వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక
VEEKSHANAM, TELUGU MONTHLY
సంపుటి : 19 సంచిక : 2 హైదరాబాద్ 232 ఫిబ్రవరి 2021 పేజీలు : 68 రు. 25

- కొనసాగుతున్న రైతుల నిరసన
- కార్పొరేట్ల చేత, కార్పొరేట్ల వల్ల, కార్పొరేట్ల కొరకు
- తెలంగాణ: పిఆర్సి ప్రజానుకూలమేనా?
- ఆంధ్రప్రదేశ్: దేవాలయాలపై దాడులు
- విస్ట్రాన్ ఇండియా కార్మిక ఆందోళన
- కోవాక్సిన్ ఎంత సురక్షితం?
- అమెరికా ప్రమాదకర వ్యూహం క్వాడ్

వీక్షణం రచయితల సమావేశం

మార్చ్ 7, 2021 ఆదివారం

పత్రిక బాగోగుల గురించి ప్రతి సంవత్సరం తన రచయితలతో, పాఠకులతో, అభిమానులతో సంభాషించాలని పదిహేను సంవత్సరాల కింద వీక్షణం ప్రారంభించిన అరుదైన సంప్రదాయాన్ని గత మూడు సంవత్సరాలుగా అనేక అనివార్య కారణాల వల్ల జరపలేకపోయాం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి సంవత్సరం హైదరాబాద్‌లో జరుగుతుండిన ఈ సమావేశం, రాష్ట్ర విభజన తర్వాత చివరిగా 2016 అక్టోబర్ 23న ఆంధ్రప్రదేశ్ (ప్రొద్దుటూరు)లో, 2017 జూలై 9న తెలంగాణ (మహబూబ్‌నగర్) లో జరిగింది. తర్వాత మూడు సంవత్సరాలుగా జరపలేకపోయిన ఈ సమావేశ పరంపరను మళ్లీ కొనసాగించాలని, మార్చ్ 7 ఆదివారం హైదరాబాద్‌లో జరపాలని వీక్షణం కలెక్టివ్ నిర్ణయించింది. ఆరోజు మరే కార్యక్రమాలు పెట్టుకోకుండా హైదరాబాద్ రావలసిందిగా, వీక్షణం రచనల గురించి, నాణ్యత గురించి, నిర్వహణ గురించి మీ అభిప్రాయాలు, సలహాలు, సూచనలు పంచుకోవలసిందిగా రచయితలకూ, పాఠకులకూ, అభిమానులకూ హృదయపూర్వకమైన విజ్ఞప్తి. స్థలం, సమయం తదితర వివరాలు మార్చ్ సంచికలో ప్రకటిస్తాం.
తప్పనిసరిగా పాల్గొనమని కోరుతూ....

– **వీక్షణం** కలెక్టివ్

232 ISSN 2231-6892

వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

ఫిబ్రవరి 2021
సంపుటి : 19
సంచిక : 02

'వీక్షణం' పేరిట రచనలు, ఎం.ఓలు, చెక్కులు,డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం VEEKSHANAM

మైత్రీ రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029. ఫాక్స్, ఫోన్ : 040-66843495

Email : veekshanam2003@gmail.com
www.veekshanam.wordpress.com

ప్రింటర్స్ : **చరితా ఇంప్రెషన్స్**
ఆజామాబాద్, హైదరాబాద్. ఫోన్ : 040 - 27678411

వీక్షణం చందా వివరాలు

	సంస్థలకు / లైబ్రరీలకు	వ్యక్తులకు
విడి ప్రతి	రు. 25	రు. 25
సంవత్సరం	రు. 300	రు. 250
మూడు సంవత్సరాలు	రు. 900	రు. 650
ఐదు సంవత్సరాలు	రు. 1500	రు. 1100
పది సంవత్సరాలు	రు. 3000	రు. 2000

ఆన్‌లైన్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా డబ్బులు పంపేవారు బ్యాంక్ స్లిప్‌లపై **'VEEKSHANAM'** అని రాసి తమ పేరు కూడా రాయాలి. వీక్షణం అకౌంట్ నెంబర్ – **013911011002175** యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్ పేరు మీద వేయాలి. ఇతర బ్యాంకులలో వేసేవారు **UBIN0801399** నెంబర్‌తో పాటు తమ పేరు కూడా రాసి వేయాలి.

వీక్షణం ఆర్థిక పరిస్థితిని వివరిస్తూ చేసిన విజ్ఞప్తికి స్పందిస్తూ వీక్షణంను నిలబెట్టుకోవాలనే తపనతో ఆర్థిక సహాయం అందించిన నాగజ్యోతి, హైదరాబాద్ - రు. 5,000; అఖండ రావు, చెన్నై - రు. 10,000; మిత్రులకు కృతజ్ఞతలు - సం.

నేను రాసిన 'ప్రస్థానం' నవలకు (2019 సం) 'అంపశయ్య నవీన్ ట్రస్ట్' వరంగల్ వారు ఉత్తమ నవలా పురస్కారంతో పాటు (2020 డిసెంబర్ 24న) పదివేల రూపాయల బహుమతిని అందజేసారు. అట్టి బహుమతి పైకాన్ని 'సైన్స్ హేతువాదం' పత్రికకు – రు. 4,000, 'అరుణతార' పత్రికకు – రు. 3,000, 'వీక్షణం' పత్రికకు–రు. 3,000 పంపుతున్నాను. స్వీకరించవలసినదిగా మనవి.

– సమతా శ్రీధర్
ఖమ్మం

మీకు ఎన్నో రోజుల నుండి ఉత్తరం రాయాలని అనుకుంటున్నాను. కాని మన 'వీక్షణం'కు వచ్చే ఉత్తరాలు చదువుతుంటే వాళ్ల విషయ పరిజ్ఞానం, భాషా పటిమ, చెప్పదల్చుకొన్న విషయాన్ని 'అరటి పండు ఒలిచినట్లు' అంత తేలికగా, చక్కగా రాస్తు పాఠకులకు అర్థమయ్యే రీతిలో రాస్తున్నారు. అందుకని 'వీక్షణం'లో వచ్చే వ్యాసాల మీద నేను ఉత్తరాలు రాసే పరిజ్ఞానం, భాష మీద పట్టు నాకు లేవు. ఇప్పుడు 'వీక్షణం'ను ఆదుకోండి, నాలుగు కాలాలు నిలబడేందుకు సహాయం అందించండి 'అన్న విజ్ఞప్తి' నా బాధ్యతను గుర్తు చేస్తున్నది కాబట్టి ధైర్యం చేసి ఈ ఉత్తరం మీకు రాస్తున్నాను.

మన 'వీక్షణం' సంపాదక వర్గానికి నాదొక 'ప్రతి విజ్ఞప్తి'. నా విజ్ఞప్తి గురించి రాసే ముందు కొన్ని విషయాలు ముందుగా మీ దృష్టికి తీసుకురావాల్సిన అవసరం, బాధ్యత నామీద ఉన్నది.

గతాన్ని గురించి క్లుప్తంగా రాస్తాను. 1975 ఎమర్జెన్సీ తర్వాత 1978లో మన అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికలలో ఇందిరా కాంగ్రెస్‌కు 178, జనతా పార్టీకి 60, రెడ్డి కాంగ్రెస్‌కు 32 అసెంబ్లీ సీట్లు వచ్చాయి. చెన్నారెడ్డి గారు ముఖ్యమంత్రిగా ఉన్నారు. మిగిలిన 25 సీట్లలో పుచ్చలపల్లి సుందరయ్య గారు, ఓంకారు లాంటి వామపక్ష నాయకులు, వెంకయ్య నాయుడు గారు బిజెపి తరుపున, ఎంఐఎం తరుపున కొంతమంది. కొంతమంది స్వతంత్ర సభ్యులు నల్లపురెడ్డి శ్రీనివాసరెడ్డి గారి లాగ ఉన్నారు. కేంద్రంలో జనతా పార్టీ ప్రభుత్వం 1979లో పడిపోవడం, అదే సందర్భంలో జనతా పార్టీ చీలిపోవడం, భారతీయ జనతా పార్టీ ఆవిర్భవించడం, కొద్ది నెలలు మాత్రమే చరణ్ సింగ్ ప్రభుత్వం ఉండడం, ఆ తర్వాత 1980లో జనరల్ (పార్లమెంట్) ఎన్నికలలో ఇందిరా కాంగ్రెస్ అధికారంలోకి రావడం జరిగింది. ఈ పరిణామాలతో రాష్ట్ర రాజకీయాలలో పెను మార్పులు జరిగాయి. రెడ్డి కాంగ్రెస్ సభ్యులు 32 మంది, జనతా పార్టీ సభ్యులలో సుమారు 50 మంది ఎంఎల్ఏలు ఇందిరా కాంగ్రెస్‌లో చేరిపోయారు. ఇక జనతా పార్టీ తరపున గౌతు లచ్చన్న గారు, జయపాల్‌రెడ్డి గారి లాంటి ఉద్దండులు మిగిలారు. ఈ రాజకీయ పరిస్థితుల వలన రాష్ట్రంలో 'రాజకీయ శూన్యత' ఏర్పడింది. 1978 నుండి 1983 ఈ అయిదు సంవత్సరాల్లో నలుగురు ముఖ్యంత్రులు మారారు. ఇటువంటి రాజకీయ అస్థిరత ఏర్పడిన సందర్భంలో 'ప్రజల పక్షాన' ధైర్యంగా నిలబడి అసెంబ్లీలో ప్రజా సమస్యల మీద, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడింది కేవలం ముగ్గురు వ్యక్తులు మాత్రమే. ఆ మహానుభావులు వీరే: జయపాల్‌రెడ్డి గారు, వెంకయ్యనాయుడు గారు, ఓంకార్ గారు. ఆ సభలో పుచ్చలపల్లి సుందరయ్యగారు, గౌతు లచ్చన్నగారి లాంటి ఉద్దండులు ఉన్నా ఎక్కువగా వీళ్ల 'వాయిస్' మాత్రమే ప్రముఖంగా ఆ రోజులలో వినపడేది. అంటే ఆనాడు ప్రతిపక్షం ఎవరంటే కేవలం ఈ ముగ్గురు ఎంఎల్ఏ, మీడియా ('ఈనాడు' కొంతమేర ప్రతిపక్ష పార్టీ భూమికను పోషించింది) మాత్రమే.

ఆనాటి ప్రజల అదృష్టమేమిటంటే 'అలహాబాద్ హైకోర్టు చీఫ్ జస్టిస్ సినాహా' లాంటి నిజాయితీపరులైన న్యాయమూర్తులు, అరుణ్ శౌరి, 'రామ్' లాంటి జర్నలిస్టులు అనేక మంది ఉన్నారు. ఆనాడు నిబద్ధత కలిగిన రాజకీయ నాయకులు కొందమంది ఉన్నారు. ఈనాడున్న 'మీడియా' మీద ఉన్న ఆంక్షలు ఆనాడు అంతగా లేవు. 'ఎమర్జెన్సీ' మినహాయిస్తే ఆనాడు దేశంలో బిజెపి పార్టీ 'రేఖా' మాత్రంగానే ఉన్నది. వామపక్షాలు, ప్రాంతీయ పార్టీలు బలంగా ఉన్నాయి. ఒక్క ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే 1978 – 1982 దాక రాజకీయ శూన్యత ఉన్నది. ఈ రోజు పరిస్థితి అలా లేదు. దేశ వ్యాప్తంగా బిజెపి తిరుగులేని బలాన్ని సమీకరిస్తున్నది. కేంద్రంలో తిరుగులేని ఆధిపత్యంతో ప్రభుత్వం ఉన్నది. రెండోవైపు ఇతర పార్టీలు అంతే వేగంతో బలహీనపడుతున్నాయి. ఈనాడు రాజకీయ, సాంఘిక, ఆర్థిక రంగాలలో ఉన్న 'సంక్లిష్టత' ఆనాడు అంతగా లేదు. ఈనాడు స్వతంత్రంగా వ్యవహరించాల్సిన రాజ్యాంగ వ్యవస్థలు ప్రభుత్వాల ఆదేశాల అనుగుణంగా నడుచుకొంటున్నాయి. ఆనాడు ఇసి శేషన్ గారు స్వతంత్రంగా వ్యవహరించి ఇసికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు. ప్రజాపక్షం వహించాల్సిన ప్రధాన మీడియా ప్రభుత్వాల కనుసన్నలలో వ్యవహరిస్తున్నాయి. ఈనాడు అసెంబ్లీలో జయపాల్‌రెడ్డి గారు, వెంకయ్యనాయుడు గారు, ఓంకార్ గారి లాంటి ప్రజా ప్రతినిధులు లేరు. ఈ రోజు ఈ రాష్ట్రంలో 'ప్రతిపక్ష పార్టీ' పాత్ర ఎవరు నిర్వహిస్తున్నారు? కేవలం 'వీక్షణం', 'వీక్షణం', 'వీక్షణం' మాత్రమే.

ఈనాడు దేశమంతా రాజకీయ శూన్యత ఏర్పడిన సందర్భంలో ప్రజాపక్షం వహించి, ప్రతిపక్ష పార్టీ పాత్ర నిర్వహించాల్సిన 'జాతీయ మీడియా' తన బాధ్యతను విస్మరించింది. ఇలా దేశమంతా అన్ని రంగాలలో చీకటి వ్యాపించిన సందర్భంలో మనకు వెలుగునిస్తున్న 'చిరు దీపం వీక్షణం'ను రెండు చేతులు అడ్డం పెట్టి కాపాడుకోవాల్సిన అవసరం ఉన్నదని 'పద్దెనిమిదవ జన్మదిన ప్రత్యేక' సంచికలో చాలా మంది పెద్దలు చెబుతూ బాధ్యతను మాత్రం 'పాఠకుల' మీద పెట్టారు. ఈ విషయంలోనే నా 'అభ్యంతరం'. పాఠకులలో ఎంతమందికి 'వీక్షణం'ను కాపాడుకొనే ఆర్థిక స్తోమత ఉంటుందన్న ఆలోచన పెద్దలు చేసి ఉంటే బాగుండేది. అలాగే సమాజం మొత్తానికి వీక్షణంను కాపాడుకోవల్సిన బాధ్యత ఉన్నదన్న సంగతి ప్రజల దృష్టికి తీసుకువచ్చే ప్రయత్నం చేసి ఉంటే బాగుండేది.

అందరు 'ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీ' మ్యాగజీన్‌తో పోల్చారు.

చాలా సంతోషం. ఆ పెద్దల పట్ల నా కృతజ్ఞత తెలుపుకొంటున్నాను.

జాతీయ స్థాయిలో దాదాపు ఐదు శతాబ్దాలుగా ఇపిడబ్లు నిర్వహించిన అమోఘమైన పాత్ర, ఆ స్థాయితో పోల్చదగినదిగా 'వీక్షణం'ను అందరు కొనియాడారు. ఇంతవరకు బాగానే ఉన్నది. ప్రజాపక్షం 'వీక్షణం' రాజకీయ వత్తిడిలను అధిగమించి, ఆర్థిక సమస్యలతో సతమతమవుతు దినదిన

(మిగతా 25వ పేజీలో...)

కోవిడ్ వల్ల పత్రికలలో సాధారణ వార్తలు రావడం లేదు గనుక అసహజ మరణాల సూచి సమగ్రంగా తయారు చేయడం సాధ్యం కావడం లేదు. కొద్దికాలంగా అసహజ మరణాల సూచి వేయలేకపోతున్నందుకు చింతిస్తున్నాం. సం.

అసహజ మరణాల సూచి జిల్లాల కరస్పాండెంట్లు

తెలంగాణ : ఆదిలాబాద్ – సి.ఎచ్. శ్రీమన్నారాయణ మూర్తి; ఖమ్మం – సి.ఎచ్. గిరిజ; మెదక్ – ముత్తన్నగారి రాజేందర్‌రెడ్డి; మహబూబ్‌నగర్ – మహమ్మద్ ఇక్బాల్; వరంగల్ – ఓరగంటి ఎల్లయ్య

ఆంధ్రప్రదేశ్ : అనంతపూర్ – కె. నాగేశ్వరాచారి; చిత్తూరు – పలమనేరు బాలాజి; కడప – కొండ్రాయుడు; కర్నూలు – జి.వి. సుధాకర్ రెడ్డి; తూర్పు గోదావరి – కె.ఎస్. ప్రకాష్‌రావు; శ్రీకాకుళం – ఆర్. శ్రీలత; విశాఖపట్నం – పి.వి. రమణ

రైతు ఉద్యమాన్ని బలపరచడం ప్రతి ఒక్కరి బాధ్యత

రెండు నెలలకు పైగా ఢిల్లీ సరిహద్దుల్లో సాగుతున్న రైతుల నిరసన ప్రదర్శనలు, దేశవ్యాప్తంగా ఆ ఆందోళనకు అందుతున్న మద్దతు ఇంకా విస్తృతం కావలసి ఉందని, దేశంలోని పీడిత ప్రజలందరూ ఈ రైతు ఉద్యమాన్ని బలపరచడం ఇవాళ్టి చారిత్రక అవసరమని రిపబ్లిక్ డే ముందూ వెనుకా పరిణామాలు ప్రకటిస్తున్నాయి.

అప్పటివరకూ పదకొండు సార్లు చర్చల పేరుతో కాలయాపనకు, రైతాంగాన్ని చీల్చే కుట్రలకు, నిర్బంధానికి ప్రయత్నించిన కేంద్ర ప్రభుత్వం రిపబ్లిక్ డే రోజున మరింత పెద్ద కుట్రకు తెరలేపింది. రిపబ్లిక్ డే రోజున అధికారిక కవాతుకు ప్రత్యామ్నాయంగా ట్రాక్టర్లతో రైతాంగ కవాతు నిర్వహిస్తామని రైతు ఉద్యమకారులు ముందునుంచే ప్రకటిస్తున్నారు. విభిన్న భావజాలాలు, సామాజిక, ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలు ఉన్న నలబై రైతు సంఘాల ప్రతినిధులు ముక్తకంఠంతో తమ ఆందోళనా కార్యక్రమాన్ని శాంతియుతంగా, క్రమశిక్షణతో, నిర్మాణయుతంగా ముందుకు తీసుకువెళ్తున్నారు. రెండు నెలల కాలంలో ఆరుబయట చలితో ఇబ్బందులు పడుతున్న ఆందోళనకారులలో డెబ్బై మంది చనిపోయినా, ప్రభుత్వం ఎన్ని కుట్రలకు పాల్పడినా రైతు ఉద్యమ నాయకులు ఉదాహరణప్రాయమైన సంయమనాన్ని ప్రదర్శిస్తున్నారు. రిపబ్లిక్ డే నాడు తలపెట్టిన రైతాంగ కవాతుకు ప్రభుత్వం ఎన్నెన్నో ఆటంకాలు కల్పించింది. పోలీసు అనుమతి నిరాకరించింది. రైతులు కోర్టుకు వెళ్లిన తర్వాత అనుమతి ఇచ్చింది. ట్రాక్టర్ల సంఖ్య మీద, కవాతు మార్గం మీద ఆంక్షలు విధించింది. ఈలోగా కుట్రపూరితంగా రైతు ఉద్యమంలోకి తన శక్తులను ప్రవేశపెట్టింది. అలా చొరబడిన శక్తులు ఉద్యమం మీద అనుమానాలు, అపోహలు కలగడానికి వీలుకల్పించే కార్యక్రమాలు ప్రారంభించారు. విధ్వంసం జరుపుతామని రెచ్చగొట్టే ఉపన్యాసాలు ఇవ్వడం మొదలుపెట్టారు. ఈ చొరబాటు విద్రోహ శక్తులు సంయుక్త కిసాన్ మోర్చా కవాతు కన్న మూడు నాలుగు గంటల ముందే తమ కవాతు మొదలుపెట్టాయి. ముందు చెప్పినట్టుగానే నిర్ణీత మార్గం కన్న భిన్నమైన మార్గంలో కవాతు సాగించాయి. ఈ విద్రోహ శక్తుల నిజమైన ప్రోత్సాహకురాలు ప్రభుత్వమే గనుక వారికి ఎక్కడికంటే అక్కడికి సులభమైన ప్రవేశం దొరికింది. తర్వాత ప్రభుత్వం అనుమతించిన మార్గంలో సాగిన సంయుక్త కిసాన్ మోర్చా కవాతుకు మాత్రం అడుగడుగునా ఆటంకాలు కల్పించారు.

సాధారణంగా అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లతో, సైనిక స్థావరంతో ఉండే ఎర్రకోట పరిసరాలు రిపబ్లిక్ డే సందర్భంగా మరింత ఎక్కువ పోలీసు బలగాల, అర్ధసైనిక బలగాల దిగ్బంధంలో ఉంటాయి. కాని ఆ దిగ్బంధాన్ని ఛేదించుకుని ఈ విద్రోహశక్తులు ఆశ్చర్యకరంగా అక్కడికి వెళ్లగలిగాయి. లేదా రెండు నెలల తాత్సారంతో అసంతృప్తితో, ఆగ్రహంతో ఉన్న రైతులను అటువైపు నడిపించగలిగాయి. అంటే, అందుకు పూర్తిగా ప్రభుత్వ, పోలీసు బలగాల సహకారం లభించిందనే అనుకోవాలి. అలా వెళ్లిన విద్రోహశక్తులు ఎర్రకోట ప్రాకారం మీదికి ఎక్కుతుంటే పోలీసులు మౌన ప్రేక్షకులుగా ఉండిపోయారంటే, వారికి అలా ఉండమని పైనుంచి ఆదేశాలు ఉన్నాయన్నమాట. ఆ క్రమంలో విద్రోహశక్తులు సిక్కు మత జెండాను ఎర్రకోట మీద ఎగరేసి, తద్వారా రైతు ఉద్యమంలో ఖలిస్తాన్ అనుకూల శక్తులు ఉన్నాయని ప్రభుత్వం చేస్తున్న ప్రచారం నిజమని అనిపించడానికి ప్రయత్నించారు. ఎర్రకోట ప్రాంగణంలోకి "ఆందోళనకారులు" చొచ్చుకుపోవడం, పోలీసుల మీద దౌర్జన్యం చేయడం, ఎర్రకోట మీద జెండా ఎగరెయ్యడం వంటి చర్యలు చూపి పాలకవర్గాలు, పాలకవర్గ అనుకూల ప్రచారసాధనాలు తమ దుష్ప్రచారాన్ని పెద్ద ఎత్తున సాగించడానికి, ఉద్యమకారుల మీద ప్రశ్నలు గుప్పించడానికి అవకాశం దొరికింది. ఈ దుష్ప్రచారం చేస్తున్నవారెవరూ వ్యవసాయ చట్టాల దుర్మార్గాన్ని ప్రశ్నించలేదు. ప్రభుత్వం చర్చల పేరుతో జరిపిన తాత్సారాన్ని ప్రశ్నించలేదు. కొంకర్లు తిరిగే చలిలో ఆరుబయట రైతుల కుటుంబాలు రెండు నెలలుగా ఇబ్బందులు పడుతుంటే కనీస సానుభూతి ప్రకటించలేదు. ఆ చలికీ, నిరాశానిస్పృహలకూ డజన్లకొద్దీ రైతులు ప్రాణాలు కోల్పోతే వీరికి పట్టలేదు. ఇంతకాలం ఇంత పెద్దఎత్తున సాగిన ప్రత్యక్ష, పరోక్ష హింస గురించి పెదవి విప్పని ఈ పెద్దమనుషులు ఇప్పుడు హఠాత్తుగా రైతుల హింస గురించి ఇల్లెక్కి అరుస్తున్నారు. ఆ "విధ్వంస" చర్యలేవీ రైతు ఉద్యమకారులు చేయలేదనేది ఒక వాస్తవమైతే, నిజంగా వారే చేసి ఉండినా ఒక దుర్భర నేపథ్యంలో చేసిన పనులుగా సమర్థనీయమేననేది మరొక వాస్తవం.

వ్యవసాయ చట్టాల ఆర్డినెన్సులు వెలువడిన జూన్ నుంచీ ప్రారంభమైన రైతు ఉద్యమం నవంబర్ 26న ఢిల్లీ సరిహద్దుల్లో ప్రదర్శన ప్రారంభించి ఒక మలుపు తిరిగితే, రిపబ్లిక్ డే పరిణామాలతో మరొక మలుపు తిరిగింది. మొదటి దశలో అది కేవలం ప్రభుత్వ దూకుడు విధానాన్ని వ్యతిరేకించేదిగా, మార్చుకొమ్మని అభ్యర్థించేదిగా ఉండింది. రెండో దశలో అది ప్రభుత్వ విధానాన్ని శాసిస్తున్న కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగానూ, ప్రభుత్వ చర్యలను ఉపసంహరించుకొమ్మని క్రియాశీలంగా కోరేదిగానూ మారింది. ప్రస్తుత మూడో దశలో అటు ప్రభుత్వాన్నీ, కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలనూ మాత్రమే గాక, తమ మీద ఇనుమడించిన దుష్ప్రచారాన్ని కూడ ప్రతిఘటించక తప్పని స్థితికి చేరింది. ఈరకంగా ఉద్యమశక్తుల వనరులను కరిగించడానికీ, వృథా చేయడానికీ కాలం అనే ఆయుధాన్ని ఉపయోగించడం, వారి గురిని అనేక దిశలలోకి తిప్పడానికి ప్రయత్నించడం పాలకవర్గాలకు అలవాటే. ఇలా ముప్పేటదాడిని ఎదుర్కొంటున్న రైతు ఉద్యమ శక్తుల బలాన్ని పెంపొందించడం, వారికి మరిన్ని స్నేహహస్తాలను అందించడం, వారి ఉద్యమ న్యాయబద్ధతను ప్రచారం చేసే బాధ్యత చేపట్టడం, రైతు ఉద్యమాన్ని దేశవ్యాప్తం చేయడం ఇవాళ సమాజంలో ప్రతి ఒక్కరి బాధ్యత. ఈ రైతు ఉద్యమ ఆకాంక్షల మీద, మార్గం మీద, నాయకత్వం మీద ఎవరికి ఎన్ని భిన్నాభిప్రాయాలైనా ఉండవచ్చు. కాని వాటిని పక్కన పెట్టి ఉద్యమాన్ని సమర్థించడం ఇవాళ్టి చారిత్రక అవసరం. ఎందుకంటే ఆ ఉద్యమం ఈ దేశాన్ని కార్పొరేట్ల చేతుల్లో బందీగా మార్చే విధానాలను ప్రతిఘటిస్తున్నది. అంటే అది ఈ దేశ ప్రజా జీవన పురోగమనానికి అవసరమైన ఉద్యమం. ఈ దేశ భవిష్యత్తుకు అవసరమైన ఉద్యమం. ఈ దేశాన్ని, ఈ సమాజాన్ని కార్పొరేట్ నరభక్షక బకాసుర దాహానికి బలి అయిపోకుండా కాపాడుకుంటారా లేదా అని కాలం మనను ప్రశ్నిస్తున్నది. ప్రతి ఒక్కరూ జవాబు చెప్పవలసిందే.

వీ

సంపాదకీయ వ్యాఖ్య - తెలంగాణ

చిన్నదొర గద్దెనెక్కుతడు సరే, పెద్ద దొర ఎందుకు దిగాలె?

వారెవ్వా, పట్నంల అవ్వల్ దర్జ తమాష జరుగుతాంది. పెద్ద దొర గద్దె మీంచి దిగిపోతడని, చిన్న దొర ఎక్కుతడని మస్తుగ ఏలాన్ అయితాంది. ఇగ తెప్పలుగ చెరువు నిండిన కప్పలు పదివేలు అని పజ్జెం పాడినట్టు చిన్నదొర భక్తులు మస్తుగ మోపై చిరతలు గొడ్తనే ఉన్నరు, భజనలు చేస్తనే ఉన్నరు. నాల్కె జాపి చిన్న దొర బూట్లు నాకకపోతె ఆ జాగలకు ఇంకెవడొచ్చి ఆ దండి మహద్భాగ్గెం గుంజుకుంటడో అని ఒకనిమీద ఒకడు పడి తొక్కులాట అయితాంది. ఇదంత ఇప్పటి ముచ్చట. ఏమో, మీరిది జదివే యాళ్లకు చిన్నదొర గద్దె ఎక్కే ఉంటడేమో తెలుత్తలేదు. మూర్తాలైతె బెట్టిన్రంటనని చెప్పుకుంటాంద్రు. కని, నాకొగ సంగతి సమజయిత లేదు. కొందరు భజనపరులు చిన్నదొరయితే మాదండి పనిజేత్తడు, మంచి పనిమంతుడు, గద్దె మీద కూసోబెట్టుడు తప్పదు అంటాంద్రు. నివద్దె కావచ్చు. కని శాత్రం జెప్పినట్టు రాజుగారి చిన్న పెండ్లం మంచిది అంటె పెద్ద పెండ్లం మంచిది గాదన్నట్టేనా కాదా? చిన్న దొర పనిమంతుడు, గాయినెనె గద్దె మీద కూసోబెట్టాలె అంటె ఏమన్నమాట, గిప్పుడు గద్దె మీద గూసున్నాయినె అంత మంచి పనిమంతుడు కాదు అన్నట్టు గాదా? పాపపు మాటలు అనగూడదు గని చిన్నదొరకు పెద్దదొరకు పోటి బెట్టి చిన్నదొర పనిమంతుడు అంటాంటె నాకు ఎట్లనో గొడ్తాంది. ఎంత బూట్లు నాకినా గింత అదుమానంగ వదురుతె ఎట్ల? అంతకు ముందు ఎట్లున్నా, ఏం జేశినా ఎంత గాదన్న పెద్ద దొర ఇరువై ఏండ్ల సంది తెలంగాణ అనబట్టె. తెలంగాణ దెచ్చిన మొనగాడు గాయినే అని అందరు అనవట్టిరి. గాయినెకూ చిన్నదొరకూ ఏం సాపత్యం? చిన్నదొర తెలంగాణ లొల్లి మొదలైనంక గుడ ఆరాంగ అమెరికాల్నె కొలువు చేసుకుంటనే ఉండె. ఇగ తెలంగాణ ఒచ్చెటట్టున్నది అనంగ జటుక్కున ఈడ దునికె. గా ముచ్చటంత బోనీ. గిది రాజిర్కమే గనుక చిన్నదొర రాజవుడు తప్పదు. అన్నలుదమ్ములు, అన్నదమ్ముల కొడుకులు, అల్లుండ్లు మేనల్లుండ్లు గుడ గద్దెనెక్కిన కతలున్నయి గని, మన కత మొత్తం కొడుకు సుట్టే తిరుగుతాంది. సరె గట్లనే గానియ్యి గని మల్ల ఈడగుడ, పాపపు మాటలు అనొద్దు గని ఒగ చిక్కు ముడి బడ్డది.

తండ్రిని జంపో, ఖైదుల బెట్టో గద్దెనెక్కిన రాజులున్నరు గని తండ్రి బతికుండంగ కొడుకు రాజైన మాట యాడగుడ ఇన్లే. రాచకురుపు బుట్టి ఏండ్లకేండ్లు నవిసిన రాజులు గుడ పురాగ పానం బోయేదాక గద్దె మీంచి దిగలే, కొడుకును గద్దె మీద కూసోబెట్టలే. మరి గిప్పుడు తెలంగాణల అసలు గీ సంగతి ఎందుకు ముంగటికొచ్చింది? పోనీ పెద్ద దొరకు ఇంకా మస్తు పెద్ద పని దొరికింది, డిల్లిల్నో బొల్లిల్నో శెక్రం దిప్పె పనున్నది, ఆడికి బోవాలె, సెక్రటేరియట్ కు వచ్చుటానికి తీర్తలేదు అందామా అనుకుంటె అది గుడ ఏం కనబడి కాలవడ్తలేదాయె. ఎందుకు దిగిపోవాలె గాయినె పాపం. మల్ల ఇన్నాల్లు జై జై అన్నోల్లె కొడుకు పెద్ద పనిమంతుడు అని అయ్యకు గంత పని రాదని అనబట్టిరి. గింత అన్నాలం యాడ్నన్న ఉంటదా? అయ్య కొడుకులకు పంచాతి బెట్టి చాట్ల తౌడు ఎత్తుకబోదామని చూశెటోల్ల ఇక్మత్ జూస్తాంటె ఇచ్చిత్రమైతాంది. ఎటుబోయినా చాట ఇంట్లనే ఉండె, తౌడు ఇంట్లనే ఉండె. కొట్లాడెటోల్లకు ఏం దొర్కుతది? వీ

సంపాదకీయ వ్యాఖ్య - ఆంధ్రప్రదేశ్

రాజ్య వ్యవస్థల మధ్య వైరుధ్యం


రాజ్యం అనేదాన్ని ఏకశిలా సదృశమైన ముద్దగా రాజనీతిశాస్త్రం, చాల సందర్భాలలో ప్రగతిశీల ఆలోచనాపరులు కూడ భావిస్తుంటారు గాని నిత్య జీవిత వాస్తవంలో అది సరికాదు. ఒక సమాజంలో పాలకవర్గాలలోనే భిన్న సమూహాలున్నప్పుడు, ఆయా సమూహాల ప్రయోజనాలు భిన్నంగా ఉన్నప్పుడు, ఆ సమాజాన్ని నడిపే రాజ్యంలో కూడ ఆ భిన్నత్వం వ్యక్తమవుతుంది. భారత సమాజం వంటి అనేక అంతరాలు ఉన్న సమాజంలో ఈ భిన్న ప్రయోజనాల ఉనికీ, ఘర్షణా మరింత ఎక్కువగా ఉంటాయి. ఒకే పాలకవర్గపు తానులో ముక్కలైనప్పటికీ భిన్నమైన రాజకీయ పక్షాలు భిన్నమైన వైఖరులు తీసుకోవడం, కొన్ని సందర్భాలలో చాల తీవ్రమైన వివాదాలకు దిగడం మన అనుభవంలో ఉన్నదే. ఆయా పాలకవర్గ ముఠాల ప్రయోజనాల మధ్య ఘర్షణకు ఈ వివాదాలు అద్దం పడతాయి. ఇవాళ ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో సరిగ్గా ఇటువంటి భిన్న ప్రయోజనాల ఘర్షణ రాజ్యాంగయంత్రంలోని రెండు విభాగాల మధ్య ఘర్షణగా వ్యక్తమవుతున్నది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ అనే రాజ్యాంగ వ్యవస్థ, ప్రభుత్వం అనే రాజ్యాంగ వ్యవస్థను ఢీకొంటున్నట్టు కనబడుతున్నది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ లోనైనా, ప్రభుత్వంలోనైనా విధాన నిర్ణయాలను అమలు చేసేది అధికారులే గాని వారి వెనుక ఆ నిర్ణయాలను రూపొందించేది రాజకీయ నాయకులు, వారి వెనుక ఉండే పాలకవర్గ రాజకీయార్థిక ప్రయోజనాలు. గత ప్రభుత్వం 2016లో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ గా నియమించిన వ్యక్తి అప్పటి పాలకపక్షానికీ, లేదా అప్పటి ముఖ్యమంత్రి సామాజికవర్గానికీ అనుకూలమైన వ్యక్తి గనుక ఆయనను తొలగించాలని ప్రస్తుత పాలకపక్షం అనుకున్నదనేది బహిరంగ రహస్యమే. అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే ప్రభుత్వానికీ ఎన్నికల కమిషనర్ కూ పంచాయతీ ఎన్నికల విషయంలో వివాదం మొదలైంది. ప్రభుత్వం ఎన్నికల కమిషనర్ ను తొలగించి, మరొకరిని ఆ స్థానంలో నియమించింది. ఎన్నికల కమిషన్ సుప్రీం కోర్టు దాకా వెళ్లి తన పదవిని తిరిగి పొందారు. అటు ఎన్నికల కమిషనర్, ఇటు ప్రభుత్వం తరఫున పాలకపక్షపు పెద్దలు ఒకరి మీద ఒకరు ఆరోపణాస్త్రాలు సంధిస్తుండగానే, ఈ వివాదంలోకి భారతీయ జనతా పార్టీ కూడ దిగి ఎన్నికల కమిషనర్ తో రహస్య సమాలోచనలు జరుపుతున్నదని వార్తలు బైట పడ్డాయి. ప్రభుత్వ అభీష్టానికి భిన్నంగా ఎన్నికల కమిషనర్ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడం, దాన్ని వ్యతిరేకిస్తూ ప్రభుత్వం సుప్రీం కోర్టుకు వెళ్లడం, ఉద్యోగ సంఘాలు, వైద్యుల సంఘాలు కూడ ప్రభుత్వం తరఫున కోర్టులో వాదించడానికి పూనుకోవడం, వగైరా అసందర్భపు పనులతో రభస మరింత పెద్దదయింది. ఇంత పెద్ద ఎత్తున జరుగుతున్న ఈ రభసలో ప్రజల ప్రయోజనాలేమైనా ఉన్నాయా అనేది చూడడం ముఖ్యం. ఈ వివాదమంతా మూడు పాలకవర్గ ముఠాల మధ్య, లేదా రెండు ఆధిపత్య కులాల మధ్య జరుగుతున్న ఘర్షణ, ఇద్దరు ముగ్గురు వ్యక్తుల అహంకారాల మధ్య జరుగుతున్న ఘర్షణ మాత్రమే గాని ఎవరి మాట చెల్లినా, ఎవరు ఓడి ఎవరు గెల్చినా ప్రజలకు ఒరగబోయే ప్రయోజనమేమీ లేదు. ఒకరు కోరుకున్నట్టు పంచాయతీ ఎన్నికలు ఇప్పుడే జరిగినా మరొకరు కోరుకున్నట్టు జరగకపోయినా గ్రామీణ ప్రజాస్వామ్యం అమలై ఊడబొడిచేదేమీ లేదు. పంచాయతీ ఎన్నికల పేరుతో గ్రామాల్లో ఘర్షణలు పెరగడం, డబ్బు, మద్యం ఏరులై పారి సామాజిక కల్లోలం జరగడం తప్ప ప్రయోజనమేమీ లేదు. పాలకవర్గ ముఠాల మధ్య తగాదాలే ఇంత భీకరంగా ఉంటే, నిజంగా పాలకవర్గాలకూ ప్రజలకూ మధ్య జరగబోయే నిజమైన ఘర్షణ ఎట్లా ఉండడానికి అవకాశం ఉందో తెలుసుకోవడానికి తప్ప ఈ ఉదంతం నుంచి తెలుసుకోవలసిందేమీ లేదు. వీ

నేపాల్‌లో మళ్లీ అనిశ్చితి

- ఎ.నర్సింహారెడ్డి

నేపాల్ రాజకీయ పరిణామాలు ఆసక్తికరంగా మారాయి. 240 సంవత్సరాలు కొనసాగిన రాచరిక వ్యవస్థ 2008 మేలో రద్దయి నేపాల్ రిపబ్లిక్‌గా మారింది. ఆ తర్వాతి కాలంలో ఎన్నికైన ఏ సంకీర్ణ ప్రభుత్వం 8 మాసాలకు మించి పాలించలేకపోయింది. ఎన్నో సంకీర్ణాలు, కూటముల పాలన సాగినందున రాజ్యాంగాన్ని రూపొందించడం అతి కష్టంగా మారింది. నిరంతరం సంక్షోభం నుంచి సంక్షోభానికి పయనించడం అలవాటైన నేపాల్ మరోసారి చిక్కుల్లో పడింది. 2017 డిసెంబర్‌లో జరిగిన సాధారణ ఎన్నికల్లో ప్రజల ప్రయోజనం, దేశ రాజ్యాంగ ఆమోదం నిమిత్తం సుదీర్ఘకాలం శత్రు వైఖరులతో పనిచేసిన కెపి శర్మ ఓలి నేతృత్వంలో లీగల్‌గా పనిచేస్తున్న కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ నేపాల్ (యుఎమ్ఎల్), దీర్ఘకాలం అజ్ఞాతంలో ఉండి సాయుధ పోరాటం చేసి రాచరికం రద్దుతో బహిరంగంగా వచ్చిన పుష్ప కమాల్ దహాల్ (ప్రచండ) నేతృత్వంలోని కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ నేపాల్ (మావోయిస్టు సెంటర్)లు కూటమిగా ఏర్పడి పోటీ చేశాయి. 275 స్థానాలు ఉన్న ప్రతినిధుల సభలో 165 స్థానాలు గెలుచుకొని ఓలి ప్రధానిగా సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేశారు. 8 మాసాల చర్చల తర్వాత రెండు పార్టీలు కలిసి నేపాల్ కమ్యూనిస్టు పార్టీగా విలీనమయ్యాయి. ప్రస్తుత సభ 2022 వరకు కొనసాగవలసి ఉంది. ఓలి జిత్తులమారి, అవకాశవాది, తాను పదవిలో కొనసాగడానికి జాత్యహంకారాన్ని రెచ్చగొట్టారు. ఏకపక్షంగా పాలన సాగించాడు. తన అనుయాయులను కీలక స్థానాల్లో నియమించాడు. పార్టీ కేంద్ర కమిటీ సమావేశం కూడ చాల కాలంగా జరుగలేదు. రెండు పార్టీల మధ్య విభేదాలు తీవ్రమయ్యాయి. అకస్మాత్తుగా గత డిసెంబర్ 20న పార్లమెంట్‌ను రద్దు చేసి ఏప్రిల్‌లో ఎన్నికలకు పిలుపునిచ్చాడు. మధ్యంతరంగా పార్లమెంట్‌ను రద్దు చేయడం రాజ్యాంగ విహితం కాదనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

ఉభయ పార్టీల విలీనంలోనే వివాద బీజాలున్నాయి. ఒప్పందం ప్రకారం ఓలి, ప్రచండ చెరి సగం కాలం పాలించాలన్న షరతు ఉంది. దాని ఉల్లంఘన తాజా సంక్షోభానికి దారితీసింది. విలీనం ప్రహసనంగా మారింది. ప్రధానమంత్రి, సిపిఎన్ కో చైర్మన్ పదవులు రెండింటికీ ఓలి రాజీనామా చేయాలని ప్రచండ, మరో అగ్రనాయకుడు మాధవకుమార్ డిమాండ్ చేశారు. తన ప్రభుత్వాన్ని కూల్చటానికి ప్రచండ, ఆయన సహచరులు కుట్ర చేస్తున్నారంటూ దీని వెనుక భారతదేశపు గోప్యపు పాత్ర ఉందని సంకేత ప్రాయంగా వ్యాఖ్యానించాడు. ఒకప్పుడు ప్రచండకు చైనా ముద్ర ఉండగా ఓలి అతన్ని తలదన్నాడు. భారత భూభాగాలైన లిపులెఖ్, కాలాపానీ, లింపియదురలను నేపాల్ భౌగోళిక పటంలో చూపుతూ, ఆ పటానికి ఆదరాబాదరా పార్లమెంటులో ఆమోదింపజేసుకున్నాడు. భారత్‌కు చిరకాల మిత్ర పార్టీ నేపాలీ కాంగ్రెస్ కూడా ఎక్కడ జాతీయ మనోభావం గాయపడుతుందోనన్న భయంతో ఆ పటానికి అనుకూలంగా ఓటు చేసింది. భారత్‌తో శతృత్వం కూడదని, భారత్, చైనా రెండింటితో లౌక్యంతో వ్యవహరించాలన్నది ప్రచండ భావన. నేపాల్‌ను భారత్–చైనా ప్రచ్ఛన్న యుద్ధ రంగస్థలిగా మార్చిన చరిత్ర ఓలిదే. మొత్తంగా ఓలి చర్యలు అప్రజాస్వామిక మైనవి, చారిత్రక తప్పిదాలను కొనసాగించేవి. బూర్జువా పత్రికలు భావిస్తున్నట్లు ఇది కమ్యూనిస్టు పార్టీలో సంక్షోభం కాదు, ప్రజాస్వామ్య ఉద్యమంలో సంక్షోభంగా గుర్తించాలి. ప్రజా ఉద్యమంలో మిగిలిపోయిన కర్తవ్యాలను పూర్తి చేయడానికి బదులు ఉభయ కమ్యూనిస్టు పార్టీలు అధికార కుమ్ములాటలో మునిగిపోవడం విషాదకరం. సామ్రాజ్యవాద యుగంలో బూర్జువా పార్లమెంటరీ వ్యవస్థలో ప్రజా ఎజెండాను అమలుచేయడం సాధ్యం కాదని మరోసారి రుజువైంది. ఈ సంక్షోభంలో ఓలిని పార్టీ సస్పెండ్ చేసింది. సుప్రీంకోర్టు ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి. వీ





❖ **ప్రచ్ఛన్న వస్తు శిల్పాలు –** విమర్శనాత్మక వ్యాసాలు – సాగర్ శ్రీరామకవచం – నవ్యాంధ్ర రచయితల సంఘం ప్రచురణ – 135 పేజీలు, 1/8 డెమీ, రు. 200, ప్రతులకు: ఉషారాణి శ్రీరామకవచం, ఇ.నెం. 8-1-41 (3-5-421), జమ్మిచెట్టు బజార్, లావెరోపేట, ఒంగోల్ – 523002, ప్రకాశం జిల్లా, ఫోన్ : 9885473934



❖ **ఔరా! కరోనా!! –** కరోనా కవితలు – సింగంపల్లి అశోక్‌కుమార్ – ఆలోచన ప్రచురణలు – 72 పేజీలు, 1/8 డెమీ, రు. 60




❖ **పోరు –** సింగంపల్లి అశోక్‌కుమార్ – ఆలోచన ప్రచురణలు – 40 పేజీలు, 1/8 డెమీ, రు. 40




❖ **అంతర్ వ్యూలు –** సింగంపల్లి అశోక్‌కుమార్ – ఆలోచన ప్రచురణలు – 64 పేజీలు, 1/8 డెమీ, రు. 50
పై మూడు ప్రతులకు: ఆలోచన ప్రచురణలు, 305, ప్రగతి టవర్స్, వీరయ్య స్ట్రీట్, మారుతీనగర్, విజయవాడ – 520004, ఫోన్ : 9246277375




❖ **వ్యవసాయదారుల ఆదాయం పెంపు – మోడీ ప్రభుత్వ మహా మోసం –** వేములపల్లి వెంకట్రామయ్య – అఖిల భారత రైతుకూలీ సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యవర్గం ప్రచురణ – 104 పేజీలు, 1/8 డెమీ, రు. 60, ప్రతులకు: వాయిస్ ఆఫ్ న్యూడెమోక్రసీ, మార్క్స్‌భవన్, 658, 7వ లైన్, విద్యానగర్, హైదరాబాద్ – 500044




❖ **వాగ్దానపు ఉషోదయం –** వ్యాసాలు, కవితల సంకలనం – గద్దం శ్యామ్ – జార్జి ప్రచురణలు – 96 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు: గద్దం శ్యామ్, ఇ.నెం. 4-199, గ్రా. చిల్పకుంట్ల, మం. నూతనకల్, జిల్లా సూర్యాపేట – 508221, ఫోన్ : 9704852140




❖ **గణిక –** కథలు – విజయ భండారు – హస్మిత ప్రచురణలు – 192 పేజీలు, 1/8 డెమీ, రు. 150, ప్రతులకు: భండారు విజయ, ఎచ్ఐజి, బ్లాక్-1, ఫ్లాట్ నెం. 10, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ – 500044, ఫోన్ : 8801910908




❖ **శ్రమ పొదుగు –** కవిత్వం – యరకల యాదయ్య – తెలంగాణ రచయితల సంఘం ప్రచురణ – 152 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు: నందిక ఆద్య, ఇ.నెం. 25-36/4/4జె, మల్లికార్జున నగర్, బీరంగూడ కమాన్, బిఎచ్ఇఎల్, రామచంద్రపురం, హైదరాబాద్ – 502032, ఫోన్ : 9866468979




❖ **నోముల సాహిత్య ముచ్చట్లు –** సంపాదకుడు పెన్నా శివరామకృష్ణ – నోముల సాహిత్య సమితి ప్రచురణ – 140 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు: ఎన్.ఎస్. అరుణ, నోముల సాహిత్య సమితి, సాయి టవర్స్, నాగార్జున కాలనీ, నల్లగొండ – 508001, ఫోన్ : 8523056256




❖ **ఫాలచుక్కలు –** బుర్రా లక్ష్మీ నారాయణ కథలు – పాలపిట్ట బుక్స్ ప్రచురణ – 160 పేజీలు, 1/8 డెమీ, రు. 100




❖ **సాల్వేషన్ –** పొయెట్రీ– డాక్టర్ కావాడి ఎల్లయ్య – పాలపిట్ట బుక్స్ ప్రచురణ – 78 పేజీలు, 1/8 డెమీ, రు. 100, పై రెండు ప్రతులకు: పాలపిట్ట బుక్స్, ఇ.నెం. 16-11-20/6/1/1, 403, విజయసాయి రెసిడెన్సీ, సలీమ్‌నగర్, మలక్‌పేట్, హైదరాబాద్ – 500036, ఫోన్ : 040-27678430



❖ **మహబూబ్‌నగర్ జిల్లా దళితులు – మానవ హక్కులు** – (1995-2005 అధ్యయన పత్రం) – పి. బాల జంగయ్య – పాలమూరు అధ్యయన వేదిక ప్రచురణలు – 158 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు: పి. బాల జంగయ్య, ఇ.నెం. 11-152/4, ఆదర్శనగర్, వెలోసిటి స్కూల్ ఎదురుగా, అచ్చంపేట, నాగర్‌కర్నూల్ – 509375, ఫోన్ : 9440324794



❖ **యుద్ధం – తపస్సు –** (కరోనా కవిత్వం) – డా.మంథని శంకర్ – ప్రాగ్మా పబ్లికేషన్స్ ప్రచురణ – 58 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు: డా. మంథని శంకర్, ఇ.నెం. 35-2-212, రామయ్య కాలనీ, గోపాలపురం, హన్మకొండ, వరంగల్ అర్బన్ – 506 009, ఫోన్ : 08374354873



❖ **జాతీయ విద్యా విధానం 2020 –** విశ్లేషణ మరియు ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు – ఆంధ్రప్రదేశ్, తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ప్రచురణలు – 64 పేజీలు, 1/8 డెమీ, రు. 20, ప్రతులకు: డి. రమేష్ పట్నాయక్, ఫోన్: 9440980396, ప్రొ. కె. లక్ష్మినారాయణ, ఫోన్: 9441219028



❖ **అలలు – కవి తలపోతలు –** నిజం – నిజం ప్రచురణలు – 192 పేజీలు, 1/8 డెమీ, రు. 125, ప్రతులకు: నిజం ప్రచురణలు, ఫ్లాట్ నెం. ఎ-26, జర్నలిస్ట్ కాలనీ, జుబిలీ హిల్స్, హైదరాబాద్ – 500 033 ఫోన్ : 9848351806

రైతులతో చర్చలు - సాచివేతలు అణచివేతలు

కేంద్రప్రభుత్వం తెచ్చిన మూడు వ్యవసాయ చట్టాలు కార్పొరేట్ అనుకూలమైనవనీ, వాటిని రద్దు చేయకుండా ప్రభుత్వం రైతు సంఘాల నేతలతో చర్చల పేరిట సాగతీత ధోరణిని అవలంబిస్తున్నదనీ అంటున్నారు బి. రామకృష్ణ

జూన్ 5, 2020న మూడు వ్యవసాయ బిల్లులకు సంబంధించి ఆర్డినెన్సులు తెచ్చి 2020 సెప్టెంబర్ 27న చట్టాలు చేశారు. వీటిపై పార్లమెంటులో చర్చకు అవకాశం ఇవ్వలేదు. ప్రతిపక్షాలు అడిగినప్పటికీ సెలెక్ట్ కమిటీకి పంపించలేదు. చట్టాల రూపకల్పనలో కనీస ప్రజాస్వామిక విలువలు పాటించలేదు. రైతుల అభిప్రాయాన్ని తీసుకున్నది లేదు. ఐఎంఎఫ్ అధికార ప్రతినిధి క్యారీ రైస్ ఈ చట్టాలను సమర్థిస్తూ ప్రకటన చేశాడు. ప్రపంచ మార్కెట్ శక్తులు ఈ విధానాలను ఎన్నో దశాబ్దాలుగా ప్రతిపాదిస్తూనే ఉన్నాయి. వీటికి తలొగ్గని ప్రభుత్వాలు ఈ దేశంలో ఏవీ లేవు. పాలక పార్టీలు, వ్యక్తులు మారుతున్నారు అంతే తేడా. అందుకే ప్రధానమంత్రి మోదీ ఈ చట్టాలకు సంబంధించి ఎన్నో ఏళ్ల నుండి చర్చలు జరుగుతున్నాయని చెబుతాడు.

నూతన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా మొదటగా పంజాబ్‌లో వ్యతిరేకత నిరసనలు, పోరాటాలు వచ్చినప్పటికీ రానురాను వాటికి సంఘీభావంగా దేశంలోని అన్ని ప్రాంతాలలో అన్ని సెక్షన్ల ప్రజలు నిరసన ఉద్యమాల్లో పాల్గొనడం ద్వారా విశాల ప్రజా ఉద్యమంగా రూపు దిద్దుకొన్నది.

ఢిల్లీ సరిహద్దుల్లోని సింఘు, టిక్రీ, పల్వాల్, ఘాజీపూర్, నోయిడా, షాజహాన్పూర్‌లలో, బురారి మైదానంలో గత రెండు నెలలుగా నిరసనలను రైతులు తీవ్రమైన ప్రతికూల వాతావరణ పరిస్థితులను లెక్కచేయకుండా కొనసాగిస్తున్నారు. ఎముకలు కొరికే చలి, చలి గాలులు, వర్షం వంటి దుర్భరమైన పరిస్థితుల్లో సైతం రైతులు ఉద్యమంలో పాల్గొంటూ ఉండడం చరిత్రలో నిలిచిపోతుంది.

ఆడా, మగా, ముసలి ముతక, పిల్ల జెల్లా అనే తేడా లేకుండా వేలాదిగా ఆరు బయట వండుకుంటూ, నిద్రిస్తూ కనీస వసతులు ఐన మలమూత్ర విసర్జన, స్నానాలు, తిండి నిద్రలకు ఇబ్బందులు పడుతూ వ్యవసాయ చట్టాలను రద్దు చేయించే వరకు అక్కడి నుండి కదలమని పోరాటాన్ని సాగిస్తున్నారు. భవిష్యత్ ప్రజాస్వామిక ఉద్యమాలకు స్ఫూర్తిని నింపుతున్నారు. రైతులు, వారి నాయకత్వం చూపిస్తున్న ధైర్యం, దృఢసంకల్పం, పట్టుదల విజయం వైపు ప్రయాణం, ఐకమత్యం, సమన్వయం పోరాటపటిమ ఆదర్శంగా నిలుస్తున్నది. వారు చేస్తున్న ఉద్యమానికి వస్తున్న, వచ్చిన ప్రత్యక్ష పరోక్ష మద్దతు వారినిరసనలకు వన్నె తెస్తున్నది.

వివిధ స్థాయిల్లోని బిజెపి శ్రేణులు, ఎంఎల్ఎలు, ఎంపిలు, రాష్ట్రాల ముఖ్యమంత్రుల నుండి కేంద్ర మంత్రుల దాకా రైతు ఉద్యమంపై బురద జల్లుతూ నైతికంగా దెబ్బతీసేందుకు ఎన్నోరకాల ప్రచార అస్త్రాలు ప్రయోగిస్తూ వచ్చారు. ఈ ఉద్యమంలో విదేశీ హస్తం ఉన్నదని, ఖలిస్తాన్ తీవ్రవాదులు ఉన్నారని, అసలు వీరంతా రైతులే కాదని, దళారులు చేస్తున్నారని పరిపరి విధాలుగా తప్పుదోవ పట్టించాలని చూశారు.

ప్రతిపక్షాలు, కమ్యూనిస్టులు ఈ ఉద్యమంలో ఉన్నారని, అదేదో చెయ్యకూడని పని అన్నట్లుగా ఘోరమో, నేరమో అయినట్లుగా మాట్లాడుతున్నారు. న్యాయమైన డిమాండ్ పై ఎవరైనా స్పందించవచ్చు. ప్రజాస్వామిక పద్ధతుల్లో నిరసన తెలపడం, ప్రజలను సమీకరించడం, ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టడం, వాటిని రద్దు చేయించడం అనేది ప్రజాస్వామ్య విలువల విస్తృతికి సూచికలే తప్ప నేరం ఎలా అవుతాయి. ప్రజా ఉద్యమాలను నేరపూరితంగా చూసే పాలకపక్షమే నేరమయంగా మారి ప్రశ్నించే గొంతుకలపై అణచివేత ప్రయోగించడం ఫాసిజానికి సూచిక. నేరాలు చేస్తున్న పాలకులను వారిస్తుండడం, అలా చేయడం తప్పని వారికి చెప్పడం దేశ ద్రోహం అని ఎదురు దాడి చేయడంలో పాలక వర్గం ఆరితేరిపోవడం గమనిస్తున్నాం.

రాజ్యాంగ వ్యతిరేక అప్రజాస్వామిక చట్టాలను వ్యతిరేకిస్తే సహించలేని తనం, అహంకారం అధికార బలాలతో అణచివేయడం జరుగుతున్నది. చరిత్రలో ఇలా చేసిన ఎంతో మంది పాలకులు కనుమరుగైపోయారు అన్నది సత్యం. రైతాంగం పెద్ద ఎత్తున ప్రతిఘటన చూపిస్తూ బలమైన సర్పం చలిచీమల చేత చిక్కి చావదే అన్నట్లుగా పోరాటం చేయడం ప్రజాస్వామ్య వ్యక్తీకరణలు చైతన్యాన్ని ప్రకటిస్తూ ఉండడం అనేది సమాజాన్ని మెరుగైన దిశలో నడిపించడం వైపు కదలికలను ప్రతిబింబిస్తూ ఆశావహ వాతావరణాన్ని సూచిస్తున్నది.

రైతు ఉద్యమంలో ఖలిస్తాని ఉగ్రవాదులు, మావోయిస్టులు, నక్సలైట్లు విదేశీ శక్తులు, తదితరులు ఉన్నారని రైతు పోరాటాన్ని వక్రీకరించి ప్రజల దృష్టిని తప్పుదోవ పట్టించే ప్రయత్నం జరుగుతున్న నేపథ్యంలో అలాంటి అధికారిక సమాచారం ప్రభుత్వం దగ్గర ఉన్నదా అంటే అటువంటి ధ్రువీకరణలు అధికారులు చేయలేదని చెప్పారు. భావోద్వేగాలను రెచ్చగొట్టడంలో, అబద్ధాలను, అసత్యాలను వేగంగా గోబెల్స్ ప్రచారం చేయడం అనేది ఫాసిస్టు మూకలకు నిత్యకృత్యం అయ్యింది. ఒక ముఖ్యమంత్రి రామమందిర నిర్మాణాన్ని సహించలేకనే ప్రభుత్వం పైకి రైతు ఉద్యమాలు చేయిస్తున్నారు అని అంటాడు. మరో ముఖ్యమంత్రి ఈ ఉద్యమంలో మావోలు ఉన్నారని అంటాడు. ప్రజాస్వామ్యయుతంగా నిరసన తెలిపే హక్కు అందరికీ ఉంటుంది. దానిని వ్యతిరేకించే వారే ద్రోహులు కాకుండా పోతారా.

మరోవైపు రైతు ఉద్యమకారులపై నిర్బంధాలను అమలు చేస్తున్నారు. ఎంతో మందిపై నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీచే దర్యాప్తు పేరుతో వేధిస్తున్నారు. రైతు నాయకుల కదలికలను కట్టడి చేయడం కోసం

లక్షల రూపాయల బాండ్లను అడుగుతున్నారు. జర్నలిస్టులను వేధిస్తున్నారు. నిరసన తెలుపుతున్న వారిపై చల్లటి చలిలో సహితం వాటర్ కెనాన్లను ఉపయోగించారు. వారు వచ్చే దారిలో కందకాలను తవ్వారు. ఎన్నో ఆటంకాలను కల్పించినప్పటికీ రైతులు ఢిల్లీ సరిహద్దులకు చేరుకుని తమ పోరాటాన్ని కొనసాగిస్తున్నారు. ఎన్నో నిర్బంధాలను, అణచివేతను, అబద్ధపు ప్రచారాలు ఎదుర్కొని తమ పోరాటాన్ని స్థిరంగా కొనసాగిస్తూ వస్తున్నారు. ఎన్ని రకాలుగా తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేసినప్పటికీ తొణకకుండా, బెణకకుండా శిఖరంలా నిలుచున్న రైతు ఉద్యమంతో చర్చలు జరపడం ప్రభుత్వానికి అనివార్యమయింది .

2020 అక్టోబర్ 14న మొదలై 2021 జనవరి 22 వరకు మొత్తంగా 11 దఫాలుగా చర్చలు జరిగాయి. చట్టాలు చేసే ముందు రైతులతో చర్చించారా అనే ప్రశ్న వచ్చినప్పుడు కేంద్ర న్యాయ శాఖ మంత్రి ఈ చట్టాలపై విస్తృతంగా సంప్రదింపులు, శిక్షణా కార్యక్రమాలు జరిగాయి అని చెప్పాడు. లక్షా ముప్పై ఏడు వేల వెబినార్‌లు, శిక్షణలు జూన్ 2020లో జరిగాయని, వీటిల్లో తొంబై లక్షల నలభై రెండు వేల మంది పాల్గొన్నారని వివరించాడు. వీటికి సంబంధించి అధికారిక సమాచారం కోసం ఎన్‌డి టివి 2020 డిసెంబర్15న కేంద్ర వ్యవసాయ శాఖను సంప్రదించింది. ఏ రోజు ఎవరెవరితో, ఏఏ సమూహాలతో చర్చలు జరిపారని అలాగే వాటి మినిట్స్‌కు సంబంధించిన సమాచారం ఇవ్వమని ఎన్‌డి టివి అడిగింది. దీనికి ప్రతిగా ముఖ్య ప్రజా సమాచార అధికారి స్పందిస్తూ ప్రభుత్వం దగ్గర వీటికి సంబంధించిన ఎలాంటి రికార్డులు లేవు అని చెప్పారు. ఇలా అబద్దాలతో పబ్బం గడుపుకునే దౌర్భాగ్యం ప్రభుత్వానికి దాపురించింది.

2020 అక్టోబర్ 14న జరిగిన మొదటి దఫా చర్చల్లో కేంద్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి సంజయ్ అగర్వాల్‌తో కలిసి రైతులు తమ డిమాండ్లను ముందుంచారు. అందులో వ్యవసాయ చట్టాల రద్దు, విద్యుత్ సవరణ బిల్లు 2020 ఉపసంహరణ, నిరసనకారులపై నమోదు చేసిన కేసుల ఉపసంహరణ, కనీస మద్దతు ధర గురించి ప్రాతినిధ్యం చేశారు. ప్రభుత్వ ప్రతినిధులుగా మంత్రులెవరూ రాకపోవడంతో ఆ సమావేశాన్ని బహిష్కరించారు.

ఆ తర్వాతి చర్చల్లో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్, కేంద్ర వాణిజ్య శాఖా మంత్రి పియూష్ గోయల్, కేంద్ర వాణిజ్య శాఖ సహాయ మంత్రి సోమ్ ప్రకాష్‌లు పాల్గొన్నారు. 2020 నవంబర్ 13న జరిగిన రెండవ దఫా చర్చల్లో వ్యవసాయ చట్టాలను, రద్దు చేయడం కనీస మద్దతు ధరకు గ్యారెంటీ ఇవ్వడం వంటి వాటిని ప్రభుత్వం పట్టించుకోనేలేదు. అధికారులు, వ్యవసాయ నిపుణులు, రైతు నాయకులతో కూడిన ఐదు మందితో కమిటీని వేస్తామన్నారు. ఇది రైతుల సమస్యల, వ్యవసాయ చట్టాల పరిష్కారాలను పరిశీలిస్తుందని చెప్పారు. దీన్ని రైతు నాయకులు తోసిపుచ్చారు. చట్టాలను రద్దు చేయడం కోసం ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు ఏర్పాటు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. అవి అసంపూర్తిగా ముగిశాయి. ఆ తరువాత డిసెంబర్ 1, డిసెంబర్ 3, డిసెంబర్ 5, డిసెంబర్ 30, జనవరి4, జనవరి8, జనవరి 15, జనవరి 20, జనవరి 22-2021 తేదీలలో చర్చలు జరిగాయి.

మొత్తం జరిగిన 11 దఫాల చర్చల్లో కేంద్ర ప్రభుత్వం రైతుల స్పష్టమైన డిమాండ్లపై సానుకూలంగా స్పందించింది లేదు. కానీ పదే పదే రైతులతో చర్చలు జరుపుతామని చెబుతుంటారు. కొత్తగా తెచ్చిన వ్యవసాయ చట్టాలను రద్దు చేయమని మొదటి నుండి కూడా రైతు ఉద్యమం కోరుతున్నది. రద్దు చేయడం కుదరదని అందులో సవరణల గురించి చర్చిద్దామని అంటారు. కనీస మద్దతు ధరకు చట్టపరమైన గ్యారెంటీ ఉండాలని అంటే చట్టంలో దీనిని చేర్చమని, కావాలంటే రాతపూర్వక హామీ ఇస్తామని చెబుతారు. చట్టాలకే గ్యారంటీ లేని సందర్భాలలో గతంలో ఇచ్చిన అనేక హామీలకు విలువే లేదని, అలాంటిది మీరిచ్చే రాతపూర్వక హామీ ఎలా నిలబడుతుందని ఆ ప్రతిపాదనలను రైతులు తిరస్కరించారు.

కొత్త వ్యవసాయ చట్టాలను రద్దు చేయడానికి, జాతీయ రైతు కమిషన్ సిఫారసు చేసిన కనీస మద్దతు ధరను అన్ని వ్యవసాయ ఉత్పత్తులకు రైతులందరికి ఇచ్చేందుకు అనుసరించాల్సిన పద్ధతుల కోసం అనుసరించాల్సిన విధి విధానాలపై చర్చలు జరపాలని స్పష్టంగా రైతులు చెబుతున్నారు. కానీ ఇవేవీ పట్టించుకోకుండా ఈ చట్టాలలోని క్లాజుల వారీగా ఒక్కొక్క దానిపై చర్చిద్దామని ప్రభుత్వం చెబుతున్నది. చట్టాలను రద్దు చేయడం కుదరదని, వాటిలో సవరణలపై చర్చిద్దామని ప్రభుత్వం పదేపదే ప్రతిసారీ ముందుకు తెస్తూ ఉన్నది. రైతుల ఉద్యమం పట్టు సడలనీయకుండా నిరసనలు తెలుపుతున్న నేపథ్యంలో చర్చల పేరుతో కాలం సాగదీస్తూ సాచివేతను ప్రదర్శిస్తున్నారు. రైతులపై తప్పుడు కేసులు పెడుతూ, నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ విచారణలతో వేధిస్తూ, అణచివేతను ఉపయోగిస్తూ మరోవైపు దుష్ప్రచారం సాగిస్తూ రైతు ఉద్యమంపై ప్రత్యక్ష, పరోక్ష దాడులను చేస్తూ ఉద్యమాన్ని బలహీనం చేసే ప్రయత్నం చేస్తున్నారు.

వ్యవసాయ చట్టాలను రద్దు చేయమని డిమాండ్ చేస్తూ ఉంటే వాటిలో సవరణలపై మాట్లాడదామని, అందుకోసం కమిటీలు వేస్తామని చెప్పడంలోని ఆంతర్యమేమి. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడానికి చట్టాలు చేస్తామని చెప్పకుండా చర్చలను నడపడం అనేది దగాకోరుతనం కాకుండా మరేమవుతుంది. చర్చల ప్రహసనం పనికిమాలినదిగా, కాలయాపన చేసేదిగా, వంచించేదిగా తయారైందంటే తప్పేముంటుంది. ఇక రైతులకు మరోదారి లేక ఉద్యమాన్ని కొనసాగిస్తూనే పోయే నిర్బంధ వాతావరణంలోకి నెట్టబడ్డారు. రైతులకు నేషనల్ క్యాపిటల్ రీజియన్ పక్కనే ఉన్న ప్రాంతాల ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ కమిషన్ ఆర్డినెన్స్ 2020 అనుసరించి జరిమానా నిబంధనల నుండి రైతులను మినహాయించడానికి, రైతుల ప్రయోజనాలను రక్షించడానికి విద్యుత్ సవరణ బిల్లు 2020 ముసాయిదాను రద్దు చేయడంలపై రైతులు కొంత మేరకు విజయం సాధించారు.

చర్చల సందర్భంగా గొప్ప మానవతావాదిగా వ్యవసాయ శాఖ మంత్రి తోమర్ కనిపించే ప్రయత్నం చేస్తాడు. ఢిల్లీ సరిహద్దుల్లో నిరసన ఉద్యమంలో ఉన్నటువంటి స్త్రీలను, ముసలి వాళ్లను, పిల్లలను ఇంటికి పంపించమని చెబుతాడు. అంత మనసున్న ప్రభుత్వమే అయితే, ప్రజాస్వామిక స్ఫూర్తికి కట్టుబడే వారే అయితే దీర్ఘకాలంగా ఇంటికి, ఊరికి దూరంగా రైతుల కుటుంబాలకు కుటుంబాలే వేలాదిగా, లక్షలాదిగా రాజధానికి దగ్గరలో నిరసనలు తెలుపుతుంటే వారిపై గౌరవం లేకుండా, వారి ఆరోగ్య, ఆర్థిక పరిస్థితులను, రక్షణ భద్రతలను పట్టించుకోకుండా బాధ్యతారహితంగా ఎలా ఉండగలుగుతున్నారు. తీవ్రమైన చలి, అననుకూల వాతావరణ పరిస్థితుల్లో రైతులు పడుతున్న నానా అవస్థల

గురించి ప్రభుత్వానికి పట్టింపు లేదు. కేంద్ర ప్రభుత్వం రైతుల నిరసనోద్యమాలపై ప్రదర్శిస్తున్న సాచివేత, అణచివేతలు, కించపరిచే వ్యాఖ్యలు ఇప్పటివరకు వందకు పైగా రైతుల మరణాలకు కారణమయ్యాయి. తద్వారా ప్రభుత్వం హంతక స్వభావాన్ని సంతరించు కున్నట్లైంది. ఈ ఉద్యమంలో నేలకొరిగిన వారి పట్ల ప్రభుత్వానికి బాధ్యత లేకుండా పోయింది. రైతులతో తూతూ మంత్రంగా చర్చలు చేసి కార్పొరేట్‌ల ప్రయోజనాలకు కించిత్తు నష్టం కలుగకుండా ప్రజల ప్రయోజనాలను, సంక్షేమాన్ని, ప్రాణాలను పణంగా పెట్టడానికి వెనుకాడడం లేదని చర్చల సరళి స్పష్టం చేస్తున్నది.

చట్టాల రద్దును పక్కకు పెట్టి మాట్లాడమని కేంద్ర మంత్రులు తమ అసహనాన్ని చర్చల సందర్భంగా వెలుబుచ్చారు. కేంద్రం మొండి వైఖరితో ప్రవర్తిస్తూ 'కోర్టుకు వెళ్లండి కోర్టు ఏం చెబితే అది చేస్తాం' అని అంటుంది. అంటే దీని ద్వారా అర్థం చేసుకోవలసింది ఏమిటంటే కోర్టు తమకు అనుకూలంగా ప్రవర్తిస్తుందనే గట్టి నమ్మకం ప్రభుత్వానికి ఉన్నట్లే కదా. మీ అందరితో చర్చలు జరపం, కొంత మందితోనే జరుపుతాం, ఆ వివరాలన్నీ రహస్యంగా ఉంచుతామని ఒకసారి చెబుతారు. అంటే కొందరిని తమకు అనుకూలంగా మార్చుకుని ఉద్యమంలో చీలికలు తెచ్చే ప్రయత్నంగా కూడా దీనిని అర్థం చేసుకోవచ్చు. చట్టాల రద్దు కుదరదని కరాఖండిగా చెబుతూ బాధ్యతారహితంగా ప్రవర్తిస్తుంటారు.

ఒక ఉద్యమం నడుస్తున్నప్పుడు దాన్ని వక్రీకరించడం తప్పుదోవ పట్టించడానికో, నలిపేయడానికో కొందరు న్యాయస్థానాలను ఆశ్రయిస్తుంటారు. వారి వెనక ఉద్యమాన్ని సహించని వారో, పాలక పక్షమో ఉండడం ఎప్పుడూ జరిగేదే. శాంతి భద్రతలకు విఘాతం, ట్రాఫిక్‌కు అంతరాయం, మరేవో కారణాలతో ప్రజా సమీకరణాలను నిలిపివేసే ప్రయత్నాలు జరుగుతూనే ఉంటాయి. ఈసారి కూడా రైతులను ఢిల్లీ సరిహద్దుల నుండి ఖాళీ చేయించమని కొందరు సుప్రీంకోర్టుకు వెళ్లారు. సమస్యను పరిష్కరించమనో, మధ్యవర్తిగా ఉండమనో రైతు సంఘాలు లేదా ప్రభుత్వం కోర్టును అడగలేదు. కోర్టు బలవంతపు మధ్యవర్తిత్వం అవసరం లేదని రైతు సంఘాల నాయకులు స్పష్టం చేశారు. ప్రభుత్వంతోనే తేల్చుకుంటామని చెప్పారు. సుప్రీంకోర్టు నలుగురితో కూడిన కమిటీ వేసింది. చిత్రమేమిటంటే ఆ కమిటీలో ఉన్న నలుగురికి నలుగురు రైతులు వ్యతిరేకించే చట్టాలను సమర్థించిన వారే. ఒకరు మాత్రం రైతుల పక్షాన్నే ఉంటానని, ఆ కమిటీలో ఉండనని చెప్పాడు. రైతులు కోర్టు వేసిన ఈ కమిటీని తిరస్కరించారు. ప్రభుత్వంతోనే చర్చిస్తామని ప్రకటించారు. చట్టాలను ఎందుకు రద్దు చేయాలో వివరించేందుకు రైతు ఉద్యమం సిద్ధంగా ఉందని, రద్దు చేయడానికి సంబంధించిన విధానాలపై చర్చలు జరుపుతామని రైతు సంఘం నాయకులు చెబుతున్నారు. రైతులకు కలిగే ఇబ్బందులపై చర్చించడానికి సిద్ధంగా ఉన్నామని చెబుతున్న వ్యవసాయ మంత్రి తోమర్ చర్చల్లో ఏకపక్షంగా ఉంటూ చట్టాలను రద్దు చేయడం కుదరదని, అది తప్ప మరేదైనా చర్చించండి అని చెబుతుంటాడు. దీన్ని ఏమనాలి.

ప్రధానమంత్రి ఈ చట్టాలను రైతులకు బహుమతి అని అన్నాడు. రైతుల పేరు చెప్పి కార్పొరేట్లకు ఈ చట్టాలను బహుమానంగా ఇస్తున్నారు. దీనిని వెనక్కి తీసుకోమంటే మధ్యేమార్గం చెప్పండి అని కేంద్ర మంత్రులు అంటున్నారు. చట్టాల రద్దు తప్పించి అందులో సవరణల గురించి మాట్లాడదాం అని చెప్పిన దానికే కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉన్నది. ఇంకేమాత్రం ముందుకు జరగడం లేదు. చర్చలు జరుపుతున్నట్లుగా ప్రపంచానికి చెప్పాలనుకుంటున్నారు తప్పిస్తే రైతుల ఆకాంక్షలను పట్టించుకునే, ఆలోచించే స్థితిలో ప్రభుత్వం లేదు. కనీసం రైతులు చెప్పే వాటిని వినే పరిస్థితిలో కూడా లేరు.

చర్చలంటే ఏమిటి? వాటి వల్ల ప్రయోజనం ఏమిటి? చర్చలు జరిపిన ప్రతిసారి ప్రభుత్వం అవే ప్రతిపాదనలను పాడిందే పాడరా అన్నట్లుగా వల్లిస్తూ పోయింది. పదవ దఫాలో కొంచెం మార్పు కనిపించింది. కాని రైతులు డిమాండ్ చేస్తున్న చట్టాల రద్దు, కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడం గురించి ఏమాత్రం లేదు. చివరకు 18 నెలల వరకు వ్యవసాయ చట్టాల అమలును నిలిపివేస్తామని, చట్టాలలో లోపాలు లేకపోయినప్పటికీ ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. అంటే ఏదో విసిరేసినట్టుగా రైతులపై జాలో, దయో చూపిస్తున్నట్లుగా 18 నెలలు చట్టాలను నిలిపివేస్తామని, అంతకంటే చేయగలిగిందేమీ లేదని చెప్పడం ద్వారా రైతు ఉద్యమాన్ని తక్కువ చేసి అవమానించడం జరిగింది. కత్తి మెడపై వేలాడుతూనే ఉంటుంది కానీ, 18 నెలల వరకు ఏమీ అనదన్నమాట. ఈ ప్రతిపాదనతో తాత్కాలికంగా ఉపశమనం వంటిది కలిగించి రైతుల ఉద్యమాన్ని విరమింప చేసే మోసపూరిత స్వభావం బయటపడింది. 11 దఫాలుగా చర్చలు జరిగినప్పటికీ ప్రభుత్వం రైతుల పక్షాన దిగి వచ్చింది ఏమీ లేదు. మొండి వైఖరితో బాధ్యతారాహిత్యం, జవాబుదారీతనం లేకపోవడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడం జరుగుతున్నది.

(రచయిత ఉపాధ్యాయులు) వీ

తుర్లపాటి కుటుంబరావు మృతి

సీనియర్ పాత్రికేయుడు, రచయిత, వ్యాఖ్యాత తుర్లపాటి కుటుంబరావు(87) కన్నుమూశారు. గుండెపోటు కారణంగా విజయవాడలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ జనవరి 11న మరణించారు. 1938 ఆగస్టు 10న కృష్ణాజిల్లాలో జన్మించిన ఆయన 14 ఏళ్ల వయస్సులో జర్నలిజంలోకి అడుగు పెట్టారు. ఏడు దశాబ్దాల పాటు ఆయన పాత్రికేయునిగా, రచయితగా వివిధ హోదాల్లో పనిచేశారు. తెలుగు జర్నలిజం, సాహిత్యానికి ఆయన ఎనలేని కృషి చేశారు. ఏ విషయంపైనైనా అనర్గళంగా మాట్లాడగలిగేవారు. 1947లో 'మాతృభూమి' పత్రికలో తొలి వ్యాసం రాశారు. 1952లో 'ప్రతిభ' వారపత్రికలో చలసాని రామారావుతో కలిసి సంపాదకుడిగా పనిచేశారు. ఆ తరువాత 'ప్రజాసేవ'కు సంపాదకుడిగా, ఆ తరువాత 'ప్రజాపత్రిక'లోనూ, 'వాహిని'లోనూ పనిచేశారు. 1960లో ఆంధ్రజ్యోతిలో చేరి ఆదివారం అనుబంధం ఇన్‌చార్జీగా, సినిమా ఎడిటర్‌గా, సంపాదకీయ రచయితగా, 'జ్యోతిచిత్ర' ఎడిటర్ స్థాయి దాకా వివిధ హోదాల్లో పనిచేశారు. తొలిసారి ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రతిరోజు వార్తలలోని ఒక ప్రముఖుడిని నాలుగేండ్ల పాటు పరిచయం చేశారు. ఒకప్పుడు 'ది హిందూ' దినపత్రికలో ప్రచురించి నిలిపివేసిన 'మ్యాన్ ఆఫ్ ది న్యూస్' శీర్షిక ప్రేరణతో 'వార్తలలోని వ్యక్తి'ని ప్రముఖుల పరిచయంతో ప్రారంభించారు. 1992లో ఆంధ్రజ్యోతికి రాజీనామా చేసిన తరువాత కూడా ఆ శీర్షికను 1999 వరకు కొనసాగించారు.

వ్యవసాయ చట్టాలు: సరుకుల విలువల ధరల వైరుధ్యం

***కేంద్ర వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా సాగుతున్న ఉద్యమంతో రైతులతో పాటు వ్యవసాయ కూలీలు, అసంఘటిత కార్మికులు, పేద మధ్యతరగతి ప్రజల ప్రయోజనాలు కూడా ముడిపడి ఉన్నాయని అంటున్నారు* రమేష్ పట్నాయక్**

కేంద్రం తీసుకు వచ్చిన మూడు వ్యవసాయ చట్టాలకు, విద్యుత్ బిల్లుకు వ్యతిరేకంగా సుమారు గత రెండు నెలలుగా రైతులు ఉద్యమిస్తున్న ఒక చారిత్రక సందర్భంలో మనం ఉన్నాం. చట్టాలపైన, రైతు ఉద్యమంపైన, కోర్టు తీర్పులపైన అనేక విశ్లేషణలు వచ్చాయి. ఇవి రైతు వ్యతిరేక కార్పొరేటు అనుకూల చట్టాలని, పాలక పార్టీ వారు తప్పితే, అత్యధికులు ప్రకటిస్తున్నారు. జనవరి 22న కేంద్ర ప్రభుత్వంతో జరిగిన 11వ విడత సమావేశంలో కూడా రైతు సంఘాల ప్రతినిధులు మూడు వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలనే తమ డిమాండుపై ఎటువంటి రాజీకి అంగీకరించలేదు, ఉద్యమం కొనసాగుతుంది. ఈ వ్యాసం రాసే సరికి 2021 జనవరి 26న, అంటే రిపబ్లిక్ దినాన, దేశ రాజధానిలో రైతుల ప్రదర్శన ప్రధాన చర్చనీయాంశంగా ఉంది. ఈ వ్యాసం ప్రచురించబడే సరికి మరిన్ని పరిణామాలు జరుగవచ్చు. అయితే ఈ వ్యాసంలో మనం సరుకుల విలువలు, ధరల మధ్య సంబంధం, ఇంకా వ్యవసాయ చట్టాల వలన ఏర్పడే పరిణామాలను మార్క్సిస్టు ఆర్థిక శాస్త్ర పద్ధతిలో పరిశీలిద్దాం.

కొత్త పాఠకుడి కొరకు ఒకటి రెండు ప్రాథమిక విషయాలను ముందుగా చెప్పుకుందాం. కుండలు చేసే వ్యక్తి కుండలు తయారు చేసి తన కుటుంబ అవసరాలకు వాడుకుంటే ఆ కుండలకు ఉపయోగపు విలువ ఉంటుంది కాని మారకపు విలువ ఉండదు. అయితే ఆ వ్యక్తి ఒక పనిదినంలో (8 పని గంటలు అనుకుందాం) తయారు చేసిన కుండలు ఒక పనిదినంలో తయారయిన మేదర బుట్టలతో మారకం చేసుకుంటే అప్పుడు తన కుండలకు మారకపు విలువ కూడా వస్తుంది. మారకం పొందిన రెండు సరుకులలో ఒకే విలువ, అదే 8 గంటల శ్రమ ఉంది. సరుకులకు విలువ అందులో సమకూరిన లేదా సంచితమయిన శ్రమ ద్వారా మాత్రమే ఏర్పడుతుందని మార్క్స్ సిద్ధాంతం చేశాడు. మరింత ముందుకు పోయిన తరువాత, వస్తు మార్పిడి పద్ధతి స్థానంలో డబ్బు లావాదేవీలు వచ్చిన తరువాత, కుండలు తయారు చేసే వ్యక్తి, బుట్టలు అల్లే వ్యక్తి వారాంతపు సంతలో తమ సరుకులను డబ్బులకు అమ్మినప్పుడు వాటి మారకపు విలువ డబ్బులలో ధరగా కనిపిస్తుంది. ఇక్కడ మనం గమనించవలసిన విషయం ఏమంటే డబ్బు లేకముందు కూడా సరుకులకు మారకపు విలువ ఉంది. ఒక సరుకు విలువ మరొక సరుకులో వ్యక్తమయ్యేది. సార్వత్రిక మారకపు విలువగా డబ్బు వచ్చిన తరువాత అన్ని సరకుల విలువ డబ్బు రూపంలో ధరగా కనిపిస్తున్నాయి. ప్రైవేట్ ఆస్తి వ్యవస్థలో శ్రమతో తయారయిన వస్తువులకు ఉపయోగ విలువ, మారక విలువ, ధర అనే మూడు అంశాలు ఉంటాయని పాఠకుడు గమనించాలి. అయితే మార్కెట్లు విస్తరించినప్పుడు డిమాండుకు, సప్లైకి మధ్య ఒక అస్థిరత్వం ఏర్పడుతుంది. డిమాండు, సప్లై మధ్య వస్తున్న వ్యత్యాసాల వలన ధరలలో ఎగుడు దిగుడులు ఏర్పడతాయి. మార్కెట్లో ఒక వైపు అమ్మకందారులలో రెండవ వైపు కొనుగోలుదారులలో పోటీ ఉన్నప్పుడు ఒక సీజన్లో ఒక సరుకు మారుతున్న ధరల సరాసరి దానిలో ఉన్న విలువకు తుల్యంగా ఉంటుంది. సరుకుల మారకపు విలువలను పనిగంటలలో చెప్పవచ్చు. కాగా ధరలను రూపాయిలలో చెప్తాం. అందుకే విలువకు తుల్యమైన ధర అంటాము కాని సమానమైన ధర అనము. సమానమైన ధర అని రాసినా అది పెద్ద తప్పుకాదు.

మనం వ్యవసాయ ఉత్పత్తుల ధరలు అన్న మాట తరుచుగా ఉపయోగిస్తాం. అయితే ధర అన్న మాట ఏ ధరను సూచిస్తున్నది? రైతు వ్యాపారునికి అమ్మిన ధర ఒకటి. అలాగే ఒక వ్యాపారి మరొక వ్యాపారికి అమ్మిన ధర మరొకటి. ఇతర మధ్యంతర ధరలు కూడా ఉంటాయి. చివరిగా రిటైల్ వ్యాపారస్తుడు వినియోగదారునికి అమ్మిన ధర (కన్స్యూమర్ ప్రైస్) మరొకటిగా ఉంటుంది. ఈ విషయాలను మనం దృష్టిలో పెట్టుకోవాలి. పంట పండించిన రైతులలో అత్యధికులు తమ ఆర్థిక పరిస్థితుల వలన మంచి ధర వచ్చేవరకు ఆగలేరు. కాగా, ధాన్యం కొనుగోలు చేసే వ్యాపారుల మధ్య సుమారు పోటీ ఉండదు. అంటే రైతు ధాన్యం అమ్మే సందర్భంలో అమ్మకం దారుల మధ్య పోటీ ఉంటుంది కాని కొనుగోలు దారుల మధ్య పోటీ ఉండదు. ఈ కారణంగా ధాన్యం అందులో ఉన్న విలువ కంటే తక్కువ ధరకు, చాలా తక్కువ ధరకు వ్యాపారి కొనుగోలు చేయగలుగుతున్నాడు. క్వింటాలు స్వర్ణ మసూరి ధాన్యంలో ఉన్న విలువ సుమారు రు. 2,200లకు తుల్యంగా ఉండగా రు. 1700లు మాత్రమే ఇస్తున్నాడు. ప్రభుత్వం సేకరణ ధరను రు. 1860లు నిర్ణయించడమే కాక పెద్ద ఎత్తున సేకరిస్తున్నది కూడా కావున ప్రైవేటు వ్యాపారి ఈ ధర అయినా ఇస్తున్నాడు. బీహార్లో పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉన్న విషయం తెలిసిందే. ఆంధ్రప్రదేశ్లో ఇప్పుడు ప్రతి క్వింటాలు దగ్గర రైతు సుమారు రు. 500లు నష్టపోతున్నాడు. క్వింటాలు ధాన్యంలో రు. 2200లకు తుల్యమైన విలువ ఉందని మనం ఎలా చెప్పగలమో తరువాత చూద్దాం. అయితే, 'వ్యవసాయ ఉత్పత్తికి గాని లేదా మరొక ఉత్పత్తికి గాని వివిధ దశలలో వివిధ ధరలు ఉన్నా, మార్కెట్లో పోటీ ఉన్న సందర్భంలో చివరి వినియోగదారుడు చెల్లించే ధరయే సరుకులో విలువకు తుల్యంగా ఉంటుందనే' విషయం మార్క్సిస్టు అర్థశాస్త్రంలో ధరల సూత్రం అని గుర్తు పెట్టుకోవాలి. ఈ సూత్రంపై ఆధారపడి మాత్రమే మనం తరువాత పంక్తులలో క్వింటాలు ధాన్యంలో ఉన్న విలువను రూపాయలలో సుమారు రు. 2,200 గా చెప్పవచ్చని వివరించాం.

రిటైల్ వ్యాపారి వినియోగదారునికి బియ్యం అమ్మే సందర్భాన్ని ఇప్పుడు పరిశీలిద్దాం. ఇక్కడ వ్యాపారులు బియ్యంలో ఉన్న విలువ కంటే తక్కువ ధరకు అమ్మరు. అదే సందర్భంలో అనేక దుఖాణాలు

ఉంటాయి కావున వినియోగదారులు కూడా బియ్యంలో ఉన్న విలువ కంటే ఎక్కువ ధరకు కొనరు. అమ్మకం దారులు గాని కొనుగోలుదారులు కాని ఒత్తిడికి గురయ్యే పరిస్థితి కాదు. ఆ కారణంగా ఈ సందర్భంలో బియ్యం సరాసరిమీద అందులో ఉన్న విలువకు తుల్యమైన ధరకే అమ్ముడు పోతాయి. స్వర్ణ మసూరి బియ్యం కిలో రు. 40 లకు అమ్ముడు పోతుంది అంటే ఆ బియ్యంలో అందుకు తుల్యమైన విలువ ఉందని మనం గ్రహించాలి. మార్కెట్‌లో అమ్మకం దారుల మధ్య పోటీ తొలగిపోయి మోనోపలి పరిస్థితులు ఏర్పడినప్పుడు సరుకులో ఉన్న విలువ కంటే ధర ఎక్కువగా ఉండగలుగుతుంది. అయితే, భారత దేశంలో ఇంతవరకు వ్యవసాయ ఉత్పత్తులను వినియోగదారులకు అమ్మే వ్యాపారంలో పెద్ద పెద్ద పెట్టుబడిదారులు ఉన్నప్పటికీ ఒక ఏకస్వామ్య (మోనోపలి) పరిస్థితి మాత్రం ఏర్పడలేదు. కాస్తా అటు ఇటుగా పోటీ వాణిజ్యం జరుగుతూ వ్యవసాయ ఉత్పత్తుల కన్జ్యూమర్ ధరలు వాటిలో ఉన్న విలువకు అంటే సంచిత శ్రమకు తుల్యంగా ఉంటున్నాయి. మూడు వ్యవసాయ చట్టాలు పూర్తి స్థాయిలో అమలులోనికి వస్తే కన్జ్యూమర్ ధరలు పెరుగుతాయి.

రైతు, వ్యాపారి, వినియోగదారుల మధ్య సంబంధాన్ని పరిశీలిద్దాం. గ్రామంలో ధాన్య సేకరణ చేసే ఏజంట్ దగ్గర నుంచి మిల్లరు మీదుగా పట్టణంలో రిటైల్ వ్యాపారి వరకు మొత్తం ఈ వ్యాపారుల గొలుసును మనం ఒకే వ్యాపారిగా పరిగణించవచ్చు. ఆ విధంగా పరిగణించడం వలన లెక్క వేయడంలో తేడా ఏమీ రాదు. ఇక, 100 కిలోల ధాన్యాన్ని మిల్లు ఆడితే సరాసరిన 60 కిలోల బియ్యం వస్తాయి. స్వర్ణ మసూరి ధాన్యాన్ని ఉదాహరణగా తీసుకుంటే వ్యాపారి రైతు దగ్గర క్వింటాలు రు. 1700 లకు కొనుగోలు చేస్తాడు. ఇంకా వ్యాపారికి ధాన్య సేకరణ, మిల్లు పట్టడం, నిలువ ఉంచడం, రవాణా మొత్తం ఖర్చులు ఉంటాయి. అయితే ఈ ఖర్చులలో తనకు మిగిలే ధాన్యం పొట్టు (దీనినుండి ఖరీదైన ఆయిల్ తీస్తారు), నూకలు, మెత్తని తౌడు విలువలను తీసివేయాలి. అవి కాక క్వింటాలు ధాన్యం దగ్గర మిల్లు పట్టడానికి, నిల్వ ఉంచడానికి, రవాణా చేయడానికి కిరాణా కొట్టు నిర్వహించడానికి ఒక 200 రూపాయిలు అదనంగా ఖర్చు అవుతాయనుకుందాం. దీనినే వాల్యూ అడిషన్, నిర్వహణ వ్యయం అంటారు. ఈ ఖర్చులు కలుపుకుంటే వ్యాపారికి 60 కిలోల బియ్యం రు. 1,900 లకు గిట్టుబాటు అవుతాయి, అయితే వ్యాపారి ఆ 60 కిలోల బియ్యాన్ని వినియోగదారునికి కిలో రు. 40 లు చొప్పున రు. 2,400 లకు అమ్ముతాడు. క్వింటాల్ ధాన్యం వద్ద కనీసం రు. 500 లు లాభం వస్తుంది. అంటే రైతుకు వినియోగ దారునికి మధ్య ఉన్న వ్యాపారి లేదా వ్యాపారుల గొలుసు ప్రతి క్వింటాలు ధాన్యానికి రు. 500 లను జేబులో వేసుకుంటున్నారు.

వ్యవసాయ ఉత్పత్తుల రంగంలో పెద్ద ఎత్తున లాభాలు వస్తున్నాయి. ఈ వ్యాపారంలో వినియోగదారుడు దోపిడీకి గురవుతున్నాడా లేక రైతు దోపిడీకి గురవుతున్నాడా అన్నది మన ముందున్న ప్రశ్న. ఒక వర్గం దోపిడీకి గురికాకుండా మరొక వర్గానికి లాభం రాదుకదా! మోనోపలి పరిస్థితులు ఇంకా ఏర్పడనందున, బియ్యం అమ్మే వ్యాపారుల మధ్య పోటీ ఉన్నందున వ్యాపారి వినియోగదారునికి అందులో ఉన్న విలువకు తుల్యంగా ఉన్న ధరకే అమ్మగలుగుతాడు. 60 కిలోల బియ్యాన్ని వ్యాపారుడు వినియోగదారునికి రు. 2,400 లకు అమ్మగలిగాడంటే ఆ బియ్యంలో అంత విలువ ఉందని తెలుస్తుంది. ఈ సందర్భంలో వ్యాపారి వినియోగదారుని దోచుకోవడం లేదు. మరి ఈ 60 కిలోల బియ్యంలో ఉన్న అంశాలు ఏమిటి? ఈ విలువ రైతు పండించిన ధాన్యంలో ఉన్న విలువ, మిల్లుపట్టడం వంటి చర్యల ద్వారా కలసిన విలువల మొత్తం. వ్యాపారి చేసిన వాల్యూ ఎడిషన్, సామాజికంగా అవసరమైన నిర్వహణ వ్యయం రు. 200 మాత్రమే కావున ఆ రెండువందలను తీసివేస్తే, రైతు పండించిన ధాన్యంలో రు. 2,200 లకు తుల్యమైన విలువ ఉందని స్పష్టమవుతుంది. అయితే ఇంతకు ముందే చెప్పుకున్నట్లు ధాన్యం కొనుగోలు సందర్భంలో వ్యాపారుల మధ్య పోటీ లేకపోవడం వలన, రైతులు తమ ఆర్థిక పరిస్థితుల కారణంగా పంట అమ్మడానికి తొందర పడడం వలన వ్యాపారి రైతుకు 100 కిలోల ధాన్యానికి రు. 2,200లు చెల్లించడానికి బదులు రు. 1,700లు మాత్రమే చెల్లించాడు. రైతు 100 కిలోల ధాన్యం అంటే క్వింటాలు వద్ద రు. 500లు దోపిడీకి గురయ్యాడు. పెట్టుబడి వృత్తంలో దోపిడీ జరిగేది ఉత్పత్తి స్థానం వద్ద అమ్మకం వద్ద కాదని మార్క్స్ వివరించి ఉన్నాడు. సరుకును దాని విలువకు తగిన ధరకు అమ్మినా కూడా పెట్టుబడిదారులకు లాభాలు వస్తాయని మార్క్స్ విశ్లేషించి చూపాడు. కాబట్టి, పోటీ కన్జ్యూమర్ ధరలు ఉన్న ప్రస్తుత పరిస్థితిలో వినియోగదారులను దోపిడీ చేయడం వలనకాక, రైతులను దోపిడీ చేయడం వలన వ్యాపారులు లాభపడుతున్నారని మనం తీర్మానంగా చెప్పవచ్చు. ఈ లెక్కలో ఇచ్చిన అంకెలు ఉజ్జాయింపు అంకెలు మాత్రమే. గణించే పద్ధతిపైననే పాఠకుడు దృష్టి పెట్టాలి.

క్వింటాలు ధాన్యానికి రైతుకు రు. 1,700లు అందుతున్నాయని చెప్పుకున్నాం. అయితే ఇది ఒక సీజన్ సరాసరి ధర అనుకుంటే పేద రైతుకు ఇంత కూడా చేరదు. పేద, మధ్య తరగతి రైతులకు అంతకంటే తక్కువ అందుతుంది కాగా ధనిక రైతులకు అంతకంటే ఎక్కువ అందుతుంది. గ్రామం మొత్తానికి సరాసరిన క్వింటాలు ధాన్యానికి రు. 1,700లు రేటు వస్తుందని చెప్పవచ్చు. మార్క్స్ 'గ్రామాన్ని పట్టణం ఆర్థికంగా దోపిడీ చేస్తుంది కాగా గ్రామం పట్టణాన్ని రాజకీయంగా దోపిడీ చేస్తుందని' అంటాడు. మనం ఇక్కడ గ్రామం ఒక యూనిట్‌గా ఎలా దోపిడీకి గురవుతుందో పరిశీలించాం. ఇక మధ్య తరగతి రైతు, ధనిక రైతు కూలీల శ్రమను ఉపయోగిస్తారు. వారు కూలీలను మరింతగా దోపిడీ చేస్తారు. ఆ వివరాలలోనికి మనం ఇక్కడ వెళ్లడం లేదు. కౌలు రేట్ల తగ్గింపు, కూలీ రేట్ల పెంపుదల పోరాటాల ద్వారా, అంతిమంగా భూమి పంపకం, సహకార వ్యవసాయం, సమిష్టీకరణ ద్వారా ఆ సమస్యలు పరిష్కరించుకోవలసి ఉంటుంది. ప్రస్తుత ఉద్యమానికి అవి కడుదూరమైన విషయాలు. వ్యవసాయంలో కార్మికుడు ఉత్పత్తి చేస్తున్న అదనపు విలువ కార్మికునికి నిరాకరించబడుతుంది. అందులో రెండవ మాట లేదు. అయితే ఆ అదనపు విలువ రైతుకు కూడా మిగల కుండా రైతుద్వారా వ్యాపారికి చేరిపోతుందన్నదే ఇక్కడ చర్చనీయాంశం. వ్యవసాయ ఉత్పత్తుల, ఇన్‌పుట్స్ వ్యాపారం వలన పేద రైతులకు తన శ్రమ కూడా మిగలడం లేదు. మధ్యతరగతి రైతుకు తన శ్రమ మిగులుతుండవచ్చు. కాగా ధనిక రైతు కూడా తాను కూలీల నుంచి దోపిడీ చేసిన అదనపు విలువలో అధిక భాగం వ్యాపార వర్గాలకు అప్పజెప్పవలసి వస్తుంది. ఇది ప్రస్తుత పరిస్థితి. అయితే ఈ మూడు చట్టాలు అమలు జరిగితే, విద్యుత్ బిల్లు చట్టం అయితే, ప్రభుత్వ సేకరణ అడుగంటితే అత్యధిక రైతులకు భూమిని నిలుపుకోవడం కూడా సాధ్యం కాదు. ఒక పెద్ద ఉత్పాతం వస్తుంది. వామపక్ష ఉద్యమం లేకపోతే, ఆ ఉత్పాతాన్ని కూడా పాలక పార్టీ ఫాసిజాన్ని తీసుకురావడానికి ఉపయోగించుకోగలదు.

వ్యాపారులను తొలగించి వ్యవసాయ ఉత్పత్తులలో టోకు, చిల్లర వ్యాపారాన్ని ప్రభుత్వం చేపడితే తన నిర్వహణ ఖర్చులకు, వాల్యూ ఎడిషన్‌కు క్వింటాలుకు 200 రూపాయిలు తగ్గించుకున్నా వినియోగదారుడు చెల్లించిన రు. 2,400 లలో రైతుకు రు. 2,200

లకు చెల్లించవచ్చు. ఇది స్వామినాథన్ కమిటీ సిఫారసు చేసిన మద్దతు ధరకు (సి2 + 50 శాతానికి) పరిమాణంలో సుమారు సరిపోతుంది. రైతుల కొనుగోలు శక్తి పెరుగుతుంది. అప్పుడు శ్రమాధార పరిశ్రమలకు గిరాకీ పెరుగుతుంది. అది మరిన్ని ఉద్యోగాలను పెంచుతుంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ వైవిధ్యం చెందుతుంది, ఆధునీకీకరించబడుతుంది, ఆర్థిక వ్యవస్థ ఊపందుకుంటుంది. ఐతే ఆనాటి కాంగ్రెస్ కేంద్ర ప్రభుత్వం మధ్య దళారులను తొలగించి రైతుకు న్యాయమైన ధర ఇవ్వడానికి ముందుకు రాలేదు. కాగా, ప్రస్తుత కేంద్ర బిజెపి ప్రభుత్వం మధ్య దళారుల స్థానంలో కార్పొరేటు సంస్థలను తీసుకు వస్తున్నది. వీరు రైతులను, కొనుగోలుదారులను కూడా దోపిడీ చేస్తారు.

నిత్యావసర సరుకుల చట్టానికి ఇప్పుడు తీసుకువచ్చిన సవరణ ప్రకారం ధాన్యం, గోధుమలు వంటి తృణ ధాన్యాలు, పెసలు, మినుములు వంటి పప్పు ధాన్యాలు, నువ్వులు, వేరుశనగ వంటి నూనె గింజలు ఇంకా బంగాళా దుంపలు, ఉల్లిపాయలు వంటి వాటిని ఎంత ఎక్కువగానైనా నిల్వ చేసుకోవచ్చు, యథేచ్ఛగా వ్యాపారం చేసుకోవచ్చు. దీనికి మినహాయింపుగా ఈ చట్టంలో ఒక రెండు నిబంధనలు ఉన్నాయి. ఒకటి, యుద్ధాలు, తీవ్రమైన ప్రకృతి వైపరీత్యాల సందర్భంలో ప్రభుత్వాలు నిల్వలను, ధరలను నియంత్రించగలుగుతాయి. రెండు, నిల్వ ఉంచదగ్గ గోధుమలు, ధాన్యం వంటి పంటల విషయంలో 50 శాతంగా, నిల్వ ఉంచడానికి వీలుకాని కూరగాయలు, పండ్లు వంటి పంటల విషయంలో 100 శాతంగా ధరలు పెరిగిన సందర్భాలలో పంటలను నిల్వ ఉంచడంపై, ధరల పెరుగుదలపై ప్రభుత్వాలు నియంత్రణ చేపట్ట గలుగుతాయి. అంటే ఈ చట్టాల వలన మార్కెట్‌లో కృత్రిమ కొరత కల్పించడానికి, ధరలను రెండు రెట్లు వరకు పెంచుకోవడానికి అవకాశం ఉంటుంది.

ఇప్పుడు కిలో రు. 40 లకు వస్తున్న బియ్యాన్ని రు. 80 లకు అమ్ముకున్నా అడిగే పరిస్థితి ఉండదు. ఈ 'వాణిజ్య అనుకూల' వాతావరణంలో బడా కార్పొరేటు సంస్థలు వ్యవసాయ ఉత్పత్తుల వ్యాపారం లోనికి వచ్చి మోనోపలి ధరల పరిస్థితిని కల్పిస్తాయి. కార్పొరేటు సంస్థలు రింగ్ అయి రైతుకి ఇచ్చే ధరలను తగ్గించవచ్చు, వినియోగదారుడు చెల్లించాల్సిన ధరలను పెంచవచ్చు. ధరల పెరుగుదల ఆయా సందర్భాలలో 50 శాతం లేదా 100 శాతం దాటకుండా వారు జాగ్రత్త తీసుకుంటే సరిపోతుంది. మరుసటి సంవత్సరం ధరల పరిమితిని నిర్ణయించేటప్పుడు ఈ సంవత్సరం ధరలు కూడా గమనంలోనికి తీసుకుంటారు. ఆ విధంగా ప్రతి సంవత్సరం ధరలు పెరుగుతూపోతాయి.

ఈ మూడు చట్టాలు అమలు జరిగితే ప్రభుత్వ నియంత్రణ సుమారు శూన్యం అవుతుంది. ఈ విధంగా వ్యవసాయ ఉత్పత్తుల వ్యాపారంలో పోటీ స్థానంలో మోనోపలి ధరలు ఏర్పడతాయి. ప్రధానంగా పంటను పెద్ద ఎత్తున నిల్వ ఉంచుకోవడానికి, దేశ విదేశాలలో ఎక్కడైనా అమ్ముకోవడానికి ఈ చట్టాలు వీలు కల్పించడం వలన అంబానీలు, ఆదానీలు ఈ రంగంలోకి వస్తారు, వ్యాపారంలో పోటీని తొలగించి ఏకస్వామ్యాన్ని నెలకొల్పుతారు. పదుల లక్షల సంఖ్యలో వివిధ స్థాయి వ్యాపారులు కూడా దివాళా తీస్తారు.

ఈ చట్టాల వలన సమస్య వచ్చేది రైతులకు మాత్రమే కాదు. ధరల పెరుగుదల వలన గ్రామాలలో కూలీలు, ఇతర వృత్తుల వారు, పట్టణాలలో అసంఘటిత కార్మికులు తీవ్ర సంక్షోభానికి గురవుతారు. ఇప్పటికీ ఈ వర్గాలలో పౌష్టికాహార లోపం అధికంగా ఉంది. ఆహారపంటల సేకరణపై ప్రైవేట్ సంస్థల మోనోపలి ఏర్పడిన తరువాత ప్రభుత్వాలు అధిక ధరలకు కొని రూపాయికే కిలో బియ్యం ఇవ్వగలుగుతాయా? బాలబాలికలకు మధ్యాహ్నభోజన పథకాన్ని నిర్వహించగలుగుతాయా? ఆహార సంబంధ సరుకుల ధరల పెరుగుదల చివరికి మధ్య తరగతిని కూడా ప్రభావితం చేస్తుంది. ఒక మధ్య తరగతి ఉద్యోగి ప్రస్తుతం ఇంటిలో ఆహారానికి పది పన్నెండు శాతం కంటే ఎక్కువ ఖర్చుచేయడం లేదు. కాబట్టి జాగ్రత్తగా ఉంటే ఒక స్వంత ఇల్లు కట్టుకుంటున్నాడు.

కాని విద్యా వైద్యం ఖర్చులతో పాటు ఆహారం మీద ఖర్చు పెరిగితే స్వంత ఇంటి నిర్మాణం కష్టతరం అవుతుంది. ఒక్కమాటలో చెప్పాలంటే కాంగ్రెస్ నాయకత్వాన గల కేంద్ర ప్రభుత్వాలు మధ్య దళారుల దోపిడీని అనుమతించగా బిజెపి ప్రభుత్వం చిన్న చిన్న మధ్య దళారీల స్థానంలో బడా కార్పొరేటు సంస్థలను తీసుకువస్తున్నది, ఇంతవరకు రైతుకు మద్దతు ధర రాలేదు, అనేక సందర్భాలలో తాము పెట్టిన మదుపులు కూడా రావడం లేదు. కాని ఈ చట్టాలు అమలు జరిగితే రైతు వ్యవసాయంలో నిలబడడానికే సాధ్యం కాదు. ఐదు ఎకరాల లోపు భూమి ఉన్న 12 కోట్ల 50 లక్షల పేద, సన్నకారు రైతులు భూమిని కోల్పోయి రోడ్డున పడతారని అంచనాలు ఉన్నాయి. ఇక వినియోగదారులు కూడా విపరీతమైన దోపిడీకి గురవుతారు.

కాంగ్రెస్ వారి మధ్య దళారీల, బిజెపి వారి కార్పొరేట్ల దోపిడీ అంతం కావాలంటే వ్యవసాయ ఉత్పత్తులలో మొత్తం టోకు, చిల్లర వ్యాపారాన్ని జాతీయం చేయడం ఒక్కటే మార్గం. అప్పుడే రైతుకు మద్దతు ధర వినియోగదారునికి సరసమైన ధర అందుబాటులోనికి వస్తాయి. ఇంకా పంటల సేకరణ, ప్రాసెసింగ్, నిల్వ, రవాణా, పంపిణీ రంగాలలో ఇప్పుడు పనిచేస్తున్న వారికి పని ఒత్తిడి తగ్గుతుంది, పనిగంటలు అమలు అవుతాయి, అంతేకాక వారి పని పరిస్థితులు, వేతనాలు, భత్యాలు మెరుగవుతాయి.

ఈ రంగం ఒక సంఘటిత రంగంగా అభివృద్ధి చెందగలదు. రష్యా, చైనా రెండు దేశాలలో కూడా విప్లవానంతరం వ్యవసాయ ఉత్పత్తుల వ్యాపారాన్ని చాలా వరకు రాజ్యం చేపట్టింది.

ఈ మూడు చట్టాలు ఉన్నన్నాళ్లూ రైతుకు న్యాయబద్ధమైన కనీస మద్దతు ధర, వినియోగదారునికి సరసమైన ధర సాధ్యం కాదు. ఈ పరిస్థితులలో కేంద్రం తీసుకు వచ్చిన మూడు చట్టాలను, విద్యుత్ బిల్లును వ్యతిరేకించడమే కాక, పాలు, గుడ్లు, చేపలు వంటి అన్ని ఉత్పత్తులకు కనీస మద్దతు ధర కొరకు చట్టాన్ని డిమాండు చేయడమేకాక వ్యవసాయ ఉత్పత్తులలో ప్రైవేట్ వ్యాపారాన్నే రద్దు చేయాలనే డిమాండ్ ప్రాధాన్యతను కూడా ఉద్యమం గుర్తించాలి. సన్నకారు, పేద రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీలు, గ్రామీణ ఉపాధి హామీ పథకం 200 రోజులకు విస్తరించడం వంటి డిమాండ్‌లు కూడా చాలా ముఖ్యమైనవి. ప్రభుత్వ సేకరణను కొనసాగించి, విస్తరించి ప్రజాపంపిణీ వ్యవస్థను అభివృద్ధి చేయాలి. ఇక భూగరిష్ట పరిమితిని తగ్గించడం, కనీసం ప్రస్తుత పరిమితులలో మిగులు భూములను పంపిణీ చేయడం వంటి డిమాండ్లను ధనిక రైతుల నాయకత్వానగల ఈ ఉద్యమం స్వీకరించగలుతుందని భావించలేం. అయితే పేద సన్నకారు రైతులు పూర్తిగా దివాళా తీయకుండా ఉండడానికి, ధరల అదుపుకు, ప్రజాపంపిణీ వ్యవస్థ కొనసాగడానికి ఈ మూడు చట్టాలను, విద్యుత్ బిల్లును నిలువరించడం ఏంతైనా అవసరం. నాయకత్వం ధనిక రైతులదైనా పేద, సన్నకారు రైతుల, వ్యవసాయ కూలీల, అసంఘటిత కార్మికుల చివరికి మధ్య తరగతి ప్రజల ప్రయోజనాలు కూడా ఈ ఉద్యమంతో ముడిపడి ఉన్నాయి.

(రచయిత కన్వీనర్, ఆంధ్రప్రదేశ్ విద్యాపరిరక్షణ కమిటీ) వీ

కార్పొరేట్ల చేత, కార్పొరేట్ల వల్ల, కార్పొరేట్ల కొరకు

మోడీ పాలనలో దేశ పాలనా నిర్ణయాలు ఎంతగా కార్పొరేట్ల, ప్రత్యేకంగా కొద్దిమంది వ్యక్తుల, స్వార్థ ప్రయోజనాలు తీర్చేందుకు, సంపదలు పెంచేందుకు ఉపయోగపడుతున్నాయో వివరిస్తున్నారు ఎన్. వేణుగోపాల్

ఒకప్పుడు దేశ రాజకీయార్థిక చర్చలలో టాటా, బిర్లా పేర్లు వినబడినట్టుగా ఇటీవల, ముఖ్యంగా వ్యవసాయ చట్టాల తర్వాత, ఢిల్లీ రైతు నిరసన ప్రదర్శనల్లో భాగంగా అంబానీ, అదానీ పేర్లు వినబడుతున్నాయి. అప్పుడు టాటా, బిర్లా అయినా, ఇప్పుడు అంబానీ, అదానీ అయినా ఒంటరి వ్యక్తులు కారు. వారు ఈ దేశ ఆర్థిక వ్యవస్థను తమ గుప్పెట్లో పెట్టుకున్న, తద్వారా విధాన నిర్ణయాలను, రాజకీయాలను శాసిస్తున్న వ్యాపారవేత్తల, పారిశ్రామిక వేత్తల సమూహానికి ప్రతినిధులు.

వీరు తమ ఆర్థిక బలం ద్వారా రాజకీయ అధికార వర్గానికి, ముఖ్యంగా విస్తృతమైన నిర్ణయాధికారాలున్న మంత్రులకు, ముఖ్యమంత్రులకు, ప్రధానమంత్రులకు దగ్గరవుతారు. ఆ రాజకీయాధికారుల చేత తమకు అనుకూలమైన నిర్ణయాలు చేయించుకుంటారు. ఆ నిర్ణయాల ద్వారా తమ ఆర్థిక బలాన్ని మరింత పెంచుకుని, రాజకీయవేత్తలకు ఆర్థికవనరులు సమకూర్చేవారుగా మారుతారు. రాజకీయ నాయకులతో అవినాభావ సంబంధం నెరపుతూ తమ వ్యాపార, ఆర్థిక ప్రయోజనాలకు అనుకూలమైన పాలనా నిర్ణయాలు, విధానాలు అమలులోకి వచ్చేట్టు చూస్తారు. పాలకులతో సన్నిహిత సంబంధాలు, నిరంతరాయంగా పెద్ద ఎత్తున సాగే అవినీతి ఈ వ్యాపారవేత్తల అభివృద్ధికీ, సంపద పోగుపడడానికీ, రాజకీయ నిర్ణయాధికారం పెరగడానికీ పునాదిగా ఉంటాయి. మామూలుగానే వ్యాపార అర్థశాస్త్రంలో పెట్టుబడికి ప్రతిఫలం – రిటర్న్ ఆన్ ఇన్వెస్ట్‌మెంట్, ఆర్‌ఓఐ అంటారు – అనే లెక్క ఉంటుంది. వంద రూపాయల పెట్టుబడి పెడితే నూట పది సంపాదించగలమా, నూట ఇరవై సంపాదించగలమా అనే లెక్క అది. పరిశ్రమల్లో, వ్యాపారాల్లో ఉండే ఆర్‌ఓఐ కన్న రాజకీయాల్లో ఆర్‌ఓఐ చాల చాల రెట్లు ఎక్కువ. రాజకీయ నాయకుల మీద, వారి ఎన్నికల వ్యయం మీద, వారి ఆస్తుల పెంపుదల కార్యక్రమాల మీద ఈ వ్యాపారవర్గాలు పెట్టే పెట్టుబడికి ఎన్నో రెట్ల ఎక్కువ ఆర్‌ఓఐ ఉంటుంది. ఒక రాజకీయ పార్టీకి, లేదా ఒక ముఖ్యమంత్రి అభ్యర్థికి, ఎన్నికల వ్యయంగా ఐదువందల కోట్ల రూపాయలో, వెయ్యి కోట్ల రూపాయలో పెట్టుబడి పెట్టి, వాళ్లు అధికారంలోకి రాగానే పదివేల కోట్ల రూపాయల పథకాలు ప్రతిఫలంగా సంపాదించిన వ్యాపారవేత్తలు ఉన్నారు.

ఇటువంటి పెట్టుబడిదారులను కొందరు సామాజిక విశ్లేషకులు ఆశ్రిత పెట్టుబడిదారులు (క్రోనీ కాపిటలిస్టులు) అని పిలుస్తున్నారు. క్రోనీ కాపిటలిజం అంటే పాలనా యంత్రాంగంతో సన్నిహిత సంబంధం ద్వారా తమ వ్యాపార ప్రయోజనాలను నెరవేర్చుకునే పెట్టుబడిదారీ వ్యాపార పద్ధతి అని అర్థం. అయితే ఈ పద్ధతిని వివరించడానికి 1980ల తర్వాత బహుళ ప్రచారంలోకి వచ్చిన క్రోనీ కాపిటలిజం అనే మాట కన్న 1940లలో చైనా విప్లవ క్రమంలో మావో సే టుంగ్ ప్రతిపాదించిన బ్యూరాక్రటిక్ బూర్జువాజీ అనే పదబంధం ఎక్కువ సరిపోతుంది. రాజకీయాధికారాన్ని అండగా పెట్టుకుని పెట్టుబడిదారులుగా మారినవారు, రాజకీయాధికారం సహాయంతో తమ పెట్టుబడిదారీ కార్యకలాపాలను సాగించేవారు అనే అర్థంలో బ్యూరాక్రటిక్ బూర్జువాజీ అనే మాట వాడుతారు. దీన్ని రాజకీయ పరిభాషలో నిరంకుశ పెట్టుబడిదారీ అని అనువదిస్తున్నారు గాని అధికారాశ్రిత, అధికారసహిత పెట్టుబడిదారీ అనడం సరిపోతుంది. అయితే ఈ అధికారసహిత పెట్టుబడిదారీ విధానం ద్రవ్య పెట్టుబడి యుగంలో అటు సామ్రాజ్యవాద దళారీ కాకుండా, ఇటు సామాజిక పునాది కోసం భూస్వామ్యంతో మిలాఖత్తు కాకుండా మనుగడ సాగించజాలదు.

ఈ అధికారాశ్రిత పెట్టుబడి పద్ధతి కొత్తదేమీ కాదు. బ్రిటిష్ వలస కాలం నుంచీ కూడ ప్రభుత్వంతో సన్నిహత సంబంధం నడిపిన, రాజకీయ అధికారాన్ని తమ వ్యాపార ప్రయోజనాల కోసం వినియోగించుకుంటున్న పెట్టుబడిదారీ వ్యాపార, పారిశ్రామిక వర్గాలున్నాయి. అధికార మార్పిడి తర్వాత పార్లమెంటరీ ఎన్నికల రాజకీయాలు, ప్రభుత్వ కార్యక్రమాల కాంట్రాక్టు పద్ధతి విపరీతంగా పెరిగిన తర్వాత ఆ వర్గాల ప్రాధాన్యత, బలం మరింత పెరిగాయి. ఆ వర్గాలు అన్ని పాలకవర్గ పార్టీలతో సన్నిహిత సంబంధం నెరపుతూ, అన్ని పార్టీలకూ ఎన్నికల నిధులు సమకూరుస్తూ, ఎవరు అధికారానికి వచ్చినా తమకు అనుకూలమైన విధానాలు, నిర్ణయాలు, చర్యలు, కార్యక్రమాలు అమలు చేయించుకుంటూ, తాము బలపడుతూ, అందులో కొంత భాగాన్ని రాజకీయవేత్తలకు ముడుపులుగా చెల్లిస్తూ వచ్చాయి. విదేశీ ప్రభుత్వాలతో, బహుళజాతి సంస్థలతో ఒప్పందాలు, ప్రభుత్వం ప్రజాధనంతో స్థాపించే భారీ పథకాలు, నీటి పారుదల, విద్యుచ్ఛక్తి, సమాచార సంబంధాలు, రవాణా, రహదారులు, వైద్య ఆరోగ్య సౌకర్యాలు, విద్యా సౌకర్యాలు వంటి అన్ని అభివృద్ధి కార్యక్రమాలలోను ఇటువంటి వ్యాపార, పారిశ్రామిక వర్గాలు ప్రవేశించాయి. ప్రభుత్వాధికారాన్ని అడ్డం పెట్టుకుని రాజకీయ పార్టీలు ఈ వ్యాపార పారిశ్రామిక వర్గాలను పెంచి పోషించాయి. మూడు దశాబ్దాల పాటు నిరంతరాయంగా, ఆ తర్వాత మరొక పదిహేను సంవత్సరాలు అధికారం నెరపిన కాంగ్రెస్ పార్టీ ఇలా పెట్టుబడిదారీ వ్యాపార, పారిశ్రామిక వర్గాన్ని తన ఆశ్రయంలో ఉంచుకుంది. లేదా ఆ వ్యాపార పారిశ్రామిక వర్గాలే కాంగ్రెస్‌ను తమ ఆశ్రయంలో ఉంచుకున్నాయి. ఈ దేశంలో అన్ని అక్రమాలకూ కన్నతల్లి అయిన కాంగ్రెస్ ను అనుకరించని, అనుసరించని పార్లమెంటరీ రాజకీయపార్టీ ఒక్కటి కూడ లేదు. మొదట రాష్ట్రాల్లో, ఆ తర్వాత కేంద్రంలో మిశ్రమ మంత్రివర్గాల్లో అధికారంలోకి వచ్చిన అన్ని రాజకీయ పార్టీలూ ఇటువంటి వ్యాపార, పారిశ్రామిక వర్గాల సన్నిహిత మైత్రిని కొనసాగించాయి.

అలా తొలుత రాష్ట్ర ప్రభుత్వాలు నడిపిన రోజుల్లో కుదిరిన స్నేహసంబంధాలను మరింత పై స్థాయికి విస్తరించే పనిని భారతీయ జనతా పార్టీ తన తొలి కేంద్ర ప్రభుత్వ అధికారం రోజుల్లోనే ప్రారంభించింది. గుజరాత్‌లో ముఖ్యమంత్రిగా ఉన్న రోజుల్లో వ్యాపార వర్గాలతో సన్నిహిత మైత్రి నెరపి, పెట్టుబడిదారుల పెరుగుదలకు బాటలు వేసి, దాన్ని ఆకర్షణీయ గుజరాత్ అభివృద్ధి నమూనాగా ప్రచారం

చేసుకున్న నరేంద్ర మోడీ ప్రధాన మంత్రిగా అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ నమూనాను మరింత విస్తరించాడు. తన గుజరాత్ రోజుల మిత్రులతో పాటు కొత్త మిత్రులను కూడ పెంచుకున్నాడు. మోడీ ప్రభుత్వ పాలనలో దేశంలో శత కోటీశ్వరుల సంఖ్య ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోవడానికి ప్రధాన కారణం అదే. మోడీ ప్రభుత్వ విధానాలు శత కోటీశ్వరులను పెంచాయి, వారు చేసిన అనేక ఆర్థిక అక్రమాలను చట్టపరంగా శిక్షించకుండా కాపాడాయి. దేశ వనరులను వారికి అప్పనంగా అప్పగించాయి. మాటల్లో దేశభక్తి చెపుతూనే ఆ వ్యాపార వర్గాలు బహుళజాతి సంస్థల దళారులుగా, భాగస్వాములుగా మారుతుంటే మౌనంగా చూస్తూ కూర్చున్నాయి. కనీసం 1970ల తొలిరోజుల్లో ఇందిరా గాంధీ ప్రగతిశీల ముసుగు రోజుల్లో, ఇటువంటి పెట్టుబడిదారుల అక్రమాలను అడ్డుకోవడానికి తయారు చేసిన విధానాలను, ఇప్పటిదాకా అరకొరగానైనా అమలవుతున్న విధానాలను, మోడీ ప్రభుత్వం బలహీనపరిచింది, రద్దు చేసింది.

మోడీ విధానాల పర్యవసానం కనీసం ఇద్దరు ఇటువంటి వ్యాపారవేత్తల విషయంలో చెప్పాలంటే 2014లో 23 బిలియన్ డాలర్లు (ఒక లక్షా డెబ్బై వేల కోట్ల రూపాయలు) గా ఉండిన ముకేశ్ అంబానీ ఆస్తి మోడీ మొదటి పాలనా కాలం పూర్తయ్యే నాటికి 2018 చివరికి 55 బిలియన్ డాలర్ల (నాలుగు లక్షల కోట్ల రూపాయల) కు ఎగబాకింది. మరొక రెండు సంవత్సరాలు కూడ పూర్తికాక ముందే 2020 అక్టోబర్ నాటికి అది 88.7 బిలియన్ డాలర్లకు (ఆరు లక్షల అరవై ఐదు వేల కోట్ల రూపాయలు) పెరిగింది. గౌతం అదానీ ఆస్తి 2014లో 2.6 బిలియన్ డాలర్లు (పందొమ్మిది వేల కోట్ల రూపాయలు) గా ఉన్నదల్లా 2018 చివరికి 11.9 బిలియన్ డాలర్ల (ఎనభై ఏడు వేల కోట్ల రూపాయల) కు, 2020 అక్టోబర్ నాటికి 25.2 బిలియన్ డాలర్ల (ఒక లక్షా ఎనభై నాలుగు వేల కోట్ల రూపాయల) కు చేరింది.

ముకేశ్ అంబానీ అక్రమాల చరిత్ర వివరించడానికి ఒక వ్యాసం సరిపోదు, పుస్తకాలు కావాలి. తండ్రి ధీరూభాయి అంబానీ అత్యంత సాధారణ దిగువ మధ్యతరగతి చిరుద్యోగిగా ప్రారంభించి, క్రమంగా వస్త్ర వ్యాపారంతో ప్రారంభించి, కాంగ్రెస్ తో సన్నిహిత సంబంధాల సహాయంతో, పాలియెస్టర్, పెట్రోకెమికల్స్, విద్యుచ్ఛక్తి, పరికరాలు, చిల్లర వర్తకం, వినోద సేవలు, ప్రచార సాధనాలు, డిజిటల్ సేవలు వంటి అనేక రంగాలకు విస్తరించాడు. తన వ్యాపార సామ్రాజ్యం విస్తరిస్తుంటే కొడుకును అమెరికాలో చదువు మానిపించి తన దగ్గర పెట్టుకుని రాజకీయ సంబంధాలలో, రాజకీయవేత్తలను వాడుకుని వ్యాపారాన్ని విస్తరించడంలో శిక్షణ ఇచ్చాడు. తండ్రి చనిపోయిన తర్వాత తమ్ముడితో ఆస్తి తగాదా వచ్చినా, అది ముదిరి పంపకాలు జరిగినా, అప్పటికే గుజరాత్ ముఖ్యమంత్రి అయిన నరేంద్ర మోడీతో సంబంధాలు పెట్టుకుని ముకేశ్ అంబానీ తన వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించాడు. గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో మోడీ గుజరాత్ స్టేట్ పెట్రోలియం కార్పొరేషన్, ఆయిల్ అండ్ నాచురల్ గాస్ కమిషన్ వంటి ప్రభుత్వ సంస్థలను దోచి ముకేశ్ అంబానీకి వేల కోట్ల రూపాయల ఆస్తులను ఎట్లా అప్పగించాడో కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదికలు ఎన్నోసార్లు విప్పిచెప్పాయి. అలా పెరిగిన వ్యాపార సామ్రాజ్యంలో ఇవాళ పాలిమర్లు, రసాయనాలు, పాలీయెస్టర్లు, పెట్రోలియం చిల్లర వర్తకం, రవాణా సర్వీసులు, ప్రధాన రహదారుల మీద భోజనశాలలు, హోటళ్లు, ఆహారపదార్థాలు, లూబ్రికెంట్లు, వస్త్రాలు, చిల్లర దుకాణాలు, సూపర్ మార్కెట్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, వజ్రాభరణాలు, దుస్తులు, పాదరక్షలు, డిజిటల్ సేవలు, ప్రచార మాధ్యమాలు, సమాచార సంబంధాల సేవలు వంటి ఎన్నో విభాగాలున్నాయి. ఒక్క జియో మొబైల్ సేవలకే తాజా గణాంకాల ప్రకారం నలభై కోట్ల వినియోగదారులున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఇవాళ దేశమే ముకేశ్ అంబానీ సొంత ఆస్తిగా ఉన్నది.

నరేంద్ర మోడీకీ ముకేశ్ అంబానీకీ ఉన్న సన్నిహిత సంబంధం అంబానీ వ్యాపారానికి ఎలా ఉపయోగపడిందో చూడాలంటే డజన్లకొద్దీ ఉదాహరణలు ఇవ్వవచ్చు గాని రిలయన్స్ జియో ఉదాహరణ ఒక్కటి సరిపోతుంది. అప్పటికి మార్కెట్‌లో ఉన్న మొబైల్ టెలిఫోన్ వ్యాపార గృహాలు ఐడియా, ఎయిర్ టెల్, రిలయన్స్ కమ్యూనికేషన్స్, ఎయిర్ సెల్, టెలినార్ ఇండియా, వోడాఫోన్‌ల కన్న తక్కువ ధరకు హాండ్‌సెట్లు, దాదాపు ఉచితంగా మొబైల్ సేవలు ఇస్తూ 2016 సెప్టెంబర్‌లో రిలయన్స్ జియో ప్రారంభమైంది. అది ప్రారంభమైన రోజున కనీవినీ ఎరగని రీతిలో ఆ ప్రైవేటు కంపెనీ మొబైల్ ఫోన్ పట్టుకున్న మోడీ ఫొటోతో ప్రచారకర్తగా పూర్తిపేజీ ప్రకటనలు ఇచ్చుకున్నారు. ప్రత్యర్థి కంపెనీలు అభ్యంతరాలు లేవనెత్తితే మోడీ అనుమతి లేకుండా ఫొటో వాడుకున్నారని ప్రకటించారు గాని, ఆనాటి ప్రకటనలో జియో కంపెనీ ఉపయోగించిన రంగులు, మోడీ వేసుకున్న దుస్తుల రంగులు ఒకటేనని చూస్తే ప్రత్యేకంగా ముకేశ్ అంబానీ కంపెనీకి ప్రచారం ఇచ్చేందుకే భారత ప్రధానమంత్రి సిద్ధపడ్డారని తేలుతుంది.

అలా చౌకధరలకో, ఉచితంగానో ఇవ్వడం ద్వారా ప్రత్యర్థులను దెబ్బతీసి, మార్కెట్ ను ఆక్రమించడానికి ముకేశ్ అంబానీ పథకం వేశాడు. టెలికాం రంగంలో అటువంటి అక్రమ వ్యాపార విధానాలను నియంత్రించడానికే ఏర్పడిన టెలికాం రెగ్యులేటరీ అథారిటీ (ట్రాయి) తన నియంత్రణ విధానాలను మార్చడం ద్వారా జియో వినియోగదారుల సంఖ్య ఇబ్బడి ముబ్బడిగా పెరగడానికి సాయపడింది. సరిగ్గా జియో ప్రారంభం కావడానికి ఒక నెల ముందు ట్రాయి ఇంటర్ కనెక్షన్ చార్జీలను 50 శాతం తగ్గించింది. తద్వారా జియో వినియోగదారులకు అప్పటికి ఉన్న ఇతర పెద్ద కంపెనీల వినియోగదారులతో సంబంధాలు సులభంగా ఏర్పడ్డాయి. అందువల్ల చాల మంది వినియోగదారులు అప్పటికి తాము వాడుతున్న వేరువేరు కంపెనీలను వదిలి జియో వినియోగదారులుగా మారిపోయారు. ఆ తర్వాత జియో ఇంకా తన సేవలను అందించడానికి పరీక్షలు జరుపుతున్న సమయంలో 2016లోనే ట్రాయి హఠాత్తుగా జియోకు తగినంతగా ఇంటర్ కనెక్టింగ్ పాయింట్లు ఇవ్వకుండా ఉన్నందుకు ప్రత్యర్థుల మీద రు. 3000 కోట్ల జరిమానా విధించింది. ఆ పాయింట్లు ఇవ్వడానికి 90 రోజుల గడువు ఉన్నప్పటికీ అంతకన్న ముందే జరిమానా విధించి, ప్రత్యర్థుల మెడలు వంచడంతో జియో విస్తరణ సులభమైంది.

ప్రత్యర్థుల మార్కెట్లను ఆక్రమించడం కోసం జియో తన సేవలను తక్కువధరకు అమ్మే అన్యాయానికి పాల్పడుతున్నదని, అది అప్పటికి ఉన్న గుత్తాధిపత్య, అక్రమ వ్యాపార పద్ధతుల నిరోధ చట్టానికి వ్యతిరేకమని ప్రత్యర్థి కంపెనీలు ఫిర్యాదు చేస్తుండగానే 2018లో ట్రాయి మరొకసారి పోటీ ఆంక్షలను జియోకు అనుకూలంగా మార్చివేసింది. అప్పటివరకూ ఇతరుల మార్కెట్లను ఆక్రమించడానికి దొంగదెబ్బగా తక్కువ ధరలకు అమ్మేవారి మీద ఆంక్షలు విధించడానికి ఆ కంపెనీకి ఉన్న మార్కెట్ శక్తి అనేది ఒక సూచికగా ఉండేది. ఇప్పుడు ట్రాయి అసలు మార్కెట్ శక్తి అనే మాటకు నిర్వచనాన్ని మార్చేసింది. ఆదాయంలో మార్కెట్ వాటా, చందాదారులలో మార్కెట్ వాటా, లావాదేవీల పరిమాణం, సామర్థ్యం అనే నాలుగు సూచికలతో అప్పటివరకూ మార్కెట్ శక్తిని కొలుస్తుండేవారు. ఈ నాలుగు సూచికలలో చివరి రెండు సూచికలను తొలగించడం ద్వారా ప్రిడేటరీ ప్రైసింగ్ (ధరల అక్రమ నిర్ణయం) పరిధిలోకి జియో రాకుండా ట్రాయి కాపాడింది. ఈ పని చేసినందుకు గాను అప్పటి ట్రాయి చైర్మన్ ఆర్ ఎస్ శర్మ పదవీకాలాన్ని మోడీ ప్రభుత్వం మరొక రెండు సంవత్సరాలు పొడిగించింది. ట్రాయి ఇరవై సంవత్సరాల చరిత్రలో ఒక చైర్మన్ కు రెండో దఫా పదవి పొడిగింపు అదే మొదటిసారి.

ఇలా మోడీ ప్రభుత్వం, ట్రాయి చేసిన సహాయాల వల్ల రిలయన్స్ జియో, ముకేశ్ అంబానీ సంపద విపరీతంగా పెరిగిపోయింది. అంతకు ముందు ఉన్న ఆరుగురు ప్రత్యర్థులలో నలుగురు మూసుకొనిపోవడమో, మరొక కంపెనీలో కలిసి పోవడమో జరిగింది. ఇప్పుడిక నూట పదిహేను కోట్ల వినియోగదారుల మార్కెట్ లో జియో 32 శాతం కన్న ఎక్కువ వాటాతో మార్కెట్ నాయకురాలి స్థానంలో ఉంది. నిజానికి ముకేశ్ అంబానీ ఆస్తుల పెరుగుదలలో జియో చేసిన దోహదమే ఎక్కువ అనాలి. ముకేశ్ అంబానీ వాస్తవ సంపదలో 2014 నుంచి 2016 వరకూ, జియో ప్రారంభించే వరకూ, కూడ పెద్ద పెరుగుదల లేదు. అది 23 బిలియన్ డాలర్లుగానే ఉండింది. కాని 2020 కల్లా నాలుగు సంవత్సరాల్లో మూడున్నర రెట్లకన్న ఎక్కువ పెరిగింది.

మోడీకి మరొక సన్నిహిత ఆంతరంగిక మిత్రుడు గౌతమ్ అదానీ. గుజరాత్ లో మోడీ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో అదానీ ఆస్తులు ఐదువందల రెట్లు పెరిగాయి. మోడీ గుజరాత్ పాలన ముగిసే సమయానికి అదానీ ఆస్తులు 2.6 బిలియన్ డాలర్లు. కేంద్రంలో మోడీ మొదటి పాలనా కాలంలో నాలుగు సంవత్సరాలలో ఆ ఆస్తులు నాలుగు రెట్లు 11.9 బిలియన్ డాలర్లకు పెరిగాయి. తాజాగా 2020 అక్టోబర్ నాటికి అవి 25.2 బిలియన్ డాలర్లకు చేరాయి. మోడీ పాలన తొలి నాలుగు సంవత్సరాలలో జరిపిన విదేశీ పర్యటనల్లో భాగంగా అదానీ 15 అంతర్జాతీయ వ్యాపార ఒప్పందాలు కుదుర్చుకున్నాడు. రక్షణ, రవాణా, విద్యుచ్ఛక్తి రంగాలలో మోడీ పర్యటించిన ప్రతిదేశంలోనూ అదానీకి కాంట్రాక్టులు దక్కాయి.

ఒక్క ఉదాహరణ చెప్పాలంటే మోడీ అధికారానికి వచ్చిన కొద్ది నెలల్లోనే ఆస్ట్రేలియా పర్యటన సందర్భంలో అక్కడ 15.5 బిలియన్ డాలర్ల (ఒక లక్షా పద్నాలుగు వేల కోట్ల రూపాయల) విలువైన కార్మైకేల్ గనుల కాంట్రాక్టును అదానీ సంపాదించాడు. ఆ ఆస్ట్రేలియన్ గనులను అదానీ తన సొంత డబ్బుతో ఏమీ కొనుగోలు చేయలేదు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇచ్చిన ఒక బిలియన్ డాలర్ల (ఏడు వేల మూడు వందల కోట్ల రూపాయల) రుణంతో అదానీ ఆ గనులను చేజిక్కించుకున్నాడు. ఆ గనుల లావాదేవీల్లో అనేక ఆర్థిక అక్రమాలు జరిగాయని, పన్నుల ఎగవేత జరిగిందని, ఆ గనుల తవ్వకం వల్ల పర్యావరణ సమస్యలున్నాయని ఆస్ట్రేలియాలో గత ఐదు సంవత్సరాలుగా ప్రజాందోళనలు జరుగుతూనే ఉన్నాయి.

అసలు ఆశ్చర్యకరమైన విషయమేమంటే అదానీ వ్యాపార సామ్రాజ్యమంతా ప్రభుత్వ రంగ బ్యాంకుల నుంచి తక్కువ వడ్డీకీ, అసలు ఎగ్గొట్టడానికి వీలుగా తీసుకున్న రుణాలతో నిర్మాణమయిందే. 2015 నాటికి అదానీ గ్రూపు కంపెనీలన్నిటికీ కలిపి రు. 92,000 కోట్ల అప్పులున్నాయని సొంత పత్రాలే చెపుతున్నాయి. క్రెడిట్ స్విస్ అనే అంతర్జాతీయ సలహా సంస్థ అదానీ గ్రూపు ఒక "రుణగ్రస్త గృహం" అని ప్రకటించింది. అంటే మరెవరూ కొత్త రుణాలు ఇవ్వగూడదు అని అర్థం. కాని మరుసటి సంవత్సరమే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వందకోట్ల డాలర్ల రుణం మంజూరు చేసింది. అంతే కాదు, 2017 నాటి కంపెనీ లెక్కల ప్రకారమే అదానీ పవర్ అనే కంపెనీ రు. 53,000 కోట్ల రుణ భారంతో ఉంది. ఆ కంపెనీ అప్పటి లెక్కల ప్రకారం ఉత్పత్తి చేసే విద్యుత్తుతో రు. 70 సంపాదిస్తుంటే, దాని మీద కేవలం వడ్డీగానే రు. 100 చెల్లించవలసిన స్థితిలో ఉంది. అంటే, అది మనుగడ అసాధ్యమైన స్థితిలో ఉంది. మోడీ అధికారంలోకి రాగానే ఆ రుణాలలో అత్యధికభాగానికి రుణం తిరిగి చెల్లింపు సమయాన్ని పది సంవత్సరాల నుంచి ఇరవై ఐదు సంవత్సరాలకు మార్చడం, కొత్త రుణాలు ఇచ్చి పాత రుణాలను చెల్లవేయడం, వంటి అనేక అక్రమాల ద్వారా అదానీ అప్పులను నాన్ పర్ఫార్మింగ్ అసెట్స్ (నిరర్థక ఆస్తులు – తిరిగి రాని అప్పులు) అనే జాబితాలో లేకుండా చేశారు. ఆ జాబితాలో ఉంటే, నిజాయితీపరులైన బ్యాంకు అధికారులుంటే ఆస్తులు జప్తు చేసుకునే అవకాశం ఉంటుంది.

మోడీ సాయంతో అదానీ సాగించిన అక్రమాల జాబితా కూడ చాల పెద్దది. ఇక్కడ ఒక్క ఉదాహరణ చెప్పుకుంటే సరిపోతుంది. అదానీ పవర్ కంపెనీలు 2014–15ల్లో కొన్ని యంత్ర పరికరాలను విదేశాల నుంచి కొన్నాయి. ఆ పరికరాలను చైనీస్, దక్షిణ కొరియన్ అమ్మకందార్లు నేరుగా భారత ఓడరేవులకు పంపారని స్పష్టమైన ఆధారాలున్నాయి. కాని ప్రభుత్వ శాఖలకు ఇచ్చిన సమాచారంలో ఆ పరికరాలను గౌతం అదానీ తమ్ముడైన వినోద్ అదానీకి చెందిన దుబాయి లోని ఎలక్ట్రోజెన్ ఇన్ ఫ్రా అనే కంపెనీ మొదట కొన్నట్టు, ఆ కంపెనీ తిరిగి ఆ పరికరాలను అదానీ పవర్ కంపెనీకి అమ్మినట్టు చూపారు. ఎక్కడ కొని ఎక్కడ అమ్మితే, ఎట్లా రవాణా చేస్తే ఏమి తేడా పడుతుందని ఎవరైనా అనుకోవచ్చు. కాని దుబాయి కంపెనీ కొన్న ధరకూ భారత కంపెనీ కొన్న ధరకూ మధ్య 800 శాతం తేడా ఉంది. దుబాయిలో ఆదాయం మీద పన్ను చెల్లించనక్కరలేదు గనుక ఈ 800 శాతం తేడా మీద, అంటే రు. 5000 కోట్ల రూపాయల మీద పన్ను చెల్లించనక్కరలేదు. భారత్ నుంచి మాత్రం ఆ మేరకు విదేశీ మారక ద్రవ్యం దుబాయికి మారింది. ఇది అక్షరాలా భారత ఆర్థిక వ్యవస్థను మోసగించడమే. ఇటువంటి పని చేసే వ్యాపారస్తులు ఎందరో ఉన్నారు. ఈ బిల్లులు తిరగరాసిన, ఎక్కువ చేసి రాసిన మోసానికి జవాబు చెప్పమని డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటిలిజెన్స్ సంస్థ అదానీ పవర్ కంపెనీలకు నోటీసులు పంపింది. కాని 2017 ఆగస్ట్ 21 న స్వయంగా డిఆర్ఐ అధికారులే ఏ మోసమూ జరగలేదని తీర్పు ప్రకటించి, నోటీసులు వెనక్కి తీసుకున్నారు.

బహుళ జాతి సంస్థలు, వారి దళారీలైన భారత కార్పొరేట్లు చాల కాలంగా భారతదేశపు భూమి మీద కన్ను వేసి ఉన్నారు. ఈ సువిశాలమైన భూములను ఆక్రమించి విశాల భూక్షేత్రాలుగా మార్చి, వ్యాపార పంటలు పండించడం, సాధారణ ఆహారధాన్యాలను, కూరగాయలను, ఫలపుష్పాలను మార్కెట్ సరుకులుగా మార్చడం, అగ్రో ప్రాసెసింగ్ పరిశ్రమలు ఏర్పాటు చేయడం వారి లక్ష్యం. చిల్లర వర్తకంలో ఇప్పటికే గణనీయమైన మార్కెట్ వాటా సంపాదించుకున్న అంబానీ వ్యవసాయోత్పత్తుల చిల్లర వర్తకంలో గుత్తాధిపత్యానికి కలలు కంటున్నాడు. అగ్రో ప్రాసెసింగ్ రంగంలో డజన్ల కొద్దీ కంపెనీలను ఇప్పటికే రిజిస్టర్ చేసిన అదానీ వేర్ హౌజింగ్, కోల్డ్ స్టోరేజి వంటి రంగాలలోకి రాదలచాడు. వారి కోర్కెల మేరకు భారత వ్యవసాయ రంగాన్ని పూర్తిగా వ్యాపారీకరించడానికి, కాంట్రాక్టు వ్యవసాయంలోకి ప్రవేశపెట్టడానికి, నిత్యావసర వ్యవసాయోత్పత్తులలో గుత్తాధిపత్యం స్థాపించడానికి వీలు కల్పించే చట్టాలను మోడీ ప్రభుత్వం తయారు చేసింది.

ఈ అర్థంలో ఈ మూడు చట్టాలను రద్దు చేయాలని రైతులు చేస్తున్న ఆందోళన కేవలం రైతాంగ ప్రయోజనాల కోసం మాత్రమే కాదు, ఈ దేశ వ్యవసాయోత్పత్తులను, వ్యవసాయ మార్కెట్లను, వ్యవసాయోత్పత్తుల రవాణాను, నిల్వను, పంపిణీని, చివరికి భూములను కార్పొరేట్ల హస్తగతం చేసే ప్రయత్నాలను ప్రతిఘటిస్తున్న ఉద్యమం ఇది. ఇవాళ ఈ ఉద్యమం ప్రధానంగా కనీస మద్దతు ధర అనే సమస్య మీద కదిలిన పంజాబ్, హర్యానా ధనిక రైతాంగ సమస్య మీద రగిలినదిగా కనిపించవచ్చు. కాని అది ఈ దేశ ప్రజలందరి సమస్య అయిన కార్పొరేట్–రాజకీయ మిలాఖత్తు పాలన మీద, ప్రధాన పాలకవర్గాల మీద ఎక్కుపెట్టిన ఉద్యమం.

(రచయిత వీక్షణం సంపాదకులు) వీ

యూ-టర్న్‌ల తెలంగాణ పాలన

కేంద్రం తెచ్చిన వ్యవసాయ చట్టాలను మొదట వ్యతిరేకించిన టిఆర్ఎస్ పార్టీ తిరిగి సమర్థించడమంటే ప్రజల ప్రయోజనం కన్నా పాలకుల లోపాయకారి ప్రయోజనాలే ముఖ్యమనేది స్పష్టమైందని అంటున్నారు సతీష్ బైరెడ్డి

రాష్ట్రాల పరిధిలోని వ్యవసాయం పైన కనీస సంప్రదింపులైనా చేయకుండా కరోనా కాలంలో కేంద్రం హడావుడిగా తీసుకొచ్చిన మూడు వ్యవసాయ చట్టాలు భారత వ్యవసాయ రంగ చరిత్రలోనే అత్యంత కీలకమైన సంస్కరణలు.. దేశ వ్యవసాయ ముఖచిత్రాన్నే మార్చివేయగలిగేంత ప్రభావవంతమైనవి. మూడు దశాబ్దాలుగా దేశంలో అమలవుతున్న నూతన ఆర్థిక విధానాల కొనసాగింపులో భాగంగానే నేటి వ్యవసాయ చట్టాలు వచ్చాయి. రైతులు ఎక్కడైనా, ఎంతకైనా తమ ఉత్పత్తిని అమ్ముకునే స్వేచ్ఛకు సంబంధించిన చట్టం ఒకటి. ఆహార పదార్థాల నిల్వలకు సంబంధించిన విధి నిషేధాలను ఎత్తివేసేది మరొకటి. దేశంలో 80 శాతం చిన్న, సన్నకారు రైతాంగం దగ్గర ఉన్న చిన్న చిన్న కమతాలతో వ్యవసాయం లాభసాటి వ్యాపకంగా ఉండడం లేదు కాబట్టి 'కాంట్రాక్టు' వ్యవసాయం కోసం భూమిని ఇతర సంస్థలకు కట్టబెట్టడానికి సంబంధించిన మరొక చట్టం. ఇంతటి కీలకమైన, మౌలికమైన వ్యవసాయ చట్టాలను ప్రవేశపెట్టిన తీరుపై, వాటి లక్ష్యాలపై దేశ వ్యాప్తంగా తీవ్రమైన, తీక్షణమైన అలజడిని రేకెత్తించింది.

దేశంలో రైతులు తమ ఉత్పత్తిని ఎక్కడైనా, ఎంతకైనా అమ్ముకునే స్వేచ్ఛ అని పైకి కనపడుతున్నా ఆ చట్ట సారమంతా కొనుగోలు దారుడు ఎక్కడైనా, ఎంతకైనా కనీస మద్దతు ధర అనేది లేకుండానే తనకిష్టమొచ్చినంత కొనుక్కొని నిలువ చేసుకునే స్వేచ్ఛ మాత్రమే! చిన్న కమతాలు ఆర్థికంగా గిట్టుబాటు కావనే పేరుతో వారి భూముల్ని బడా బాబుల(కార్పొరేట్స్)కు కట్టబెట్టి నయా భూస్వామ్యాన్ని నెలకొల్పేలా చట్టం ఉందని రైతాంగానికి అర్థం అయ్యింది. ఆహార ధాన్యాల నిల్వలకు సంబంధించి ఇప్పటికే అమలులో ఉన్న చట్టపరమైన అడ్డంకులన్నీ ఈ చట్టంతో తొలగి పోయాయని, పెద్ద ఎత్తున నిలువలు పోగేసుకొని కృత్రిమ కొరత సృష్టించి, ధరలు పెంచి కార్పొరేట్ సంస్థలు వినియోగదారులను దోపిడీ చేసి తమ ఆర్థిక సామ్రాజ్యాన్ని విస్తరించుకునేలా భారీ అవకాశాలను ఈ చట్టం కల్పిస్తుంది.

సరిగ్గా ఈ ప్రమాదాన్ని పసిగట్టిన భారత రైతాంగం ప్రధానంగా పంజాబ్, హర్యానా, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ రైతాంగం దేశ రాజధాని సరిహద్దుల్లో ఎముకలు కొరికే చలిలో ప్రతిఘటిస్తున్నది. కేంద్రం చర్చల పేరుతో ఓ ప్రహసనాన్ని గత రెండు నెలలుగా కొన'సా'గిస్తున్నది. ఉద్యమ కారుల మీద అనేక అభాండాలు, అబద్ధపు ప్రచారాలతో చీల్చివేసే, మొత్తంగా బలహీనపరిచే కుట్రలేవి సాగకపోవడంతో ఆందోళనను ఆపించే కుట్రలో భాగంగా సుప్రీంకోర్టు రూటులో వస్తున్నది. చట్టాలు రద్దు చేయాలనే డిమాండ్‌ను పోరాడే రైతాంగం చేస్తుంటే సుప్రీంకోర్టు ప్రభుత్వానుకూల 'నిపుణుల'తో కమిటీ వేసింది. ఈ ఉద్యమ తొలి నాళ్లలో భారత్ బంద్‌ను కూడా విజయవంతంగా నిర్వహించింది. ఈ బంద్ నాటికే దేశ వ్యాప్తంగా ఆసక్తిని రేకెత్తించిన రాజకీయ పరిణామాలు అనేకం ఉన్నా ఎన్‌డిఏ నుంచి అఖాలీదళ్ ఈ చట్టాలను వ్యతిరేకిస్తూ నిష్క్రమించడం ఒకటైతే అధికారంలో ఉండి భారత్ బంద్‌లో సంపూర్ణంగా పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర సమితి వైఖరి మరింత దృష్టిని ఆకర్షించింది.

నిజానికి ఈ చట్టాలు ఆర్డినెన్స్ రూపంలో జారీచేయబడ్డ నాటి నుండి, పార్లమెంటులో బిల్లులుగా ప్రవేశపెట్టి రాష్ట్రపతి సంతకంతో చట్టాలుగా రూపొందే క్రమాన్నంతా టిఆర్ఎస్ వ్యతిరేకించింది. సరే బిజెపి తనకున్న సంపూర్ణ మెజారిటీతో వాటిని సునాయాసంగా ఆమోదింపజేసుకోవడం మరో విషయం. ఇవ్వాళ దేశంలో ఈ చట్టాలను అనేక ప్రాతిపదికలతో అనేక సంఘాలు, పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. ఈ చట్టాలు మొత్తంగా దేశ వ్యవసాయాన్ని ధ్వంసం చేసి రైతులను కార్పొరేట్స్‌కి బానిసలుగా, కూలీలుగా మార్చివేస్తాయని పెద్ద ఎత్తున ఆందోళన వ్యక్తమవుతోంది.

రాజ్యాంగం ప్రకారం రాష్ట్ర పరిధిలోని అంశమైన వ్యవసాయం పై కేంద్రం ఎలా చట్టాలను తీసుకొస్తుందని, ఇది రాజ్యాంగ వ్యతిరేక చర్య అనేది మరొక వాదన. ఆర్డినెన్సులను బిల్లుల రూపంలో లోక్‌సభ, రాజ్యసభలలో ప్రవేశపెట్టే క్రమంలో విధివిధానాలను పాటించలేదని, సభా నియమాలను ఉల్లంఘించారనే వాదనతో ఈ చట్టాలను వ్యతిరేకించే వారున్నారు. ప్రధానంగా ఈ చట్టాలను మొదటి అవగాహనతోనే వ్యతిరేకించిందనేలా టిఆర్ఎస్ వ్యవహరించింది. పార్లమెంటులో ఎంతో సూత్రబద్ధంగా వ్యవహరించినట్టు కనపడినప్పటికీ ఆ తర్వాత కాలంలో దాని కొనసాగింపు ఏమీలేదు! గత డిసెంబర్ భారత్ బంద్ సందర్భంగా టిఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు నిప్పులు కురిపించారు. బంద్‌లో టిఆర్ఎస్ నాయకత్వ పాత్రను తీసుకుంటుందని, ఢిల్లీ పై ఇక యుద్ధమే అంటూ గాండ్రించాడు. ఇక్కడే ఈ హఠాత్తు యుద్ధ శంఖారావానికి నేపథ్యమూ తెలుసుకోవాలి.

దుబ్బాక ఉప ఎన్నికల్లో ఓటమి, జిహెచ్ఎంసి ఎన్నికల్లో చతికిల పడడం, బిజెపి వచ్చే ఎన్నికల నాటికి ప్రధాన ప్రత్యర్థిగా ఎదుగుతుందేమోననే ఆందోళనలో ఉండగానే అందివచ్చిన ఆయుధాలయ్యాయి ఈ చట్టాలు. ఎక్కడైనా అమ్ముకోవచ్చు అంటే తెలంగాణ రైతు ఢిల్లీ వెళ్లగలడా, కార్పొరేట్స్‌కి వ్యవసాయాన్ని అప్పగిస్తారా అంటూ టిఆర్ఎస్ పరపతి తగ్గుతున్న సంకేతాలను పూర్వపక్షం చేసే ప్రయత్నాలను బలంగా చేశారు. హైదరాబాద్ కేంద్రంగా అఖిలపక్షం నిర్మాణం చేసి ఢిల్లీ పై దండు గడదాం అనే ఆవేశపూరిత నినాదాలు కూడా బాగానే వినపడ్డాయి. బంద్ బాగా జరిగింది. మంత్రులందరూ రోడ్ల మీదికొచ్చారు. ముఖ్యమంత్రి తనయుడు కాబోయే ముఖ్యమంత్రిగా ప్రచారంలో ఉన్న తారకరామారావు కర్షకుడు కావాలా– కార్పొరేట్స్ కావాలా అని రోడ్డు పైన నినదించాడు. స్వంత పత్రికలో ప్రచారంతో

పాటు మంత్రులతో సహా టిఆర్ఎస్ మేధో వర్గమంతా ప్రధాన పత్రికల్లో ఈ చట్టాలకు వ్యతిరేకంగా రాతలు రాశారు. ఒక్కసారిగా టిఆర్ఎస్‌ను వ్యతిరేకించే, రైతాంగం వైపు నిలిచే వర్గాల్లోనూ ఏదో 'ఆశ' చిగురించింది. ఇక ఢిల్లీపై మిగిలింది 'యుద్ధమే' అనుకున్నారంతా..! ఆ యుద్ధ మేఘాలేవో కమ్ముకుంటున్నాయని అంతటా ప్రచారం. అంతటా ఎదురు చూపు. నిప్పులు కక్కుతూ ఢిల్లీ వైపు దూసుకెళ్లాల్సింది తుస్సుమని ఫామ్ హౌజ్ ముందే పేలవంగా కూడా పేలలేదు. ఇంతలోనే ఢిల్లీ పెద్దల ఆహ్వానమో, ఆదేశమో కాని పర్యటన అంతా నిశ్శబ్దం.. గప్ చుప్. సీనంతా రివర్సయింది. ఎక్కడ చూసినా యూ-టర్న్ చర్చలే. ప్రధాన మీడియా, సోషల్ మీడియా నిండా యూ టర్న్ ముచ్చట్లే.

ఒంటరిగా చేసిన ఓ ఢిల్లీ పర్యటన తర్వాత 15 రోజులకి రాష్ట్ర వ్యవసాయ రంగ సమీక్ష పేరుతో జరిపిన సమావేశం పిదప అసలు కథ బయటికొచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం వ్యాపార సంస్థ కాదు ఇక రైతుల నుండి పంట కొనుగోళ్లు ఉండవు. కేంద్ర చట్టాలననుసరించి రైతులకు ఎక్కడయినా అమ్ముకునే స్వేచ్ఛ ఉన్నదని, ఆ చట్టాలను అమలు చేయక తప్పదని ముఖ్యమంత్రి ప్రకటించాడు. రైతుల కోసం దేవుడితో అయినా కొట్లాడుతా అన్న ముఖ్యమంత్రి ఢిల్లీలో కూడా కొట్లాడకుండానే చట్టాలకు సై అంటున్నాడు.

కేంద్ర చట్టాలకు పూర్తిగా పచ్చ జెండా ఊపడమే కాదు రాష్ట్రంలో తన ఆలోచన నుండే రూపుదిద్దుకున్న నియంత్రిత సాగు పద్ధతిని కూడా రద్దు పరుస్తున్నట్టు ప్రకటించారు. ప్రభుత్వమే కాలనీలుగా విభజించి ఏ ప్రాంతంలో ఏ పంటను సాగు చేయాలి, ఎంత విస్తీర్ణంలో ఏ పంట వేయాలో కుడా నిర్ధేశించింది. డిమాండ్ ఉన్న పంటలనే పండించాలని, రాబడి ఎక్కువ ఉండేలా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రైతులను బెదిరించి మరీ నియంత్రిత సాగు విధానాన్ని అమలు పరిచింది. దాంట్లో భాగంగానే సన్న రకం వడ్లు పండించాలని, ప్రభుత్వమే ప్రతి గింజను కొనుగోలు చేస్తుందని ముఖ్యమంత్రి స్వయంగా చెప్పడంతో లక్షల ఎకరాల్లో సన్నవి సాగైనా కూడా కొనుగోలుకు ప్రభుత్వం చేతులెత్తేయడంతో రైతుల చేతుల్లో సున్నమే మిగిలింది.

నియంత్రిత సాగు ఒక దశలో నిర్బంధ సాగు అనిపించేంతగా, రైతు బంద్‌ను నిలిపివేస్తామనేలా లీకులిచ్చి, రైతుల్ని బెదిరించి మరీ పంటలు వేయించింది. మక్కలు, జొన్నలు, కందులు, శనగలు వంటివి కొనడం ద్వారా ప్రభుత్వానికి 7500 కోట్ల నష్టం వాటిల్లిందని తనే ఓ వ్యాపారిని అనేలా మాట్లాడింది ప్రభుత్వం. నిజానికి ఆ కొనుగోళ్లన్నీ కనీస మద్దతు ధరకు కొనడం వల్లనే అంత నష్టం వచ్చిందనేలా మాట్లాడి మద్దతు ధర భావనకు విరుద్ధంగా మరీ వ్యవహరించింది. కేంద్ర చట్టాలకు అనుకూలంగా పెద్ద యూ-టర్నే తీసుకున్నది.

లాక్ డౌన్ కాలంలో ప్రభుత్వమే కొనుగోళ్లు జరపడం ద్వారా రైతులకు కొంత ఊరటనిచ్చినట్లయింది. ఇప్పుడు ఐకెపి లాంటి కొనుగోలు కేంద్రాలను కూడా మూసివేయనున్నారు. ప్రభుత్వం రైస్ మిల్లరో, దాల్ మిల్లరో కాదంటున్న ముఖ్యమంత్రి, కేంద్ర చట్టాలను తీవ్రంగా వ్యతిరేకించిన ముఖ్యమంత్రి మోడీ, షాలను ఏకాంతంగా కలసి వచ్చిన వెంటనే తన విధానాలను సంపూర్ణంగా మార్చుకున్నారు. అన్ని పార్టీలను ఏకంచేసి ఢిల్లీ పైన యుద్ధం చేస్తానని ఆయుధం పట్టకుండానే ఢిల్లీ పంచన చేరిపోయాడు. నిజానికి అది యూ-టర్న్ ఏమి కాదు! అసలు విధానమే అది అనే అభిప్రాయం కూడా బలంగా ఉన్నది.

భౌగోళిక తెలంగాణ కోసం నిలబడిన టిఆర్ఎస్, దాని నాయకత్వానికి కార్పొరేట్స్ పట్ల బిజెపి కంటే భిన్నమైన వైఖరి లేదు. తను రాజకీయంగా బలహీనపడుతున్నానేమో అని అనుకున్న ప్రతి సందర్భంలోనూ సూత్రబద్ధ వైఖరితో ప్రజా పక్షం వహించినట్టు ఆ కాలానికి కనిపిస్తుంది అంతే! విలువలను, విశ్వసనీయతను ఈ దేశంలో పార్లమెంటరీ పార్టీలు ఏనాడో కోల్పోయినవి. అధికారం సంపాదించడం, ఆర్థికంగా బలపడడమే లక్ష్యమైన పార్టీలకు, నాయకులకు రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల ప్రయోజనాలను పణంగా పెట్టడం వెన్నతో పెట్టిన విద్యయే కదా! దానికి మినహాయింపుగా టిఆర్ఎస్‌ని, దాని నాయకత్వాన్ని చూడడం అమాయకత్వం కాకుంటే మరేమిటి. విధానాలు, విలువలు, విశ్వసనీయత, సూత్రబద్ధత వంటివన్నీ ఈ పార్టీలకు అశుద్ధమైన అంశాలు.

గమ్మత్తైన విషయం ఏంటంటే కేంద్రం రూపొందించిన వ్యవసాయ చట్టాలను మొదట్లో సూత్రబద్ధంగా వ్యతిరేకించిన రాజకీయ పార్టీలు వారు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఆచరణాత్మకంగా ఆయా రాష్ట్రాల అసెంబ్లీల్లో వాటిని వ్యతిరేకిస్తూ తీర్మానం చేశాయి. బంద్‌లో ముందుండి సడక్ మీదికి వచ్చిన టిఆర్ఎస్ మాత్రం సడెన్‌గా పీచే ముడ్ అంటూ కలుగులో దాక్కున్న ఎలుకలా మారిపోయింది. ముందే అనుకున్నట్టు ఆ పార్టీకి కార్పొరేటీకరణ, కార్పొరేట్స్ పట్ల కనీస వ్యతిరేకత కాదుగదా కౌగిలించుకునే ప్రేమే ఎక్కువ! టిఆర్ఎస్ పుట్టి పెరిగిన కాలంలోనే స్పెషల్ ఎకనమిక్ జోన్ల పేరుతో ప్రైవేట్ ఆర్థిక సామ్రాజ్యాల కోసం వచ్చిన ఏ విధానాన్ని అది వ్యతిరేకించలేదు. దాంట్లో ఆంధ్రా ప్రాంతానికి చిన్నపాటి లింక్ ఉంటే తప్ప.

కార్పొరేట్ స్కూల్స్, కాలేజీల విషయం తీసుకుంటే పిల్లల ఆత్మహత్యలకు, అధిక ఫీజులకు ఆంధ్రా కార్పొరేట్ విద్యా సంస్థలే కారణమని ఆనాడు గొంతు చించుకున్న పార్టీ పాలనలోనే అవే ఇంతింతై వటుడింతై అన్నట్టు శాఖోప శాఖలుగా హైదరాబాద్‌లో పరుచుకున్నాయి. ఇక యూ-టర్న్ లంటారా ధరణి దద్దరిల్లేలా 'ధరణి' ప్రయోజనం గురించి చెప్పిన ముఖ్యమంత్రే మళ్లీ పాత పద్ధతికి వచ్చాడు. అధికార యంత్రాగపు తప్పిదమో, స్వంత ప్రయోజనాల కోసం కుమ్మక్కయ్యో అనధికార లేఔట్లు వెలిసేలా వ్యవహరించి ఆనక అక్రమ స్థలాలు అని ప్రకటించి ఎల్ఆర్ఎస్ ప్రాయశ్చిత్తం చేసుకొమ్మని సెలవిస్తున్నారు. అక్రమాన్ని ముందుగా ప్రోత్సహించి, సహించి, అన్నీ కానిచ్చి ఆ తర్వాత కాసులిస్తే క్రమం అవుతుందనే వాదన ఎంతటి చట్టవిరుద్ధమైన పని. దాన్ని కూడా నెలల తరబడి నానబెట్టి సాధారణ జనాన్ని నానా ఇక్కట్లు పెట్టి ఏదో చేస్తారనుకుంటే ఏమీ చేయకుండానే మళ్లీ పాత పద్ధతికే వచ్చి జెండా ఊపడం ఎంత పెద్ద యూ-టర్న్. ఇవన్నీ వర్తమానపు చరిత్రలో భాగమైన, బాగా అర్థమయిన యూ టర్న్ లే! గుట్టు చప్పుడు కాకుండా చేసిన యూ టర్న్‌లు ఎన్నో. దళిత ముఖ్యమంత్రి యూ టర్న్. దళితులకు మూడెకరాల భూమి యూ టర్న్. కెజి టు పిజి యూ టర్న్. ఇంటికో ఉద్యోగం యూ టర్న్. ఇంకా ఎన్ని యూ టర్న్‌లను చూడాల్సి ఉందో! పాలకులు యూ టర్న్ తీసుకున్నా ప్రజలు మాత్రం వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీ పైన తిరగబడ్డారు, ప్రతిఘటిస్తున్నారు. తెలంగాణ జనానికి తిరగబడడం, మర్లబడడం మామూలు విద్యే! పాలకులు జర పారహుషార్‌గా యూ టర్న్‌లు ఆపండి. వీ

(రచయిత ఆంగ్ల ఉపన్యాసకులు)

తెలంగాణ పిఆర్‌సి ప్రజానుకూలమేనా?

తెలంగాణలో ఉద్యోగుల జీతాలకు, జీవితాలకు భరోసా ఉంటుందని ఆశపెడుతూ వచ్చిన ప్రభుత్వం చివరికి వారికి మొండి చేయి చూపించిందనీ, ఎవరికీ అనుకూలం కాని పిఆర్‌సిని ప్రకటించిందనీ అంటున్నారు **పబ్బతి వెంకటేశ్వర్లు**

జీవితాలను, జీత భత్యాలను ఫణంగా పెట్టి కొట్లాడి, ఆకాశమంత ఎత్తున నినదించి లాఠీలకు, నీటి ఫిరంగులకు, తుపాకీ తూటాలకు, పొగబాంబులకు ఎదురొడ్డి నిలిచిన, ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి, కార్మికవర్గమే తొలి ఉద్యమ తరంగం. స్వార్జిత తెలంగాణలో అనూహ్యమైన భవిష్యత్తును ఆకాంక్షించిన పై వర్గాలకు ఆరేళ్లుగా నిరాశా, నిస్పృహ ఎదురుచూపులే అంతిమంగా దక్కిన ప్రతిఫలం.

ఆంధ్రప్రదేశ్ అవతరణ సమయంలో కోల్పోయిన వేతన వ్యత్యాసాలు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు, నిరంతరాయమైన, ఉద్యోగ పరికల్పన వంటి ఆశాజనిత ప్రకటనలతో కలలుగన్న ఉద్యోగ వర్గాలు, పుట్టెడు సమస్యలతో అరకొర జీతాలతో, తల్లడిల్లుతూ నిర్వీర్యం అవుతున్నాయి. నెత్తిన పెట్టుకున్న నాయకత్వమే ఉద్యోగులను చివరికి చీత్కారానికి గురిచేసి అవినీతిపరులుగా, పని దొంగలుగా చిత్రీకరించి ప్రజల ముందు పలుచన చేసి పక్కకు పారదోసింది. అత్యంత సాధారణంగా నెరవేరవలసిన ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక వర్గాల హక్కులను నిర్దాక్షిణ్యంగా అణచి వేసి నిరంకుశంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వ వర్గాల పట్ల పిడికిలెత్తాల్సిన ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల నాయకత్వాలు నోరు వాయి మూసుకుని కూర్చోవడం, సాధారణ ఉద్యోగుల్ని విస్మయానికి గురి చేస్తుంది. ప్రభుత్వాల మెడలు వంచాల్సిన నాయకత్వాలు తలదించుకొని నిలబడటం ఏమిటో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఇంత జరుగుతున్నా కారకులెవరో, కళ్లముందే కనిపిస్తున్నా, మునుపటి పోరాట స్ఫూర్తి కొరవడి, బిత్తరచూపులు చూస్తున్న ఉద్యోగ ఉపాధ్యాయుల దారుణ స్థితికి కారణమేమిటి? ఉద్యోగులను అంటరాని వారిగా పరిగణించిన ప్రభుత్వ నిర్లక్ష్య పూరిత వైఖరికి కారణమేమిటి? హక్కుల సాధనలో ఎదురైన, ఎదురవుతున్న సవాళ్లు ఏమిటి? పరిష్కారానికి ఎంచుకోవాల్సిన మార్గాలు ఏమిటి తర్కించుకోవలసింది.

ఉద్యమం-ఉద్యోగులు

మలిదశ తెలంగాణ ఉద్యమం ముందుండి నడిపించింది ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సంఘాలు. రాజకీయ నాయకులు ప్రతిచోటా, ప్రతి క్షణం తమ రాజకీయ లబ్ధికి ఎక్కడా దెబ్బ తగలకుండా జాగ్రత్త పడుతూ వచ్చారు. ప్రజా స్పందనను బట్టి తామే ఉద్యమ చైతన్యానికి కారణమని తమ వల్లనే రాష్ట్ర సాధన జరుగుతుందని, జరిగిందని అన్ని రాజకీయపక్షాలు ప్రజల అభిమానాన్ని ఓట్ల రూపంలో దండుకోవడానికి నాటి నుండి నేటి దాకా ప్రయత్నిస్తూనే ఉన్నాయి. ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మిక లోకంలో తమ తమ రాజకీయ సిద్ధాంతాలు ఎలా ఉన్నా, ఉద్యమాన్ని నడిపిస్తున్నాడని భావించి, కెసిఆర్ పట్ల చాలా నమ్మకాన్ని, అభిమానాన్ని కలిగి ఉండి, అతనికి అన్ని రకాలుగా మద్దతునిచ్చాయి. ఒకరకంగా టిఆర్ఎస్ కార్యకర్తలకంటే, ఎక్కువగా టిఆర్ఎస్‌ను గుండెలకు హత్తుకుని సహకరించాయి. ఉద్యమ నాయకుడు రాష్ట్ర సారథి అయితే కష్టనష్టాలు తెలిసినోడు, తెలంగాణ స్థితిగతులు తెలిసినోడు, జయశంకర్ సార్ మెచ్చినోడు అని తమ తలపై పాలు పోస్తాడని అనుకున్నారు. కానీ, మునుపటికంటే తమ పరిస్థితిని దిగజార్చినందుకు వగచి వగచి, దుఃఖం దిగమింగుకుంటున్నారు.

ఉద్యమ చైతన్యం నీరుగారినా, కొందరు నాయకులు ఏనాడో ప్రభుత్వం చంకలో ఒదిగిపోయారు. ఇప్పుడిప్పుడే కొందరి పిడికిళ్లు బిగుసుకుంటున్నాయి. ఎన్నో ఏళ్లుగా అరకొర జీతాలతో ఆంధ్రుల కలయికతో నష్టపోయిన వేతనాలు పెరుగుతాయని, ఫ్రెండ్లీ ఉద్యోగ ప్రభుత్వం తమకు బాసటగా ఉంటుందని, నీళ్లు నిధులు నియామకాలు అనే మహత్తర మంత్రానికి ఆకర్షితులై పోరాటం సాగిస్తే చివరికి దక్కిన ఫలితం ఉన్న జీతాల్లో కోత ఉద్యమ చైతన్యం నీరుగారినా కొందరు నాయకులు ఏనాడో ప్రభుత్వం. ఎప్పుడు వస్తాయో తెలియని జీతాల పైనే జీవిస్తున్న వేతన జీవులు. మెరుగైన జీతం కాదు కదా ఉన్న జీతం పోతుందని ఏనాడూ భావించలేదు. పదోన్నతులు వస్తాయని తమ పిల్లలకు ఉద్యోగాలు వస్తాయని భావిస్తే, పదోన్నతి రాక పదవీ విరమణ వచ్చింది. ఉద్యోగం రాక వయసు దాటి పోతుంది. ఎందుకు ఇంతగా ప్రభుత్వం ఉద్యోగుల పట్ల ఉదాసీనత వహిస్తున్నది. ఉద్యోగులంటేనే ఎందుకీ చీదరభావం అర్థం కాని స్థితి నెలకొన్నది. ఈ నేపథ్యంలో ఇప్పుడిప్పుడే కొందరి పిడికిళ్లు బిగుసుకుంటున్నాయి.

నిజానికీ ఉద్యోగులు, ఉపాధ్యాయులు అంతా వేతన జీవులే. వారి వెతలు దూరంచేసేవి వేతనాలు మాత్రమే. అది ఎంత మెరుగ్గా ఉంటే అంత వారి కుటుంబాలు క్షేమంగా భద్రంగా ఉంటాయి. దాని కోసం తాము చేస్తున్న పనికి మార్కెట్లో నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలను అనుసరించి ఐదేళ్లకోసారి తమ వేతన అభివృద్ధి జరగాలని అది సకాలంలో జరగాలని కోరుకుంటారు. ఉద్యమ కాలంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు సమానంగా, అన్ని రాష్ట్రాల ఉద్యోగుల జీతాల కంటే ఎక్కువగా ఇచ్చుకుందామని, సర్వీస్ రూల్స్ రెండు కమ్మలలో రాసుకుందామని వరాల వర్షం కురిపిస్తే, ఉద్యోగులు ఉద్యమ తీవ్రత తగ్గకుండా పోరాడి తెలంగాణ తెచ్చుకున్నారు. అయితే తెలంగాణ వచ్చాక వరాల వర్షం కాకుండా అది ఎండమావిగా మారి ఉద్యోగులను మోసం చేసింది. దిక్కుతోచక స్థితిని కుమిలిపోతున్నారు. కొన్ని సంఘాలు వేతన సవరణ కమిషన్ కోసం కోరాయి. ప్రభుత్వం నామ మాత్రంగా కమీషన్ వేసి చేతులు దులుపుకుంది. కాగా ఇప్పుడు కమిషన్ నివేదిక అమలు కోసం పోరాటమే శరణ్యమైంది. అంతేగాక, నివేదిక అమలు కోసం ముఖ్యమంత్రి దయాదాక్షిణ్యాల కోసం ఎదురు చూడాల్సిన దుస్థితి దాపురించింది. ముఖ్యమంత్రి అనే పదానికి పర్యాయపదంగా దొరగారు అనే పదం వచ్చి చేరింది. ఆయన కటాక్ష వీక్షణాలు లేకుండా తెలంగాణలో చీమ కూడా కదలదు. ఆఖరికి అది వేతన సవరణ కమిషన్ అయినా సరే. ఈ వైఖరి ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక వర్గాల పట్ల అశనిపాతమైంది

ఉద్యోగులు-పిఆర్‌సి నేపథ్యం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగులకు మెరుగైన జీతాల కోసం వేతన సవరణ కోసం మొట్టమొదట పిఆర్‌సి 1969లో ఏర్పడి 1969, మార్చ్ 19 నుండి అమలులోకి వచ్చింది. ఇప్పటివరకు 10 పిఆర్‌సిలు ఏర్పాటయ్యాయి. వరుసగా 1969, 1974, 1978, 1982, 1986, 1993, 1999, 2005, 2010, 2015. పదకొండవ పిఆర్‌సి 2018, జూలై 1 నుండి రావాల్సి ఉండగా 2018, మే 28న ముగ్గురు సభ్యులతో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి సిఆర్ బిశ్వాల్, ఉమామహేశ్వరరావు, మహమ్మద్ అలీ రఫత్‌లతో కమిటీ ఏర్పడింది. కమిషన్ పేరుతో తాత్సారం జరుగుతుందని, ఒకరైతే ఆలస్యం అవుతుందని ముగ్గురిని వేసి మూడు నెలల్లోనే రిపోర్టు ఇవ్వాలని అన్ని రాష్ట్రాల్లో తిరిగి అక్కడి వేతనాలు పరిశీలించి నివేదిక ఇవ్వాలని ముఖ్యమంత్రి అనగానే ఆ రోజు రాష్ట్రంలో పాల ప్యాకెట్ల కొరత ఏర్పడింది.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక అప్పటికే ఉమ్మడి రాష్ట్రంలో ఏర్పాటయిన పదవ పిఆర్‌సి కమిషన్, పిఆర్‌సి 2015గా 2013, జూలైన 1 నుండి అమలులోకి వచ్చి ఆర్థిక లాభం 2014, జూన్ 2 నుండి ఇచ్చారు. నోషనల్ కాలం 2013, జూలై 1 నుండి 2014, జూన్ 1 వరకు దాదాపు 11 నెలలు నష్టపోవడం జరిగింది. ఉమ్మడి రాష్ట్రంలో ప్రకటించిన పిఆర్‌సిలో 43 శాతం ఫిట్మెంట్‌గా ఇచ్చారు. చాలా సమస్యలు అపరిష్కృతం గానే మిగిలిపోయాయి. అపరిష్కృత సమస్యల సాధనకై ఐక్య ఉద్యమాల ఫలితంగా తేదీ.16 మే 2018 న ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి రాసి ఇచ్చిన హామీలు నీటి మీద రాతలు అయ్యాయి. పదోన్నతులు కల్పిస్తామని హెల్త్ కార్డులు, బదిలీలు, మోడల్ స్కూల్స్, ఉపాధ్యాయుల బదిలీలు, అంతర్ జిల్లా బదిలీలు ఒక్కటేమిటి అడిగినవన్నీ చేస్తానని నమ్మబలికి మళ్లీ కడుపునిండా బువ్వ పెట్టి, మాటలు చెప్పి తల దువ్వి సంఘాలను పంపేశారు. ఎప్పటిలాగే ఆరోజు కూడా పాల ప్యాకెట్ల కొరత ఏర్పడింది. ఆ తర్వాత ఉద్యోగుల కళ్లలో కన్నీటి కొరత ఏర్పడింది. తెలంగాణ వచ్చాక పిఆర్‌సి లో వచ్చిన ఆర్థిక లాభమే తప్ప, ఇంతవరకు ఉద్యోగ ఉపాధ్యాయులు కోరుకున్నది ఏదీ జరగలేదు. ఇప్పటికే పది పిఆర్‌సి లలో చాలా సంవత్సరాలు ఎటువంటి ఆర్థిక లాభం లేకుండా నష్టపోయామని ఇప్పుడు కూడా అన్నింటికన్నా ఎక్కువగా ఈ పిఆర్‌సి లో నష్టపోవాల్సి వస్తుందేమోనని ఉద్యోగులు భయపడుతున్నారు. కారణమేమంటే పిఆర్‌సి కమిషన్ వేసి మూడు నెలలు కాదు ముప్పై మూడు నెలలు దాటిపోయింది. ఎంత మొత్తుకున్నా వినే నాథుడు లేడు. ఉద్యోగుల వేదన అరణ్య రోదనే అయింది. ముఖ్యమంత్రి ఒంటెత్తు పోకడలు నియంతృత్వ విధానాలు అనాలోచిత నిర్ణయాలు వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నాయి. దీనికి ఉదాహరణే ఆర్‌టిసి కార్మికుల సమస్య. కార్మిక వర్గమైన ఆర్‌టిసి ఉద్యోగులు తెలంగాణ ఉద్యమంలో అగ్రభాగాన నిలబడ్డారు. వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామన్నారు. ఆర్‌టిసిని ప్రభుత్వంలో కలిపేస్తామన్నారు. ఆఖరుకు ఆర్‌టిసి ఉద్యోగులు జీతాలు పెంచండి సంస్థను కాపాడండి మహాప్రభో అంటే ఆర్‌టిసి ప్రైవేట్ పరం అన్నారు. సమ్మె చేస్తే అందరినీ ఉద్యోగం నుంచి పీకి పడేశాడు. జీతం పెరుగుతుంది అనుకుంటే జీతం, జీవితం నాశనం చేశాడు అని ఆర్‌టిసి కార్మికులు కన్నీటి పర్యంతమయ్యారు. మళ్లీ అదే ముఖ్యమంత్రి ఉద్యోగ సంఘాలను కాదని డిపోకి కొందరిని పిలిపించుకొని, కడుపునిండా బువ్వతో పాటు వారి గారడీ మాటలతో కడుపు నింపి పంపి చేతులు కడుక్కున్నాడు. ఆర్‌టిసి ఉద్యోగ సంఘాలను నిర్వీర్యం చేస్తే అక్కడి కార్మికులకు వచ్చే చిన్నా చితక సమస్యల్ని పట్టించుకునేవారు లేక అష్టకష్టాలు పడుతున్నారు. అదే విధంగా ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలను నిర్లక్ష్యం, నిర్వీర్యం చేస్తున్న తరుణంలో వస్తున్న వార్తలు, చేస్తున్న తాత్సారం వారి అనుమానాలకు కారణమవుతున్నాయి.

పిఆర్‌సి – ప్రభుత్వ వైఖరి

సాధారణంగా ఏ రాజకీయ పార్టీ అయినా సరే సాధారణ ఎన్నికలకు ముందు ఉద్యోగులను మచ్చిక చేసుకోవడానికి ప్రయత్నిస్తాయి. పిఆర్‌సి లాంటి తాయిలాలు ప్రకటిస్తారు. కానీ, కెసిఆర్ ఉద్యోగుల సంఖ్య వారి ఓట్లను లెక్కలోకి తీసుకొని రెండు శాతం ఉన్న వాళ్లు మనల్ని ఏం చేస్తారని కనీసం వారి ఉనికిని కూడా లెక్కచేయ లేదు. ఎన్నికలకు వెళ్లడం జరిగింది. ఇంతగా ఉద్యోగుల్ని నిర్లక్ష్యం చేసిన ముఖ్యమంత్రి న భూతో. మళ్లీ అడుక్కోగా, అడుక్కోగా కొన్ని యుఎస్‌పిసి లాంటి సంఘాలు ఉద్యమం చేయగా పదకొండవ పిఆర్‌సి 2018, మే 28న ఏర్పడింది. మాజీ ఐఏఎస్ అధికారి సి ఆర్ బిశ్వాల్ నేతృత్వంలో ముగ్గురు సభ్యుల కమిటీని నియమించి, మూడు నెలల కాలంలో రిపోర్ట్ ఇవ్వాలని ఆదేశించింది. ఇప్పటికీ మూడు నెలలు దాటి 30 నెలలు అయింది. తెలంగాణ ఆవిర్భావం తర్వాత ఏర్పాటైన మొదటి పిఆర్‌సి ఇది. ఉమ్మడి రాష్ట్రంలో పిఆర్‌సి కమిటీలన్నీ, ఏకసభ్య కమిటీలే. అయినా సరే ముగ్గురు సభ్యుల కమిటీ కన్నా ముందే నివేదికలు అందించాయి. వేతన సవరణతో పాటు పలు అంశాలను పరిశీలించాలని, ముగ్గురితో కమిటీ వేసి నివేదిక రూపొందించేటప్పుడు, రాష్ట్ర ఆర్థిక స్థితిగతులను, వనరులను రాష్ట్ర ఖజానాపై ఆకస్మిక, దీర్ఘకాలిక పరిణామాలను దృష్టిలో పెట్టుకోవాలని కేంద్రంలో, ఇతర రాష్ట్రాల్లోనూ ఉన్న వేతనాల పరిస్థితిని పరిశీలించాలని మొత్తంగా మూడు నెలల కాలంలో కమిటీ రిపోర్టు ఇవ్వమని నియమించి, ఇప్పటికీ మూడుసార్లు పొడిగించి మూడు సంవత్సరాల దిశగా సాగదీస్తున్నది.

తెలంగాణ ఆవిర్భావం తర్వాత ఏర్పడిన తొలి పిఆర్‌సి అని ఆనవాయితీ ప్రకారం తేదీ. జులై 1, 2018 నుండి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు సవరించాలని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, స్థానిక సంస్థలు, జెఎన్‌టియు, జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం సహా, వర్సిటీల బోధనేతర సిబ్బంది, ఫుల్ టైం ఉద్యోగులు, వర్క్ ఛార్జ్‌డ్ ఉద్యోగులకు సంబంధించిన పేస్కేళ్లను రూపొందించి, విభాగాల వారీగా సర్వీసు నిబంధనలు కమీషన్ అధ్యయనం చేసి, రిపోర్ట్ ఇవ్వాలని పేర్కొన్నారు. అలాగే కరువు భత్యం ఎంత మేరకు వేతనంలో విలీనం చేయాలి, విలీనమైన డిఎ ప్రకారం సవరించిన వేతనాలను ఎలా స్థిరీకరించాలి. ఎంత ఫిట్మెంట్ ఇవ్వాలి. ఎంత భారం పడుతుందో చెప్పాలని కమిషన్ కు బాధ్యతలు అప్పగిస్తే అది ముప్పై మూడు నెలలు తీసుకుంది. ఇక్కడ గమనించాల్సింది కమిషన్ తీసుకున్నదా? కమిషన్ తీసుకునేలా చేశారా? అన్నది ముఖ్యం. ప్రభుత్వ కనుసన్నల్లో నడిచే కమిషన్లు ప్రభుత్వం చెప్పినట్టు కాక స్వతంత్రంగా వ్యవహరిస్తాయి అని అనుకోవడం భ్రమే అవుతుంది.

ప్రభుత్వానికి చేరిన నివేదిక

పిఆర్‌సి ఇవ్వాలని సంఘాలు చేసే విజ్ఞప్తులు కెసిఆర్ చెవికి ఏనాడు చేరనే లేదు. చేరినా పట్టించుకోలేదు. దుబ్బాక ఉప ఎన్నికలు, జిహెచ్ఎంసి ఎన్నికలు, ఎంఎల్‌సి ఎన్నికల్లో చావు దెబ్బలు తింటూ వస్తుండటంతో, టిఆర్ఎస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి చలనం మొదలైంది. సీఎం ఆదేశానుసారం మళ్లీ గడువు పెంచితే ఎక్కడ తమ చాప కిందికి నీళ్లు వస్తాయోనని భావించి నివేదికను తెప్పించుకున్నారు. తెలంగాణలో అన్నీచిత్రమే. ఏకసభ్య కమిషన్ పోయి త్రిసభ్య కమిషన్ వచ్చింది. నివేదిక సాధారణంగా సీఎంకి అందజేస్తారు. కానీ, డిసెంబర్ 31న సీల్డ్ కవర్లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి అందజేశారు. ఈ క్రమంలో అధికారులు మాత్రమే ఉంటారు. కానీ ప్రభుత్వ అనుకూల ఉద్యోగ సంఘ నాయకులు నివేదిక అందించే సమయంలో ఫొటోలకు పోజులివ్వడం ఫొటోలకు పోజులివ్వడం కూడా ఓ చిత్రమే. అలాగే

నివేదిక పరిశీలనకు మరో ముగ్గురికి సిఎస్ సోమేశ్ కుమార్. ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి కె. రామకృష్ణ రావు. నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రజత్ కుమార్ లకి అప్పగించటం మరో చిత్రం. మరెన్ని చిత్రవిచిత్రాలు చూపిస్తుందో చూడాలి. ఈ కమిటీ కూడా ఛేటీ కావడానికి సమయం తీసుకుంటూనే ఉంది. తాత్సారం జరుగుతూనే ఉంది. ఉద్యోగుల్లో అసహనం పెరుగుతుంది. సీల్డ్ కవర్ అసలు విప్పుతారా? లేదా? అన్నసంశయంలో ఉన్నారు ఉద్యోగులు. పదోన్నతులు, బదిలీలు, పాఠశాలల ప్రారంభం అని చెప్పి దృష్టి మళ్లిస్తున్నారని, అలాగే ఆ తర్వాత వాక్సినేషన్ ముఖ్యమంటారని ఆ తర్వాత ఎన్నికల కోడ్ వచ్చి, కోడ్ పుణ్యాన మా ఆశలు ఎక్కడ అడుగంటుతాయోనని కలవరపడుతున్నారు. నివేదికలో ఏముందో తెలుసుకోవడానికి సాధారణంగా సంఘాలకు పిఆర్‌సి ప్రతి ఇవ్వడ రివాజు . కానీ ప్రధాన కార్యదర్శిని అడిగితే ఈసారి ముఖ్యాంశాలు మాత్రమే ఇస్తాం. నివేదిక పూర్తిగా ఇవ్వమని చెబుతున్నారు. ఇది మరో విచిత్రం. వీరి మాటలకు మతలబేమిటో ఏలిన వారికే ఎరుక.సరే నివేదికలో ఏమున్నా ఉద్యోగులకు పెద్దగా ఒరిగేదేమీ ఉండకపోవచ్చు. కానీ, ఇంత నిర్లక్ష్యానికి నిరాదరణకు ఉద్యోగ ఉపాధ్యాయులు ఎందుకు గురవుతున్నారు. సంఘాలు ఇంతకు ముందులాగా తమ గొంతును బలంగా వినిపించలేక పోవటానికి కారణాలు పరిశీలించాలి.

పిఆర్‌సి– ఉద్యోగ సంఘాల పాత్ర

తమ ఉద్యోగుల సమస్యల సాధనలో ముందుండే టిఎన్‌జిఓ, టిజిఓ, ఉద్యోగ సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు ఆర్‌టిసి కార్మిక సంఘాలు ఉద్యమ సమయంలో బలంగా పని చేశాయి. క్షేత్రస్థాయిలో ఉద్యమాన్ని తీవ్రస్థాయిలో నడపడంలో వీటి పాత్ర చాలా ఎక్కువ. టిఎన్‌జిఓ స్వామి గౌడ్, టిజిఓ శ్రీనివాస్ గౌడ్ ప్రధాన బాధ్యులుగా ఉండి ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. తెలంగాణ ఆవిర్భావం తరువాత వీరిద్దరికీ ప్రభుత్వంలో పదవులు లభించాయి. దీంతో ఒక్కసారిగా వారి గొంతులకి పదును తగ్గింది. స్వామి గౌడ్ గాని, శ్రీనివాస్ గౌడ్ కానీ ఉద్యోగులకు కలుగుతున్న నష్టాన్ని కెసిఆర్ కు చేరవేయడంలో లేదా అర్థం చేయించడంలో విఫలమయ్యారు. స్వామి గౌడ్ మండలి చైర్మన్ అయినప్పటికీ అపాయింట్మెంట్ కూడా దొరకలేదని అలిగి బిజెపిలోకి చేరిపోయారు. శ్రీనివాస్ గౌడ్ మంత్రి అయి టిఎన్‌జిఓ, టిజిఓ ఉద్యోగ సంఘాలు అసంతృప్తిని వెళ్లగక్కకుండా ప్రభుత్వంపై ఎలాంటి ఒత్తిళ్లు తీసుకు రాకుండా, కనీసం వారి నుండి వ్యతిరేక ప్రకటనలు కూడా రాకుండా కట్టుదిట్టం చేస్తున్నారు.

గతంలో ప్రభుత్వాల మెడలు వంచి ఐక్య ఉద్యమాల ద్వారా పిఆర్‌సి సాధించుకున్నాయి. కానీ, ఇవాళ ఆ స్ఫూర్తి పెద్ద సంఘాలని చెప్పుకుంటున్న సంఘాల్లో నిలువెల్లా స్వార్థంతో ఆ స్ఫూర్తి కొరవడింది. ఇది బహిరంగ రహస్యమే అయినా కింది స్థాయి ఉద్యోగుల కొరకు పనిచేయాలన్న స్పృహ లేకపోవడమే విచిత్రం. టిఎన్‌జిఓ, టిజిఓ నాయకులు వారి స్వలాభం చూసుకుంటూ ఉద్యోగుల్ని విస్మరించారు. టిజిఓ నాయకురాలు మమత తన భర్తకు సర్వీస్ పొడిగింపజేసుకున్నది. అలాగే తమ ప్రయోజనాలు చూసుకుంటూ, అప్పుడప్పుడు వినతి పత్రాలు ఇవ్వటం తప్ప పోరాటం మరిచారు. ఇక ఉపాధ్యాయ సంఘాలలో పెద్ద సంఘం అని చెప్పుకొనే సంఘం కూడా, వారికి ఎంఎల్‌సిలు ఉండి కూడా, ఏమీ చేయటం లేదు. పైగా ఉపాధ్యాయ ఎంఎల్‌సిలుగా గెలిచి టిఆర్ఎస్‌లో చేరడం వారి ప్రాథమిక సభ్యులకు కూడా రుచించడం లేదు. అయినా సరే వీరు ఇతర సంఘాలతో యుపిఎస్‌సి, జెఎసిటిఒ లతో కలిసి పని చేయడానికి ముందుకు రావడం లేదు. వీరు ప్రభుత్వానికి అనుకూలంగా ఉండి మాత్రమే సమస్యలు సాధించగలమని నమ్ముతూ కాలం వెళ్లదీస్తున్నారు. వారి కిందిస్థాయి కార్యకర్తల ఒత్తిడి మేరకు అప్పుడప్పుడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసి వినతి పత్రాలు ఇస్తూ ప్రకటనలతో పొద్దు పుచ్చుతున్నారు. వీరి సంఘ అధినాయకత్వం నగరానికి డిప్యూటేషన్లు తెచ్చుకోవడం సొంతలాభాలు చూసుకోవడం జరిగింది. ఇటీవల ఒక ఎంఎల్‌సిలు తనకు ప్రగతిభవన్లోకి వెళ్లటానికి పర్మిషన్ దొరకడం లేదని వాపోయారు. బ్రతిమిలాడే స్థితి ఏనాటికైనా ప్రమాదమే. మొదటి నుండి కూడా టిఎస్‌యుటిఎఫ్, టిపిటిఎఫ్, డిటిఎఫ్‌లతో కలిసి మరి కొన్ని సంఘాలు యుఎస్‌పిసిగా ఏర్పడి ఉపాధ్యాయ సమస్యల మీద పిఆర్‌సి, బదిలీలు, ప్రమోషన్ల కోసం వివిధ స్థాయిల్లో ఉద్యమాలు చేస్తూ, ఐక్య ఉద్యమాలే శరణ్యం అంటూ ప్రభుత్వ దమననీతిని ఎండగడుతూ ఉన్నాయి. వీరికి తోడుగా జెఎసిటిఒ కూడా తోడయింది కలిసి పోరాట బాట పట్టారు. పోరాడితే తప్ప సమస్యలు పరిష్కారం కావని ఒక్కతాటిపైకి వచ్చి దశలవారీ పోరాటాలు మండల, జిల్లాస్థాయి, అలాగే నగరంలో మహా ధర్నా నిర్వహించి తన అసంతృప్తిని వెళ్లగక్కాయి. తక్షణమే సమస్యలు పరిష్కారం కావాలని కోరాయి. రాష్ట్ర స్థాయిలో అన్ని సంఘాలు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు కలవకుండా ఎవరికి వారే పోరాటాలు చేస్తే సమస్యలు సాధించడం కూడా కష్టం. మొత్తంగా నాయకత్వంలో ఉన్న వారి బలహీనతల వల్ల ఉద్యమాలు నీరుగారి పోతుండటం శోచనీయం.

ఈ క్రమంలో సంఘాల మధ్య నెలకొన్న సమన్వయ లోపం, అనైక్యత ఆసరాగా చేసుకుని ప్రభుత్వం విభజించు పాలించు అనే సూత్రాన్ని అక్షరాల అమలు పరుస్తుంది. సంఘాల ఐక్యతా పోరాటాలు చరిత్రను పునర్నిర్మించగలవని ఉద్యమంలో గుర్తెరిగిన ప్రభుత్వ పెద్దలు సంఘాలలో చీలికలకు పాల్పడింది. కొంత మంది నాయకుల అక్రమాలు, అనైతికతల పట్ల నిఘాను పెంచడం, మరి కొంత మందిని ప్రలోభాలకు గురి చేయడంతో ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో చేష్టలుడిగి ప్రభుత్వాన్ని ఎదిరించలేక చేతులు ముడుచుకొని కూర్చున్నారు. అప్పుడప్పుడు పై పైకి టిఎన్‌జిఓ, టిజిఓ సంఘాలను ప్రభుత్వం పిలిపించుకొని మాట్లాడడం ఏదో జరగబోతోందని చెప్పటం జరుగుతుంది. ఒక ఉపాధ్యాయ సంఘం వీళ్లతో జత కలిసి ప్రభుత్వ అనుకూల వైఖరి తీసుకుంటుంది. కెసిఆర్ ఉద్యోగ సంఘాలను అప్పట్లో అంతగా పొగిడి తాను ఇచ్చిన నోటి మాటలకు, రాసిచ్చిన రాతలకు కట్టుబడి ఉండడం లేదు. రాష్ట్రం కోసం గొంగళి పురుగునైనా ముద్దాడతానన్న ముఖ్యమంత్రి, రాష్ట్రం కోసం పోరాడిన ఉద్యోగస్తులు అంటేనే విపరీతమైన జుగుప్సను ప్రదర్శిస్తున్నారు. ఎట్టకేలకు ఉద్యోగ సంఘాల పోరాటం ఇటీవల జరిగిన ఎన్నికల పరిణామాల తర్వాత పార్టీ, ప్రభుత్వ ఉనికికి ప్రమాద ఘంటికలు మ్రోగుతున్నాయని తెలిసి సానుకూల ప్రకటనలకు ప్రభుత్వం నోరు తెరిచింది.దానిలో భాగంగానే పిఆర్‌సి నివేదిక అందింది. పదోన్నతుల ఫైళ్లు కదులుతున్నాయి. అయినప్పటికీ ఇది కార్యరూపం దాల్చే వరకు అనుమానించాల్సి వస్తోంది. కెసిఆర్ అన్న మాట ఏదీ కార్యరూపంలోకి రాకపోవడం మాట మార్చటమే దీనికి కారణం.

మీడియా అత్యుత్సాహం

ఇదే సమయంలో పత్రికలది, టివి చానళ్లది మరీ విపరీత ధోరణి. అదిగో పులి అంటే ఇదిగో తోక అంటారు. దీని మీద ఉద్యోగ సంఘాలు తమ అసహనం వ్యక్తం చేస్తూనే ఉన్నాయి. పత్రికలన్నీ, టివి చానల్స్ అన్నీ ప్రభుత్వానికి అనుకూలంగా మారిపోయాయి.పిఆర్‌సి అనగానే లెక్కలు కట్టి జీతాలు ఇబ్బడిముబ్బడిగా పెరిగినట్లు ఊకదంపుడు వార్తలు ప్రచారం చేస్తున్నాయి. ఆర్థికభారం ఎంత పడుతుందో చెబుతూ వార్తా కథనాలు వండి వారుస్తాయి. మామూలుగా డిఎ పెరిగినప్పుడల్లా జీతాలు విపరీతంగా పెరిగినట్లు ప్రచారం చేయడంతో ప్రజలకు తప్పుడు

సమాచారం ఇచ్చినట్లు అయింది. నిజంగానే లక్షలు వస్తున్నాయని ప్రజలు అనుకుంటున్నారు. దీంతో ఉద్యోగ సంఘాల ఉద్యమాలకు ప్రజా మద్దతు దొరకటం లేదు. నిజానికి రాష్ట్రం వచ్చిన తర్వాత ఉద్యోగులకు దక్కింది 450 రూపాయల ఇంక్రిమెంట్ అయితే ఉద్యోగుల శ్రమ పోరాట ఫలితంగా పీఠమెక్కినా నాయకులకు దక్కింది నెలకు నాలుగులక్షలు. రాజకీయ నాయకుల వేతనాలు పెంచుకోవటానికి ఏ కమిషన్లు ఉండవు, ఏ రిపోర్టులు ఉండవు. ఒక గంట శాసనసభ సమావేశం జరిపి ఏకగ్రీవంగా తమకు నచ్చినంత పెంచుకుంటారు. ఏ రాష్ట్రంలో లేని వేతనాలు తెలంగాణలో రాజకీయ నాయకులకు ఉన్నాయని పత్రికలూ, టివి చానెళ్లు మాట్లాడవు. దేశంలో జరిగే ప్రజా ఉద్యమాల గురించి నోరు మెదపని పత్రికలూ, టివి చానెళ్లకు ఈ ద్వంద్వ నీతి ఎందుకని ఉద్యోగ సంఘాలు ప్రశ్నిస్తున్నాయి.

ఉద్యోగుల అసహనం

ఈ వ్యాసం రాసే నాటికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కమిటీ బేటీ కానే లేదు. ఉద్యోగ సంఘాలకు రిపోర్టు అందనే లేదు. ఉద్యోగులు ఊహల్లోనే ఉన్నారు. పిఆర్‌సి వాస్తవ రూపంలోకి వస్తుందనే నమ్మకం వారికి లేదు. దీనికి తోడు పదోన్నతుల పందేరాన్ని బయట పెట్టి పిఆర్‌సి నుంచి దృష్టి మళ్లించే ఎత్తుగడకు పూనుకుంది ప్రభుత్వ నైజాన్ని గమనించిన ఉద్యోగులు ఇదంతా రాబోయే ఎంఎల్‌సిలు ఎన్నికలు, ఎమ్మెల్యే ఉప ఎన్నికలు, పురపాలక ఎన్నికల జిమ్మిక్కు అని చెవులు కొరుక్కుంటున్నారు. నిజంగా వాస్తవ రూపం దాల్చినా, నమ్మలేని స్థితికి చేరుకున్నారు. ఇంత అపనమ్మకాన్ని కెసిఆర్ ప్రభుత్వం మూటగట్టుకుంది.

ఉద్యోగులు అంటే ప్రభుత్వ భాగస్వాములు మరి వారి బాగోగులు చూసుకోవాల్సిందీ ప్రభుత్వమే వారికి సంతృప్తికరంగా వేతనాలు అందినప్పుడు మాత్రమే నిబద్ధతతో పనిచేస్తారు. కానీ జీతాలు ఒకటో తారీఖున రావటం గగన కుసుమమైంది. పదో తారీకు వరకు జీతాలు వస్తూనే ఉన్నాయి. బ్యాంకుల్లో తీసుకున్న అప్పులకు వడ్డీలు పెరిగి పోతున్నాయి. నిత్యావసర సరుకులు కొనడానికి కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జీతాల్లో కోత పెడితే విలవిలలాడి పోయారు. ఒక్కసారిగా జీతం సగానికి తగ్గిపోతే ఏం చేయాలి? ఎవరితో చెప్పుకోవాలి? ఎవరి దగ్గర చేతులు చాచాలి? అన్న వైరాగ్యంతో తనువు చాలించిన వారు కూడా ఉన్నారు.తెలంగాణ కన్నా ఆర్థికంగా వెనుకబడ్డ ఆంధ్రప్రదేశ్‌లో ఏ పోరాటాలు లేకుండానే ఉద్యోగులు 27 శాతం ఐఆర్ పొందుతూ, మంచి పిఆర్‌సి కోసం ఎదురు చూస్తున్నారు. అక్కడ బదిలీలు, ప్రమోషన్లు పొందుతూనే ఉన్నారు ఉమ్మడి రాష్ట్రం నుండి విడిపోయి లాభపడ్డామా? నష్టపోయామా? అని బేరీజు వేసుకుంటున్నారు తెలంగాణ ఉద్యోగులు.

నిత్యం ఆఫీసుల్లో, క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ విధానాలను ప్రజల్లోకి తీసుకుపోయేది ఉద్యోగులే. ప్రభుత్వ పథకాలు విజయవంతం కావడానికి ప్రధాన భూమిక వహించేది ఉద్యోగులే. ఉద్యోగులు లేకుండా ఏ ప్రభుత్వం ఏం చేయలేదు. అటువంటి ఉద్యోగులకు ఐదు సంవత్సరాలకు ఒకసారి వచ్చే పిఆర్‌సి, మరో రెండు మూడేళ్లు దాటినా రాకపోతే, ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా వినకపోతే, ఏమీ తెలియనట్లు ఏమీ పట్టనట్టు రాజ్యం ప్రవర్తిస్తే, ఏం చేయాలో తెలియక కుమిలిపోతున్నారు. చివరికి దీనికి పోరాట మార్గమే శరణ్యమని, హక్కుల సాధనకు గళ మెత్తడమే మార్గమని పోరాటాలకు తెరతీశారు. నిజానికి ప్రభుత్వాన్ని, రాజకీయ నాయకుల్ని నిలదీయకుండా ఉద్యోగుల ఏ కోరికలు నెరవేరవు. అందుకే న్యాయపరమైన కోరికల సాధనకు పోరాటాలే దిక్కు. ఇది గ్రహించి ప్రభుత్వాధినేత ఉద్యోగుల పట్ల నిర్లక్ష్య వైఖరి విడనాడాలి. ఆర్థిక పరమైన సమస్యలు కానటువంటివి, మొదట వెంటనే పరిష్కరించి ప్రభుత్వం ఉద్యోగులకు నమ్మకాన్ని కలిగించాలి. పిఆర్‌సి కోసం ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఉద్యోగులకు ఆర్థికంగా నష్టం కలగని రీతిలో పిఆర్‌సిని అమలు చేస్తే, మరింత ఉత్సాహంగా ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలు పనిచేస్తాయి. రాష్ట్రాభివృద్ధిలో చిత్తశుద్ధితో తమ భాగస్వామ్యాన్ని నెరవేరుస్తాయి. ప్రభుత్వంపై ఒత్తిడి తగ్గుతుంది. ఇప్పటికైనా ఏదో ఒక సాకుతో తాత్సరం చేయకుండా పిఆర్‌సి అమలు దిశగా ప్రభుత్వం పని చేయాలి. లేకపోతే తెలంగాణ తొలి పిఆర్‌సి పట్ల సబ్బండ ఉద్యోగ వర్గాల అసంతృప్తి పెరిగిపోయి మరో మహత్తర ఉద్యమానికి దారి తీయవచ్చు.

నివ్వెరపరిచిన నివేదిక

ఎట్టకేలకు పిఆర్‌సి వెలుగు చూసింది. కాని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక వర్గాలను నివ్వెరపరిచింది. కోటి ఆశలతో ఎదురుచూసిన ఉద్యోగ వర్గాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా రోడ్ల పైకి వచ్చి రాష్ట్ర ప్రభుత్వ రెండు నాల్కల ధోరణి పట్ల నిరసన గళం విప్పారు. ముగ్గురు ఐఎఎస్ లతో కూడిన కమిటీ 50 కోట్లకు పైగా ఖర్చుపెట్టి మూడు సంవత్సరాలు సాగదీసి చివరికి చావు కబురు చల్లగా చెప్పినట్లు, ఉద్యోగుల ఆశల మీద నీళ్లు చల్లుతూ అధ్వాన్నమైన 7.5 శాతం ఫిట్మెంట్‌తో నివేదిక ఇవ్వడంపై ఉద్యోగులు తీవ్ర నిరసనను వ్యక్తం చేస్తున్నారు. ఈ పిఆర్‌సి కరువు భత్యం ప్రకటనకన్నా ఘోరంగా ఉన్నదని, అలాగే హెచ్ఆర్ఏను కూడా తగ్గించడంతో రగిలిపోతున్నారు. ఈ 278 పేజీల నివేదికను కావాలనే ఉద్యోగుల పట్ల కక్ష్య పూరిత వైఖరితో తాననుకున్నట్లు అవమానకరంగా, పిఆర్‌సి నివేదికను రాయించుకున్న ప్రభుత్వ వైఖరిని ఎండగడుతున్నారు. నివేదిక అంతా గందరగోళంగా ఉన్నదని, నివేదికలో చెప్పిన ఫిట్మెంట్‌కు ఇదే నివేదికలోని పిఆర్‌సి గ్రేడ్లకు పొంతనలేదని, నివేదిక గందరగోళంగా, నిర్లక్ష్యంగా తయారుచేశారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీస మూలవేతనం రు. 19,000 చేయడం, గ్రాట్యుటీ నామమాత్రంగా పెంచడం అత్యంత అవమానకరమని ఇది సహించలేమని మంచి పిఆర్‌సి అందేవరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని అంటున్నారు. నిజానికి అడుగడుగునా ధనిక రాష్ట్రమని, గొప్పలు చెప్పుకుంటున్న నేపథ్యంలో గతంలో ఇచ్చిన 43 శాతం పిఆర్‌సిని దృష్టిలో పెట్టుకొని ఇటీవల పక్క రాష్ట్రంలో ఐఆర్ తీసుకుంటున్న ఉద్యోగులను చూసి మంచి పిఆర్‌సి కోసం ఉద్యోగులు ఎదురు చూసారు. కానీ వారి ఆశలు తలకిందులయ్యాయి. ఇది ఉద్యోగుల పట్ల ప్రభుత్వ వైఖరికి నిదర్శనమని దుయ్యబడుతున్నారు. పిఆర్‌సి ప్రతులను తగులబెట్టి ఈ పిఆర్‌సి మాకొద్దని, పోరాటానికి ప్రతి ఫలంగా ఇచ్చిన తెలంగాణ ఇంక్రిమెంటును వెనకకు తిరిగి ఇస్తామని అంటున్నారు. పోరాడి తెచ్చుకున్న ఉద్యోగులకు ఈ పిఆర్‌సి అవమానకరమని, విడిపోయిన సోదర ఉద్యోగులు వెక్కిరిస్తున్నారని వాపోతున్నారు. ప్రభుత్వ నిర్లక్ష్య విధానానికి వ్యతిరేకంగా ప్రబలమైన ఉద్యమాన్ని నిర్మించక తప్పదని అభిప్రాయపడుతున్నారు. ఈ నివేదికతో ఉద్యోగుల జీతాల్లో ఎదుగుదల ఉండదని ఎచ్ఆర్ఏలో గాని సిపిఎస్ ఉద్యోగులకు గాని తీవ్ర అన్యాయం జరుగుతుందని అన్నారు.

ఉద్యోగుల కడుపు నింపుతామని మాయ మాటలు చెప్పి చివరికి ఉద్యోగుల కడుపుకొట్టారని ఉద్యోగ వర్గాలు ఉడికిపోతున్నాయి. నివేదికలోని పలు అంశాలు విస్మయానికి గురి చేసినట్లు, ఇప్పటికైనా ప్రభుత్వ నివేదికను పునః పరిశీలించి ఉద్యోగ వర్గాల ఆకాంక్షలకు అనుగుణంగా పిఆర్‌సిని ప్రకటించాలని కోరుతున్నారు. ప్రభుత్వ పెద్దలు మసిబూసి మారేడి కాయజేసి ఏం మాటలు చెప్పి మభ్యపెడతారో వేచి చూడాలి.

(రచయిత డిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్) వీ

దారితప్పిన తెలంగాణ

***పోరాడి సాధించుకున్న తెలంగాణలో ఎన్నో కలలు గన్న ప్రజల ఆశలు అడియాసలయ్యాయనీ, అన్ని వ్యవస్థలు దెబ్బతిని జీవన స్థితిగతులు దారితప్పాయనీ అంటున్నారు* అవినాష్ భారత**

తెలంగాణ ప్రస్తుత ప్రభుత్వ ఏడు ఏండ్ల పాలన చూశాక కలిగిన భావనలు పంచుకొంటున్నాను.

తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణ వస్తే మన ఉద్యోగాలు మనకు, మన నీళ్లు మనకు వస్తాయని నాలాంటి చాలా మంది నిరుద్యోగ యువత అనుకున్నారు. కానీ అవి ఏవి నెరవేరలేదు. ఉద్యోగాలనే చూస్తే ఈ ఏడు ఏండ్లలో టిఎస్‌పిఎస్‌సి ద్వారా నింపింది 36 వేల ఉద్యోగాలు మాత్రమే. మరి ముఖ్యమంత్రి అసెంబ్లీ సాక్షిగా చెప్పిన లక్ష ఉద్యోగాల మాట నీటి మూటేనా. నాలాంటి వాళ్లం తెలంగాణ వస్తే ఇక్కడ ఏర్పడే ప్రభుత్వం తెలంగాణ మేధో సంపదను విస్తృత స్థాయిలో ఉపయోగించి, ఒక అభివృద్ధి సలహా మండలిని ఏర్పాటు చేసుకొని సరైన దిశలో ప్రయాణిస్తుందని ఆశించాం. కానీ ఆ దిశగా ప్రయత్నమే జరగలేదు. తెలంగాణ ఉద్యమం ఏ విధంగా కొత్త దారిలో ప్రయాణించి లక్ష్యాన్ని ముద్దాడిందో అభివృద్ధిలోను అదే కొత్త దారిలో ప్రయాణించి ఉంటే ఒక ప్రజాస్వామ్య, మానవ వనరులతో అభివృద్ధి చెందిన మేధో వికాసవంతం అయిన తెలంగాణగా రూపుదిద్దుకొని ఉండేది. కానీ ఆ అవకాశాన్ని తెలంగాణ నేడు చేజార్చుకుంది. బహుశా ప్రపంచంలో ఎక్కడా ఒక ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి ఒక ప్రొఫెసర్ నాయకత్వం వహించడం చాలా అరుదు. మరి అలాంటి వారిని ఎందుకు పక్కన పెట్టినట్టో ఇప్పటికీ అర్థం కాని విషయం. తెలంగాణ అభివృద్ధి మండలిని ప్రొఫెసర్ హనుమంతరావు, ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ రేవతి, ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్, ప్రొఫెసర్ నాగేశ్వర్ లాంటి వాళ్లతో ఏర్పాటు చేస్తే బాగుండేది. నాకు ఇక్కడ జయశంకర్ సర్ పదే పదే చెప్పిన మాట ఒక్కటి గుర్తుకు వస్తున్నది. 'తెలంగాణ వస్తే మన ముఖ్యమంత్రి ఉంటాడు, మన హోంమంత్రి ఉంటాడు' అని అనేవారు. కానీ ఇవ్వాళ చూస్తే వాళ్లే మనకు పరాయివాళ్లు అయిపోయారు. అదే విషాదం. ఇక్కడ ఇంకో విషయం కూడా గుర్తు చేసుకోవాలి. మొన్నటికి మొన్న అధికార పార్టీ ముఖ్య నేత ఒకరు అభివృద్ధి మీద దృష్టి సారించి విశ్వవిద్యాలయాల గురించి పట్టించుకోలేదు అని చెప్పారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఇంకా తెలంగాణ విద్యారంగం విషయానికి వద్దాం. తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ లాంటి మంచి ప్రయోగం జరిగిన తెలంగాణ లాంటి రాష్ట్రంలో నేటి విద్యా పరిస్థితి చూస్తే జాలేస్తున్నది. ఉద్యమ సమయంలోను, తెలంగాణ వచ్చిన తరువాత నేటి ముఖ్యమంత్రి నోటి నుండి కెజి టు పిజి వరకు ఉచిత విద్య అనే మాట వచ్చిందంటే అది విద్యా పరిరక్షణ సమితి, ఇంకా అనేక ప్రజా సంఘాల పోరాట ఫలితమే. కానీ ఇప్పుడు ఆ నినాదం విధాన రూపం సంతరించు కోకపోవడం విచారకరం. ఒక ఉద్యమం నుండి పుట్టిన పార్టీ ఇలా వ్యవహరించడం విషాదం. నియోజకవర్గానికి ఒక గురుకుల పాఠశాల నెలకొల్పామని చెప్పుకున్న పాలకులు వాటి ద్వారా ఎంత మందికి విద్య అందుతున్నది అనేది వాళ్లకు వాళ్లు వేసుకోవలసిన ప్రశ్న. సమాధానం కొంతమందికి అనేది స్పష్టమే. మరి మిగిలిన పిల్లల పరిస్థితి ఏమిటి. విద్య అనేది అందరికి అందాలని రాజ్యాంగం కూడా చెపుతున్నది. మరి రాజ్యాంగాన్ని కూడా కాలరాస్తున్నారు. అందరికి ఉచిత నిర్బంధ విద్య అందించి వారి మేధో వికాసానికి తోడ్పాటును అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపైన లేదా?

తెలంగాణలో విద్యా వ్యవస్థ అభివృద్ధి కొరకు ఒక సలహా మండలిని ఏర్పాటు చేయొచ్చు కదా. ప్రొఫెసర్ అనిల్ సద్గోపాల్ గారి నేతృత్వంలో ఒక కమిటీ వేస్తే బాగుంటుంది. ఆ కమిటీ చేసే సిఫారసులు ఆమలు చేస్తే, ఆ దిశగా ప్రభుత్వం ఆడుగులు వేస్తే తెలంగాణ విద్యారంగం దారినపడే అవకాశం ఉంది. అలాగే ఎక్కడికక్కడ అధ్యయన కేంద్రాలు ఏర్పాటు చేసి, పరిశోధనలు పెంచి తెలంగాణ విద్యార్థులను మేధో పరంగా పరిపుష్టం చేసే అవకాశం ఈ ప్రభుత్వం ముందర ఉన్నది. ఇవన్నీ అమలు చేయడానికి ప్రభుత్వం దగ్గర కావలసినంత సమయం కూడా ఉన్నది. దానిని ఉపయోగించుకొని ఒక ఉదారవాద ప్రజాస్వామ్యయుత మేధో సమాజాన్ని పునర్నిర్మించే అవకాశం ఈనాటి పాలకుల చేతిలో ఉన్నది. దానిని ఎట్లా ఉపయోగించుకుంటారు. ప్రజలు కేంద్రంగా అభివృద్ధి విధానాలు రూపొందుతాయా లేక పాతపాటే కొత్తగా అమలు చేస్తారా అన్నది కాలమే నిర్ణయించాలి.

ఒకవేళ పాతపాటే కొత్తగా పాడితే ప్రజలు చేయాల్సింది ప్రజలు చేస్తారు. ఎందుకంటే తెలంగాణ ఒక బయపడని సమాజం, చైతన్యవంతమైన సమాజం. జయశంకర్ గారు అన్నట్లు తెలంగాణ వచ్చిన తరువాత కూడా ఉద్యమ పంథా అవసరమే. ఇప్పటి పరిస్థితి చూస్తే అది నిజమే అనిపిస్తున్నది. ఇక్కడ గమనించాల్సిన విషయాలు కూడా ఉన్నాయి.

1. దక్షిణ తెలంగాణ రైతాంగం స్వరాష్ట్రంలో కూడా అభివృద్ధి నుండి వెలివేయబడడం. ముఖ్యంగా మహబూబ్‌నగర్ రైతాంగం స్వరాష్ట్ర ఫలితాలు పొందకపోవడం విషాదమే. ఈ విషయం పైన చాలా ఏండ్లుగా పోరాటం చేస్తున్న పాలమూరు అధ్యయన వేదిక వాళ్లతో అసలు సమస్యలు ఏమిటో తెలుసుకొని విధానాలు రూపొందించొచ్చు కదా. ఎందుకంటే వాళ్లంతా గత రెండు దశబ్దాలకు పైగా కార్యరంగంలో ఉన్నవారు. వాళ్లకు కష్టనష్టములు ఎక్కువగా తెలుస్తాయి కదా. ఆ ప్రయత్నం చేస్తే బాగుండేది. ఇప్పటికైనా చేస్తే బాగుంటుందో ప్రజలకు దగ్గరగా మెదిలేవాడే నిజమైన నాయకుడు అని, దానితోనే నాయకత్వ ప్రతిభ తెలుస్తుందని మరి చెప్పాలా ప్రగతి భవన్ దాటండి సర్.

2. ఉద్యోగాల భర్తీ ఒక ఎన్నికల జుమ్లా కావడం మహా విషాదం. ఒక్కసారి నిరుద్యోగుల మనసులోని మాటను గుండెతో ఆలకించండి.

3. కొత్తగా చేరిన పంచాయితీ కార్యదర్శుల బాధలు వినండి సర్. కొత్తగా ఏర్పాటు చేసిన గ్రామ పంచాయితీలలో పంచాయితీ భవనాలు లేక, కనీస సౌకర్యాలు లేక కార్యదర్శులు ఎంత ఇబ్బంది పడుతున్నారో

చూడండి.

ఇప్పటికైనా మించిపోయింది లేదు. ప్రతి సంవత్సరం ఉద్యోగాల క్యాలెండర్ రీలీజ్ చేసి ఉద్యోగాల భర్తీ చేసి తెలంగాణ కొట్లాడి తెచ్చుకున్నందుకు దానికి సార్థకథ చేకూర్చండి. తెలంగాణలో రైతుల గురించి ఒక వ్యవసాయ అధ్యయన కమిటీని ప్రొఫెసర్ నర్సింహారావు గారి నేతృత్వంలో వేసి రైతులకు సరైన మార్గనిర్దేశం చేస్తే బాగుంటుంది. సన్న బియ్యం వల్ల గ్రామాలలో రైతులు కనీస పెట్టుబడి రాక భార్యల మెడలో ఉన్న పుస్తెలతో సహా తనకా పెడుతున్నారు. సన్న బియ్యం తమకు సున్నం పెట్టిందని వాపోతున్నారు.

తెలంగాణలో ఉన్న రైతులకు వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమ కూడా అభివృద్ధి చేస్తే రైతుకు ఆదాయం పెరిగి జీవన స్థితిగతులు కూడా మెరుగయ్యే అవకాశం ఉంది.

అలాగే ఉమ్మడి రాష్ట్రంలో ధ్వంసం అయిన కుల వృత్తులను మళ్లీ పునర్నిర్మించండి. కరీంనగర్ వెండి ఆధారిత పరిశ్రమలు, వరంగల్ కంబల్లు, జనగామ ప్రాంతంలో చేనేత పరిశ్రమ, మహబూబ్‌నగర్‌లో తుంగ చాపలు, ఆదిలాబాద్‌లో నిర్మల్ కొయ్య బొమ్మలు లాంటి వాటికి మళ్లీ పునర్వైభవం తెచ్చే ఏర్పాటు చేయాలి. అలాగే హైదరాబాద్ సంస్కృతికి వెన్నెముకగా నిలిచిన బిద్రి క్రాఫ్ట్‌ను కూడా కాపాడాల్సిన అవసరం ఉంది. ఇవన్నీ తెలంగాణలో ఉండే గొప్ప చారిత్రక సంస్కృతి, సంప్రదాయానికి చిహ్నాలు. ఇవన్నింటిని కాపాడుకోవడం ద్వారా తెలంగాణ వైభవాన్ని మరొకసారి ప్రపంచానికి చాటొచ్చు.

తెలంగాణలో శ్రీకృష్ణ కమిటీ మొదటిసారి పర్యటించిన అక్కపల్లి గూడం వాసుల ఆవేదన మేడిద బుచ్చిరెడ్డి, యార మోహన్ మాటల్లో వినండి

తెలంగాణ వాదాన్ని మొదటిసారి గట్టిగా వినిపించిన మా వాదన వృథా ప్రయాస అవుతోందని ఆవేదన చెందుతున్నాం. మా గ్రామంలో అంత రైతు కుటుంబాలు ఉన్నాం, అట్లా 140కి పైగా ఉంటాం. ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు కనీస పెట్టుబడి రాక ఉన్న మా పొలాలు కూడా మార్ట్ గేజ్ పెట్టాల్సిన పరిస్థితి దాపురించింది. మాకు శివాజీనగర్ నుండి జనగామకి వెళ్లడానికి దగ్గరి దారి ఉన్న రోడ్ వేయించడం లేదు.

గత 20 ఏండ్లుగా ఈ సమస్య తీరకుండానే ఉన్నది. అలాగే ఇక్కడ ప్రజలంతా వ్యవసాయదారులే కాబట్టి వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం శ్రద్ధ చూపాలి. అలాగే పాల ఉత్పత్తిని పెంచడానికి పశువుల పంపిణీ చేసి ఆర్థిక స్వావలంబనకు తోడ్పాటును అందించాలి. ముఖ్యంగా అక్కపల్లిగూడెం నుండి జనగాం వయా శివాజీనగర్ రోడ్‌ను త్వరితగతిన పూర్తిచేయాలని వేడుకుంటున్నాం. తద్వారా మా ఉత్పత్తులను తొందరగా మార్కెట్‌కి తరలించి రవాణా ఛార్జీలు, సమయం ఆదా చేసుకోవచ్చు. ఇక్కడ పండే పొగాకుకు ఉమ్మడి రాష్ట్రంలో మంచి పేరు ఉంది. కాబట్టి ఇక్కడ ఒక పొగాకు ప్రాసెసింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని వేడుకుంటున్నాం.

(రచయిత విద్యార్థి)

వీ

గండంగా ఉన్న పరిస్థితి. అయినా నిరంతరాయంగా ప్రతి నెల వీక్షణం వస్తున్నందుకు కారణం వేణు గారి నేతృత్వం, సమర్థులైన 'వీక్షణం' టీం సమిష్టి కృషి. 'వీక్షణం' జన్మదిన సందర్భంగా అభినందనలు అందజేసిన పైన నేనుదహరించిన గౌరవనీయులైన పెద్దలందరికీ నాదొక విజ్ఞప్తి: ఈరోజు దేశంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులు మీకు తెలియనివి కావు. నేడు ప్రజాస్వామ్యానికి, పౌరహక్కులకు భంగం కల్గుతున్న రాజకీయ పరిస్థితులు మీకు తెలుసు. అందువలన వీక్షణం లాంటి పత్రికలను రక్షించుకోవల్సిన బాధ్యత అందరిమీద ఉన్నది. వీక్షణం ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న సంగతి మీకు తెలుసు. పాఠకులు మాత్రమే వీక్షణం ఆర్థిక సమస్యలను తీర్చలేరు. ఈ పనికి సమాజం మొత్తం పూనుకోవాలి. ఈ 'సమాజంలో మీరు కూడా సభ్యులే'. మీ అందరికి సమాజంలో గొప్ప కీర్తి ప్రతిష్టలు ఉన్నాయి. రాజకీయాలకతీతంగా మీ అందరిని ప్రజలు గౌరవిస్తారు. మీ మాటకు విలువ ఇస్తారు. అందువలన 'వీక్షణం'ను ఆర్థికంగా ఆదుకొమ్మని మీరందరు ప్రజలకు విజ్ఞప్తి చేయండి. ప్రజల నుండి మంచి స్పందన వస్తుంది. వీక్షణం లాంటి పత్రికలను రక్షించమని ప్రజాహితం కోరి మేము మీకు విజ్ఞప్తి చేస్తున్నామని చెప్పండి. గౌరవనీయులైన పెద్దలైన మీకు నేను విజ్ఞప్తి చేయడమే కాదు, పాఠకుడిగా – కవి, జర్నలిస్టు దేవిప్రియ గారు 'జన్మదిన సంచికలో' ఎడిటర్, యాజమాన్యంకి ఈ ఆర్థిక సమస్యల నుండి పత్రిక బయట పడడానికి మంచి విలువైన సూచన చేశారు. ఆ సూచనను నేను అంగీకరిస్తూ, దేవిప్రియ గారి 'సూచన' అమలులోకి తీసుకవస్తే నావంతు బాధ్యతగా (దేవిప్రియ గారి సూచన ప్రకారం (ట్రస్ట్' ఏర్పడితే 'లక్ష' రూపాయలు ఇస్తాను. శ్రీ వేణుగోపాల్ గారికి, యాజమన్యంకి 'ట్రస్ట్' ఏర్పాటు చేసేవైపు అడుగులు వేయమని నేను 'ప్రతి విజ్ఞప్తి' చేస్తున్నాను. ప్రజాపక్షం వహించిన 'వీక్షణం' ఉభయ తెలుగు రాష్ట్రాల 'ముద్దుబిడ్డ'. ఈ ముద్దుబిడ్డను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిది. గౌరవనీయులైన దేవిప్రియ గారి, సోదరి సజయ గారి హృదయ స్పందన, 'వీక్షణం' నిర్వహణలో కొంతమేర వారి సహకారం ఎలా అందించగలుగుతామో ఆలోచిద్దాం, ఆ వైపుగా కృషి చేద్దాం అన్న వారి హృదయం నుండి వచ్చిన మాటలు నన్ను కదిలించాయి. వారిద్దరికి నా కృతజ్ఞతలు మీ ద్వారా తెలియజేయాలనుకుంటున్నాను. దయచేసి 'వీక్షణం' నిరంతరాయంగా ప్రజల చెంతకు చేరడానికి ఎన్ని మార్గాలు ఉన్నాయో మీతో పాటు మిగిలిన మేధావులతో చర్చించండి. మీరు ప్రజలను చైతన్యపరిచే ఈ 'మహా యజ్ఞం' నిరాఘాటంగా సాగిపోవాలి. ఎటువంటి అవంతరాలు ఎదురైనప్పటికీ ఈ 'మహా యజ్ఞం' ఆగిపోకూడదు. అప్పుడే ప్రజలకు న్యాయం చేసినవాళ్లమవుతాము.

మీరు నవ్వుకుంటున్నారు కదూ! నా 'చాదస్తానికి'. ఏమి చేయను నా వయస్సు ఈ 'డిసెంబర్'తో 77 సంవత్సరాలు వెళ్లి 78 సంవత్సరంలోకి అడుగు పెట్టాను. పెద్దలు చెబుతారు కదా! 'ముసలితనం'లో 'చాదస్తం' ఎక్కువ అవుతుందని, అదే 'చాదస్తం' ఇంత ఉత్తరం రాయడానికి కారణం అయింది.

– కొమ్మన బాబు

వైరా

వీక్షణం జనవరి పందొమ్మిదవ జన్మదిన ప్రత్యేక సంచికలో వచ్చిన అన్ని వ్యాసాలు ప్రస్తుతం దేశంలో, రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను వివరంగా తెలియజేసేవిగా ఉన్నాయి. ముఖ్యంగా మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు వ్యవసాయ చట్టాలను రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తూ, ఆందోళనలు చేస్తున్న సందర్భంలో అసలు కేంద్రం తీసుకొచ్చిన ఈ చట్టాలు కార్పొరేట్‌లకు ఎలా అనుకూలంగా ఉన్నాయో, అలాగే ఆరుగాలం కష్టపడి వ్యవసాయం మీదనే ఆధారపడి జీవిస్తున్న రైతుల పాలిట ఏ విధంగా ప్రభావం చూపిస్తున్నాయో, మొత్తం వ్యవసాయ రంగాన్నే కార్పొరేటీకరణ చేసేవిగా ఉన్నాయో ఈ సంచికలో వచ్చిన ఎనిమిది ప్రతిస్పందనలు చదువుతుంటే స్పష్టంగా అర్థమవుతున్నది. ప్రభుత్వాలు తమకు అనుకూలంగా ఉన్న కార్పొరేట్‌ల కోసం, బహుళజాతి సంస్థల ప్రయోజనాల కోసం ఎంత దారుణానికైనా పాల్పడతాయనేది ఇప్పుడు మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు చూస్తుంటే తేటతెల్లం అవుతున్నది. వీక్షణం పత్రిక పాలకులు అమలుపరుస్తున్న తప్పుడు విధానాలను ఎప్పటికప్పుడు విశ్లేషణతో కూడిన వ్యాసాలను ప్రచురించి సామాన్య ప్రజలను చైతన్యం చేస్తున్నందుకు ధన్యవాదాలు. అలాగే వీక్షణం పందొమ్మిదవ సంవత్సరంలోకి ప్రవేశిస్తున్న సందర్భంగా వీక్షణం ఎడిటోరియల్ కలెక్టివ్ వారికి అభినందనలు.

– కృష్ణహరి

మహబూబ్‌నగర్

వీ

మరోసారి దగాపడ్డ దివీస్ ఫార్మా బాధితులు

***పాలకులు మారినంత మాత్రాన విధానాల్లో మార్పు ఉండదని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ దివీస్ కార్మికుల పట్ల వ్యవహరించిన తీరు మరోసారి తెలిపిందని అంటున్నారు* నత్తల నాగరాజు**

తీరానికి చేర్చడం తప్ప ముంచడం తెలియని మత్స్యకారులు, అన్నం పెట్టే రైతన్నలు, హేచరీలలో పనిచేసే కూలీలు 'నేనున్నాను, నేను విన్నాను' అని అనగానే నమ్మారు. తమ ఆందోళనలకు కొండంత అండ అనుకున్నారు. 'తమను కాదని ముందుకెళితే, తాను అధికారంలోకి రాగానే దివీస్‌ను బంగాళా ఖాతంలో కలిపేస్తాం' అన్నప్పుడు వాళ్లంతా కేరింతలతో జైకొట్టారు. పార్టీల కతీతంగా ఆనాటి అధికార పక్ష శాసన సభ్యుడ్ని మట్టి కరిపించి ప్రతిపక్షంలోని జగన్‌కి అధికారాన్ని కట్టబెట్టారు. దివీస్ బంగాళా ఖాతంలో కలిసిపోతుందనుకున్నారు. కానీ 'నమ్మి నానబోసుకుంటే పుచ్చి బుర్రలైనాయి' అన్న చందంగా దివీస్‌ను తీరం చేర్చి నమ్ముకున్న వారి బతుకులను ఆ బంగాళా ఖాతంలోనే ముంచాడు. ఇదీ జగన్నాటకం. తీవ్రంగా వ్యతిరేకించిన వాడే అధికారంలోకి వచ్చిన లగాయత్తు గత ప్రభుత్వం అనుమతించిన చోటే దివీస్ ఫార్మా నిర్మాణానికి భూమి పూజకు పయనమై నమ్మడం మీవంతు, నమ్మించి మోసగించడం మావంతు అని మరోసారి నిరూపించాడు ముఖ్యమంత్రి జగన్.

ఔషధాల ఉత్పత్తిలో దేశంలోనే రెండవ స్థానంలో ఉన్న దివీస్ లేబరేటరీస్ తన విస్తరణలో భాగంగా మూడవ విభాగాన్ని (మొదటిది 1995లో తెలంగాణలోని యాచారంలో, రెండవది 2002లో ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ ఫార్మా సిటీలో నిర్మాణం జరిగింది) కాకినాడ సెజ్‌కు సమీపంలో తుని ప్రాంతానికి చెందిన తొండంగి మండలం, ఒంటిమిట్ట గ్రామం వద్ద నెలకొల్పడానికి 2015లో నాటి తెలుగుదేశం ప్రభుత్వం నుండి అనుమతి పొంది 2016లో నిర్మాణ పనులు ప్రారంభించింది. ఇందుకోసం ఎపి ఐఐసి ద్వారా 271.34 హెక్టార్లు అంటే 670.5 ఎకరాల భూములను సేకరించడం జరిగింది. ఇందులో 260 ఎకరాలకు పైగా రైతుల నుండి బలవంతంగా సేకరించారు. ఆ రైతులు ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారానికి నేటికీ ఒప్పుకోవడం లేదు. అనేక సార్లు గ్రామ ప్రజాభిప్రాయ సేకరణ పేరుతో బలవంతంగా రుద్దాలనే ప్రయత్నం జరిగింది. ఆ కార్యక్రమం రసాబాసగా మారడమే కాకుండా పలుమార్లు పెద్ద ఎత్తున ఆందోళనలు, ఆపై అరెస్టులు జరిగాయి. ప్రభావిత గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున 'దివీస్ గోబ్యాక్' అని నినదించారు.

శాసన సభ ప్రతిపక్ష నేత హోదాలో జగన్ 2016 నవంబర్ 16న తొండంగి మండలం, దానవాయిపేట వద్ద జరిగిన ఆందోళనలో పాల్గొని బాధిత ప్రజలకు అండగా నిలుస్తానని హామీ ఇవ్వడం జరిగింది. తిరిగి తన పాదయాత్రలో భాగంగా 2018 ఆగస్టు 18న తునిలో నిర్వహించిన సభలో మాట్లాడుతూ 'తమను కాదని ముందుకెళితే, అధికారంలోకి రాగానే దివీస్‌ని బంగాళా ఖాతంలో కలిపేస్తాం' అంటూ తీవ్ర హెచ్చరికలు చేశాడు. ప్రజలను నమ్మించాడు. అధికారంలోకి వచ్చాడు. దివీస్ పీడ విరగడైందనుకున్నారు. ఆశగా ఎదురు చూశారు. కానీ ఒకరోజు ఉదయం వివిధ దిన పత్రికలలోని తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ ఇచ్చిన ప్రకటన చూసి అంతా నివ్వెరపోయారు. 'డిసెంబర్ 7న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి దివీస్ ఫార్మా కంపెనీ నిర్మాణానికి భూమి పూజకు విచ్చేయు చున్నారు, అందుకోసం తగిన ఏర్పాటు జరుగుతున్నవి'. ఇంతకంటే నమ్మక ద్రోహం మరొకటి లేదు.

ఇది విన్న తొండంగి మండలంలోని ప్రభావిత గ్రామాల ప్రజలు తిరిగి సమీకృతమైనారు. 'దివీస్ వ్యతిరేక పోరాట సమితి' పేరుతో కదిలారు. వెూసగించిన వారికి తగిన బుద్ధి చెప్పాలని తీర్మానించుకున్నారు. ఆందోళనను ఉధృతం చేశారు. వారి ధర్మాగ్రహానికి అప్పటికే నిర్మించిన ఎత్తయిన ప్రహరీ గోడ క్షణాలలో నేలమట్టం కావడం, అక్కడికి తరలించిన యంత్రాలు, ఇతర సామాగ్రీ దగ్ధమైంది. జగన్ ప్రభుత్వం దివీస్‌కు అండగా నిలిచింది. 400 మంది పోలీసులను మోహరించింది. మొత్తం 116 మందిపై హత్యా నేరంతో పాటు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసింది. 42 మందిని అరెస్ట్ చేసి జైలుకు పంపింది. దివీస్ ఫార్మా కంపెనీని శాశ్వతంగా తరిమివేయాలని, అరెస్ట్ చేసిన వారిని విడుదల చేయడమే కాకుండా భేషరతుగా కేసులను ఎత్తివేయాలని దశలవారీ ఆందోళనతో పాటు నేటికీ ఈ ప్రాంతంలో దిక్షా శిభిరాన్ని నిర్వహిస్తున్నారు. ఫలితంగా ఆ 42 మందిని బెయిల్‌పై విడుదల చేయడమైనది. దీక్షలు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రస్తుతం దివీస్‌ను తీవ్రంగా వ్యతిరేకించడం ప్రతిపక్షమైన తెలుగుదేశం వంతైంది. అప్పుడు వాళ్లు పెట్టాలంటే వీళ్లు వద్దని, ఇప్పుడు వీళ్లు పెడతానంటే వాళ్లు వద్దని ఇద్దరూ బాధిత ప్రజల జీవితాలతో ఆడుకుంటున్నారు. ఇంతకీ ఈ దివీస్ ఫార్మా కంపెనీని ప్రజలు ఇంత తీవ్రంగా వ్యతిరేకించడానికి గల కారణాలు ఏమిటి? ఆ కంపెనీ ఆచరణ ఏమిటి? ఔషధాల తయారీలో దీని పాత్ర ఏమిటి?

హైదరాబాద్ కేంద్రంగా 1990లో ప్రారంభమైన దివీస్ ఫార్మా లేబరేటరీస్ నేడు దేశంలోనే ఫార్మా రంగంలో రెండవ స్థానంలో ఉంది. ఒక రీసర్చ్ సెంటర్, రెండు ఉత్పత్తి కేంద్రాలతో ప్రపంచ వ్యాప్తంగా 95 దేశాలలో వినియోగదారులను కలిగి ఉంది. ప్రపంచం మొత్తం మీద ఔషదాలపై వ్యయం రోజు రోజుకూ పెరుగుతూ ఉంది. 2023 నాటికి ప్రపంచ ఔషద వ్యయం 1.5 ట్రిలియన్ డాలర్లకు మించి ఉంటుందని దివీస్ అంచనా వేస్తుంది. ఆ వ్యయంలో మెజార్టీ వాటా పొందాలనే ఆశతో విస్తరణకు పూనుకున్న దివీస్ అనేక అక్రమాలకు పాల్పడడమే కాకుండా, చట్ట విరుద్ధమైన కార్యకలాపాలు, అనుమతులు లేకనే కొత్త

కొత్త యూనిట్లు నిర్మిస్తుంది. కరోనా నేపథ్యంలో షేర్ విలువ వేగంగా పెరిగిన కంపెనీలలో దివీస్ అగ్ర స్థానంలో ఉంది. విస్తరణ ప్రణాళిక కారణంగా షేర్ విలువ మరింత పెరిగిందని పరిశ్రమ వర్గాలు విశ్లేషించాయి.

2002లో విశాఖ ఫార్మా సిటీలో ఈ కంపెనీకి కేవలం నాలుగు కెమికల్ బ్లాకుల నిర్మాణానికి అనుమతించగా అవి నేడు 40 బ్లాకులకు చేరుకోగా మరో 20 బ్లాకులు నిర్మాణ దశలో ఉన్నాయి. ఇలా దివీస్ అనుమతులకు మించి వందల ఎకరాలలో విస్తరిస్తున్న కారణంగా వందల గ్రామాలు ప్రభావితమవుతున్నాయి. ఆ ప్రాంతంలోని గ్రామాలలో భూగర్భ తాగునీటి వనరులు కలుషితమయ్యాయి. కొన్ని గ్రామాలలో నీటిపై చమురు తేలియాడుతుంది. మూత్ర పిండాల సమస్యలు, టిబి, కంటి వ్యాధులు ప్రభలంగా ఉన్నాయి. కాలుష్యం కారణంగా వేల ఎకరాల పంట భూములు వట్టిపోతున్నాయి. తాటి చెట్ల దిగుబడి తగ్గిపోయింది. ఫలితంగా రైతులు వలసపోతున్నారు. గాలి, నీరు కలుషితం కావడం వల్ల గర్భిణీ స్త్రీలు వైకల్యాలున్న పిల్లలకు జన్మనిచ్చిన సందర్భాలు ఉన్నాయి. అంతేకాక ఈ సంస్థ 2002లో నిర్మాణ అనుమతులు పొందినప్పుడు విధించిన షరతుల్లో స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించాలని నిబంధన ఉన్నా, అర్హతలు కలిగి ఉన్నప్పటికీ బాధిత గ్రామాలకు చెందిన యువకులకు ఉద్యోగాలు ఇవ్వడం లేదు. స్థానికులైతే యూనియన్స్ ఏర్పాటు చేస్తారని, కాబట్టి వారిని చేర్చుకోకూడదని గట్టి నిర్ణయం తీసుకున్నారు. ఇంతటి దుష్ప్రభావాలు కంటి ముందు కనిపిస్తుండగా, ఆ కంపెనీని నివారించాల్సిన ప్రభుత్వాలు అది చంద్రబాబు ప్రభుత్వమైనా, జగన్ ప్రభుత్వమైనా ఆ యాజమాన్యానికి దాసోహమవడం, ప్రజా ఆకాంక్షలను ఏమాత్రం పట్టించుకోకపోవడం స్పష్టంగా తెలుస్తుంది.

ఇక ప్రతిపాదిత దివీస్ మూడవ ఔషధ తయారీ కేంద్రం వల్ల ఉత్పన్నం కాబోయే సమస్యలు చెప్పనలవి కానన్ని ఉన్నాయి. జగన్ ప్రతిపక్ష నాయకుడిగా ఉండి ఆ ప్రాంతాన్ని సందర్శించినప్పుడు తను స్వయంగా 'ఇదే దివీస్ కంపెనీ ఫార్ములేషన్ చేస్తే అందరూ సంతోషించేవాళ్లు. కానీ డ్రగ్‌ను బల్క్ స్థాయిలో తయారు చేయబోతున్నారు. 65 లక్షల లీటర్ల మంచినీరు తీసుకొని, 55 లక్షల కలుషిత నీటిని నేరుగా సముద్రంలో కలిపేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇది రొయ్య పిల్లలను, మత్స్య సంపదను దెబ్బతీస్తుంది. రైతులు ఇబ్బందులు పడతారు' అని మాట్లాడడం జరిగింది.

విశాఖ జిల్లా నక్కపల్లి నుంచి తూర్పు గోదావరి జిల్లా యు. కొత్తపల్లి వరకు నేడు 300 లకు పైనే హేచరీస్ ఉన్నాయి. ఒక్కొక్క హేచరీలో 100 మంది దాకా పనిచేస్తున్నారు. అలా దాదాపు 30 వేల మంది ప్రత్యక్షంగా, మరో 50 వేల మంది పరోక్షంగా హేచరీ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారు. ఈ ప్రతిపాదిత దివీస్ ఫార్మా వల్ల 100 హేచరీలు ప్రత్యక్ష ప్రభావానికిలోనై మూసివేతకు గురవుతాయి. దేశంలోనే అత్యధికంగా హేచరీలున్న ప్రాంతం తొండంగి ప్రాంతం. ఈ ప్రాంతాన్ని ఆక్వాజోన్‌గా ప్రకటిస్తే అత్యధిక విదేశీ మారక ద్రవ్యాన్ని పొందడమే కాకుండా, ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. మత్స్యకారుల వేటకు ఈ ప్రాంతం ఎంతో అనువైనది. జీడి మామిడి వంటి వ్యాపార పంటలు కూడా ఇక్కడ సాగులో ఉన్నాయి. మరోవైపు కోస్తా ప్రాంతంలో పర్యావరణ కాలుష్య నివారణకు గాను 1991లో కోస్టల్ రెగ్యులేషన్ జోన్ సిఆర్‌జెడ్ చట్టం ప్రకారం ఆ కంపెనీకి ఇచ్చిన అనుమతులు చెల్లవు. పైగా ఫారెస్ట్ ప్రాంతంలో ఫార్మా కంపెనీ ప్రతిపాదన తప్పు. అయినా కూడా ఈ కంపెనీ స్థాపనకు అనుమతులు ఇవ్వడానికి, భూమి పూజలు చేయడానికి ప్రభుత్వాలు పోటీ పడ్డాయి.

ప్రభుత్వ కల్లబొల్లి కబుర్లు: ప్రజల ఆందోళనతో ఊపిరి సలుపుకోలేని స్థితిలో అటు జగన్ ప్రభుత్వం, ఇటు దివీస్ యాజమాన్యం, అధికార యంత్రాంగం లోపాయికారి విధానాలను అవలంభిస్తున్నాయి. నేరమంతా గత ప్రభుత్వానిదే, ప్రజల అభ్యంతరాలు, సందేహాలు నివృత్తి చేయకుండా ఏకపక్షంగా వ్యవహరించిందని, అవసరానికి మించి భూములు కట్టబెట్టారని, మా ప్రభుత్వం భూ కేటాయింపును తగ్గించిందని పరిశ్రమల శాఖా మంత్రి, వ్యవసాయ శాఖా మంత్రి బుకాయిస్తున్నారు. దివీస్ యాజమాన్యం కూడా 'జీరో డిశ్చార్జ్'తో పొల్యూషన్ లేకుండా చేస్తామని ప్రభుత్వానికి హామీ ఇచ్చినట్లు చెబుతుంది. కానీ స్థానిక ఎంఎల్ఏ మాత్రం కంపెనీ యాజమాన్యం మాతో వేరుగా చెబుతుందని, సిఎంతో మాట్లాడితే స్థానిక అధికారులతో మాట్లాడమని చెబుతున్నారు. ఏ ఒక్కరి మధ్య పొంతన లేకుండా ఉంది.

ప్రజల అభ్యంతరాలు, సందేహాలు నివృత్తి జరిగేవరకూ దివీస్ ఒక్క ఇటుక కూడా కదపకూడదని పరిశ్రమల మంత్రి ఆదేశించారు. కానీ ఇక్కడ ప్రజలు కోరుకుంటుంది సందేహాల నివృత్తి కాదు. దాని శాశ్వతంగా ఇక్కడ నుండి తరలించడం. స్వాధీనం చేసుకున్న భూములన్నింటినీ తిరిగి ఇచ్చేయడం. అంతే కాకుండా ఈ ప్రాంతాన్ని అక్వా జోన్‌గా ప్రకటించి హేచరీల నిర్వహణకు, రొయ్యల సాగుకు, మత్స్య సంపదకు ఇబ్బందిలేని, కాలుష్య రహిత ప్రాంతంగా మార్చాలని 'దివీస్ వ్యతిరేక పోరాట సమితి' డిమాండ్ చేస్తుంది. ఇప్పటికైనా ఆనాడు చెప్పినట్లుగా దివీస్‌ను బంగాళా ఖాతంలో కలపాలని ప్రభావిత గ్రామాల ప్రజలు కోరుతున్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం అందుకు ఉపక్రమించాలి. సిఆర్‌జెడ్ చట్టాన్ని అమలు చేయాలి.

(రచయిత ఎఐకెఎంఎస్ కార్యకర్త) వీ

నాగళ్ల వెంకట దుర్గాప్రసాద్ మృతి

సాంస్కృతిక సాహిత్య సంస్థ ప్రజ్వలిత వ్యవస్థాపక అధ్యక్షులు నాగళ్ల వెంకట దుర్గాప్రసాద్(56) మరణించారు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో విజయవాడలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ జనవరి 13న రాత్రి మరణించారు. పట్టణ రంగస్థల కళాకారుల సంఘం అధ్యక్షునిగా పనిచేసిన ఆయన 2014లో ప్రజ్వలిత సామాజిక, సాంస్కృతిక సాహితీ సంస్థను స్థాపించారు. దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన కవులు, కళాకారుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలు సంస్థ ఆధ్వర్యాన నిర్వహించి, వారి జీవిత విశేషాలను ప్రజలకు తెలియజేశారు. భట్టుమూర్తి, రామరాజ భూషణుడు, ప్రఖ్య శ్రీరామమూర్తి, ఆశుకవి మాదవ పెద్ది బుచ్చి సుందరరామశాస్త్రి, డాక్టర్ వాసిరెడ్డి సీతాదేవి, త్రిపురనేని రామస్వామి చౌదరి, మధుర కవి నూతక్కి అబ్రహాం వంటి వారి గురించి పునరావలోకనం కోసం కృషి చేశారు. తంజావూరుకు చెందిన దక్షణ మండల సాంస్కృతిక కేంద్రం సహకారంతో ప్రజ్వలిత ఆధ్వర్యంలో 'ఆక్టేవ్' పేరుతో ఈశాన్య రాష్ట్రాల కళాకారుల సంప్రదాయ నృత్యాలను పట్టణానికి పరిచయం చేశారు.

వధ్యశిలపై విద్యారంగం

***పాలకులు ప్రైవేట్ విద్యారంగాన్ని ప్రోత్సహిస్తూ, ప్రభుత్వ విద్యారంగాన్ని బలహీనం చేస్తూ పేద, బడుగు వర్గాలకు విద్య అందకుండా ప్రజా వ్యతిరేక విధానాలను రూపొందిస్తున్నారని అంటున్నారు* ఎం. రఘుశంకర్ రెడ్డి**

తెలంగాణ రాష్ట్రంలో పుట్టిన ప్రతి బిడ్డకు అంతర్జాతీయ స్థాయిలో పోటీపడగల రీతిలో ఉన్నతమైన, నాణ్యమైన విద్యనందించడమే తమ ధ్యేయమని తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. అందులో భాగంగానే కేజి నుండి పిజి వరకు ఉచిత నిర్బంధ విద్యనందిస్తానని తమ మేనిఫెస్టోలో టిఆర్ఎస్ పార్టీ ప్రకటించింది. మరో అడుగు ముందుకేసి ముఖ్యమంత్రి కెసిఆర్ కామన్ స్కూల్ నా కల అని తెలిపారు. దీనికి విద్యాభిమానులు, మేధావులంతా హర్షించారు. కాని ఆరు సంవత్సరాలు గడిచినా విద్యారంగంపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టలేదు. కనీసం సమగ్రంగా ఒక్క సమీక్ష కూడా జరగలేదు. ప్రభుత్వ ప్రాధాన్యతల్లో విద్యారంగం లేకపోవడం విచారకరం. విద్య చారిత్రకంగా ఒక సామాజిక, సాంస్కృతిక ప్రక్రియ. సమాజపు విశాల, ఉమ్మడి ప్రయోజనాల కోసం బాల బాలికల్లోనూ, యువతి యువకుల్లోనూ సృజనాత్మకమైన, మానవీయమైన శక్తులను మేల్కొలుపుతుందని అందరికి తెలిసిన విషయమే. అయినా ప్రభుత్వం ప్రభుత్వ విద్యపట్ల పట్టింపు చూపడం లేదు. సీమాంధ్ర పాలకులు విద్యను ధ్వంసం చేశారని వివక్ష పాటించారని ఆరోపించాం. సమాన విద్య అందించలేదని, నిధులు, నియామకాలు సరిపడనంత చేయలేదన్నాం. ఆ కారణంగానే దేశ సగటు అక్షరాస్యత 74 శాతం అయితే తెలంగాణలో 66.54 శాతం ఉంది. దేశ స్థాయిలో తెలంగాణ 32వ స్థానంలో ఉంది.

ఈనాడు రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగం నిధులలేమితో, బోధనా సిబ్బంది ఖాళీలతో, మౌలిక వసతుల కొరతతో పర్యవేక్షణ వ్యవస్థ కుంటుపడి ప్రాథమిక స్థాయి నుండి విశ్వవిద్యాలయ స్థాయి వరకు విద్యావ్యవస్థ కునారిల్లుతుంది. ప్రైవేట్, కార్పొరేట్‌ను అదుపుచేసి పబ్లిక్ ఫండెడ్ విద్యాసంస్థలను పటిష్టంగా నిర్వహిస్తామన్నారు. రాష్ట్రంలో నేడు ఉన్న 25,966 ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్ని పట్టించుకోవడం లేదు. ఏటేటా బడ్జెట్‌లో నిధులు తగ్గిస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో చివరి బడ్జెట్ 2013-14లో 14 శాతం విద్యకు కేటాయిస్తే, తెలంగాణ ఏర్పడిన తర్వాత తొలి బడ్జెట్ 2014-15లో కుదిస్తూ 10.88 శాతం కేటాయించారు. ప్రతి సంవత్సరం తగ్గిస్తూ ప్రస్తుతం 2020-21లో 6.6 శాతం నిధులను అత్యల్పంగా కేటాయించారు. గత సంవత్సరం రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన వార్షిక నివేదికలో దేశం మొత్తంలో విద్యా వైద్యంపై అత్యల్పంగా ఖర్చుచేస్తున్న రాష్ట్రాలలో తెలంగాణ మొదటి స్థానంలో ఉందని తెలిపింది. పాఠశాల విద్యలో 67 శాతం ప్రాథమిక పాఠశాలలు సింగిల్, డబుల్ టీచర్లతో నడుస్తున్నాయి. 56 శాతం రెండు గదులలో నిర్వహింపబడుతున్నాయి. 12 వేల పాఠశాలలకు ఆటస్థలం లేదు, 6,874 పాఠశాలలకు తాగునీరు, 7 వేల పాఠశాలలకు మరుగుదొడ్లు లేవు. 10 వేలకు పైగా పాఠశాలల్లో వంటగదులు లేవు. 2,145 పాఠశాలల్లో విద్యుత్ సౌకర్యం లేదు. అలాగే పాఠశాలల్లో సుమారుగా 24 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గత 6 సంవత్సరాలలో కేవలం ఒక్కసారి మాత్రం టి.ఆర్.టి. ద్వారా 8,972 పోస్టులు అభ్యర్థుల ఆందోళనల మధ్య దఫదఫాలుగా భర్తీ చేశారు. ప్రతినెల వందలాదిగా టీచర్లు ఉద్యోగ విరమణ చెందుతున్నారు. వేలాది ఖాళీల కారణంగానే గత సంవత్సరంలో 16,781 విద్యావాలంటీర్లను నియమించారు. పాఠశాలల్లో విషయ బోధకులు, ప్రధానోపాధ్యాయులు, పర్యవేక్షణాధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ కారణంగా పర్యవేక్షణ కుంటుపడి విద్యా ప్రమాణాలపై ప్రభావం పడుతుంది.

ఇటీవల నీతి ఆయోగ్ దేశంలోని 20 రాష్ట్రాలలో నిర్వహించిన 'స్కూల్ ఎడ్యుకేషన్ క్వాలిటీ ఇండెక్స్ ర్యాంకింగ్స్'లో తెలంగాణ 14వ స్థానంలో ఉంది. పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ నాల్గవ స్థానంలో ఉంది. రాష్ట్రంలో 7 వేల స్కూల్ అసిస్టెంట్ ఖాళీలు, మరో 10,479 పండిట్, పి.ఇ.టి. అప్‌గ్రేడెడ్ ఖాళీలు, 2800 గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల పోస్టులు ఖాళీలు ఉన్నాయి. అలాగే 592 మండలాలలో 571 మండల విద్యాధికారి పోస్టులు ఖాళీలుగా ఉన్నాయి. ఇందులో కొత్త మండలాలకు 48 ఎం.ఇ.ఓ. పోస్టులు మంజూరు కావలసి ఉంది. ఇవన్నీ పదోన్నతుల ద్వారా భర్తీ కావాలి. కాని రాష్ట్రంలో ఎంఇఓలు గత 14 సంవత్సరాలుగా, ఇతర పోస్టులకు గత ఆరు సంవత్సరాలుగా పదోన్నతులు ఇవ్వబడలేదు. ఉమ్మడి రూల్స్ సమస్య, కోర్టు కేసులు కారణమైనప్పటికీ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రయత్నించలేదు. పొరుగున ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చొరవతో, సమన్వయంతో రెండు సంవత్సరాల క్రితమే ఖాళీలు పదోన్నతుల ద్వారా భర్తీ చేసుకున్నారు. రాష్ట్రంలో 56 ఉప విద్యాధికారి పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జిల్లాల పునర్విభజన జరిగిన తర్వాత 33 జిల్లాలు ఏర్పడితే కేవలం 12 జిల్లాలకే రెగ్యులర్ డి.ఇ.ఓ. పోస్టులున్నాయి. అందులో ఏడు జిల్లాలకే రెగ్యులర్ డి.ఇ.ఓ.లు పనిచేస్తున్నారు. ఇంకా 21 జిల్లాలకు డిఇఓ పోస్టులే మంజూరి కాలేదు. నాలుగేళ్లుగా ఇంచార్జీల పాలనే సాగుతుంది. అలాగే డైట్ లెక్చరర్లు 206 పోస్టులకు గాను 187 ఖాళీలుండగా కేవలం 19 మంది మాత్రమే పనిచేస్తున్నారు. సీనియర్ లెక్చరర్లు 70 పోస్టులకు గాను 63 ఖాళీలు ఉన్నాయి. బి.ఇడి. లెక్చరర్లు 107 పోస్టులకు గాను 96 ఖాళీలు ఉండగా కేవలం 11 మంది పనిచేస్తున్నారు. ఎస్.సి.ఇ.ఆర్.టి. ప్రొఫెసర్లు 32 పోస్టులకు గాను 29 ఖాళీలున్నాయి. ఈ పోస్టులన్ని పదోన్నతుల ద్వారా భర్తీ కావాలి. ఉపాధ్యాయ శిక్షణ, విద్యా పరిశోధనకు సంబంధించిన పోస్టులన్నీ ఖాళీగా ఉండడం విద్యారంగం దుర్బలత్వాన్ని తెలుపుతుంది.

బోధనా సిబ్బంది 30, 35 సంవత్సరాల సేవాకాలం పూర్తి చేసి, అన్ని అర్హతలుండి ఎలాంటి పదోన్నతులు లేకుండా తీవ్రవేదనతో, నైరాశ్యంతో ఉద్యోగవిరమణ చెందుతున్నారు.

ప్రభుత్వం ప్రధాన స్రవంతి పాఠశాలల పట్ల బహుముఖ నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నది. రాజ్యాంగం కల్పించిన సమానత్వ భావనకు భిన్నంగా కులాల పేరిట ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ గురుకులాలు ఏర్పాటు చేస్తూ వాటిని ప్రత్యేక దృష్టితో చూస్తూ ఇవి కెజి టు పిజిలో భాగమని తెల్పుతుంది. గత ఆరేండ్లలో 613 కొత్త గురుకులాలు ఏర్పరచి మొత్తం 900 వరకు నిర్వహిస్తున్నది. ఇందులో సుమారుగా మూడున్నర లక్షల మంది విద్యార్థులు నమోదైనారు. ఒక్కో విద్యార్థిపై సాలీనా 1.32 లక్షల రూపాయలు వెచ్చిస్తున్నది. సకల సౌకర్యాలు కల్పిస్తూ రెగ్యులర్‌గా ఉపాధ్యాయుల నియమిస్తూ, ఎంట్రెన్స్ ద్వారా విద్యార్థులను ఎంపిక చేసుకొని నాణ్యమైన విద్యను అందిస్తున్నారు, మంచి ఫలితాలు సాధిస్తున్నారు. కాని గ్రామీణ, పట్టణ పేదవర్గాల బిడ్డలు చదువుకునే ప్రభుత్వ పంచాయతీరాజ్ పాఠశాలల పట్ల ప్రభుత్వం సవతి తల్లి ప్రేమను ప్రదర్శిస్తున్నది. ఇక్కడ 24 లక్షల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అనేక కొరతల కారణంగా సమాన విద్యను, నాణ్యమైన విద్యను అందించలేని దుస్థితి ఏర్పడుతుంది. ఒకే ప్రభుత్వంలో కొనసాగే భిన్నయాజమాన్యాల మధ్య ఈ వివక్షత వాంఛనీయమా?

అలాగే ప్రైవేట్, కార్పొరేటు పాఠశాలల పట్ల ప్రభుత్వం ఉదారంగా ఉంటుంది. వాటిపై విద్యాధికారుల నియంత్రణ లేదు. తెలంగాణ ఏర్పడితే పొలిమేరలు దాటి తన్ని తరుముతామన్న శ్రీచైతన్య, నారాయణ విద్యా సంస్థలు మారుమూల మండలాలకు విస్తరించాయి. జి.ఓ. నెం.1 నిర్వీర్యం చేస్తూ ప్రైవేట్ యాజమాన్యాల పట్ల ఉదారంగా, ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. వారు వసూలు చేసే ఫీజుల పట్ల నియంత్రణ లేదు. కోవిడ్–19 సందర్భంలో జి.ఓ. 45, 46లు విడుదల చేసి ఫీజులు పెంచరాదని ఆదేశించినా పట్టించుకున్న వారు లేరు. ప్రైవేట్ ఉపాధ్యాయులకు జీతం చెల్లింపులు లేవు. ప్రైవేట్ స్కూళ్ల విశృంఖల విస్తరణవల్ల, ఆంగ్ల మాధ్యమంపై మమకారంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గింది. దీన్ని అనుకూలంగా తీసుకున్న ప్రభుత్వం పాఠశాలల విలీనాలు, మూసివేతలు, హేతుబద్ధీకరణ విధానానికి ఉపక్రమిస్తుంది. గత కొంతకాలంగా అప్రకటితంగానే 2000 పాఠశాలలు మూసివేతకు గురైనాయి. రాబోయే కాలంలో కన్సాలిడేషన్ ఆఫ్ స్కూల్ పేరిట, రేషనలైజేషన్ పేరిట ప్రభుత్వ పాఠశాలల కుదింపునకు రంగం సిద్ధం చేస్తున్నది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వ పాఠశాలలపై, టీచర్లపై అనుచిత ప్రచారాలు చేస్తూ ప్రజల విశ్వాసం పోయేలా చేస్తున్నారు. ఇది తీవ్ర గర్హనీయం.

అలాగే మరోవైపు ఎయిడెడ్ విద్యారంగాన్ని, ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలను, విశ్వవిద్యాలయాలను కూడా నిర్లక్ష్యం చేయడం జరుగుతుంది. రాష్ట్రంలోని 404 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 5395 అధ్యాపక పోస్టులుండగా ప్రస్తుతం 4055 ఖాళీలతో 1340 మంది మాత్రమే పనిచేస్తున్నారు. అలాగే 123 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 4100 అధ్యాపక పోస్టులుండగా 1300 మంది పనిచేస్తుండగా 2800 ఖాళీలున్నాయి. వివిధ రకాల కోర్సులతో విలసిల్లాల్సిన రాష్ట్ర విశ్వవిద్యాలయాలు బోధకులు లేక బోరుమంటున్నాయి. పరిశోధనలకు పెద్దపీట వేస్తూ పరుగులెత్తాల్సిన యూనివర్సిటీలు ఆచార్యుల జాడలేక ఆగమాగం అవుతున్నాయి.

రాష్ట్రంలో 11 విశ్వవిద్యాలయాలలో పదింటికి ఉపకులపతులు లేక, జెఎన్ఎఫ్ఎయు. మినహా అన్నింటిని నడిపిస్తుంది ఐఎఎస్ అధికారులే. అన్ని విశ్వవిద్యాలయాల్లో మొత్తం 2766 ప్రొఫెసర్ పోస్టుల్లో పనిచేస్తున్నవారు కేవలం 1026 మాత్రమే. 1740 పోస్టులు ఖాళీ ఉన్నాయి. ఉదాహరణకు ప్రతిష్టాత్మక ఉస్మానియా యూనివర్సిటిలో 1267 ప్రొఫెసర్ పోస్టులుంటే కేవలం 451 మంది మాత్రమే పనిచేస్తున్నారు. రిక్రూట్‌మెంట్ లేక రిటైర్ అవుతుండడంతో మరో మూడు నాలుగేండ్లలో అన్ని ఖాళీ పోస్టులే దర్శనమిస్తాయి. కాంట్రాక్టు, గెస్ట్, అవర్‌లీ లెక్చరర్స్ ద్వారా నెట్టుకొస్తున్నారు. ప్రభుత్వం విశ్వవిద్యాలయాలను నిర్వీర్యం చేస్తూ మరోవైపు 5 ప్రైవేట్ విశ్వవిద్యాలయాలకు అనుమతులిచ్చింది. మరో కొద్ది రోజులలో జాతీయ విద్యావిధానం 2020లో భాగంగా విదేశీ విశ్వవిద్యాలయాలు కూడా రాబోతున్నాయి.

ఈ విధంగా ప్రాథమిక స్థాయి నుండి విశ్వవిద్యాలయ స్థాయి వరకు ప్రభుత్వ విద్యారంగాన్ని బలహీనం చేస్తున్నారు. ప్రభుత్వ విద్యను పతనం చేయడం చాలా అనుచితం. ప్రైవేట్, కార్పొరేట్ విద్యకు పెద్దపీట వేయడం ప్రమాదకరం. దీని ద్వారా పేదవర్గాల బిడ్డలకు విద్య దూరం చేయబడి సామాజిక అసమానతలు మరింత పెరిగే అవకాశం ఉంది. ఫలితంగా రాజ్యాంగ సమానత్వ, సామాజిక న్యాయవిలువలు మృగ్యమవుతాయి. దాని ద్వారా సామాజిక సంక్షోభం ఏర్పడే ప్రమాదం ఉంది. అందుకే ప్రభుత్వ విద్యను తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ప్రకటించినట్టుగా కెజి నుండి పిజి వరకు ఉచితంగా, నాణ్యంగా అందరికి అందించడం ప్రభుత్వ కర్తవ్యం.

(రచయిత తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు, డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్) వీ

బత్తుల పున్నయ్య స్మృతి

దళిత ఉద్యమకారుడు, రచయిత, బత్తుల పున్నయ్య జనవరి 15న మరణించారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా మద్దిపాడు పున్నయ్య స్వగ్రామం. ఉన్నత చదువులు చదివిన పున్నయ్య కారంచేడు దళిత ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొన్నారు. 'ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ' వ్యవస్థాపక రాష్ట్ర నాయకుల్లో ఆయన ఒకరు. తెలంగాణ ప్రాంతంలో ఎక్కువగా పనిచేశారు. పనిచేసిన ప్రతిచోటా దళితులతో మమేకం అయ్యారు. కుల సమస్య మీద పనిచేశారు. అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని బోధించారు. దళితుల సమస్యల పరిష్కారం కోసం ప్రజలతో కలిసి పోరాడారు. సభలు, సమావేశాలు, ధర్నాలు చేశారు. ప్రజల పట్ల నిబద్ధతతో ఎంతో నిజాయితీగా పనిచేశారు. కుల మత బేధాలు చూడకుండా ఎందరికో ఉద్యోగాలు ఇచ్చి బ్రతుకు భద్రత కల్పించిన గొప్ప వ్యక్తి. దళిత బాహుజనులకు రాజ్యాధికారం కోసం ఎంతో కృషి చేసారు. "దళిత బాహుజనులకు రాజ్యాధికారం" అనే పుస్తకాన్ని రచించారు.

ఆంధ్రప్రదేశ్‌లో దేవాలయాలపై దాడులు

రాష్ట్రంలో రాజకీయ కుల కుమ్ములాటలతో ప్రజల జీవనం అస్తవ్యస్తమౌతుంటే మత విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం జరుగుతోందనీ, ఇది అన్ని రాజకీయ పార్టీలు కలిసి చేస్తున్న పన్నాగమనీ అంటున్నారు **చిమ్మె. జాన్ బర్నబాస్**

గత కొన్ని మాసాలుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అనేక చోట్ల హిందూ దేవాలయాలపై దాడులు చేస్తూ, అందులోని దేవతా విగ్రహాలను ధ్వంసం చేస్తూ రాష్ట్రంలో పలుచోట్ల హింసాత్మక చర్యలకు పాల్పడడం వెనుక ఎవరున్నారనే విషయం పక్కన పెడితే, రాష్ట్రంలోని పోలీస్ శాఖ వైఫల్యం స్పష్టంగా కనబడుతున్నది. అంతే కాకుండా రాష్ట్రంలోని కేబినెట్ మంత్రులు పలు పలు విధాలుగా వ్యాఖ్యానించడం, హిందూ మతానికి చెందిన వారి మనోభావాలను రెచ్చగొట్టే విధంగా ప్రకటనలు చేయడం వలన అధికార పార్టీలోని వారే కొంత మంది వీటిని ప్రోత్సహిస్తున్నారనే అనుమానం కలుగడమే కాకుండా, హిందూ మతానికి చెందిన సంస్థలను, వాటికి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో మద్దతునిస్తున్న అన్ని రాజకీయ పార్టీలను ఒక విధంగా ఆందోళనా కార్యక్రమాలు చేయడానికి ఒక పని కల్పించిన వారయ్యారు. రాష్ట్రంలో ఇదొక పెద్ద చర్చనీయాంశంగా మార్చారు.

అంతే కాకుండా ప్రధానమైన ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ఘోరంగా వైఫల్యం చెందిన కేంద్రంలో ఉన్న భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం, రాష్ట్రంలోని వై.ఎస్.ఆర్. పార్టీ ప్రభుత్వం రెండూ ఏదో ఒక విధంగా ఈ దాడులను ప్రోత్సహిస్తున్నాయి. మరోవైపు ఖండిస్తున్నట్లు ప్రకటనలు గుప్పిస్తూ ఆందోళనా కార్యక్రమాలు చేబడుతున్నాయి. ఇది పూర్తిగా రెండు పార్టీల ద్వంద్వ వైఖరికి నిదర్శనం. అంతే కాకుండా సామాన్య ప్రజలను రెచ్చగొడుతూ, వారిలో మత విద్వేషాలు వ్యాపింపజేస్తూ మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్నారు.

వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ ఏదో క్రైస్తవ సమాజాన్నంతటినీ ఉద్ధరిస్తున్నట్లూ, రాష్ట్రంలో ఆ పార్టీ అధికారంలో ఉన్నది కాబట్టి క్రైస్తవులు ఆ పార్టీకి బాసటగా ఉన్నట్లు భావిస్తూ క్రైస్తవులపై భారతీయ జనతా పార్టీ నాయకులు దుమ్మెత్తి పోస్తున్నారు. వాస్తవానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దేవతా విగ్రహాలను ధ్వంసం చేస్తున్న సంఘటనల్లో వై.ఎస్.ఆర్. పార్టీ కార్యకర్తల ప్రమేయం ఉందనేది బహిరంగ రహస్యమే అయినప్పటికీ, రాష్ట్ర డిజిపి గౌతమ్ సవాంగ్ పత్రికా సమావేశం ఏర్పాటు చేస్తూ 21 కేసుల్లో 80 మందిని అరెస్ట్ చేసినట్లు ప్రకటించారు. వాస్తవానికి వారిలో చాలా మంది సోషల్ మీడియాలో ఇలాంటి సంఘటనలు జరగడం సమాజానికి మంచిది కాదనీ, భారత రాజ్యాంగం ప్రకారం అన్ని మతాలు సమానం అంటూ ప్రకటించినవారే. అంతే కాకుండా వారిలో చాలా మంది తెలుగుదేశం పార్టీకి చెందిన సోషల్ మీడియా విభాగానికి చెందినవారే. రాష్ట్ర డిజిపి మొదట ఈ దేవాలయాలపై దాడుల వెనుక, రామతీర్థంలో రాముని తల నరికి సమీపంలో చెరువులో పారవేయడం వెనుక కుట్రకోణం దాగి ఉందని చెప్పిన వారు; దానిపై స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం (ఎస్ఐటి) దర్యాప్తు పూర్తికాక మునుపే రాష్ట్ర డిజిపి గౌతమ్ సవాంగ్ పత్రికా ప్రకటన చేయడం వెనుక రాష్ట్ర ప్రభుత్వ ఒత్తిడి ఉన్నదనేది స్పష్టంగా అర్థమవుతుంది. ప్రజలను తప్పుదోవ పట్టించడానికి రాష్ట్ర ప్రభుత్వం చేసిన కుట్రగా దీనిని భావించవచ్చు. రాష్ట్ర డిజిపి మొత్తం ఘటనలన్నింటిపైన విచారణ ప్రక్రియ పూర్తికాక ముందే అన్నీ తానై ప్రకటించారు. తూర్పు గోదావరి జిల్లా అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామి రథం (తేరు) దగ్ధంతో మొదలై, విజయవాడ కనకదుర్గమ్మ రథంలోని 3 సింహాల (వెండి) దొంగతనం కేసు వరకూ మొదట పిచివాళ్ల పని అంటూ, తర్వాత దొంగలంటూ వివిధ రకాలుగా వ్యాఖ్యానిస్తూ వచ్చిన అధికార పార్టీ మంత్రుల, నాయకుల వ్యాఖ్యలను డిజిపి ఏమీ పట్టించుకోలేదు. అంతే కాకుండా విజయనగరం జిల్లా రామతీర్థం అనే కొండపై ఉన్న సీతారాముల విగ్రహాల ధ్వంసంలోని నిందితులను అరెస్ట్ చేయడంలో విఫలమైన ప్రభుత్వం చివరికి ఒక క్రైస్తవ పాస్టర్ ప్రవీణ్ చక్రవర్తి అనే వ్యక్తిని మొత్తం ఈ ఘటనలన్నింటినీ చేశాడు లేదా చేయించాడు అనే విషయాన్ని పత్రికలకు వెల్లడించారు.

'హిందూ దేవాలయాలపై దాడులు ప్రభుత్వాన్ని అస్థిరపరచాలనే కుట్రలో భాగమే'నంటూ అందుకు మీడియా కూడా కొంత సహకరిస్తున్న దంటూ చెప్పకనే చెప్పారు. రాష్ట్రంలో దేవాలయాలకు రక్షణ లేదన్న ప్రచారం కూడా కొన్ని రాజకీయ పార్టీల కుట్రే అంటూ రాష్ట్ర డిజిపి గౌతమ్ సవాంగ్ ప్రకటించారు.

పాస్టర్ ప్రవీణ్ ప్రకాశ్ అనే వ్యక్తి వెనుక ఎవరున్నారు? అతనికి ఎవరెవరు సహకరించారు? అతను ఏ రాజకీయ పార్టీ అండతో ఇవన్నీ చేస్తున్నాడనే విషయం రాష్ట్ర డిజిపి వెల్లడించలేదు. తూర్పు గోదావరి జిల్లా కాకినాడకు చెందిన ప్రవీణ్ చక్రవర్తి, తన ఆధీనంలో 3,642 మంది పాస్టర్లు పనిచేస్తున్నారనీ, ఇప్పటికే రాష్ట్రంలో 699 హిందూ గ్రామాలను క్రైస్తవ గ్రామాలుగా మార్చివేశామనీ, భవిష్యత్తులో మా టార్గెట్‌లో మరిన్ని గ్రామాలు క్రైస్తవంలోకి మార్చివేస్తామనీ బెంగుళూరుకు చెందిన 'గాసిప్' అనే యూ ట్యూబ్ ఛానల్‌కు ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ కూడా ఇచ్చారు. అంతే కాకుండా జనవరి 11న అమెరికాకు చెందిన ఒక క్రైస్తవ సంస్థ ప్రతినిధితో ఆన్‌లైన్‌లో మాట్లాడుతూ దేవుడి విగ్రహాలు ఫేక్, 'ఎన్నో విగ్రహాలు నా స్వహస్తాలతో ధ్వంసం చేశాను' అంటూ స్వయంగా వెల్లడించారు. ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతూ ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నది. ఇది రాష్ట్రంలో క్రైస్తవులు – హిందువుల మధ్య వైషమ్యాలను పెంచి, ప్రజలలో మత మౌఢ్యాలను పరివ్యాప్తం చేసి మారణ హోమాలకు దారితీసే పరిస్థితి దాపురిస్తుంది.

ఈ ప్రవీణ్ చక్రవర్తి అనే వ్యక్తిపై రాష్ట్ర పోలీసు యంత్రాంగం సుమోటాగా కేసు నమోదు చేయలేదు. గుంటూరుకు చెందిన సింగం వెంకటలక్ష్మీనారాయణ అనే వ్యక్తి ఫిర్యాదు చేయగా పోలీసులు విధిలేక కేసు నమోదు చేశారు. 'క్రీస్తు విలేజ్' పేరు మీద స్వంత ఛానల్‌ను నడుపుతున్న వ్యక్తి ఈ ప్రవీణ్ చర్కవర్తి. ఇతనిని అరెస్ట్ చేసే సమయంలో పోలీసులకు అతని ప్రైవేట్ గార్డ్‌లకు జరిగిన ఘర్షణలో పోలీసుల పైనే దాడులకు తెగబడ్డారు ఇతని ప్రైవేట్ సైన్యం. ఇతను స్వంత ప్రైవేట్ సైన్యాన్ని ఏర్పాటు చేసుకునే ఆర్థిక స్థోమత కలిగి ఉన్నాడంటే ఆర్థిక వనరులు ఎక్కడి నుండి సమాకూరుతున్నాయనేది కూడా ఆలోచించాల్సిన విషయం. ఒక క్రైస్తవ మత బోధకుడికి ప్రైవేట్ సైన్యం అవసరమా? ప్రజలను మరింత భావ దారిద్ర్యంలో ఉంచుతూ తమ ఆర్థిక వనరులను సమకూర్చుకుంటూ, దేశ, విదేశాల నుంచి నిధులను సమీకరించుకుంటూ మత ప్రచారం నిర్వహించే వ్యక్తి ఇప్పుడు హిందూ మతోన్మాదాన్ని రెచ్చగొట్టే పనిలో నిమగ్నమయ్యాడు. ఇతడు చేసే చర్యల వల్ల అటు క్రైస్తవులు ఇటు హిందువులు రెండు వర్గాలుగా విడిపోయి ఘర్షణలకు దిగే పరిస్థితి నెలకొనింది. ఈ పరిస్థితికి రాష్ట్రంలో అధికారంలో ఉన్న వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ నాయకుల అండదండలే కారణం. రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కన్నబాబు ఇతని వెనుక వెన్నుదన్నుగా (స్థానికంగా) ఉన్నాడనేది బహిరంగ రహస్యమే.

మొత్తం మీద కాకినాడ కేంద్రంగా చేసుకొని మదర్ థెరిస్సా పేరుమీద పాఠశాలలు, అనాథ పిల్లల ఆశ్రమాలు నిర్వహిస్తున్నాడు. సామర్లకోట మండలం ఉండూరులో 15 ఎకరాలలో ఒక పెద్ద విద్యా సంస్థ ఇతని ఆధీనంలో ఉంది. మొత్తం మీద ఇతనికి రు. 1,000 కోట్ల ఆస్తి ఉండవచ్చునని అంచనా. 50 మంది వరకూ ప్రైవేట్ గార్డ్‌లకు ఒక్కొక్కరి రు. 10 – 20 వేల వరకు చెల్లిస్తున్నట్లు సమాచారం. దాదాపు 16 కార్లు స్వంతంగా ఉన్నట్లు తెలుస్తుంది. విలాసవంతమైన జీవితం గడుపుతూ క్రైస్తవ మత ప్రచారం నిర్వహించే వ్యక్తి 'రామతీర్థం' లాంటి పుణ్యక్షేత్రపు కొన్ని వందల మెట్లు ఎక్కి రాముని విగ్రహాన్ని ధ్వంసం ఒక్కడే చేసి ఉంటాడా? అనేది ప్రశ్నార్థకమే. పోలీసులు ఎవరో ఒకరిని కేసులో ఇరికించాలనే నెపంతో ఇతన్ని తయారు చేశారా? లేదా అధికార పార్టీ నాయకులు ఇతన్ని నేరం ఒప్పుకోమని చెప్పి ఇతన్ని పోలీసులకు అప్పగించారా? అనేది భవిష్యత్తులో తెలుస్తుంది. ఇలాంటి వారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎంత మంది ఉన్నారనేది బయటకు రావలసి ఉంది.

రాష్ట్రంలో ఇప్పటికే హిందూ మతోన్మాద శక్తులన్నింటినీ ఒకేతాటిపైకి తెచ్చి తద్వారా పబ్బం గడుపుకోవాలని చూస్తున్న భారతీయ జనతా పార్టీకి ఇదొక అంశంగా మారి, దీనికి రాజకీయ రంగు పులిమి ఎలాగూ ప్రతిపక్ష పార్టీగా ఉన్న తెలుగుదేశం పార్టీ బలహీనపడింది కాబట్టి ఆ స్థానంలో బిజెపి నిలదొక్కుకొని, రాబోయే ఎన్నికలలో లబ్ధిపొందాలనేది బిజెపి నాయకుల ఆంతర్యం. ఇది ఎలాగూ ప్రజలకు అర్థమైంది. బిజెపి కేవలం మతోన్మాద చర్యలను ప్రోత్సహించడం ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రాజకీయం చేయదలచుకున్నది. (రాజకీయాలను హిందూకరణ చేసి తద్వారా హిందూయిజాన్ని మిలిటరీకరణ చేయాలనే గోల్వాల్కర్ సిద్ధాంతాన్ని పూర్తిగా ఒంటబట్టించుకొని ఇక్కడ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ ఎదగాలనే ప్రయత్నం చేస్తుంది. దీనికి పరోక్షంగా వై.ఎస్.ఆర్. గాంగ్రెస్ పార్టీ కూడా సహకరిస్తుంది.

ఇప్పటికే రాష్ట్రంలో పోలీసులు చేస్తున్న అక్రమ అరెస్టులు, శిరో ముండనాలు, మాస్క్‌లు లేకపోతే కొట్టి చంపడం, పోలీసుల వేధింపులు తలలేక ఆత్మహత్యలకు పాల్పడడం ఇక్కువైపోయాయి. పోలీసుల దమనకాండ ఒకవైపు సాగుతుండగానే మతోన్మాద చర్యలకు పురికొల్పుతూ ప్రజలను బలవంతంగా ఇందులోకి లాగే ప్రయత్నం చేస్తున్నది భారతీయ జనతా పార్టీ నాయకత్వం. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 'కులోన్మాదం' విశృంఖలతకు తోడు మతోన్మాదం జతయింది. వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో కేవలం 'రెడ్డి' కుల శక్తులకు మాత్రమే ఆర్థిక వనరులు సమకూరే విధంగా ప్రభుత్వంలో కీలకమైన పదవులన్నీ ఉన్నాయనేది సుస్పష్టం. అంతే కాకుండా ఢిల్లీలో జరుగుతున్న రైతల దీక్షలు, పోరాటాలు దక్షిణాది రాష్ట్రాలలో బలోపేతం కాకుండా తనకున్న మీడియా బలంతో బిజెపి నాయకత్వం ప్రజలను ఏదో ఒక రకంగా మభ్యపెడుతూ కాలం గడుపుతుంది.

రాష్ట్రంలో 'అమరావతి' రాజధాని కొనసాగాలనే రైతుల దీక్షలకు దిక్కూ దివానా లేదు. దాదాపు 400 రోజులు కావస్తున్నా పరిష్కారం దొరకడం లేదు. ఇటు రాష్ట్ర ప్రభుత్వం, అటు కేంద్ర ప్రభుత్వం రెండూ తమలను మోసం చేశాయనే కోపంతో అక్కడి 29 గ్రామాల ప్రజలు రగిలిపోతున్నారు. దాదాపు 100 మంది రైతులు వివిధ కారణాలతో ప్రాణాలు విడిచారు. ముఖ్యంగా మహిళలు ముందుండి పోరాడుతున్నారు. ఈ సమస్యలన్నింటినీ పక్కదారి పట్టించడానికి వైకాపా ప్రభుత్వం 'హిందూ – క్రైస్తవ' వివాదాలను తెరపైకి తెస్తుంది. దీనిని పోలీసుల ద్వారా ప్రభుత్వమే పరోక్షంగా ఒకవైపు మద్దతునిస్తూ, మరోవైపు ఆందోళనలను అణచివేస్తున్నట్లు నటన చేస్తున్నది. కేంద్ర ప్రభుత్వం మద్దతుతో భారతీయ జనతా పార్టీ నేతలు రాష్ట్ర ప్రభుత్వాధినేతలను సిబిఐ కేసుల పేరుమీద లేదా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) దాడుల పేరుమీద బెదిరింపులకు గురిచేస్తూ, భవిష్యత్తులో జరుగబోయే ఎన్నికలలో బిజెపి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నిలదొక్కుకోవాలని ప్రయత్నిస్తున్నది. ఈ ప్రయత్నాలను ప్రజాస్వామ్యవాదులంతా గర్హించాలి, తిప్పికొట్టాలి. 'బ్రాహ్మణీయ హిందూయిజమంటే ఫాసిజమే' అన్న డా. అంబేద్కర్ ఆలోచనలు భారతీయ జనతా పార్టీని వ్యతిరేకించే శక్తులన్నింటినీ ఐక్యం చేయడానికి ఉపయోగపడాలి. ఏది ఏమైనప్పటికీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలు ఒకవైపు అగ్ర కులోన్మాదం మరోవైపు హిందూ మతోన్మాదంతో సతమత మవుతున్నారు. దీనిని వ్యతిరేకించే శక్తులన్నీ ఐక్యమయ్యే విధంగా 'విశాల ఐక్య సంఘటన' రాష్ట్రంలో ఏర్పడాలి. మొన్నటి ఎన్నికలలో బీహార్ రాష్ట్రంలో వామపక్షాల విశాల ఐక్య సంఘటన 12 సీట్లు సాధించడం ద్వారా సిపిఐ (ఎంఎల్) (లిబరేషన్) భారతీయ జనతా పార్టీకి గుణపాఠం చెప్పింది. కింది స్థాయి (గ్రామీణ స్థాయి) నుంచి పోరాడకుండా బిజెపి లాంటి శక్తులను ఎదుర్కోవడం కష్టమవుతుంది. ప్రజాస్వామిక స్ఫూర్తితో రాజ్యాంగ హక్కులను కాపాడుకోవడానికి ప్రధాన శత్రువుకు వ్యతిరేకంగా పోరాటం ఎక్కుపెట్టాలి. దానికి 'విశాల ఐక్య సంఘటన' మాత్రమే పరిష్కార మవుతుంది. మతోన్మాద శక్తులు బలపడితే రాజ్య వ్యవస్థ ప్రజాస్వామికానికి బదులు రాజరికానికీ, అనాగరికానికీ తద్వారా అరాచకం ప్రభలే అవకాశం లేకపోలేదు.

(రచయిత న్యాయవాది, ఒపిడిఆర్ రాష్ట్ర కమిటీ సభ్యులు) వీ

కార్మిక హక్కులపై కర్కశ దాడి

***కేంద్ర ప్రభుత్వం సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ విధానాలకు అనుగుణంగా సంస్కరణలను అమలు చేస్తూ కార్మికుల, ప్రజల సంక్షేమ బాధ్యతల నుంచి తప్పకుంటోందని అంటున్నారు* సంతోష్**

ప్రపంచంలో భారత్ అతిపెద్ద ప్రజాస్వామిక దేశమని గొప్పగా పాలకులు ఘోషిస్తారు. ప్రజాస్వామ్యమంటే ప్రజల సంక్షేమం కోసమే పాలన సాగవలసి ఉంటుంది. అయితే దేశంలో అత్యధికులుగా ఉండి దేశ ప్రజలందరికి కావల్సిన ఆహార, వస్తు ఉత్పత్తుల సృష్టికి మూలమైన రైతుల పట్ల, శ్రామికుల పట్ల, ప్రజానీకం పట్ల మనదేశ పార్లమెంటరీ ప్రాతినిధ్య ప్రజాస్వామ్య వ్యవస్థను నడుపుతున్న సంపన్న బూర్జువా, భూస్వామ్య వర్గాలు మాత్రం ఉద్దేశపూర్వకంగా అశేష ప్రజల దైనందిన అవసరాల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారు. సంపదలు సృష్టించే శ్రామికులను ఏమాత్రం ప్రాధాన్యత లేని వారిగా విస్మరిస్తున్నారు. ప్రత్యేకించి 1991 జూన్ నుంచి అమలులోకి వచ్చిన సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ఆర్థిక విధానాలు అమలుతో మన దేశ పాలకులు, పాలక వర్గాలు కార్మికుల పట్ల నిర్లక్ష్యం వహించే విధానాలను వేగంగా అమలు చేస్తున్నారు. దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న హక్కులను హరించి వేస్తున్నారు.

కరోనా సృష్టించిన సంక్షోభం కంటే మిన్నగా పాలకులు అమలు చేస్తున్న రాజకీయార్థిక విధానాలు ప్రజా జీవితాలను కకావికలం చేస్తున్నాయి. రైతులు, కార్మికులు తమ దుర్భర జీవన పరిస్థితుల గురించి ఎన్ని విజ్ఞప్తులు చేసినా, ఎన్ని ఆందోళనలు చేసినా పాలకుల చెవికెక్కడం లేదు. రాజ్యాంగ పరంగా వారికి చట్టబద్ధంగా సంక్రమించిన హక్కులు, సౌకర్యాలు సైతం పాలకులు అమానవీయంగా కాలరాచి వేస్తున్నారు. అయితే ఆశ్చర్యకరంగా కార్మికవర్గంపై ఎక్కుపెట్టిన దాడులనే పాలకులు 'కార్మిక సంస్కరణలు' పేరుతో నిస్సిగ్గుగా, ఎలాంటి భీతి లేకుండా దూకుడుగా కొనసాగిస్తున్నారు. నిజానికి కార్మిక చట్టాల సంస్కరణలు అంటే కార్మికులకు మరింత మేలు చేసే విధంగా ఉండాలి. కాని మోడీ ప్రభుత్వ సంస్కరణలు కార్మికులను వలసపాలన నాటి బానిసత్వానికి నెడుతుండడం అత్యంత గర్హనీయం, దారుణం. ఈ కోడ్‌లను నిశితంగా పరిశీలిస్తే కార్మికుల ప్రయోజనం శూన్యమని తేటతెల్లమవుతుంది. ప్రభుత్వం చెబుతున్న మాటలు పచ్చి బూటకమని విదితమవుతుంది.

వలసానంతర ఏడు దశాబ్దాలకు పైగా సాగిన స్వతంత్ర పాలనలో దేశం ఎంతో పురోగమించిందని పాలకులు బకాలాదుతున్నారు. నిజానికి, నానాటికి దిగజారుతున్న జీవన ప్రమాణాలతో శ్రామిక వర్గం దిక్కుతోచకున్నారు. బ్రిటిష్ వలస పాలన కాలంలో 1929లో ఏర్పాటు చేసిన మొదటి జాతీయ కార్మిక కమిషన్ సామాజిక భద్రత, సాంఘిక సంక్షేమం, వేతనాలు, సామాజిక బీమా, పారిశ్రామిక సంబంధాలు, సామూహిక బేరసారాలు వంటివి హామీ ఇచ్చింది. ఆ కమిషన్ నివేదిక ఆధారంగా కార్మికుల ప్రయోజనాల కనుగుణంగా అనేక చట్టాలు చేశారు. 1947 ఆగస్టులో అధికార మార్పిడి జరిగిన తర్వాత 1966 డిసెంబర్ 24న జస్టిస్ పి.బి. గజేంద్ర గడ్కర్ అధ్యక్షతన మొదటి జాతీయ కార్మిక కమిషన్ ఏర్పాటు చేశారు. ఆ కమిషన్ సంఘటిత, అసంఘటిత రంగాలలోని కార్మిక సమస్యలన్నింటిని పరిశీలించి 1969 ఆగస్టులో తన నివేదికను సమర్పించింది. పి.బి. గజేంద్ర గడ్కర్ సిఫార్స్ చేసిన ప్రధాన సూచన కనీస వేతనాన్ని మన పాలకులు సంవత్సరాలు గడిచినా అమలు చేయలేదు. రెగ్యులర్ కార్మికులకు వర్తించే సామాజిక భద్రత, ప్రమాద బీమా, ఆరోగ్యం వంటి హక్కులను అసంఘటిత రంగ కార్మికులకు వర్తింప చేయలేదు. 72 సంవత్సరాల తరువాత రెండవ జాతీయ కార్మిక కమిషన్ 1999 ఆగస్టు 15న ఏర్పాటు చేశారు. ఈ కమిటీ తన నివేదికను 2002 జూన్ 22న ప్రధాని వాజ్‌పేయికి అందజేసింది. కమిషన్ సిఫార్సులు చాలవరకు ప్రపంచీకరణ ఆర్థిక సంస్కరణల నేపథ్యంలో కార్మిక వర్గానికి వ్యతిరేకంగా, పరిశ్రమల యాజమాన్యాలకు అనుకూలంగా ఉన్నాయి. అలాగే ఆనాటికి ఉన్న 44 చట్టాలను రద్దుపరిచి నాలుగు కోడ్‌లుగా విభజించాలని సూచించింది.

కార్మిక హక్కులపై ప్రపంచీకరణ ప్రతికూల ప్రభావం

సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానంలో భాగంగా 1991 నుంచి అమలు చేస్తున్న సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ (ఎల్‌పిజి) సంస్కరణల ఫలితంగా ప్రభుత్వరంగ పరిశ్రమలు పునర్వ్యవస్థీకరణ, ప్రైవేటీకరణ, బహుళజాతి కంపెనీల ప్రవేశానికి స్వేచ్ఛ, కార్మిక సంక్షేమం అమలు విధానంలో మార్పులు, వేతనాల స్తంభన విధానం వంటి ప్రమాదకరమైన కార్మిక వ్యతిరేక నూతన ఆర్థిక విధానాలకు అంకురార్పణ జరిగింది. ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు ఆదేశాలకు అనుగుణంగా దేశ ఆర్థిక విధానాలలో కార్పొరేట్ దోపిడీ అనుకూల మార్పులకు పాలకులు పూనుకున్నారు. కాంగ్రెస్, బిజెపిలలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా కార్మికవర్గ ప్రయోజనాలను హరించే చట్టాలు రూపొందించే విషయంలో తోడు దొంగలుగా వ్యవహరించాయి. నిజానికి మనదేశ కార్మిక వర్గంలో కేవలం 7 శాతంగా ఉన్న సంఘటిత రంగంలోని కార్మికులకు మాత్రమే రాజ్యాంగం ప్రకారం చట్టబద్ధమైన హక్కులు, సౌకర్యాలు, ఉద్యోగ భద్రత లభిస్తుంది. కాగా వ్యవసాయ రంగంతో సహా మిగిలిన 93 శాతంగా ఉన్న అసంఘటిత, అనియత రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు హక్కులు, సౌకర్యాలు చట్టబద్ధంగానే నిరాకరిస్తున్నారు. ఈ కార్మిక వ్యతిరేక సంస్కరణలు అన్నీ ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థల నిర్దేశాల కనుగుణంగానే జరుగుతున్నాయనడంలో దాపరికమేమి లేదు.

మనదేశంలో సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ఆర్థిక విధానాలను

యుపిఏ పాలకులు ప్రారంభించి, కార్మిక చట్టాలను విడతలవారీగా సవరించే పేరున శ్రామిక వ్యతిరేక 'కార్మిక సంస్కరణ'లను అమలు చేస్తూ వచ్చారు. కాగా, వారి స్థానంలో అధికారానికి వచ్చిన ఎన్‌డిఏ పాలకులు సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ఆర్థిక విధానాలనే, ఆ కార్మిక సంస్కరణలనే మరింత దూకుడుగా, మొరటుగా అమలు చేస్తున్నారు. కార్మిక సంక్షేమం ఉమ్మడి జాబితాలో ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలతో, కార్మిక సంఘాలతో, ప్రతిపక్షాలతో చర్చించకుండానే ఏకపక్షంగా ఆర్థికాభివృద్ధిని సాధించే పేరిట, కార్మికుల న్యాయమైన ఆకాంక్షలను, మెరుగైన జీవితం గురించిన వారి కోర్కెలను, మెరుగైన పని పరిస్థితులను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తూ మనదేశంలో అమలులో ఉన్న 44 రకాల కార్మిక చట్టాలను నాలుగు నూతన కార్మిక కోడ్‌లుగా కుదించేందుకు ఎన్‌డిఎ పాలకులు పూనుకున్నారు. బిజెపి పాలిత రాష్ట్రాలైన రాజస్థాన్, ఝార్ఖండ్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రాలలో కార్మికుల చట్టబద్ధ హక్కులన్నింటినీ పూర్తిగా కాలరాచివేసే విధంగా చట్టాలకు ఇప్పటికే సవరణలు చేశారు.

ప్రపంచబ్యాంకు 2018 ఏప్రిల్‌లో విడుదల చేసిన ఓ పత్రంలో ఇలా పేర్కొంది. పెట్టుబడిదారుల కోర్కెలు, వెసులుబాటుల కనుగుణంగా కార్మికులు పనిచేయటానికి ప్రస్తుతం ఉనికిలో ఉన్న కార్మిక చట్టాలు అవరోధంగా ఉన్నాయి కనుక, ఆ చట్టాలన్నింటినీ రద్దు చేయవలసిందిగా అనేక అభివృద్ధి చెందుతున్న దేశాలకు ప్రపంచబ్యాంకు సలహా ఇచ్చింది. నూతన సాంకేతికత పరిజ్ఞానపు ఫలాలన్నీ పెట్టుబడిదారులకు పూర్తిగా కార్యరూపం దాల్చాలంటే ప్రస్తుత కార్మిక చట్టాలను రద్దు చేయాలన్నమాట. భారతదేశం చేపట్టిన కార్మిక చట్టాల సంస్కరణలను ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలు భారతదేశాన్ని ఆదర్శంగా తీసుకోవాలని, 'సంస్కరణ'లను అమలుచేయడంలో మనదేశ అనుభవాలను ఉపయోగించుకోవాలని ప్రపంచబ్యాంకు వారికి సలహా ఇస్తోంది. శాశ్వత లేదా స్థిర, రెగ్యులర్ ఉద్యోగుల స్థానంలో 'నియమిత కాల ఉద్యోగాల'(ఎఫ్‌టిఇ) విధానాలను అమలు చేయాలని కూడా ప్రపంచ బ్యాంకు సిఫార్సు చేస్తోంది. అలాగే, సామాజిక భద్రతా విధానాలు, కార్యక్రమాల స్థానంలో సామాజిక బీమా కార్యక్రమాలను అమలు చేయాల్సిందిగా ప్రపంచ బ్యాంకు సలహా ఇస్తోంది. కనీస వేతనాన్ని నిర్ణయించి నిర్ధారించే విధానాల స్థానంలో సార్వత్రిక కనీస వేతన వ్యవస్థను (సార్వత్రిక మూల ఆదాయం- యుబిఐ)ను అమలు చేయాలని కూడా ప్రపంచ బ్యాంకు సిఫార్సు చేస్తోంది. వీటన్నింటినీ సామాజిక భద్రతా పథకాలకు కాక, సామాజిక బీమా పథకాలకు అనుసంధానం చేయాలని చెప్తోంది.

పోరాటాల ఫలితమే కార్మిక హక్కులు

భారతదేశంలో నేడున్న కార్మిక చట్టాల్లో కార్మికులకు అనుకూలంగా మూడు ప్రధాన అంశాలున్నాయి. అవి 1. కార్మికులు యూనియన్ పెట్టుకోవడం 2. కార్మిక సంఘాలు యాజమాన్యంతో సంప్రదింపులు, చర్చలు జరపడం(బేరసారాలాడే హక్కు) 3. సమ్మె హక్కు. ఈ మూడు హక్కులను కూడా కాలరాయాలని బిజెపి ప్రభుత్వం నిర్ణయించింది. ఇది కార్మిక వర్గంపై ప్రత్యక్ష దాడి తప్ప మరొకటి కాదు. కార్మిక చట్టాల్లోనే కాకుండా భారత రాజ్యాంగంలో ప్రాథమిక హక్కుల్లో సంఘం పెట్టుకునే హక్కు భారత ప్రజలందరికీ ఉంది. దానికి అనుగుణంగానే బ్రిటిష్ ప్రభుత్వ కాలంలోనే 1926లో ట్రేడ్ యూనియన్ చట్టం వచ్చింది. పారిశ్రామిక వివాద చట్టం ప్రకారం యజమానితో బేరసారాలాడడానికి, సమ్మె హక్కుని అంగీకరిస్తూ స్వాతంత్ర్యానికి ముందే చట్టాలు వచ్చాయి. అయితే స్వాతంత్ర్యానికి ముందు, తర్వాత వచ్చిన చట్టాలన్నింటిని బిజెపి ప్రభుత్వం పెట్టుబడిదారులకు చుట్టాలుగా మారుస్తున్నది.

నేడున్న కార్మిక చట్టాలన్నీ కార్మికులు దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్నవే. ఏ ప్రభుత్వాలూ కార్మికులకు తమ దయా దాక్షిణ్యాలతో, అయాచితంగా ఇచ్చిన హక్కు ఒక్కటీ లేదు. కార్మికులు దేశవ్యాప్తంగా అనేక సమ్మెలు చేసిన తర్వాతే సమ్మె హక్కు చట్టం గావించబడింది. మనం జరుపుకునే మేడే 8 గంటల పని దినానికి చికాగో కార్మికుల వీరోచిత సమ్మె ప్రతీక. రోజుకు 8 గంటల పని దినం సాధించడానికి 1886 మే 4న చికాగో నగరంలోని హే మార్కెట్‌లో ప్రదర్శన జరుపుతున్న నలుగురు కార్మికులు ప్రభుత్వం జరిపించిన కాల్పుల్లో ప్రాణాలొడ్డారు. కార్మికుల హక్కుల కొరకు, భద్రత కోసం ప్రపంచ వ్యాప్తంగా వందలాది మంది కార్మికులు ప్రాణాలర్పించారు. కోట్లాది మంది కార్మికులు సమ్మెలు చేసిన ప్రతిఫలంగానే ప్రపంచవ్యాప్తంగా ఫ్యాక్టరీ చట్టం 8 గంటల పని దినం అమల్లోకి వచ్చింది.

మన దేశంలో కరోనా సంక్షోభాన్ని అడ్డం పెట్టుకొని అనేక రాష్ట్రాలు కార్మిక చట్టాలకు చిల్లులు పొడిచేందుకు ప్రయత్నించడం పట్ల అంతర్జాతీయ కార్మిక సంఘం (ఐఎల్‌ఓ) తీవ్ర అభ్యంతరాన్నీ, ఆవేదననీ వెలిబుచ్చింది. ఐఎల్‌ఓలో సభ్యదేశంగా భారతదేశం 47 తీర్మానాలను ఆమోదించడం ద్వారా కార్మికుల వేతనాలు, పనిపరిస్థితులు, పని గంటలు తదితర అనేక హక్కుల పరిరక్షణకు కట్టుబడాల్సి ఉంది. కార్మికులను యజమానుల దయాదాక్షిణ్యాలకు వదిలేయకుండా ప్రభుత్వ మధ్యవర్తిగా ఉంటుందన్న ప్రధానమైన ఒప్పందాన్ని కూడా భారతదేశం గౌరవించాల్సి ఉంది. కార్మికుల పక్షాన బలంగా ఉంటానని ఘనమైన ప్రమాణాలు చేసిన భారత్ ఇలా చరిత్రలో ఎన్నడూ లేనంత స్థాయిలో కీలకమైన కార్మిక చట్టాలను సైతం తుడిచిపెట్టేయడం ఐఎల్‌ఓకు ఆశ్చర్యం కలిగించింది. వివిధ రాష్ట్రాలు తీసుకున్న కార్మిక వ్యతిరేక నిర్ణయాలను ఐఎల్‌వో దృష్టికి సవివరంగా తెస్తూ, దాని తక్షణ జోక్యాన్ని అభ్యర్థిస్తూ దాదాపు పది ప్రధాన కార్మిక సంఘాలు విజ్ఞప్తి చేసిన నేపథ్యంలో, కార్మికుల హక్కులకు కట్టుబడవలసిందిగా కేంద్ర ప్రభుత్వానికి ఆ సంస్థ డైరెక్టర్ జనరల్ తన లేఖలో కోరారు.

కార్మికులపై బిజెపి పాలిత రాష్ట్రాల కర్కశత్వం

కరోనా సంక్షోభాన్ని అడ్డం పెట్టుకుని ఆర్థిక వ్యవస్థ కుదేలైందన్న సాకుతో విదేశీ పెట్టుబడులను ఆకర్షించడానికి, దేశీయ పరిశ్రమలు వేగంగా పుంజుకోవడానికి ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, గుజరాత్, ఝార్ఖండ్ రాష్ట్రాల ప్రభుత్వాలు అతి ముఖ్యమైన కార్మిక రక్షణ చట్టాల నుంచి పరిశ్రమలను తాత్కాలికంగా మినహాయింపులను ప్రకటించాయి. తాత్కాలికమంటూనే ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం మూడేళ్ల మినహాయింపులు ప్రకటించింది. కార్మికులను నియమించుకోవడం, తొలగించడంలో యాజమాన్యాలకు నిరంకుశమైన అధికారాలు దఖలు పరిచాయి. కార్మికులతో దినంలో 8 గంటలే పని

చేయించాలన్న నిబంధన స్థానంలో ఏకంగా పన్నెండు గంటలు చాకిరి చేయించుకొనేందుకు అనుమతించాయి. తనిఖీలను మరింత కుదించి నామమాత్రం చేశారు. కార్మికుల వేతనాలు, ఇతరత్రా ప్రయోజనాలు నిర్ణయించడంలోనూ, కత్తెర వేయడంలోనూ యాజమాన్యాలకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు.

ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఒక ఆర్డినెన్సుతో 38 కార్మిక చట్టాల్లో మూడు మాత్రమే అమలులో ఉంచి, మిగతావన్నింటినీ, మూడేళ్లపాటు రద్దుచేసింది. పారిశ్రామిక వివాదాలు, ట్రేడ్ యూనియన్, కాంట్రాక్టు ఉద్యోగాలతో వ్యవహరించే చట్టాలన్నీ రాష్ట్రం కత్తెర వేసిన వాటిలో ఉన్నాయి. కార్మికులకు నీరు, మరుగుదొడ్లు వంటి కనీస సౌకర్యాలు కల్పించి, పని ప్రదేశాల్లో వారి ఆరోగ్యాన్ని కాపాడాలని, భద్రత చూడాలని, నిర్దేశిస్తున్న చట్టాలు మధ్యప్రదేశ్‌లో మాయమైనాయి. కొత్తగా పరిశ్రమలు పెట్టబోయేవారు కార్మికుల జీవితాలతో చిత్తం వచ్చినట్టు ఆడుకొనే రీతిలో గుజరాత్ ప్రభుత్వం చాలా సవరణలు చేసింది. పారిశ్రామిక వివాదాలు, కార్మిక ఒప్పందాల చట్టం వంటివి తొలగిపోవడంతో ఇకపై యాజమాన్యాలు వందమంది ఉద్యోగులను కూడా ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ఒకే దెబ్బతో తీసిపారేయవచ్చు.

వేతనాల కోడ్- 2019

కేంద్రంలో నరేంద్ర మోడీ నేతృత్వంలో ఎన్‌డిఏ ప్రభుత్వం రెండోసారి అధికారం చేపట్టిన తరువాత కార్మిక వ్యతిరేక విధానాలకు పదును పెడుతున్నారు. కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా అత్యవసరంగా కుదించాల్సిన అవసరం ఏముంది..? మొదటి ఐదేళ్ల పాలనలో ఆర్థికవ్యవస్థ అధ్వాన్నంగా ఉంది. అందువల్ల కార్మిక వర్గాన్ని పణంగా పెట్టి పారిశ్రామిక రంగాన్ని ప్రోత్సహించేందుకు ఈ చర్యను మోడీ ప్రభుత్వం తీసుకుంటోంది. ముసాయిదా వేతన కోడ్ బిల్లును లోక్‌సభలో 2017 ఆగస్టులో ప్రవేశపెట్టారు. పార్లమెంటరీ కమిటీ దీనిపైనే చర్చించి తన నివేదికను 2018 మే 1న మోడీ ప్రభుత్వానికి సమర్పించింది. 2019లో పార్లమెంట్ ఆమోదించిన వేతనాల కోడ్‌కు, 2019 ఆగస్టు 8న రాష్ట్రపతి తన అంగీకారాన్నీ తెలిపారు. వేతనాల చెల్లింపు చట్టం 1936, కనీస వేతనాల చట్టం 1948, బోనస్ చెల్లింపు చట్టం 1965, సమాన వేతన చట్టం 1976- ఈ నాలుగు చట్టాల స్థానంలో తేబడిన ఈ కోడ్ ఏదైనా పరిశ్రమ, వాణిజ్యం, వ్యాపారం లేదా ఉత్పత్తి రంగాల్లో పనిచేసే కార్మికులందరికీ వేతనాలు, బోనస్‌లను నియంత్రించడానికి ప్రయత్నిస్తుంది.

1957లో 15వ భారత కార్మిక మహాసభ కనీస వేతనాల నిర్ధారణ ప్రాతిపదికను ఏకగ్రీవంగా ఆమోదించగా, ఈ ప్రాతిపదికను సుప్రీంకోర్టు కూడా ధృవీకరించింది. 1992లో జరిగిన కార్మిక మహాసభ దీనిని మరింత బలోపేతం చేసింది. కానీ 2019 వేతన కోడ్‌లో మాటవరుసకన్నా ఈ విధి విధానాల ప్రాతిపదికను ప్రస్తావించలేదు. తర్వాత జరిగిన జాతీయ కార్మిక మహాసభలు ఈ సిఫార్సులను పునరుద్ఘాటించాయి. ఈ ప్రాతిపదికనే ఏడవ వేతన సంఘం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు కనీస నెలసరి వేతనం రు.18000గా ఉండాలని సిఫార్సు చేసింది. తొలి దఫా మోడీ అధికారానికి వచ్చినప్పుడు బిజెపి ఈ ప్రతిపాదనలను అంగీకరించింది. పెరుగుతున్న నిత్యావసర ధరలను దృష్టిలో పెట్టుకుని 21 వేల రూపాయలు కనీస వేతనంగా ఉండాలని కేంద్ర కార్మిక సంఘాలు ప్రతిపాదించాయి. ఈ కోరికను అంగీకరించడానికి బదులు బిజెపి ప్రభుత్వం కనీస వేతనాలకు ప్రాతిపదికను నిర్ధారించేందుకు అధ్యయనం కోసం నిపుణుల బృందాన్ని నియమించింది. ఈ నిపుణుల కమిటీ రు. 9,000-12,000 కనీస వేతనంగా ఉండాలని ప్రతిపాదించింది. ఇది ఏడో వేతన సంఘం సిఫార్సుల కంటే దాదాపు సగం తక్కువ.

పారిశ్రామిక సంబంధాల కోడ్ - 2020

1947 పారిశ్రామిక వివాదాల చట్టం.'1926 ట్రేడ్ యూనియన్ చట్టం', '1947 పారిశ్రామిక వివాదాల చట్టం', '1946 పారిశ్రామిక ఉద్యోగిత చట్టం' (స్టాండింగ్ ఆర్డర్స్)- ఈ నాలుగు ముఖ్యమైన కార్మిక చట్టాల స్థానంలో ఈ పారిశ్రామిక సంబంధాల కోడ్‌ను ప్రభుత్వం గత సెప్టెంబర్‌లో పార్లమెంట్ ఆమోదం పొందింది. కార్మికుల హక్కులను నీరుగార్చడమే ఈ చట్టం ప్రధాన లక్ష్యం. ప్రత్యేకించి సమ్మె హక్కును చట్టవిరుద్ధమైనదిగా గుర్తించడం ఈ కొత్త చట్టం ప్రధాన లక్ష్యం. వాస్తవానికి 2015 లోనే ఈ బిల్లును రూపొందించి వెబ్‌సైట్‌లో పెట్టారు. దాని మీద సంప్రదింపులు కూడా జరిపారు. కాని కార్మిక సంఘాల ప్రతిపాదనలను వేటినీ పరిగణనలోకి తీసుకోకుండా తోసిరాజని కొద్దిగా పైపైన నామ్‌కా మార్పులతో 2019 నవంబర్ 28న లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఈ చట్టం కార్మికులను, వారి హక్కులను, గట్టిగా దెబ్బతీసే లక్ష్యంతోనే రూపొందింది. కార్మికులు సంఘం పెట్టుకునే హక్కును, ఉమ్మడి బేరసారాల హక్కును హరిస్తుంది. ఈ కోడ్ పరిశ్రమలలో ట్రేడ్ యూనియన్‌లే లేని పరిస్థితి కల్పిస్తుంది. పరిశ్రమ అంటే ఏంటి? అన్న నిర్వచనం దగ్గరే దాడి ప్రారంభం అయింది. గతంలో పలు సందర్భాలలో సుప్రీంకోర్టు సైతం 'పరిశ్రమ' అనే దానికి విస్తృత అర్థం ఇచ్చింది. విద్యాసంస్థలు, ఆస్పత్రులు, సేవా సంస్థలు సైతం పరిశ్రమ కిందికి వస్తాయని తీర్పులు ఇచ్చింది. కాని ఇప్పుడు దాన్నంతటినీ తిరగదోడి సామాజిక, సేవా సంస్థలను, ధార్మిక సంస్థలను, 'పరిశ్రమ' అన్న పదం పరిధి నుంచి మినహాయించింది.

ఈ చట్టంలోని దారుణమైన అంశమేమిటంటే నెలకు రు.15,000, ఆ పైన సంపాదించే సూపర్‌వైజర్లు, మేనేజర్లు 'కార్మికులు' అన్న నిర్వచనం పరిధి నుండి తప్పించబడతారు! అంటే యూనియన్‌లో చేరే అవకాశం వారికి ఉండదు. ఇప్పుడు రు.15,000 దాటి జీతం పొందుతున్న వారందరి పోస్టుల పేర్లు మార్చి సూపర్‌వైజరీ, మేనేజిరియల్ పేర్లు పెట్టిస్తే వారందరినీ యూనియన్ పరిధిలోకి రాకుండా ఆపేయవచ్చునన్న దుర్మార్గమైన ఆలోచన ఇందులో దాగి ఉంది. ఇప్పటికే చాలా ప్రైవేటు సంస్థల్లో ఈ పద్ధతి ఉంది. దీనిని ఇప్పుడు చట్టబద్ధం చేయడమే గాక దేశంలోని అన్ని పరిశ్రమలకూ వర్తింపజేస్తారన్నమాట. 7వ పే కమిషన్ కనీస వేతనం నెలకు రు.18,000 ఉండాలని సిఫార్సు చేసింది. అంగన్‌వాడీ, ఆశా తదితర స్కీము వర్కర్లు దేశవ్యాప్తంగా కోటి మందికి పైగా ఉన్నారు. వీరందరినీ 'కార్మికులు' అన్న పదం పరిధి నుండి మినహాయించారు. మరోవైపు ఉద్యోగ భద్రతా హక్కు, పనిగంటల నియంత్రణ హక్కు ఓవర్‌టైం నిరాకరించే హక్కు, ఓవర్‌టైంకు అధికంగా వేతనం పొందేహక్కు, మహిళా కార్మికులు రాత్రి 7 గంటల నుండి ఉదయం 7 గంటల దాకా పనిచేయకుండా నిరోధించే హక్కులు పూర్తిగా హరించివేయబడతాయి.

ట్రేడ్ యూనియన్ చట్టం 1926 విధించిన నిబంధనలన్నింటినీ పాటించి ఒక యూనియన్‌ను రిజిస్టర్ చేయడానికి దరఖాస్తు చేసినా, రిజిస్ట్రారు ఆ ట్రేడ్ యూనియన్‌ను రిజిస్టర్ చేయకుండా తిరస్కరించవచ్చు. ఇదీ 'పారిశ్రామిక సంబంధాల కోడ్' ప్రతిపాదించిన మరో అంశం! యూనియన్ రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకున్నాక ఎన్ని దినాలు గడిచినా రిజిస్ట్రేషన్ చేయకుండా కాలయాపన చేయవచ్చు. యూనియన్ రిజిస్ట్రేషన్ చేయాలంటే కనీసం వంద మంది సభ్యులుండాలి. ఇంతవరకూ 300, అంతకంటే ఎక్కువ మంది కార్మికులు పనిచేసే పరిశ్రమలలో లే ఆఫ్ గాని, రిట్రెంచ్‌మెంట్ గాని, లాకౌట్ గాని ముందస్తు అనుమతి లేకుండా చేసే అధికారం యజమానికి లేదు. ఇప్పుడు ఈ ప్రతిపాదిత కోడ్‌లో వంద మంది, ఆ పైబడి వర్కర్లు పనిచేసే పరిశ్రమల్లో లేఆఫ్, లాకౌట్, రిట్రెంచ్‌మెంట్–ఏదైనా చేయడానికి యజమానికి ముందస్తు అనుమతి అవసరం లేదు. అంతేకాదు, సంబంధిత ప్రభుత్వం అవసరమనుకుంటే 100 కన్నా కూడా సంఖ్యను తగ్గింపచేయవచ్చు.

ఇప్పటికే రాజస్థాన్, గుజరాత్, జార్ఖండ్, ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్, హర్యానా, మహారాష్ట్ర, అసోం వంటి రాష్ట్రాలు ప్రభుత్వ ముందస్తు అనుమతి లేకుండానే కార్మికులను తొలగించడానికి అనుమతించాయి. ఈ ఉల్లంఘనను సరిచేసేది పోయి దానికే పచ్చ జెండా ఊపింది కేంద్రం. మొత్తంగా పారిశ్రామిక సంబంధాల కోడ్ పని ప్రాంతాల్లో, ఫ్యాక్టరీల్లో కార్మిక సంఘాలకు తావులేదన్న యాజమాన్యపు ధోరణికి అనుకూలంగా చట్టాలను బలహీనం చేయడానికి పూనుకున్నారు. యాజమాన్యం కోరుకున్నట్లు కార్మికులను ఎప్పుడు కావాలంటే అప్పుడు ఉద్యోగాల నుండి తీసేసే హక్కును ఈ కొత్త చట్టం చట్టబద్ధం చేస్తోంది. ఇప్పటి వరకు సంఘటిత కార్మికవర్గం యాజమాన్యం ఇటువంటి చర్యలు తీసుకోకుండా అడ్డుకోగలిగింది. ఇప్పుడు వచ్చిన చట్టం ఇంతకాలం సాధించిన విజయాలను ఒక్కపెట్టున రద్దు చేసేదిగా మారింది.

వృత్తి సంబంధమైన భద్రత–ఆరోగ్యం కోడ్–2020

ఈ బిల్లు వల్ల 13 చట్టాలు పనికిరాకుండా పోతాయి. అవి 1) ఫ్యాక్టరీల చట్టం 2) కాంట్రాక్టు లేబరు చట్టం 3) మోటారు రవాణా కార్మిక చట్టం 4) బీడి, చుట్ట కార్మిక చట్టం 5) సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్ చట్టం 6) సినీ థియేటర్స్ కార్మిక చట్టం 7) భవన, ఇతర నిర్మాణ కార్మిక చట్టం 8) గనుల చట్టం 9) డాక్ కార్మికుల చట్టం 10) ప్లాంటేషన్ కార్మికుల చట్టం 11) అంతరాష్ట్ర వలస కార్మికుల చట్టం 12) వర్కింగ్ జర్నలిస్టులు, ఇతర న్యూస్ పేపర్ ఎంప్లాయిస్ చట్టం 13) వర్కింగ్ జర్నలిస్టుల వేతన చట్టం. బీడి, గనులు, నిర్మాణం, సేల్స్ ప్రమోషన్ వృత్తులు విడివిడిగా ప్రత్యేకమైనవి. ఒకదానితో ఒకటి కలవడానికి వీలులేని వాటిని కలిపివేసింది. పాత చట్టంలో యజమానులకు అనుకూలంగా ఉన్న అంశాలను అలాగే ఈ బిల్లులో ఉంచుతూ కార్మికుల హక్కులకు, భద్రతకు అనుకూలంగా ఉన్న నిబంధనలన్నింటిని కార్మికులకు వ్యతిరేకంగా, వారికి నష్టం కల్గించే రీతిలో మార్చివేసింది.

నిత్యం ఏదో ఒకచోట పని ప్రదేశాల్లో కార్మికులు ప్రమాదాల్లో చనిపోతున్నారు. పూర్తి అంగవైకల్యం, పాక్షిక అంగవైకల్యం జరిగి జీవితాంతం బాధలు అనుభవిస్తున్న కార్మికులకు ఇవ్వాల్సిన కాంపెన్‌సేషన్ (నష్టపరిహారం) కొరకు కార్మికులు, కార్మిక సంఘాలు సమర్థించుకోవడానికి ఏ విధమైన చట్టపర భద్రతా చర్యలు లేవు. ఈ దురాగతం వల్ల 98 శాతం కార్మికులు చట్టరక్షణకు నోచుకోలేని స్థితి ఏర్పడుతున్నది. ఈ కోడ్ వల్ల ప్రస్తుతం కార్మికులకు చట్టాల ద్వారా లభించే నష్టపరిహారపు మొత్తాలు (ప్రమాదాల్లో చనిపోయిన సందర్భాలలో, అంగవైకల్యం సంభవించిన సందర్భాలలో, తీవ్ర అనారోగ్యానికి వాతనబడిన సందర్భంలో) గణనీయమైన కనీస స్థాయికి తగ్గించారు. ఆర్థిక సంక్షోభ కారణంగా పెరిగిపోతున్న ఖర్చులకు (వైద్య తదితర) తగిన విధంగా కాక బహు తక్కువ మొత్తాలే కార్మికులకు చెల్లింపబడతాయి.

సామాజిక భద్రత– సంక్షేమం కోడ్ –2020

పార్లమెంట్‌లో ప్రతిపాదించిన బిల్లుల్లో చివరిది సామాజిక భద్రత కోడ్–2020. 1923 నాటి ఉద్యోగుల నష్టపరిహార చట్టం, 1948 నాటి ఇఎస్ఐ చట్టం, 1952 నాటి ఇపిఎఫ్ చట్టం, 1959 నాటి ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజి, ఖాళీలను తప్పనిసరిగా ప్రకటించాలన్న చట్టం, 1961 మెటర్నిటి బెనిఫిట్ చట్టం, 1972 గ్రాట్యుయిటీ చెల్లింపు చట్టం, 1996 నాటి భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ సుంకం చట్టం, 2008 నాటి అసంఘటిత రంగ కార్మికుల సామాజిక భద్రత చట్టం, సినిమా కార్మికుల సామాజిక భద్రత చట్టం, సినిమా కార్మికుల సంక్షేమ నిధి చట్టం వంటి ప్రస్తుతం అమల్లో ఉన్న తొమ్మిది చట్టాలను ఈ బిల్లు మింగేయనుంది. అనియత, అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న 93 శాతం కార్మికులు, శ్రామికులందరికీ చట్టపరమైన రక్షణ, సామాజిక భద్రతలను కల్పించడానికి బదులుగా, మన పాలకులు, పాలక వర్గాలు–సంఘటిత రంగంలో పనిచేస్తున్న ఆ కొద్దిపాటి సంఖ్యలోనున్న ఉద్యోగులు, కార్మికులకు ఏదో మేరకు అందుబాటులో నున్న చట్టబద్ధ హక్కులు, సౌకర్యాలను సైతం ఎగవేసేందుకు దూకుడుగా ముందుకు సాగుతున్నారు.

ఈ చట్టం ద్వారా సార్వత్రిక సామాజిక భద్రతను అమలు చేయనున్నట్లు ప్రభుత్వం మభ్య పెడుతుంది. కాని ఈ చట్టం నామమాత్రంగానైనా కార్మికులకు సామాజిక భద్రత కల్పించే బాధ్యత నుండి ప్రభుత్వాన్ని తప్పించి బీమా విభాగంలోకి ప్రత్యేకించి సూపర్ లాభాపేక్షతో ఉన్న ప్రైవేటు బీమా కంపెనీల కప్పగించింది. మరోవైపున రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమం కోసం వసూలు చేసిన సెస్ నిధులన్నింటినీ కేంద్రం ఆధీనంలోకి తీసుకుంటుంది. నిజానికి ప్రభుత్వం అందించవల్సిన సంక్షేమాల నుండి ప్రభుత్వం దూరం జరుగుతుంది. బీడి కార్మికులుగా పనిచేసే లక్షలాది పేద కుటుంబాలకు చెందిన మహిళలకు రేపటి రోజున సామాజిక భద్రత కరువవనుంది. ఇది చాలా మోసపూరితమైనది. అంతేకాక దగాకోరు స్వభావం కలిగినది. పేరులోనే సామాజిక భద్రత తప్ప, ఇందులో సామాజిక భద్రతకు సంబంధించిన అంశాలు ఏమీ లేవు. ఇపిఎఫ్, ఇఎస్ఐ నిధులు, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధులన్నింటినీ ప్రధానమంత్రి చైర్మన్‌గా ఉండే జాతీయ సలహా మండలి అధీనంలోకి వస్తాయని చట్టంలో పేర్కొన్నారు. ఈ నిధులను మరో పద్దుకు మళ్లించిన ఆశ్చర్యపోనవసరం లేదు.

ముగింపు

దశాబ్దాల పోరాటాల ఫలితంగా కార్మికులు సాధించుకున్న

విస్ట్రాన్ ఇండియా కార్మికుల ఆందోళన

బెంగళూరులో విస్ట్రాన్ కంపెనీ కార్మికులు చేసిన పోరాటం వెనుక దాగిన దోపిడీ పూర్వాపరాలను వివరిస్తూ నేడు ఢిల్లీ సరిహద్దుల్లో రైతాంగం చేస్తున్న ఆందోళనని అదే కోవలో అర్థం చేసుకోవాలని అంటున్నారు బి. ఎస్. రాజు

బెంగళూరు – విస్ట్రాన్:

బెంగళూరు ఓ సుప్రసిద్ధ దక్షిణ భారత నగరం. ఈ నగరం ఎందుకు సుప్రసిద్ధమైనదో కొందరికి కొన్ని కోణాలు తెలిసి ఉండవచ్చు. అందరికీ అన్ని కోణాలు తెలియక పోవచ్చు. పర్యాటకులకు మొదట్లో ఓ గార్డెన్ సిటీగా, ఓ సుందర పర్యాటక ప్రాంతంగా ఈ నగరం సుపరిచితం. ఇంజనీర్లకు, సాంకేతిక నిపుణులకు, కార్మికులకు బెంగళూరు ఓ ఇంజనీరింగ్ సిటీగా కూడా పరిచయం.

హెచ్ఎంటి యంత్ర ఉత్పత్తుల సంస్థ, హెచ్ఎంటి చేతి గడియారాల తయారీ సంస్థ; దేశంలో మొదటిది, అతిపెద్దది అయిన టెలిఫోన్ల, టెలిఫోన్ పరికరాల సంస్థ ఇండియన్ టెలిఫోన్ ఇండస్ట్రీస్; బిఇఎల్ (భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్), హెచ్ఏఎల్ (హిందుస్థాన్ ఎయిరోనాటిక్స్ లిమిటెడ్) వంటి మౌలిక దిగ్గజ ప్రభుత్వ రంగ సంస్థలకు పుట్టిల్లు బెంగళూరు. ఇక్కడే జలహళ్లిలో దేశంలోకెల్లా అతిపెద్ద భారత వైమానిక దళ స్థావరం ఉంది. వీటికి అనుబంధంగా అనేక చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఇక్కడ వెలిసి ఆ పట్టణానికి నైపుణ్యాల నగరంగా వన్నె తెచ్చాయి.

ప్రముఖ ఇంజనీరింగ్ నిపుణుడు, నిష్ణాతుడు, మోక్షగుండం విశ్వేశ్వరయ్య తీర్చిదిద్దిన నగరం, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అనే ప్రతిష్ఠాత్మక ఉన్నత విద్యా, రీసెర్చ్ సంస్థను పొదుముకున్న నగరం బెంగళూరు. ముందుగా ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలు, ఆ తరవాత ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలు విస్తరించి సాంకేతిక విద్యారంగ వ్యాప్తికి శ్రీకారం చుట్టిన నగరం బెంగళూరు. దేశంలో మొదటి రాష్ట్రం, కర్ణాటక.

ఈ బెంగళూరు నగరం మరో ముందంజ వేసి గార్మెంట్ సిటీగా, సాఫ్ట్‌వేర్ సిటీగా ప్రపంచ పటానికెక్కింది. రెడీమేడ్ దుస్తుల తయారీకి,

---

హక్కులన్నింటినీ కరోనా కంటే కర్కశంగా పాలకులు హరించి వేస్తున్నారు. కోట్లాది మంది కార్మికుల, ఉద్యోగుల భవిష్యత్తును ప్రమాదంలో పడవేస్తున్నారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసే ప్రక్రియ శరవేగంతో సాగుతున్నది. బహుళజాతి కంపెనీలు సైతం మనదేశానికి వచ్చేసరికి చట్టాలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్న విషయాన్ని గతంలో భోపాల్ గ్యాస్ లీక్ ఘటన, ఇటీవలి విశాఖ విషవాయు ఘటన తాజాగా తెలియచెప్పాయి. కరోనా కష్టకాలంలో పరిశ్రమలు మూతబడి, కోట్లాదిమంది వలస కార్మికులు పొట్ట చేతబట్టుకొని స్వగ్రామాలకు తరలిపోతున్న స్థితిలో, వారిని ఆదుకోవడం చేతకాని పాలకులు ఇప్పుడు కార్మికులకు ద్రోహం చేయదానికి సిద్ధపడుతున్నారు. వారికి తాగునీరు, గాలి, వెలుతురు, క్యాంటీన్లు, ప్రథమ చికిత్స ఇత్యాది అవసరాలు కూడా తీర్చనక్కరలేదంటూ పరిశ్రమల యాజమాన్యాలకు చెప్పడం కంటే అమానుషం ఇంకేమైనా ఉంటుందా?

కరోనాతో సహజీవనం తప్పదన్న వాదనతో, పరిశ్రమలను వేగంగా తెరిపించేందుకు సిద్ధపడుతున్న పాలకులు ఇకపై కార్మికులను యజమానుల దయాదాక్షిణ్యాలకు వదిలేయడమే కాదు, వారిని వ్యాధుల నుంచి రక్షించేందుకు కూడా సిద్ధంగా లేరని ఈ చట్టసవరణలు తెలియచెబుతున్నాయి. దేశంలో కార్మికులకు కనీసంగానైనా తోడ్పడే చట్టబద్ధ హక్కులు, రక్షణలనన్నింటినీ బడా పెట్టుబడిదారీవర్గ యాజమాన్య ప్రయోజనాల కోసం బాహాటంగా ఎత్తివేసేందుకు, కార్మికుల ప్రయోజనాలను బలిపెట్టి యాజమాన్యాలు సౌకర్యవంతంగా, సులభంగా తమ వ్యాపారాన్ని కొనసాగించుకొనే వాతావరణాన్ని కల్పించడానికి, మనదేశాన్ని విదేశీ పెట్టుబడికి మరింత ఆకర్షణీయ ప్రాంతంగా మలిచే ఏకైక ఉద్దేశంతోనే మనదేశ పాలకులు, పాలకవర్గాలు ఈ రూపంలో ముందుకొచ్చారనేది స్పష్టం. అంటే, దేశ ఆర్థిక వ్యవస్థను తమ ఇష్టారాజ్యంగా కొల్లగొట్టడానికి విదేశీ, స్వదేశీ పెట్టుబడిదారులకు గేట్లు తెరిచిన నేపథ్యంలో, వారికి గొడ్డుచాకిరీ చేసే కార్మికులను అందించేందుకు కార్మికులకు ఉపకారంగా ఉన్న చట్టాలనూ చట్టుబండలు చేస్తున్నారు.

మోడీ నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ విధానాలకు అనుగుణంగా, అవి నిర్దేశిస్తున్నట్లు కార్మికుల, ప్రజల సంక్షేమ, భద్రతల బాధ్యతల నుండి 'సంస్కరణల' రూపంలో తప్పుకొంటోంది. అందువలన ప్రభుత్వం చేపట్టే ఈ 'సంస్కరణ'లన్నీ కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేకమయినవే! దేశంలోని కార్మికవర్గం ప్రభుత్వం చేపట్టిన ఈ కార్మిక వ్యతిరేక యత్నాలను ప్రతిఘటించి తిప్పికొట్టగలిగేందుకు కార్మిక సంఘాలన్నీ తరతమ బేధాలను విస్మరించి ప్రభుత్వం చేపట్టిన ఈ తిరోగమన కార్మిక సంస్కరణలను ఎదుర్కొనేందుకు తక్షణమే పూనుకోవాలి! ఇందుకు అఖండ కార్మిక–కర్షక ఐక్యత ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాటం అన్న సూత్రంపై ఆధారపడి ఒక నిలకడైన, బలీయమైన ఉద్యమ నిర్మాణం జరగాలి. దేశంలోని కార్మికవర్గమంతా ముక్తకంఠంతో పట్టుసడలని ఐక్యతతో ఈ కార్మిక చట్టాల మార్పును వ్యతిరేకించటానికి పూనుకోవాలి! తగు నిరసనాందోళనా పోరాటాలను చేపట్టాలి.

(రచయిత ఉపాధ్యాయులు) వీ

సాఫ్ట్‌వేర్ ఉత్పత్తులకు, వాటి ఎగుమతులకు పెద్ద కూడలిగా మారింది. గార్డెన్ సిటీ నుండి ఇంజనీరింగ్ సిటీగా, గార్మెంట్ సిటీగా, తదనంతరం సాఫ్ట్‌వేర్ సిటీగా ఎదిగిన ఈ దక్షిణ భారత నగరం డిసిప్లిన్డ్ సిటీగా, క్రమశిక్షణగల నగరంగా ఖండాంతర ఖ్యాతి నార్జించింది. ఈ రెండు రంగాల్లో లక్షలాది సాంకేతిక నిపుణులు, ఇంజనీర్లు, టెక్నీషియన్లు, కార్మికులు, మేనేజర్లు ఓ నియమ నిబద్ధ క్రమంలో ప్రశాంతంగా, క్రమశిక్షణతో పనిచేసే నగరం బెంగళూరు, దాని పరిసర ప్రాంతాలు. ఇంతకీ 'విస్ట్రాన్ ఇండియా' సంస్థ పనివారి ఆందోళనకు, ఈ బెంగళూరు నగర ఖ్యాతికి ఏమిటి సంబంధం అనే సందేహం కలగడం సహజం. అటువంటి ప్రశ్న వేయడం కూడా సహజమే..

విస్ట్రాన్ సంస్థ, నర్సపురా కార్మికుల ఆగ్రహోందోళన:

పైన ఉదహరించిన ప్రత్యేకతల మూలంగా విస్ట్రాన్ సంస్థ బెంగళూరును ఇండియాలో సెల్‌ఫోన్ల, ఇతర ఐటి ఉత్పత్తుల తయారీ కేంద్రంగా ఎన్నుకుంది.

2001లో, తైవాన్ దేశ రాజధాని తైపీలో ఈ విస్ట్రాన్ కార్పొరేషన్ రూపుదిద్దుకుంది. మొదట్లో ప్రముఖ కంప్యూటర్ సంస్థ 'ఏసర్' (ఎసిఇఆర్)కు తయారీ విభాగంగా ఉంటూ, 2001 నుండి సొంత వ్యాపారానికి మళ్లింది. అప్పటి నుండి నోట్ బుక్, లాప్ టాప్, డెస్క్ టాప్ వగైరా కంప్యూటర్లు, సెల్‌ఫోన్లు, వాటి విడి భాగాలు, ఇతర ఇన్ఫర్మేషన్, మెడికల్ టెక్నాలజీ పరికరాలు ఉత్పత్తి చేస్తూ వస్తున్నది. ఈ రంగాల్లో ప్రపంచ ప్రఖ్యాత బ్రాండ్లకు కాంట్రాక్టు ఉత్పత్తిదారుగా పేరు గడించింది.

విస్ట్రాన్ సంస్థ, కాంట్రాక్ట్ పద్ధతిలో తయారు చేసి ఇచ్చే ఉత్పత్తులను ఆయా కంపెనీలు తమ సొంత బ్రాండ్ల పేరుతో ప్రపంచమంతా విక్రయిస్తాయి. ఈ సంస్థకు ఆసియా, ఐరోపా, అమెరికా ఖండాల్లో 20కి పైగా టెక్నాలజీ, వ్యాపార కేంద్రాలు ఉన్నాయి. రమారమి ఓ లక్ష మంది ఉద్యోగులు, టెక్నీషియన్లు ఈ సంస్థలో పనిచేస్తున్నారు. 2019లో దీని వార్షిక ఆదాయం సుమారుగా 300 కోట్ల అమెరికన్ డాలర్లు (24000 కోట్ల రూపాయలు).

ప్రపంచ సెల్ ఫోన్ దిగ్గజం ఏపిల్ కంపెనీ భారత దేశంలో కొన్ని సెల్ ఫోన్ మోడల్స్‌ను ఉత్పత్తి చెయ్యాలనే నిర్ణయంలో భాగంగా ఈ విస్ట్రాన్ సంస్థను తన కాంట్రాక్ట్ తయారీదారుగా ఎంచుకుంది. అలా, 2017లో 'విస్ట్రాన్' సంస్థ, తన ఐటి టెక్నాలజీ ఉత్పత్తులకు బెంగళూరు ప్రాంతం అనువైనదని నిర్ణయించుకుని, విస్ట్రాన్ ఇన్ఫోకామ్ మాన్యుఫ్యాక్చరింగ్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ అనే పేరుతో తొలుత బెంగళూరులోని పీన్యా ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఏపిల్ ఐ-ఫోన్ ఎసెంబ్లీ నమూనా యూనిట్‌ను నడిపింది. ఇక్కడ నుండే ముందుగా ఐఫోన్ ఎస్ ఇ, ఐఫోన్ 6 ఎస్ మొబైల్ ఫోన్లను ఏపిల్ కంపెనీకి సరఫరా చేసింది.

ఏపిల్ కంపెనీ సెల్‌ఫోన్ల సరఫరాకై, విస్ట్రాన్ పై ఊపిరాడని సంఖ్యలో ఆర్డర్లను కుమ్మరించింది. మోయలేని ఈ భారీ ఆర్డర్లతో 2018లో బెంగళూరుకు 60 కిలోమీటర్ల దూరంలో కోలార్ జిల్లాలోని నర్సపురాలో 'ఏపిల్' సెల్‌ఫోన్ల తయారీకై ప్రత్యేకంగా ఓ ఫ్యాక్టరీని స్థాపించింది ఈ విస్ట్రాన్ సంస్థ.

2019 జనవరిలో ఈ కంపెనీ తన మూల పెట్టుబడిని 3000 కోట్ల రూపాయలకు పెంచినట్లు ప్రకటించింది. నర్సపురాలో ఈ కంపెనీకి కర్ణాటక ప్రభుత్వం 43 ఎకరాల స్థలం కేటాయించింది. ఈ స్థలంలోనే రు. 550 కోట్ల వ్యయంతో అతివేగంగా ఓ ఆధునిక సెల్‌ఫోన్ల తయారీ పరిశ్రమను నిర్మించి ఉత్పత్తులను విడుదల చేసింది. అంతేగాక తాము త్వరితగతిన మరో విస్తరణ కార్యక్రమానికి ఉపక్రమిస్తున్నామని, అందుకై మరో 60 ఎకరాల స్థలం కావాలని కర్ణాటక ప్రభుత్వానికి అర్జీ పెట్టింది.

నర్సపురా పరిశ్రమలో 1343 మంది శాశ్వత, 8490 మంది తాత్కాలిక/కాంట్రాక్ట్ పనివారిని సమకూర్చుకుంది. అత్యంత దూకుడుతో 2020 ఆగస్టు నాటికి సెల్‌ఫోన్ల ఉత్పత్తి మొదలు పెట్టిన ఈ కంపెనీ 4 నెలల్లోనే అంటే డిసెంబర్ 12 నాటికే, ఓ ఉత్పాతాన్ని చవిచూసింది.

ఇందులో పనిచేస్తున్న తాత్కాలిక పనివారు, కంపెనీ అవకతవక జీతనాతాల చెల్లింపులతో, అదనపు పనిగంటల తప్పుడు లెక్కలతో, విరామమే లేని శారీరక మానసిక శ్రమతో విసిగి వేసారి, లోలో, తమలో గూడుకట్టుకుని ఉన్న కోపాగ్నితో, ఆక్రోశంతో రగిలిపోయి, పరిశ్రమపై దాడిచేసి, భీభత్సం సృష్టించారు.

ఓ 20 ఏళ్ల విద్యావంతురాలైన, పొట్టి స్కర్ట్ ధరించిన యువతి, ఫేషనబుల్ యుక్త వయసు ఉద్యోగిని, ఓ ఇనుప పైపును రెండు చేతులతో పట్టుకుని పరిశ్రమలో పరికరాలను, పని ప్రదేశంలో అమర్చిన అద్దగోడలను విరుచుకు పడ్డ శివంగిలా బద్దలు కొట్టడం వీడియోలో చూడవలసిన దృశ్యం. ఆమె విజృంభణతో ధైర్యం తెచ్చుకున్న మిగతా పురుష వర్కర్స్ ముందుకు ఉరకడం ఆ వీడియోలో స్పష్టంగా కనిపిస్తుంది.

ఎందుకిలా జరిగింది? క్రమశిక్షణగల పనివారని, ప్రశాంతంగా చెప్పిన పని చేసుకుపోయే స్వభావం, మనస్తత్వం గలవారని పేరుమోసిన బెంగళూరు వాసులు, కర్ణాటక కార్మికులు, టెక్నీషియన్లు ఇలా ఎందుకు చేశారు? విస్ట్రాన్ కంపెనీ వారి, ఏ విధి విధానాలు, ప్రశాంత మూర్తులను అశాంత చిత్తులుగా మార్చి, విచ్చిన్నకారులను చేశాయి? ఈ అంశం ప్రధానం.

అతివేగంతో, జెట్ స్పీడ్‌తో, సెల్‌ఫోన్, ఇతర మినీ ఎలక్ట్రానిక్ వస్తు తయారీ ఎసంబ్లీ లైన్ పని విధానంలో భారతదేశపు పనివారికి, టెక్నీషియన్లకు, ఇంజనీర్లకు, ఇతర ఉద్యోగులకు అంతగా అనుభవము, అలవాటు లేదు. అటువంటి వేగమయ ఉత్పత్తికి వారి మెదళ్లు సెట్ కాలేదు. కొంచెం విరామంగా, ఊసులాడుకుంటూ, ఒకరితో ఒకరు పరిహాస మాడుకుంటూ పనులు చేయడం మన పని సంస్కృతిలో భాగం. ఒకరి తరువాత మరొకరు విడి భాగాలను జోడిస్తూ ఏదైనా ఓ వస్తువును తయారు చేయడాన్ని ఎసంబ్లీ లైన్ ఉత్పత్తి విధానం అంటారు. ఇప్పుడు ప్రపంచమంతా ఈ ఉత్పత్తి విధానం విస్తరించింది. బెంగళూరు వాటి పరిసరాల్లో పనిచేసే శ్రామిక రాశులకు ఇటువంటి ఉత్పత్తి విధానం దుస్తుల ఉత్పత్తి రంగంతో పరిచయమై వారిని సాంప్రదాయ పనిపద్ధతుల నుండి కొంత మేరకు విముక్తి చేసింది.

ఎప్పుడైతే పరదేశ వస్త్ర దిగుమతి కంపెనీలు మన దేశం నుండి రెడీమేడ్ దుస్తులను పెద్దసంఖ్యలో తయారు చేయించుకుని దిగుమతి చేసుకోవడం మొదలు పెట్టాయో, అప్పటినుండి పని సంస్కృతిలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయనేది ఓ వాస్తవమే! అయితే ఇది తక్కువ నైపుణ్యాల, పెద్దగా సాంకేతికత అవసరంలేని ఉత్పత్తుల రంగం కాబట్టి

దాని కనుగుణంగానే, పని పద్ధతులు, ఉత్పత్తి విధానాలు, నాణ్యతా స్థాయిలు క్రమంగా స్థిరీకరణ చెందాయి. ఇదేమీ చిటికెలో సాధ్యపడలేదు. తప్పొప్పుల దిద్దుబాట్లతో, ప్రయాసతో, నిరంతర శిక్షణతో పనివారిని, పనిసంస్కృతిని సానబెట్టి కొత్త మూసలో ఇమడ్చడానికి ఓ దశాబ్ద కాలం పట్టింది. ఇంత జరిగినా, మనదేశం దుస్తుల తయారీ రంగంలో అగ్ర స్థానానికి చేరుకోలేదు సరికదా, ఈ రంగంలో మనకన్నా వెనుకగా ప్రవేశించిన చైనా, బంగ్లాదేశ్, శ్రీలంక, వియత్నాం, కంబోడియా ఇత్యాది దేశాలు ఇండియాను వెనక్కు నెట్టేశాయి. చైనా అయితే ఇండియాను ఓ రకంగా కుదేలు చేసి పారేసింది.

ఈ స్థితికి కారణాలు, మనదేశ ప్రత్యేకతలు చాలానే ఉన్నా, ప్రధానమైనది పని సంస్కృతిలో పేరుకుని ఉన్న మకిలి, వెనుకబాటుతనం. అయితే రాజకీయ చైతన్యం, హక్కుల పట్ల స్పృహ మిగతా 3వ ప్రపంచ దేశాల ప్రజలకన్నా మనకు 3 రెట్లు ఎక్కువే అని చెప్పాలి. ఇది ఒక పాజిటివ్ అంశం. ఈ పాజిటివ్ అంశమే ప్రధాన పెట్టుబడిదారీ దేశాలకు, అక్కడి కంపెనీలకు, ఇక్కడి దళారీలకు నచ్చని, మింగుడు పడని ముల్లు లాంటి అంశం.

చైనా ప్రపంచానికే ఓ పెద్ద ఖార్ఖానాగా ఎలా అవతరించింది? ఇండియా ఎంత కోరుకున్నా, ఆశపడుతున్నా అలా కాలేకపోతున్నది? ఫాక్స్కాన్, పెగాట్రాన్, విస్ట్రాన్ వంటి తైవాన్ కంపెనీలు చైనాలో సెల్ ఫోన్, కంప్యూటర్, ఎలక్ట్రానిక్ వస్తు తయారీ పరిశ్రమలు స్థాపించి లక్షలాది పనివారిని బందులదొడ్డి బందీఖానా పద్ధతిననుసరించి ఉత్పత్తులు కొనసాగించడం, బిలియన్ల డాలర్ల లాభాలు మూటలు కట్టుకుని మోసుకుపోవడం చూశాం. రోజుకు 12 నుండి 18 గంటలు పనిచేయించుకోవడం, చేసిన పని రోజులను, అదనపు పనిగంటలను గయాబు చేసి, దొంగ లెక్కలతో పనివారి సొమ్మును సంవత్సరాల తరబడి కాజేసినప్పటికీ అక్కడ పనివారు సహించారు. భరించారు. భరించలేక ఆత్మహత్యలు చేసుకున్నారే తప్ప నర్సపురాలో లా 4 నెలల్లోనే తిరగబడి విచ్చిన్నాలు సృష్టించలేదు.

వింతేమిటంటే, అదే చైనాలో, మావో నాయకత్వంలో, ఆయనే పేరుపెట్టి నడిపించిన 'మహత్తర శ్రామిక వర్గ విప్లవం' కని వినీ ఎరుగని రీతిలో 10 ఏళ్ల పాటు జరిగింది. అదే చైనాలో శ్రమదోపిడీ ఇపుడు తారాస్థాయికి చేరి విలసిల్లుతోంది. సహనం గాడిద లక్షణం అని నానుడి. చైనా కార్మికుల, ప్రజల ఈ సహనమే ఈనాటి చైనాకు అందివచ్చిన నిధా? బహుశా కావచ్చు.

ఏ విప్లవం ఎరుగని, చవిచూడని, సహన ధనులు, క్రమశిక్షణా శ్రేణులుగా పేరుగాంచిన బెంగళూరు– నర్సపురా కార్మికులు, ఉద్యోగులు తాము పనిచేస్తున్న తాయివాన్–చైనా కంపెనీ దోపిడీ అవలక్షణాలను, తప్పుడు లెక్కల పద్ధతులను 4 నెలల్లోనే పసిగట్టారు. వారికి నెల ముగియగానే జీతాలు రావడం లేదు. ఒక నెల ముగిసి మరో నెల సగం గడిచినా రావాల్సిన జీతం రావడం లేదు. అధిక దినాలు, అధిక పని గంటలు సరిగా జీతపు లెక్కలోకి ఎక్కవు. ఇస్తామన్న జీతం ఒకటైతే, చేతిలో పెట్టే జీతం మరొకటి. తాత్కాలిక ఉద్యోగం, దళారీ కాంట్రాక్టర్ ద్వారా కుదురుకున్న పని. 12 గంటల షిఫ్ట్. సెలవులు ఉండవు. పండగలుండవు. పనే పండగ. విశ్రాంతి, విరామాలు కరువు. రావాల్సిన జీతపు, అదనపు పనిగంటల బకాయిలు సమయానికి చెల్లించరు. ఇదంతా చైనాలో చెల్లుబాటైనట్లు ఇక్కడా చెల్లుబాటౌతుందనుకున్న విస్ట్రాన్ కంపెనీ పప్పులో అడుగేసింది. బొక్కబోర్లా పడింది. ఇక్కడ కార్మికుల చైతన్యాన్ని తక్కువ అంచనా వేసి నష్ట పోయింది.

చైనా ఆగడాలు నర్సాపురాలో నడవలేదు. కార్మికుల కోపాగ్నికి గురైన విస్ట్రాన్ పరిశ్రమను మూత పెట్టుకుంది. ఇది తెలివిమాలిన పని. పనివారి స్థానిక మనస్తత్వాన్ని, సంస్కృతిని, నైపుణ్యాల వినియోగ ప్రక్రియను తన ఉత్పత్తి విధానంలో తెలివిగా వినియోగించుకోవడంలో విఫలమై అబాసు పాలయ్యింది. ఇపుడు దళారీ స్థానిక ప్రభుత్వపు అండదండలతో తిరిగి గట్టెక్కే ప్రయత్నం చేస్తోంది. ఒకింత లెంపలేసుకుంది. పరిశ్రమపై కార్మికుల దాడిని శాంతి భద్రతల సమస్యగా మలుస్తూనే, కార్మికుల అశాంతికి అసలు కారణాలను కనుగొంటున్నాం అని, ఇక ముందు అలా జరగకుండా చూస్తామని, దిద్దుబాటు చర్యలు చేపడతామని విస్ట్రాన్ యాజమాన్యం, దాని గాడ్ ఫాదర్ అయిన ఏపిల్ సంస్థ చెబుతున్నాయి.

ఈ సంఘటనతో ఇక్కడ దళారీ ప్రభుత్వాలు విదేశీ పెట్టుబడుల రాకకు విఘాతం కలిగిందని బెంబేలెత్తుతున్నాయి. విచ్చిన్నకారులను శిక్షించి శాంతి భద్రతలు కాపాడతామని, మీకేమీ ఆటంకాలు, అవాంతరాలు రానియ్యమని హామీలు ఇస్తున్నాయి. మరిన్ని రాయితీలు, వెసలుబాట్లు కల్పిస్తామని భరోసాలు పలుకుతున్నాయి.

పెట్టుబడి విదేశీదైనా, స్వదేశీదైనా లాభాలకై వేటాడుతుంది. అది దాని లక్షణం. అది దాని సహజ స్వభావం. ఇక్కడ తప్పొప్పులుండవు. ఎలా వీలైతే అలా లాభాలు గడించాలి. సోషలిస్టు మార్గం వదిలిన చైనా లాంటి దేశాలు తమ కార్మిక శ్రేణులను పెట్టుబడికి బానిసలుగ మార్చివేశాయి. డెంగ్ లాంటి కార్మిక శ్రామిక ప్రజా ద్రోహులు చైనాలో వ్యవసాయ కమ్యూన్లను విచ్చిన్నం చేసి గ్రామీణ రైతాంగాన్ని దిక్కులేని చవకబారు కూలీలుగా మార్చి పట్టణాల్లో కుప్పలుగా పోసి పెట్టుబడి బందిపోట్లకు బలిపశువులను చేశారు. ఆకలికి అలమటించేలా చేసి సహనమనే అసహజ గుణాన్ని కార్మికుల కుత్తుకలపై కత్తిపెట్టి నేర్పారు. అదే వాళ్ల విజయమని చైనాలో ఇప్పటి డెంగ్ వారసత్వ గణం చెప్పుకుంటోంది.

ఇదే బాటలో ఇక్కడ మోడీ ముఠా, వ్యవసాయాన్ని కుదేలు చేసి అంబానీ–అదానీ జాగీరుగా మార్చివేసే పనిలో పడింది. పెట్టుబడికి కాషాయ కషాయాన్ని జోడించి ఇండియాను చైనాకు పోటీగా మలచాలని కలలు కంటోంది.

దక్షిణాన ఓ కొసలో నర్సాపురా అనే చిరు పట్టణంలో పెట్టుబడి దూర్త లక్షణాలను పసిగట్టి అక్కడి యువ కార్మిక శక్తి శిక్షిస్తే, ఉత్తరాన అశేష రైతాంగం మోడీ ముసుగును చీల్చి చెండాడుతున్నది.

చైనా రైతాంగం డెంగ్ మోసానికి గురైనట్లు, భారత రైతాంగం గురికాకుండా, కుప్పకూలి పోకుండా మేల్కొందనే చెప్పాలి. నర్సపురా విస్ట్రాన్ కార్మికులు దగాకోరు పెట్టుబడి ఆటలు అరికట్టడంలో అప్రమత్తత ప్రదర్శించి భారత దేశ యువ కార్మిక శ్రేణులకు జాగ్రత్తలు నేర్పినట్లు భావించాలి. ఈ ప్రస్తుత ఘటనలు భారతదేశ శ్రామిక శ్రేణులకు శుభ పరిణామాలుగానే పరిగణించాలి.

(రచయిత శ్రామిక నేస్తం సంపాదకులు) వీ

విచారణలో ఉన్న ఖైదీని హత్య చేసిన రాజ్యం

ఆదివాసి మహిళ కంచన్ నానావరేను తొమ్మిది అక్రమ కేసుల్లో ఇరికించి, అందులో ఆరు కేసుల్లో నిర్దోషిగా రుజువైనా కూడ విడుదల చేయకుండా, బెయిల్ ఇవ్వకుండా ఆరు సంవత్సరాలుగా నిర్బంధించి హత్య చేసిన రాజ్య దుర్మార్గం పై పత్రికా కథనాల సారాంశం

ఆరు సంవత్సరాలుగా విచారణలో ఉన్న ఖైదీగా, తీవ్రమైన హృద్రోగ బాధితురాలిగా, సరైన వైద్య సహాయం అందక ఆదివాసి కార్యకర్త కంచన్ నానావరె పుణె లోని సాసూన్ ఆస్పత్రిలో జనవరి 24న మరణించారు. మహారాష్ట్ర లోని చంద్రపూర్ జిల్లాలో విద్యార్థి ఉద్యమ కార్యకర్తగా ఉండిన కంచన్ కు మావోయిస్టు ఉద్యమంతో సంబంధం ఉన్నదనే ఆరోపణతో 2014లో అరెస్టు చేసి తొమ్మిది కేసులు బనాయించారు. ఈ ఆరు సంవత్సరాలలో విచారణ జరిగి ఆరు కేసులు కొట్టుడు పోయాయి. ఆరోపించిన నేరాలతో ఆమెకు సంబంధం లేదని, ఆమె నిర్దోషి అని న్యాయస్థానాలే తీర్పు చెప్పాయి. ఇంకా మూడు కేసులు విచారణలో ఉన్నాయి. అలా ఏ ఒక్క కేసులోనూ శిక్ష పడకుండానే ఆమె ఆరు సంవత్సరాలుగా జైలులో ఉన్నారు. చనిపోయేనాటికి 38 సంవత్సరాల వయసు ఉన్న కంచన్ కు పుట్టుకతోనే హృదయ సంబంధమైన అనారోగ్యం ఉండింది. వారం రోజుల కింద మెదడుకు సంబంధించిన అనారోగ్యం కూడ మొదలై, జనవరి 16న మెదడుకు శస్త్రచికిత్స జరిగి, తర్వాత వారం రోజులకే మరణించారు. ఆమె అనారోగ్యం పాలయినా, ఆస్పత్రిలో చేర్చి చికిత్స చేయిస్తున్నా, జైలు అధికారులు, పోలీసులు, ప్రభుత్వ యంత్రాంగం శస్త్రచికిత్స జరిగేవరకూ ఆమె కుటుంబానికి గాని, ఆ జైలులోనే ఉన్న ఆమె సహచరుడు అరుణ్ బెల్కె కు గాని సమాచారం కూడ ఇవ్వలేదు.

గత రెండు సంవత్సరాలలో ఆమె సెషన్స్ కోర్టులోనూ, బొంబాయి హైకోర్టు లోనూ ఎన్నో సార్లు బెయిల్ దరఖాస్తులు పెట్టుకున్నారు. కాని ప్రతిసారీ న్యాయస్థానాలు ఆమెకు బెయిల్ ఇవ్వడానికి నిరాకరించాయి. ఆరోగ్య కారణాల మీద బెయిల్ ఇవ్వాలని కోరుతూ బొంబాయి హైకోర్టులో అక్టోబర్ లో తాజాగా ఒక దరఖాస్తు దాఖలయింది. నానాటికీ క్షీణిస్తున్న ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి నివేదికలు, ఆమెకు గుండె మార్పిడి శస్త్ర చికిత్స అవసరమంటూ వైద్యులు చేసిన సూచన కోర్టు ముందర ఉంచడం జరిగింది. ఆ దరఖాస్తు ఇంకా విచారణలోనే ఉంది.

హైకోర్టులో ఆమె బెయిల్ దరఖాస్తు మీద వాదనలు జరుగుతున్నపుడు ఆమె సజీవంగా ఉండాలంటే గుండె మార్పిడి శస్త్ర చికిత్స మాత్రమే ఏకైక మార్గమని వైద్యులు చెప్పిన అంశాన్ని కోర్టు దృష్టికి తేవడం జరిగింది. ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి, తక్షణ వైద్య సహాయం అవసరమా లేదా అని తేల్చడం గురించి ఒక కమిటీని కూడ కోర్టు నియమించింది. కాని ఈ జీవన్మరణ సమస్య మీద విచారణను, నిర్ధారణను, పరిష్కారాన్ని తొందరగా ఇవ్వాలని హైకోర్టు భావించలేదు. విచారణ సాగుతుండగానే ఈలోగా ఆమె మరణించారు.

ఆమెను 2014లో అరెస్టు చేశాక మొత్తం తొమ్మిది కేసులు బనాయించారు. వాటిలో ఆరు కేసుల విచారణ పూర్తయి ఆమె నిర్దోషిగా కోర్టులు నిర్ధారించాయి. మిగిలిన మూడు కేసుల్లో ఒకటి గడ్చిరోలిలో, ఒకటి పుణెలో, మరొకటి గోండియాలో ఉన్నాయి. గత ఆరు సంవత్సరాల జైలు జీవితంలో ఆమె మహారాష్ట్రలోని వేరు వేరు జైళ్లలో విచారణలో ఉన్న ఖైదీగానే ఉన్నారు. ఆమెను, ఆమె సహచరుడు అరుణ్ బెల్కె ను కూడ చట్టవ్యతిరేక కార్యకలాపాల (నిరోధ) చట్టం %--% ఊపా %--% కిందనే నిర్బంధించారు. బెల్కె ఇప్పటికీ జైలులోనే ఉన్నారు.

ఆమె ఎంతో కాలంగా అనారోగ్యంతో ఉన్నప్పటికీ, ఆ విషయాన్ని ఆమె కుటుంబసభ్యులకు కూడ తెలియజేయలేదు. చిట్టచివరికి ఆమె ఆరోగ్యం పూర్తిగా క్షీణించి ఉన్న సమయంలో ఆ సమాచారం తెలియజేస్తూ రాసిన లేఖ జనవరి 24న బెల్కె కుటుంబానికి అందింది. ఆ రోజే ఆమె మరణించిందని ఫోన్ ద్వారా కూడ తెలిపారు.

ఒక బ్యాంక్ అధికారి కూతురు కంచన్ 2004 లో విద్యార్థి ఉద్యమంలో పాల్గొనడం ప్రారంభించారు. ఆమె ఆ రోజుల్లో దేశభక్తి యువ మంచ్ అనే విద్యార్థి సంస్థలో వందలాది మంది విద్యార్థులతో పాటు కలిసి పనిచేశారు. ఆ రోజుల్లో ఆమె స్నేహితురాలైన అనురాధ సోనులె ను 2011 లో కబీర్ కళా మంచ్ అనే సాంస్కృతిక సంస్థ కార్యకర్త అనే పేరుతో అరెస్టు చేశారు. ఆమె 2014లో బెయిల్ మీద విడుదలయ్యారు.

"మేం ఎన్నో విద్యార్థి ఆందోళనల్లో కలిసి పాల్గొన్నాం. అలాగే రైతులకూ, ఆదివాసులకూ, దళితులకూ సంబంధించిన సమస్యలెన్నిటిలోనో మా గొంతెత్తాం. తన ఆరోగ్యం అంత బాగుండనప్పటికీ కంచన్ ఎప్పుడూ చురుగ్గా పాల్గొంటుండేది" అని గుర్తు చేసుకున్నారు అనురాధ సోనులె. దేశభక్తి యువ మంచ్ ను ఆ తర్వాత పోలీసులు మావోయిస్టుల అనుబంధ సంస్థగా ఆరోపించి, ఆమెనూ బెల్కెనూ మొట్టమొదట 2008లో అరెస్టు చేశారు. ఆ ప్రాంతంలో జరిగిన నక్సలైట్ల కార్యక్రమాల్లో పాల్గొన్నారని ఆరోపిస్తూ ఈ ఇద్దరినీ, మరొక డజను మంది విద్యార్థులనూ కలిపి ఊపా కింద కేసు పెట్టారు. ఆ కేసులో వాళ్లు ఏడు నెలల పాటు జైల్లో ఉన్నారు. చివరికి ఆ కేసు కొట్టుడు పోయింది.

కంచన్ ఆస్పత్రిలో ఉన్న సమయంలో చూడడానికి అనురాధ సోనులె వెళ్తే ఆమెను కలవనివ్వలేదు. ఆమెకు శస్త్రచికిత్స జరిగిందని, తలనొప్పి వస్తున్నదని, మెదడులో రక్తం గడ్డకడుతున్నదనీ డాక్టర్ చెప్పారు. ఆ సమయంలోనే పుణె కు చెందిన ఒక మహిళా న్యాయవాదిని మాత్రం కంచన్ ను చూడడానికి అనుమతించారు. అలాగే సహచరుడు అరుణ్ బెల్కెకు కూడ కంచన్ ను చూడడానికి కోర్టు అనుమతి ఇచ్చింది. కాని జైలు అధికారులు వెంటనే అందుకు తగిన ఏర్పాట్లు చేయకపోవడంతో ఆయన ఆమెను కలవకముందే ఆమె చనిపోయింది.

దేశంలో కొవిడ్ మహావిపత్తు ప్రారంభమైన సందర్భంగా గత మార్చ్ లో సుప్రీం కోర్టు తనంతట తనే ఖైదీలను బెయిల్ పై విడుదల చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. మహారాష్ట్ర ప్రభుత్వం పదకొండు వేలమంది ఖైదీలను విడుదల చేస్తానని హామీ ఇచ్చింది. కాని కొందరిని మాత్రమే విడుదల చేసింది. కొత్త ఖైదీలను చేర్చడం మొదలుపెట్టింది. మహారాష్ట్ర

ప్రజావసరాలకు ప్రతిబింబం కావాల్సిన బడ్జెట్

***కోవిడ్-19 వల్ల కుదేలైన భారత ఆర్థిక వ్యవస్థ, విద్య, వైద్యం, ఉపాధి రంగాలకు ప్రాధాన్యతనిచ్చి ప్రజల జీవన ప్రమాణాలను పెంచే దిశగా బడ్జెట్ కేటాయింపులు ఉండాలని అంటున్నారు* డా. ఎ. పున్నయ్య**

భారత బడ్జెట్ అనేది భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 112 ప్రకారం, నిర్దిష్ట సంవత్సరానికి ప్రభుత్వం అంచనా వేసిన ఆదాయం, వ్యయాల ఆర్థిక ప్రకటన. ఇది ప్రతి సంవత్సరం ఏప్రిల్ 1 నుండి మార్చ్ 31 మధ్య కాలానికి తయారు చేస్తారు. సాధారణంగా బడ్జెట్ గత సంవత్సరంలో వచ్చిన ఆదాయ, వ్యయాల ఆధారంగా తయారవుతుంది. ఇందులో ప్రణాళికాబద్ధమైన అమ్మకపు ఖాతాల ఆదాయాలు, వనరుల పరిమాణాలు, ఖర్చులు, ఆస్తులు, నగదు కేటాయింపులన్నింటినీ పరిగణించాల్సి ఉంటుంది. దేశ బడ్జెట్ అనేది ఏ ఒక్కరికో సంబంధించింది కాదు. బడ్జెట్‌ను కంపెనీల, ప్రభుత్వాల, కుటుంబాల, ఇతర అన్ని రకాల సంస్థల కార్యకలాపాలు లేదా సంఘటనల వ్యూహాత్మక ముందస్తు ప్రణాళికలను వ్యక్తీకరించడానికి ఉపయోగిస్తారు. బడ్జెట్ దేశ ప్రజల విస్తృత రాజకీయ, ఆర్థిక ప్రయోజనం కొరకు ప్రభుత్వం రూపొందించుకునే ఆర్థిక విధాన, ఆచరణ పత్రం. అత్యంత రహస్యంగా, ప్రత్యేక ప్రోటోకాల్ ప్రకారం కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే బడ్జెట్ కోసం అశేష ప్రజానీకం ఉత్కంఠగా ఎదురు చూస్తారు. గతంలో విధాన ప్రకటనలు, ఆర్థిక నిర్ణయాలు అన్నీ బడ్జెట్‌లోనే జరిగేవి. ఆర్థిక సంస్కరణల అనంతరం కనీసం ఆర్థిక నిర్ణయాలు కూడా బడ్జెట్‌తో సంబంధం లేకుండా తీసుకుంటున్నారు. ఫలితంగా బడ్జెట్ ప్రాధాన్యతను పాలకులు క్రమక్రమంగా దిగజార్చి బడ్జెట్ భావనలను తలకిందులు చేశారు.

స్థూలంగా బడ్జెట్ ప్రక్రియను బలహీనం చేసి ప్రభుత్వం ఎంతో రహస్యంగా తీసుకునే విధాన నిర్ణయాలను సహితం బహిరంగంగా బహుళజాతి కంపెనీలతో చర్చించి అనంతరం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడం బడ్జెట్ స్ఫూర్తికే విరుద్ధం. ప్రస్తుతం బడ్జెట్ పార్లమెంట్ బయట దేశీయ బడా కార్పొరేట్ల, బహుళజాతి సంస్థల కనుసన్నలలో రూపొందిస్తున్నారనేది నిష్ఠుర సత్యం. పాలకులు ఈ అపసవ్య విధానాన్నే ఆచరణలో అసలు బడ్జెట్ ప్రక్రియగా చూపిస్తున్నారు. బడ్జెట్ గణాంకాలు సహితం అంకెల గారడీగానే ఉంటున్నాయి. ఫలితంగా బడ్జెట్ వల్ల ప్రజాహితం కంటే కార్పొరేట్ల లాభాలే అధికంగా కన్పిస్తాయి. ఈ నేపథ్యంలో బడ్జెట్ ప్రతిపాదనలపై సామాన్య జనానికి పట్టింపు గాని, ఆసక్తి గాని లేకుండా పోయింది. కొద్దోగొప్పో ప్రసార మాధ్యమ విశ్లేషకులు మాత్రమే ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ నేపథ్యంలో రాబోయే బడ్జెట్ ఎలా ఉంటే ఉపయోగంగా ఉంటుందో నిశితంగా పరిశీలిద్దాం.

ప్రభుత్వ ఆర్థిక పరిస్థితులు గణనీయంగా క్షీణించాయని 2020 ఏప్రిల్-నవంబర్ మధ్యకాలంలో కేంద్రానికి రాబడులు 17.9 శాతం కుంచించుకు పోయాయని తాజా ఆర్థిక సుస్థిరత నివేదికలో రిజర్వు బ్యాంకు ప్రకటించింది. 2020-21 ఆర్థిక సంవత్సరంలో దేశ ఆర్థికవృద్ధి 7.9 శాతం తగ్గుతుందని అంచనావేస్తే మొదటి అర్ధ భాగంలోనే 15.7 శాతం వృద్ధిరేటు తగ్గిపోయింది. కరోనా విపత్తుకు ముందు మూడు ఆర్థిక సంవత్సరాలలో స్థిర ధరల ప్రాతిపదికన స్థూల దేశీయోత్పత్తి (జిడిపి) 2017-18లో రు. 121.75 లక్షల కోట్లు, 2018-19లో రు. 139.81 లక్షల కోట్లు, 2019-20లో రు. 145.65 లక్షల కోట్లు. మొదటి ముందస్తు అంచనాల ప్రకారం 2020-21 ఆర్థిక సంవత్సరంలో జిడిపి రు. 134.40 లక్షల కోట్లుగా ఉంటుందని భావిస్తున్నారు. అంటే 2019 - 20 ఆర్థిక సంవత్సరపు జిడిపి స్థాయికి మరలిపోనున్నది. ఈ నేపథ్యంలో ఆర్థిక వ్యవస్థ సత్వరమే ఇతోధిక పురోగతి సాధించాలంటే 2021-22 ఆర్థిక సంవత్సరంలో జిడిపి వృద్ధిరేటు కనీసం 8.37 శాతంగా ఉండాలి. అంతకంటే తక్కువగా ఉంటే స్థిరధరల ప్రాతిపదికన 2020-21

రాష్ట్ర ప్రభుత్వం తీవ్రమైన ఆర్థిక నేరాల కింద, కొన్ని ప్రత్యేక చట్టాల కింద అరెస్టయిన వారిని విడుదల నుంచి మినహాయిస్తున్నానని నిర్ణయం తీసుకుంది. ఆ ప్రత్యేక చట్టాల జాబితాలో ఊపా ఉండడం వల్ల కంచన్‌కు విడుదలయ్యే అరత లేదన్నారు. ప్రాణాంతకమైన అనారోగ్యాన్ని కూడ పరిగణనలోకి తీసుకోలేదు.

గత సెప్టెంబర్ నుంచీ ఆమె ఆరోగ్యం మరింతగా క్షీణించడం మొదలయి, ఆమెను మధ్యమధ్య జైలు నుంచి సాసూన్ ఆస్పత్రిలో చేర్చడం, కొన్నాళ్లకు జైలుకు తిరిగి తీసుకురావడం చేస్తూ వచ్చారు. చివరిగా జనవరి 16న ఆస్పత్రిలో చేర్చారు. బొంబాయి హైకోర్టు ఆదేశాల మేరకు ఆమె చికిత్సను పర్యవేక్షించడానికి ఒక కమిటీని కూడ నియమించారు. ఈలోగా అమెకు ఊపిరితిత్తుల సమస్య, అనేక అవయవాలు పని చేయకపోవడం మొదలయ్యాయి. గుండె మార్పిడి తప్ప ఆమెను సజీవంగా ఉంచగల అవకాశమేదీ లేదని ఒక ప్రైవేటు డాక్టర్ సూచించారు. ఆ ప్రయత్నాలు జరుగుతుండగానే ఆమె మరణించారు.

అబద్ధపు కేసులు బనాయించడం, ఏళ్లు గడుస్తున్న విచారణలు పూర్తి కాకుండా తాత్సారం చేయడం, కొన్ని కేసుల్లో న్యాయస్థానాలే నిర్దోషిగా నిర్ధారించినా విడుదల చేయకపోవడం, బెయిల్ కూడ ఇవ్వకపోవడం, తీవ్రమైన, ప్రాణాంతకమైన అనారోగ్య సమస్యలకు కూడ తక్షణమే మెరుగైన వైద్య సహాయం అందించకపోవడం, కుటుంబ సభ్యులకు కూడ సమాచారం అందించకపోవడం, న్యాయరక్షణలో ఉన్న ఖైదీల ప్రాణాల పట్ల బాధ్యతారహితంగా ప్రవర్తించడం... రాజ్యం చేసిన నేరాలు అనేకం. మావోయిస్టు విప్లవకారుల పేరుతో అమాయక ఆదివాసులను, పీడితులను, సాధారణ ప్రజానీకాన్ని కూడ వేధింపులకు గురిచేస్తున్న రాజ్య దుర్మార్గానికి కళ్లముందరి నిదర్శనం కంచన్ నానావరే జీవితం.

వీ

ఆర్థిక సంవత్సరంలో మనం 11 లక్షల కోట్ల రూపాయలు నష్టపోతాం. 2021- 22 ఆర్థిక సంవత్సరంలో ఈ నష్టం మరింత భారీగా ఉంటుంది. ప్రస్తుత ధరల ప్రకారం 2020-21 ఆర్థిక సంవత్సరంలో ఆర్థిక వ్యవస్థ 9 లక్షల కోట్ల రూపాయలు కోల్పోనున్నది.

ఈ నేపథ్యంలో ప్రస్తుత బడ్జెట్ రూపకల్పనకు ఇటీవలి దేశ స్థితిగతులను పరిశీలించి, కోవిడ్ వల్ల కుప్పకూలిన ఆర్థిక వ్యవస్థను దృష్టిలో ఉంచుకొని బడ్జెట్ తయారు చేయాల్సిన అవసరముంది. నిజానికి నేలబారిన జాతీయ వస్తు ఉత్పత్తిని పూర్వ స్థితికి తీసుకురావడం ప్రభుత్వానికి పెద్ద సవాలే. ఈ బడ్జెట్‌లో కీలకంగా లాక్‌డౌన్ కారణంగా మందగించిన ఆర్థిక వ్యవస్థకు ఊపుతెచ్చేందుకు వృద్ధిరేటును పెంచడం, కరోన వల్ల దెబ్బతిన్న వర్గాలను ఆదుకోవడం వ్యవసాయ రంగానికి ఊతం ఇవ్వడం పారిశ్రామిక రంగాన్ని పరుగులు పెట్టించడం బడ్జెట్ ముందున్న ప్రాధమ్యాలు. ఒకవైపు అత్యవసర ఖర్చులకు ప్రాధాన్యత ఇస్తూనే మరొకవైపు రాబడి పెరిగే మార్గాలపై దృష్టి పెట్టాలి.

2021-22 ఆర్థిక సంవత్సరానికి ఎన్‌డిఎ ప్రభుత్వం స్వతంత్ర భారత చరిత్రలో మొట్టమొదటిసారి కేంద్ర బడ్జెట్ కాగితంపై ముద్రించకుండా పేపర్లెస్ మోడ్‌లో ప్రెజెంట్ చేయబోతోంది. దీంతో బడ్జెట్ ఎలా ఉండబోతోందనే అంశాల కంటే బడ్జెట్ ఎలా ప్రెజెంట్ చేస్తారన్నది కూడా ఆసక్తిగా మారింది. ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టనున్న యూనియన్ బడ్జెట్ పత్రాలను కోవిడ్-19 కారణంగా అస్సలు ముద్రించకూడదని కేంద్రం నిర్ణయించింది. దీంతో ఇది ఓ చారిత్రక నిర్ణయంగా మారింది. యూనియన్ బడ్జెట్ 2021-22 సాఫ్ట్ కాపీలు మాత్రమే ప్రజా ప్రతినిధులకు, అధికారులకు, మీడియాకు అందనున్నాయి.

ఈసారి బడ్జెట్ కనివిని ఎరుగని రీతిలో మహత్తరంగా ఉంటుందని గతంలో మాదిరిగానే ప్రకటించింది. గడిచిన ఆరేళ్లుగా ప్రజలకు నిరాశే ఎదురవుతున్న నేపథ్యంలో ఎవరికి మహత్తరమో తేలాల్సి ఉంది. నిజానికి కోవిడ్-19కు ముందే పాలకులు అనుసరిస్తున్న, కొనసాగిస్తున్న ఆర్థిక విధానాలు, అనాలోచిత నిర్ణయాలవల్ల దేశ ఆర్థిక వ్యవస్థ తలకిందులైంది. దీనికి తోడు కరోనా సృష్టించిన పెను ఉత్పాతం వల్ల ఆర్థిక వ్యవస్థ మరింత అతలాకుతలం అయింది. ఈ క్రమంలో ప్రభుత్వం కరోనా కట్టడిలోనే కాదు, దేశ ఆర్థికాభివృద్ధిని కాపాడడంలో విఫలమైంది. ఫలితంగా ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో జిడిపి వృద్ధి మైనస్ 23.9 శాతం పతనంతో గడిచిన 73 సంవత్సరాలలో ఎన్నడూ లేనంత కనిష్టంగా నమోదైంది.

ఆర్థిక కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోయిన ఈ తరుణంలో బడ్జెట్‌లో కొత్తగా పన్నులను విధించడం తగదు. కొత్తగా పెద్ద ఎత్తున పన్నులను విధించడం వలన పేదలను మరింత పేదరికంలోకి తోసినట్లవుతుంది. కోవిడ్-19 ప్రభావంతో కొనుగోలు శక్తి తగ్గింది. బడ్జెట్‌లో కొత్తగా ఎలాంటి పన్నులు ఉండకూడదు. ఈ బడ్జెట్ రూపకల్పనలో ద్రవ్యలోటును దృష్టిలో ఉంచుకుని పన్నులు లేని బడ్జెట్ ప్రవేశపట్టాల్సిన అవసరముంది. అంతేకాకుండా పన్ను కేసుల పరిష్కారానికి నిజాయితీతో కూడిన ప్రయత్నం చేయాలి. ఆర్థిక సంవత్సరం 2019 నాటికి అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం వివాదాల్లో ఉన్న పన్నుల మొత్తం రు. 9.5 లక్షల కోట్లుగా ఉంది. వివాదాల్లో ఉన్న పన్నుల్లో కార్పొరేట్ ట్యాక్స్ రు. 4.05 లక్షల కోట్లు, ఆదాయ పన్ను కేసుల్లో ఇరుకున్నది రు. 3.97 లక్షల కోట్లు, ఇతర కమొడిటీస్, సర్వీసెస్ ట్యాక్స్ రూపంలో రు. 1.54 లక్షల కోట్ల మొత్తం వివాదాల్లో ఉందని ఎస్‌బిఐ ఆర్థికవేత్తలు ప్రభుత్వానికి రాసిన నోట్‌లో పేర్కొన్నారు. కనుక ఈ మొత్తం రాబడికోసం చిత్తశుద్ధితో కూడిన స్పెషల్ రికవరీ డ్రైవ్‌ను నిర్వహించాలి. ద్వంద్వ పన్నుల చెల్లింపు నివారణ ఒప్పందాలను సవరిస్తే కార్పొరేట్ పన్నులు రు. 3.2 లక్షల కోట్ల నుండి రు. 4 లక్షల కోట్లకు పెంచవచ్చు. ద్వంద్వ పన్నుల చెల్లింపు అవకాశంతో మనదేశంలో పన్నులు భారీ స్థాయిలో ఉంటున్నందున వాటి చెల్లింపును తప్పించుకోవడానికి మన కార్పొరేట్ కంపెనీలు తమ ప్రధాన కార్యాలయాలను విదేశాలకు తరలించే ధోరణి అంతకంతకూ పెరుగుతోంది. కావున దీనిని రద్దు చేయాలి.

ఆదాయపుపన్ను రేట్లను పెంచి తీరాలి. గత ఆర్థిక సంవత్సరంలో ఈ పన్ను వసూళ్లలో కేంద్ర ప్రభుత్వ వాటా రు. 2.8 లక్షల కోట్లు. 2021-22 ఆర్థిక సంవత్సరంలో ఈ వాటాను రు. 4 లక్షల కోట్లకు పెంచి తీరాలి. దీనివల్ల మెరుగైన ఆదాయవర్గాల వారి నుంచి వినియోగ డిమాండ్ తగ్గిపోయే మాట నిజమే. అయితే ప్రభుత్వం అనుకుంటే హెలికాప్టర్ మనీ నుంచి మరింత భారీ డిమాండ్‌ను సృష్టించవచ్చు.

వస్తుసేవల పన్ను రేట్లను తగ్గించాలి. 2019-20లో జిఎస్‌టి వసూళ్లలో కేంద్ర ప్రభుత్వ వాటా రు. 6.1 లక్షల కోట్లు. దీనిని కొత్త ఆర్థిక సంవత్సరంలో రు. 4 లక్షల కోట్లకు తగ్గించాలి. ఈ చర్య వల్ల మార్కెట్‌లో సరుకుల ధరలు తగ్గి, తత్ఫలితంగా డిమాండ్ పెరుగుతుంది. కస్టమ్స్ సుంకాల (దిగుమతులపై విధించే పన్ను)ను మూడు రెట్లు పెంచాలి. గత ఆర్థిక సంవత్సరంలో ఈ సుంకాల వసూళ్లలో కేంద్ర ప్రభుత్వ వాటా రు. 0.6 లక్షల కోట్లు. ఈ మొత్తాన్ని రు. 2 లక్షల కోట్లకు పెంచి తీరాలి.

పెట్రోలియం ఉత్పత్తులపై ఎక్సైజ్ సుంకాలను పెంచాలి. 2019-20 ఆర్థిక సంవత్సరంలో ఈ సుంకాల వసూళ్లలో కేంద్ర ప్రభుత్వ వాటా రు. 2.5 లక్షల కోట్లు. రాబోయే ఆర్థిక సంవత్సరంలో ఈ వాటాను రు. 4 లక్షల కోట్లకు పెంచాలి. పెట్రోలియం ఉత్పత్తుల ధర పెరుగుదల వల్ల సామాన్యునిపై మరింత ఆర్థిక భారం పడుతుంది. అయితే ఈ నష్టానికి హెలికాప్టర్ మనీ ద్వారా పరిహారం సమకూర్చవచ్చు.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 7 శాతానికి పైగా ఉన్న ఆర్థిక లోటును 2019- 20 ఆర్థిక సంవత్సరంలో వలే స్థూల దేశీయోత్పత్తి (జిడిపి)లో 3.8 శాతానికి పరిమితం చేయాలి. దీనివల్ల అప్పుల నుంచి రు. 7.6 కోట్లు సమకూరుతాయి. 2019-20లో కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ విలువ రు. 27 లక్షల కోట్లు. పైన సూచించిన విధంగా పెరిగే పన్ను వసూళ్లతో రాబోయే కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ మొత్తం విలువ రు. 30 లక్షల కోట్లుగా ఉంటుంది.

వ్యయాల విషయానికి వస్తే రక్షణ రంగానికి కేటాయింపులను పెంచాలి. గత ఆర్థిక సంవత్సరంలో రక్షణ రంగానికి కేంద్రం మొత్తం రు. 4.4 లక్షల కోట్లు వెచ్చించింది. సరిహద్దుల నుంచి ముప్పు ముమ్మర మైనందున ఈ వ్యయాన్ని 2021-22లో రు. 7లక్షల కోట్లకు పెంచి తీరాలి. అలాగే టెక్నాలజీ, కమ్యూనికేషన్‌ల రంగాలకూ కేటాయింపులు పెంచాలి. గత ఆర్థిక సంవత్సరంలో కేంద్రం ఈ రెండు రంగాలకు రు. 0.3 లక్షల కోట్లు చొప్పున ఖర్చు పెట్టింది. 2021-22 ఆర్థిక సంవత్సరంలో ఈ వ్యయాలను ఐదు రెట్లు పెంచాలి. సాంకేతికతల అభివృద్ధిలో దేశం అగ్రగామిగా విలసిల్లేందుకు ఈ వ్యయాలు విశేషంగా తోడ్పడతాయి.

ఆరోగ్య మంత్రిత్వ శాఖకు కేటాయిస్తున్న రు. 0.6 లక్షల కోట్లను యథాతథంగా కొనసాగించాలి. మౌలిక సదుపాయాల అభివృద్ధి వ్యయాలను తాత్కాలికంగా తగ్గించాలి. ప్రజా పంపిణీ వ్యవస్థ, గ్రామీణ ఉపాధి హామీ పథకం, విద్యారంగ వ్యయాలను పూర్తిగా రద్దు చేయాలి. 2019-20లో ఈ పథకాలు, కార్యక్రమాలకు కేంద్రం రు. 20 లక్షల

కోట్లు వెచ్చించింది. 2021–22లో ఈ మొత్తాన్ని రు. 10 లక్షల కోట్లకు తగ్గించాలి.

కోవిడ్ మహమ్మారి, దాని ఫలితాల నుంచి పాఠాలు నేర్చుకుని వైద్య రంగంపై రు. 2.5 లక్షల కోట్లు వ్యయం చేయాల్సి ఉందని ప్రభుత్వానికి ఆర్థికవేత్తలు సలహా ఇచ్చారు. ఆర్థిక సంవత్సరం 2021లో జిడిపిలో కేవలం 1 శాతం మేర మాత్రమే ఆరోగ్య రంగంపై ప్రభుత్వం ఖర్చు చేసిందని ప్రస్తావించారు కనుక వైద్యంతో పాటు వయోవృద్ధుల కోసం సేవింగ్స్‌కు ప్రోత్సాహకాలు ప్రకటించాలి. దీనివల్ల ద్రవ్య సమస్యలు కూడా కనిష్ఠంగా ఉంటాయి.

ఆర్థిక వేత్తలు సూచించినట్లు ఈ మాంద్యం నుండి గట్టెక్కుటకు కీనెసియన్ విధానాన్ని అనుసరించి ప్రభుత్వం బడ్జెట్ ప్రణాళికలను రూపొందించాలి. దేశంలో అశేష ప్రజానీకానికి ఉపాధిని కల్పించే సూక్ష్మ, చిన్నతరహా, మధ్యతరహా పరిశ్రమల్లో భారీగా పెట్టుబడులుండాలి. ఢిల్లీ శివారులో జరుగుతున్న రైతుల ఆందోళనలను దృష్టిలో ఉంచుకొని ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న భారత వ్యవసాయ రంగానికి, రైతు సంక్షేమానికి సానుకూలమైన బడ్జెటును రూపొందించాలి. వ్యవసాయానికి తోడుగా కోళ్లఫారాలు, చేపల ఉత్పత్తి వంటి మౌలిక రంగంలో పెట్టుబడులతో పాటుగా ఉత్తమ సలహాలతో కూడిన వ్యూహాలు ఉండాలి. ఉపాధికల్పన విషయంలో బడ్జెట్‌లో తగిన శ్రద్ధ తీసుకోవాలి. ప్రధానంగా ప్రభుత్వం నుంచి భూమి, నీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలను రాయితీ రేట్లకు పొందుతున్న ప్రైవేట్ పరిశ్రమల్లో స్థానికులకు నిర్దిష్ట శాతంలో ఉద్యోగాలు ఇచ్చేటట్లు బడ్జెట్‌లో షరతులుండాలి. డిఎఫ్ఐ (డెవలప్‌మెంట్ ఫైనాన్స్ ఇన్‌స్టిట్యూషన్) ఏర్పాటు, ఫైనాన్షియల్ సేవింగ్స్ సమృద్ధి కోసం స్పష్టమైన ప్రణాళిక ఉండాలి. రాష్ట్రాలు పవర్ ట్రాన్స్‌మిషన్ అసెట్స్‌ను మోనిటైజ్ చేసుకుని ఇతర పనులకు మూలధనాన్ని ఉపయోగించేల ఉండాలి.

ఇక బ్యాంకింగ్ విషయానికి వస్తే ప్రభుత్వరంగ బ్యాంకుల్లో ప్రభుత్వ యాజమాన్యాన్ని 51 శాతానికి తగ్గించుకునేలా స్పష్టమైన ప్రణాళికను రూపొందించాలని ఆర్థిక వేత్తల అభిప్రాయం. బ్యాంకులపై పన్ను విధింపుపై స్పష్టత ఇవ్వాలి. సిబిడిటి రూపొందించిన నిబంధనల ప్రకారం మొండి బకాయిలు, అనుమానిత అప్పులపై ఆదాయాన్ని కూడా ఆదాయ పన్ను చట్టం కింద గుర్తించాలి. భారతదేశ మానవ అభివృద్ధిని ప్రతికూలంగా ప్రభావితం చేసే ప్రాథమిక కారకాలు ఆరోగ్యం, విద్య. ఈ రెండు కారకాల నాసిరకం వలన ప్రపంచ మానవ అభివృద్ధి సూచికలో 189 దేశాలలో భారతదేశం కేవలం 131 స్థానంలో ఉండడం విచారకరం. కోవిడ్–19 భారతదేశంలో అసమానతలను మరింత విస్తృతం చేసింది. ఈ సంక్షోభ అనుభవం సామాజిక రంగ వ్యయం పెరుగుదల ఆవశ్యకతను గుర్తించింది. ఈ నేపథ్యంలో 2021–22 కేంద్ర బడ్జెట్, ఆరోగ్యం, విద్య, సామాజిక భద్రత కోసం కేటాయింపులను పెంచడం ద్వారా సామాజిక రంగానికి ప్రాధాన్యత ఇవ్వాలి. భారతదేశంలో జిడిపి వృద్ధితో పోలిస్తే సామాజిక రంగంలో పురోగతి చాలా తక్కువగా ఉంది.

ప్రపంచ చరిత్రలో సామాజిక రంగంలో అధిక పెట్టుబడులు పెట్టకుండా ఏ దేశమూ పురోగతి సాధించలేదు. సామాజిక రంగంలో అంతర్గత పురోగతి సాధన ద్వారా అధికవృద్ధి సాధ్యమవుతుంది. గత కొన్ని సంవత్సరాలుగా సాంఘిక రంగ వ్యయాలను పరిశీలిస్తే జిడిపిలో విద్య వాటా 2.8 నుండి 3 శాతం వరకు నిలిచిపోయింది. ఆరోగ్య రంగంలో 1.2 శాతం నుండి 1.5 శాతం మాత్రమే. సాధారణంగా భారతదేశంలో ఆరోగ్యం, విద్యా రంగాలలో తక్కువ కేటాయింపులు ఉండడం వలన గణనీయమైన ప్రాంతీయ, సామాజిక, లింగ అసమానతలు పెరిగినాయి. కోవిడ్–19ను ప్రస్తుతం, భవిష్యత్తులో ఎదుర్కొనుటకు ఆరోగ్యరంగ వ్యయాల పెరుగుదల ముఖ్యం.

కీనెసియన్ విధానాన్ని పరిశీలించాలనుకుంటున్న ప్రభుత్వ ప్రణాళికలను ఎస్‌బిఐ ఆర్థిక వేత్తలు సమర్థించడంతో ప్రభుత్వం రోడ్లు, పౌర విమానయానం, వ్యవసాయం వంటి మౌలిక రంగంలో పెట్టుబడులకు ఉత్తమ సలహాలతో కూడన వ్యూహాలు అనుసరించాలి. సామాజిక రంగంలో ప్రధాన సమస్యగా ఉన్న పోషకాహార లోపాన్ని అధిగమించడానికి ఐసిడిఎస్, ఇతర పోషకాహార కార్యక్రమాలకు కేటాయింపులు పెంచాల్సిన అవసరం ఉంది.

కోవిడ్–19 కాలం భద్రతా వలలపై కొన్ని పాఠాలను కూడా అందిస్తుంది. మహమ్మారి సమయంలో వలస కార్మికులు ఎక్కువగా ప్రభావితమయ్యారని, వారికి భద్రత లేదని తెలిసింది. పట్టణ పేదలకు ఉపాధి హామీ పథకం, వలసదారులకు సౌకర్యాలు వంటి భద్రత ఉండాల్సిన అవసరం ఉంది. అదే విధంగా గ్రామీణ ప్రాంతాల్లో, రివర్స్ మైగ్రేషన్ కారణంగా ఎంజిఎన్ఆర్ఇజిఎకు కేటాయింపులు పెంచాల్సి ఉంది.

మానవ అభివృద్ధిని పెంచడానికి నాణ్యమైన విద్యా, వైద్యం కీలకం. ఇదివరకే అదమ స్థితిలో ఉన్న విద్యా వ్యవస్థను కోవిడ్–19 మరింత దిగజార్చింది. ఆన్‌లైన్ ద్వారా విస్తరిస్తున్న డిజిటల్ విద్య సంపన్నులకు మాత్రమే అందింది. అందరికి అందాల్సిన నాణ్యమైన విద్య కేవలం పట్టణ ప్రాంతానికి పరిమితమైంది. గ్రామీణులు ఆన్‌లైన్ విద్యను అందుకోవడంలో వెనుకపడ్డారు. విద్యలో సమానత్వం ఉంటే మానవ అభివృద్ధిని పెంచడానికి, కార్మిక మార్కెట్లో అసమానతలను తగ్గించడానికి దోహదపడేది. నేటి కస్తూరి రంగన్ కమిషన్‌తో సహ విద్యపై ప్రభుత్వ వ్యయం జిడిపిలో 6 శాతం ఉండాలని పలు కమిటీలు సిఫారసు చేశాయి. కానీ దానిమీద అంగుళం కూడా ముందుకు జరగడం లేదు. ఈ బడ్జెట్‌లో నైనా కమిటీ సిపార్సుల మేరకు కేటాయింపులుండాలి.

2019–20 బడ్జెట్ ఆధారంగా ప్రస్తావిత వ్యయాలకు రు. 22 లక్షల కోట్లు అవసరమవుతాయి. ఈ మొత్తం పోను మొత్తం ఆదాయం రు. 30 లక్షల కోట్లలో రు. 8 లక్షల కోట్లు మిగులుతాయి. ఈ మిగులు డబ్బును 140 కోట్ల భారత పౌరుల బ్యాంక్ ఖాతాలకు 'హెలికాప్టర్ మనీ'గా జమచేయాలి. ఒక్కో వ్యక్తికి నెలకు రు. 500 చొప్పున సమకూరుతుంది. సంక్షేమ పథకాల రద్దు, పెట్రోలియం ఉత్పత్తుల పెరుగుదల వల్ల వాటిల్లే నష్టాన్ని ఈ నగదు బదిలీ భర్తీ చేస్తుంది. మార్కెట్‌లో డిమాండ్‌ను ఇతోధికం చేసేందుకు ఇది తోడ్పడుతుంది. దీనితో పాటు దిగుమతి సుంకాల పెంపుదల ఫలితంగా మార్కెట్‌లో సరుకులకు డిమాండ్ పెరుగుతుంది. ఫలితంగా ఉత్పత్తి పెరుగుతుంది. ఉత్పత్తి పెరుగుదల కొత్త ఉద్యోగాల సృష్టికి దారితీస్తుంది. భద్రమైన ఆదాయాలు మరింత డిమాండ్‌కు ఉద్దీపన అవుతాయి. ఆర్థిక వ్యవస్థ మెరుగుపడిన తరువాత ఒకటి రెండు సంవత్సరాలలో హైవేలు మొదలైన మౌలిక సదుపాయాలపై వ్యయాలను పునరుద్ధరించవచ్చు.

మనం ప్రస్తుతం ఒక సంక్షోభంలో ఉన్నాం. పెద్ద ఎత్తున రుణాలు తీసుకోవడం ద్వారా పెట్టుబడి సాంద్ర మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల నిర్మాణానికి భారీ వ్యయాలు చేయడం శ్రేయస్కరం కాదు. ఆ అప్పులు వడ్డీరేట్లను పెంచుతాయి. ఆర్థిక వ్యవస్థను కుంగదీస్తాయి. పన్నుల పెంపుదల, ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా దేశీయ మార్కెట్‌లో డిమాండ్ అధికమయ్యేందుకు ఈ బడ్జెట్ ఆధారం కావాలి. మొత్తంగా ప్రజల్లో ఆత్మ స్థైర్యం పెంచే విధంగా బడ్జెట్ కేటాయింపులుండాలి.

(రచయిత అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలంగాణ విశ్వవిద్యాలయం) వీ

ఎన్‌కౌంటర్ అంటే జీవించే హక్కును నిరాకరణే

***కశ్మీర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్ సందర్భంలో పోలీసు అధికారులు ప్రమోషన్‌లు, రివార్డుల కోసం అమాయకులను చంపి ఎన్‌కౌంటర్‌గా ప్రచారం చేస్తున్నారని అంటున్నారు* వంగాల సంపత్ రెడ్డి**

పుల్వామా జిల్లాలో డిసెంబర్ 30న ఎన్‌కౌంటర్ జరిగింది. ఆ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు యువకులు చనిపోయారు. వారికి తీవ్రవాదులతో సంబంధాలు ఉన్నాయని సైన్యం ప్రకటించగా వారు అమాయకులని వారి కుటుంబ సభ్యులు ప్రకటించారు. ఆ ఎన్‌కౌంటర్‌లో మక్బూల్ అనే హెడ్ కానిస్టేబుల్ కుమారుడు అయిజాజ్ కూడా ఒకడు. అప్పటికే అతను పుల్వమా జిల్లా పుత్రిగ్రామ్‌లో తన ఇంటిలో డాక్టర్ సలహాతో వెన్నునొప్పి వలన విశ్రాంతి తీసుకుంటున్నాడు. అయిజాజ్ మరణంతో ఆ ఇంటి పరిసరాలన్నీ దుఃఖంతో మునిగిపోయాయి. అతని మరణం అక్కడి ప్రజలను కదిలించింది. వేలాది మంది ప్రజలు వచ్చి తమ సానుభూతిని ప్రకటిస్తున్నారు.

ఎన్‌కౌంటర్‌లో మరణించిన వారిలో మరొకరు పుల్వామా జిల్లాలోనే బెల్లో గ్రామానికి చెందిన పదహారు సంవత్సరాల ఆథర్. ఆథర్‌ది ఆర్థికంగా ఉన్న కుటుంబం. తన తండ్రితో కలిసి డిసెంబర్ 29న మూడు గంటల వరకూ పుల్వామాలోనే ఉన్నాడు. మరుసటి రోజే అతను శవమై కనిపించాడు. చనిపోయిన వారిలో ఇంకొకరు తుర్కేవాగన్ గ్రామానికి చెందిన జుబైర్. ఇతడు మేస్త్రీగా పని చేసేవాడు. అతని సోదరులు పోలీసులుగా పనిచేస్తున్నారు.

చనిపోయిన వారిలో ఇద్దరు యువకులు ఆన్ గ్రౌండ్ వర్కర్స్ ప్రచారం జరిగింది. ఆన్ గ్రౌండ్ వర్కర్స్ పేరుతో అమాయకులను చంపుతున్నారని అక్కడి రాజకీయ నాయకులు, ప్రజలు ఆరోపిస్తున్నారు.

చనిపోయిన వాళ్లు తమ సభ్యులు కాదని కశ్మీర్ కోసం పోరాడుతున్నామంటున్న సంస్థలే ప్రకటించాయి. నిజానికి చనిపోయిన ముగ్గురు యువకుల మీద కనీసం 'రాళ్లు రువ్విన కేసులు' కూడా లేవు.

ఎప్పటిలాగానే పుల్వామా, షోపియాన్‌లలో ఇంటర్‌నెట్ బంద్ చేశారు. 370 అధికరణం రద్దు, కశ్మీరు విభజన ద్వారా పాలకవర్గాలు కశ్మీరీయులలో అనేక అనుమానాలను రేకెత్తించారు. వాటికి తోడుగా ప్రజా జీవనాన్ని నెలల తరబడి నిర్బంధించారు. అంతేకాకుండా ప్రసార మాధ్యమాలను నియంత్రించారు. ఒక విధంగా చెప్పాలంటే అప్రకటిత ఎమర్జెన్సీ విధించారు. కశ్మీరీయుల జీవితం చిన్నాభిన్నామైంది.

నిజంగా ఈ ఎన్‌కౌంటర్ మొదటిది కాదు చివరిది కాదు. ఈ ఎన్‌కౌంటర్‌తో పాలక వర్గం కశ్మీర్ ప్రజల ఆకాంక్షలను – అవి ఏవైనా – అణిచివేయజాలదు. అందుకు చరిత్రే సాక్ష్యం.

పుల్వామా జిల్లాలో డిసెంబర్ 30న జరిగింది నకిలీ ఎన్‌కౌంటర్ అని చెప్పడానికి ఆర్మీ కమాండర్ మూడు సార్లు చేసిన భిన్న ప్రకటలే సాక్ష్యం. పోలీసులు, సిఆర్‌పిఎఫ్ కలిసి ఎన్‌కౌంటర్ చేశామని సైన్యం ప్రకటించగా – సిఆర్‌పిఎఫ్ అధికారులు ఆ ప్రకటనను ఖండించారు. ఆ ఎన్‌కౌంటర్‌తో సిఆర్‌పిఎఫ్‌కు సంబంధం లేదన్నారు.

ఎన్‌కౌంటర్ జరిగిన తరువాత పోలీస్ డిపార్టుమెంట్‌కు చెందిన ఒక కానిస్టేబుల్ మాత్రం అక్కడికి వెళ్లి వచ్చాడని పోలీసులు చెప్పారు. ఎప్పటిలాగే ఈ ఎన్‌కౌంటర్‌పై విచారణ చేస్తామని పోలీసులు ప్రకటించారు.

ఎన్ని కేసులు పెట్టినా, విచారణలు జరిపినా ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న వారికి శిక్షపడే అవకాశాలు చాలా తక్కువ. పట్టపగలు జరిగిన హత్యగా ఈ ఎన్‌కౌంటర్ ను అక్కడి ప్రజలు అభివర్ణించారు.

నగదు అవార్డుల కోసం అమాయకులను ఉగ్రవాదుల పేరుతో చంపుతున్నారనే ఆరోపణకు ఈ ఎన్‌కౌంటర్ సాక్ష్యమని ప్రజలు భావిస్తునారు. కశ్మీర్ యువకుల ప్రాణాలు ఆఫీసర్ల ప్రమోషన్లకు, అవార్డులకు పనికివచ్చే వస్తువులుగా మారిపోయాయి. జమ్మూ కశ్మీర్ జనజీవితంలో ఎన్‌కౌంటర్‌లు సాధారణమయ్యాయి.

ఒక వ్యక్తి జీవించే హక్కును నిరాకరించే సమాజం ఎలా ప్రజాస్వామిక సమాజం అవుతుంది? ఆ వ్యక్తి ఏ రాజకీయ విశ్వాసాలు కలిగి ఉన్నా సరే అతని జీవించే హక్కును నిరాకరించడం ఎప్పుడూ కూడా ఉన్నత నాగరికతా లక్షణంగా కనిపించదు. అయితే ప్రజాస్వామ్యాన్ని రక్షించే పేరుతో పాలకవర్గాలు జీవించే హక్కును కాలరాస్తున్నాయి. ఇప్పుడు కశ్మీర్‌లో జరుగుతుంది ఇదే.

అణిచివేతతో ఏ పాలకవర్గం ఏమీ సాధించలేదు. చరిత్ర అధ్యయనం చేసిన వారెవరైనా చెబుతారు. ప్రజల ఆకాంక్షలను పట్టించుకోనంతకాలం, అణిచివేసినంతకాలం అవి కొంతకాలం స్తబ్దంగా ఉండవచ్చు. కాని పరిస్థితులు అనుకూలంగా ఉన్నపుడు కొత్త రూపాలను తీసుకుని ముందుకు వస్తాయి.. ఎప్పుడూ కూడా అణిచివేత సకల సమస్యలకు పరిష్కారం కాదు.

(రచయిత అధ్యాపకులు) వీ

మధు కాగుల కన్నుమూత

సామాజిక, పౌరహక్కుల కార్యకర్త మధు కాగుల (52) మహబూబ్‌నగర్ జిల్లాలోని స్వగృహంలో గుండెపోటుతో జనవరి 15న మృతిచెందారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని పోలెపల్లి సెజ్ వ్యతిరేక ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. విద్యార్థి దశ నుంచే ప్రజా ఉద్యమాల్లో పనిచేశారు. ఆయన ఉండవల్లిలో ప్రాథమిక విద్యను, కర్నూలులో ఇంటర్, బిఏ చదివి అనంతపురంలోని శ్రీకృష్ణదేవరాయవర్సిటీలో ఎల్ఎల్‌బి, ఎంఎస్‌డబ్ల్యు చదివారు. ఆరోజుల్లోనే పౌరహక్కుల ఉద్యమ నేత ప్రొ. శేషయ్యతో పరిచయం ఏర్పడి సామాజిక, పౌరహక్కుల ఉద్యమాల్లో క్రియాశీలకంగా పాల్గొన్నారు. డిఆర్‌డిఏలో వెలుగు కోఆర్డినేటర్‌గా కొంతకాలం పనిచేసి 2005లో రాజీనామా చేసి పూర్తి సామాజిక ఉద్యమాల్లో పాల్గొన్నారు. తెలంగాణ జనసభకు మహబూబ్‌నగర్ జిల్లా కో కన్వీనర్‌గా పనిచేశారు. పౌరహక్కుల సంఘం, విప్లవ రచయితల సంఘాల్లో సభ్యుడిగా కొనసాగారు.

కొవాక్సిన్ ఎంతవరకు సురక్షితం?

దేశంలో కోవిడ్‌కు నివారణగా అనుమతించిన కోవాక్సిన్‌పై ఇంకా సందేహాలు తొలగిపోలేదనీ, అవి ఎంత వరకు సురక్షితమో తేలాల్సి ఉందనీ, అప్పటి వరకు స్వయం నియంత్రణను పాటించడమే ఉత్తమమనీ అంటున్నారు డా. కఫీల్ ఖాన్

భారత్ బయోటెక్ కంపెనీ తయారుచేస్తున్న కొవాక్సిన్ వాక్సిన్‌కు హడావుడిగా అనుమతి ఇవ్వడం ఆందోళనకరంగా ఉంది. మూడవదశ పరీక్షలు ఇంకా కొనసాగుతూ ఉండడమే దీనికి కారణం. వాక్సిన్‌ను తయారు చేయడానికి సంవత్సరాల సమయం పడుతుంది. నియంత్రణా చట్టాన్ని సడలించినప్పటికీ, దాన్ని తయారుచేయడంలో నాణ్యతా ప్రమాణాల క్రమాన్ని తప్పనిసరిగా పాటించాలి. భారత్ బయోటెక్ కంపెనీ నిర్వీర్యం చేయబడిన వైరస్‌ను నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ నుండి కేవలం యాభైరోజుల క్రితమే పొందింది. ఇంతకొద్ది కాలంలో వాక్సిన్ తయారీ మానవులమీద ప్రయోగించే దశకు చేరుకోగలిగిందని చెప్పటంపైన సందేహాలు ఉన్నాయి. ప్రశ్నలు చాలానే వున్నప్పటికీ వాటిలో కొన్నింటికి మాత్రమే జవాబులు లభిస్తున్నాయని అంటున్నారు డాక్టర్ కఫీల్ ఖాన్.

మనం నూతన సంవత్సరంలోకి ప్రవేశిస్తున్నాం. కోవిడ్-19 ప్రమాదం ఇంకా కొనసాగుతూనే ఉంది. అయితే 2021, జనవరి 3న ఒక శుభవార్త వెలువడింది. డ్రగ్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా (డిసిజిఐ) భారతదేశంలో పరిమిత అత్యవసర వినియోగం కోసం రెండు వాక్సిన్‌లకు అనుమతిచ్చారన్నది ఆ వార్త. ఈ విషమ కాలంలో అది చాలా ఆశావాహమైన వార్త.

ఆ రెండు వాక్సిన్‌లలో మొదటిది, ఆక్స్‌ఫర్డ్-ఆస్ట్రాజెంకా కంపెనీ తయారుచేసిన కొవిషీల్డ్. సిరమ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా మనదేశంలో ఈ వాక్సిన్‌ను ఉత్పత్తి చేస్తుంది. రెండవ వాక్సిన్ పేరు కొవాగ్జిన్. దీన్ని భారత్ బయోటెక్ కంపెనీ- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్‌లతో కలిసి- తయారుచేస్తోంది. మందుల నియంత్రణాధికారి, విషయ నిపుణులతో కూడిన ఒక కమిటీ జనవరి 1, 2021న తన సిఫారసులను ఇచ్చింది. అత్యవసర పరిస్థితుల్లో ఈ రెండు వాక్సిన్‌లను వాడడానికి అనుమతి లభించింది.

కొవిషీల్డ్ వాక్సిన్‌ను ఆక్స్‌ఫర్డ్-ఆస్ట్రాజెంకా రూపొందించిన మాస్టర్ సీడ్ నుంచి (మూల కారకం) అభివృద్ధి చేశారు. సార్స్- కోవ్-2 వైరస్‌కు చెందిన ఒక జాతిని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ వేరుచేయగా దాని నుంచి కొవాగ్జిన్‌ను తయారుచేశారు. ఈ రెండు వాక్సిన్‌లను రెండు దఫాలుగా మూడు నుంచి పన్నెండు వారాల వ్యవధిలో వాడాలి. వీటిని సాధారణ రిఫ్రిజిరేటర్ ఉష్ణోగ్రతలో నిల్వ ఉంచవచ్చు. మామూలుగానే రవాణా చేయవచ్చు.

తీవ్ర ఆందోళనలు

ఇప్పటికీ మూడవదశ క్లినికల్ పరీక్షలు కొనసాగుతూ ఉండగానే కొవాగ్జిన్‌కు అనుమతిని ఇవ్వడం ముఖ్యమైన ప్రశ్నలను లేవనెత్తింది. ప్రజాప్రయోజనాల దృష్ట్యా కొవాగ్జిన్‌కు అనుమతిని ఇచ్చామని డిసిజిఐ చెప్తోంది. 'క్లినికల్ ట్రయల్ దశ'లో (ముందు జంతువులపైనా తరవాత మనుషులపైనా చేసే పరీక్ష) వున్నప్పుడు పుష్కలంగా జాగ్రత్తలు తీసుకున్నామని, మ్యూటెంట్ స్ట్రెయిన్ (ప్రత్యామ్నాయ డి.యన్.ఏ. ద్వారా ఏర్పడిన జాతి) కారణంగా ఇన్‌ఫెక్షన్ సంభవిస్తే వాక్సిన్ వేయడానికి కావలసిన అవకాశాలను కూడా పరీక్షించామని, క్లినికల్ పరీక్షలు కొనసాగుతాయని డిసిజిఐ అంటోంది. ఈ అనుమతుల కారణంగా 'పరిస్థితి పూర్తిగా మారిపోతుందని' ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. కొవాగ్జిన్‌కు ఇచ్చిన అనుమతి 'పర్యవేక్షణతో కూడిన అనుమతి' అని, 'క్లినికల్ ట్రయల్ దశ' అంటే ఆ వాక్సిన్ తీసుకున్నవాళ్లందర్నీ, వాళ్లు ఇంకా పరీక్షించబడే దశలోనే ఉన్నట్టుగా భావిస్తామని అర్థం చేసుకోవాలని కేంద్ర ఆరోగ్యశాఖా మంత్రి డాక్టర్ హర్షవర్ధన్ అన్నారు.

వెల్లూరు క్రైస్తవ మెడికల్ కళాశాలలో మైక్రోబయాలజీ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న సుప్రసిద్ధ ఆచార్యుడు గగన్‌దీప్ కాంగ్‌ను 'క్లినికల్ ట్రయల్ దశ' అంటే అర్థం ఏమిటని అడిగితే ఇలా అన్నారట. 'నాకేమీ తెలియడం లేదు. ఇంతకు ముందెన్నడూ చూడలేదు. బ్రిటన్‌లో ఇప్పుడు వ్యాపిస్తున్న వైరస్‌జాతి మాట అటుంచి, కోవిడ్-19కి సంబంధించిన ఏ జాతికి చెందిన వైరస్‌నైనా నిరోధించడానికి కొవాగ్జిన్‌కున్న సామర్థ్యానికి సంబంధించిన గణాంకాలు ఉన్నాయో లేదో అనే విషయం కూడా నాకు ఏ మాత్రం తెలియదు'.

మన దేశంలో వైద్య సంబంధ వ్యవహారాలపై నిఘా ఉంచే ఆల్ ఇండియా డ్రగ్ యాక్షన్ నెట్‌వర్క్, ఈ వార్త తనకు 'దిగ్భ్రాంతి' కలిగించిందని చెప్పింది. అనుమతినిచ్చిన పద్ధతిని, తొందరపాటును ప్రతిపక్షాలు ప్రశ్నించాయి. అధ్యయనం పూర్తికాని వాక్సిన్‌కు- వేగవంతం చేయబడిన విధానంలోనైనా సరే- అనుమతిని ఇవ్వాలనే నిర్ణయం జవాబులుకంటే ఎక్కువ ప్రశ్నలను రేకెత్తిస్తోంది.

దీనికి జవాబు చెప్పటానికి ముందు, మనం వాక్సిన్ అంటే ఏమిటో అర్థం చేసుకుందాం. వాక్సిన్ మనిషి శరీరంలో ఉండే సహజ రక్షణలను ఉపయోగించుకుని నిర్దిష్టమైన ఇన్‌ఫెక్షన్లకు ప్రతిరోధకాలను (యాంటీ బాడీస్) తయారుచేస్తుంది. శరీరం ఒక వ్యాధికి గురైనప్పుడు ఎలా జరుగుతుందో అదే విధంగా, ప్రతిరోధకాలను తయారుచేయడానికి రోగనిరోధక వ్యవస్థకు అవసరమైన శిక్షణను ఇస్తుంది. అయితే వాక్సిన్‌లలో మృతిచెందిన లేదా నిర్వీర్యం చేయబడిన రూపాలలో మాత్రమే క్రిములు ఉంటాయి కాబట్టి అవి ఎలాంటి వ్యాధికి కారణం కావు. ఎలాంటి చిక్కులు తలెత్తే ప్రమాదం ఉండదు. భవిష్యత్తులో ఆ

క్రిమి మనిషి శరీరంలోకి ప్రవేశిస్తే రోగనిరోధక వ్యవస్థ ఆ వ్యాధిని గుర్తించి, మనిషి జబ్బుపడకముందే ఆ క్రిమిని వెంటనే నాశనం చేస్తుంది.

ఎడనోవైరస్ అనే వేరొక క్రిమితో డబుల్ స్ట్రాండెడ్ డి.ఎన్.ఏ.ను జతచేసి, స్పైక్ ప్రోటీన్‌ను (అత్యంత పరిశుభ్రమైన ప్రోటీన్) క్రిమి యొక్క జన్యు ఆదేశాలపై ఆధారపడి రూపొందించడం పునాదిగా కొవిషీల్డ్ తయారయింది. కొవాగ్జిన్ నిర్వీర్యం చేయబడిన వాక్సిన్ (అంటే అది మృత వైరస్‌ను ఉపయోగించి తయారుచేయబడిన వాక్సిన్).

వాక్సిన్‌ను అభివృద్ధి చేయడానికి సాధారణంగా అనుసరించే పద్ధతి

వాక్సిన్‌ను అభివృద్ధి చేయటం అనేక దశల గుండా జరగాలి. దీనికి ఎన్నో సంవత్సరాలు పడుతుంది. కాని ఆరోగ్యం మీద కోవిడ్-19 వేసిన తీవ్రమైన దుష్ఫలితాల కారణంగా నియంత్రణా చట్రాన్ని సరళీకరించారు. వాక్సిన్ తయారీలో సాధారణంగా ఈ క్రింది దశలలో పరీక్షలు జరుగుతాయి

1. ప్రి- క్లినికల్ 2. మొదటి దశ (భద్రతా పరీక్షలు) 3. రెండవ దశ (విస్తృతమైన పరీక్షలు) 4. మూడవ దశ (సామర్థ్య పరీక్షలు) 5. నియంత్రణాధికారుల సమీక్ష 6. అనుమతి, పంపిణి.

నా అభిప్రాయంలో 'క్లినికల్ ట్రయల్ దశ' అనేది మూడవ దశ పరీక్షతో సమానమైనది. సమ్మతించిన వలంటీర్లకు ఆ వాక్సిన్ ఇచ్చి దాని సామర్థ్యాన్ని ఈ దశలో పరీక్షిస్తారు. వాక్సిన్‌ను ప్రయోగాత్మకంగా ప్రజలకు ఇవ్వడానికి ముందు వాళ్లకి దాని మూలంగా రాబోయే ప్రమాదాల గురించి, కలగబోయే ప్రయోజనాల గురించి, వాక్సిన్ తీసుకున్నాక తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించిన తరవాత వాళ్ల నుండి సమ్మతి తీసుకోవాలి. ఒకవేళ ఆ వాక్సిన్ మూలంగా ఎవ్వరికైనా తీవ్రమైన ప్రమాదం జరిగితే వాళ్లు తగినంత నష్టపరిహారం పొందడానికి అవకాశం ఉండాలి. కొవాగ్జిన్ ఇంకా మూడవ దశ పరీక్షలోనే ఉందనే విషయంలో విమర్శకులకీ ప్రభుత్వానికీ మధ్య భిన్నాభిప్రాయం లేదు. అలాంటప్పుడు ఈ తొందర దేనికి?

కొవాగ్జిన్‌ను మార్కెట్లోకి విడుదల చేయడంకోసం దాని తయారీ వేగాన్ని పెంచడంపై ప్రారంభం నుంచే అనేకమైన ప్రశ్నలు తలెత్తాయి. అయితే వాటికి సమాధానాలు మాత్రం దొరకలేదు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ ఒక వైరస్ జాతికి చెందిన క్రిమిని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి పంపింది. దాన్ని ఆ సంస్థ వేరుచేసి భారత్ బయోటెక్ కంపెనీకి 9 మే 2020న అందించింది. వాక్సిన్ సురక్షితమైనదేనని నిరూపించడంకోసం దాన్ని ముందు జంతువుల మీద పరీక్షించాలి. దీనికి కనీసం మూడునెలల కాలం పడుతుంది. కంపెనీ తన ఫలితాలను 29 జూన్ 2020న ప్రకటించింది. అంటే నిర్వీర్యం చేయబడిన వాక్సిన్‌ను అభివృద్ధి చేయడానికీ, ఎలుకల మీద, సీమ ఎలుకల మీద ప్రీ క్లినికల్ పరీక్షలు చేయడానికి, దాని ఫలితాలను అంచనా వేసి ఆమోదించడం కోసం డ్రగ్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియాకు నివేదికలు పంపడానికి మధ్య కంపెనీకి కేవలం యాభైరోజుల వ్యవధి మాత్రమే ఉంది. ఈ కొద్ది కాలంలోనే ఆ దశలన్నింటినీ ఆ కంపెనీ పూర్తిచేసిందని అనుకోవాలన్నమాట.

జంతువులపై పరీక్షలు చేయడానికి సంబంధించిన సమస్య

విలక్షణమైన కరోనా వైరస్‌ను సాధారణమైన ఎలుకలలో ఇన్‌ఫెక్ట్ చేయడం సాధ్యం కాదు. అందుచేత కోవిడ్-19 వాక్సిన్‌కు సంబంధించిన పరీక్షలను జంతువులపైన నిర్వహించాలంటే తప్పనిసరిగా జన్యుపరంగా మార్పులకు గురిచేయబడ్డ ఎలుకలమీద (ట్రాన్స్‌జెనిక్ ఎలుకలు) మాత్రమే చేయాలి. ఇలాంటి ఎలుకలను అమెరికా, ఐరోపా లేదా చైనా నుంచి దిగుమతి చేసుకోవాలి. ఇందులో ఇన్ని సమస్యలున్నాయి. కాబట్టే భారత్ బయోటెక్ కంపెనీ వాక్సిన్ తయారీలో మానవుల మీద పరీక్ష చేసే దశకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ నుంచి బలహీనపరచబడిన వైరస్‌ను అందుకున్న తొంభై రోజుల్లోగా చేరుకోవడం అనేక ఆందోళనలను రేకెత్తించింది.

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్‌కి చెందిన డాక్టర్ బలరామ్ భార్గవ ఆగస్టు 2020లో భారత్ బయోటెక్‌కు రాసిన లేఖ కూడా గందరగోళాన్ని సృష్టించింది. అందులో ఆయన ఇలా అన్నారు. 'అన్ని రకాల క్లినికల్ పరీక్షలను పూర్తిచేసిన తరవాత 2020 ఆగస్టు 15నాటికి ప్రజారోగ్యం దృష్ట్యా వాక్సిన్‌ను విడుదలచేయాలని ఆలోచిస్తున్నాం'.

కొవాగ్జిన్ మూడవదశ సామర్థ్య పరీక్షను మనదేశంలో 25,800 మంది వలంటీర్లపై 6 నవంబర్ 2020న ప్రారంభించారు. అనుకున్న సంఖ్యలో సగంమంది అంటే 13 వేల మంది వలంటీర్లను మాత్రమే నియమించుకున్నామని ఆ కంపెనీ డిసెంబర్ 22న ప్రకటించింది. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 22,500 మంది వలంటీర్లకు వాక్సిన్ ఇచ్చామని నియంత్రణాధికారి ఇప్పుడు అంటున్నారు. వాక్సిన్ సురక్షితమైందిగానే అనిపించిందని ఆయన అన్నారుగాని దానికి సంబంధించిన ఇతర వివరాలు ఏవీ ఇవ్వలేదు.

ఇలాంటి వ్యవహారంలో ఇంత త్వరితగతిన ఇన్ని రకాల పరీక్షలను నిర్వహించడం సాధ్యం కాదు. వలంటీర్లకు మూడు నుంచి పన్నెండు వారాల వ్యవధిలో రెండుసార్లు వాక్సిన్ ఇవ్వాలి. వాళ్లల్లో తగినంతమందికి కోవిడ్-19 వచ్చేంతవరకు వాళ్లపై నిఘావుంచాలి, పరీక్షలు నిర్వహిస్తూ ఉండాలి. అప్పుడు మాత్రమే ఆ వాక్సిన్ సామర్థ్యానికి సంబంధించి మధ్యంతర విశ్లేషణ చేయడానికి అవకాశం ఉంటుంది.

అస్పష్టమైన వాగ్దానాలు

సార్స్- కోవ్-2కు సంబంధించిన నూతన జాతికి చెందిన క్రిములను ప్రతిఘటించడంలో కొవాగ్జిన్‌కు శక్తి ఉందని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ అన్నది. కాని దీన్ని రుజువుపరచడానికి అవసరమైన ఎలాంటి గణాంకాలను కంపెనీగానీ, నియంత్రణాధికారి గాని వెల్లడి చేయలేదు. పైగా వాళ్లు వాడుతున్న 'బహుశా', 'పరిమిత ఉపయోగం', 'మద్దతు ప్రణాళిక' అనే పదాలు మరింత గందరగోళాన్ని సృష్టించాయి.

మూడవదశ పరీక్షను పూర్తిచేయడానికి డ్రగ్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా (� 0+జ×) భారత్ బయోటెక్‌కు మరింత సమయం ఇచ్చి ఉండాల్సింది. సాధారణ పౌరుల ప్రాణాలను పణంగా పెట్టి, రిపబ్లిక్‌డే నాడు ప్రకటనలు చేయడం కోసం ఈ ప్రక్రియను వేగవంతం చేసినట్టు కన్పించకుండా ఉండివుండాలి. వాక్సిన్ అంతిమంగా సురక్షితమైందీ, సామర్థ్యం కలిగినదీ అయివుండవచ్చుగాని పరీక్షలు పూర్తికాకముందే దానికి ఆమోదం ఇవ్వడం ఆందోళన కలిగించే విషయం. వాక్సిన్ సామర్థ్యాన్ని నిపుణులు సమీక్షించడం కోసం అవసరమైన గణాంకాలను విడుదల చేయరాదని ప్రభుత్వం నిర్ణయించడం ఆందోళనకరంగా ఉంది. అనుమతినిచ్చే క్రమంలో ప్రభుత్వం మరింత పారదర్శకంగా ఉండాల్సిన

అమెరికా ప్రమాదకర వ్యూహం - క్వాడ్

ఆసియా-పసిఫిక్ ప్రాంతంపై తన ఆధిపత్యం కోసం అమెరికా ఏర్పాటు చేసిన క్వాడ్ నుంచి భారత్‌దేశం బయటికి రావాలని అంటున్నారు **ఎ. నర్సింహారెడ్డి**

రెండవ ప్రపంచ యుద్ధానంతర కాలంలో సామ్రాజ్యవాద అగ్రరాజ్యంగా ముందుకొచ్చిన అమెరికా కమ్యూనిజం వ్యాప్తిని అరికట్టడానికి 1948లో 'నాటో' సైనిక కూటమిని ఏర్పాటు చేసింది. ఆసియా-పసిఫిక్ ప్రాంతంపైన, పసిఫిక్-హిందూ మహాసముద్ర మార్గాలపైన తన ఆధిపత్యాన్ని చెలాయించేందుకు వ్యూహాత్మక పథకాలతో ముందుకు సాగుతున్నది. అందులో భాగంగానే దక్షిణ కొరియా, డిగోగార్షియా, ఇతర దీవులలో అది దశాబ్దాలుగా తన సైనిక స్థావరాలను నిర్వహిస్తూ వస్తున్నది. అది జపాన్, ఆస్ట్రేలియాలతో వ్యూహాత్మక కూటమిలో ఉంది. అది ఇతర దేశాలను తన రెక్కల కిందకు, తన ప్రభావంలోకి తెచ్చుకునే విధంగా చుట్టుముడుతున్నది. ఈ క్రమంలోనే గత అక్టోబర్‌లో అమెరికా కనుసన్నల్లో నడిచే మరో 'నాటో' తరహ చతుర్భుజ కూటమి (క్వాడ్) ఆవిర్భవించింది. దీని నిర్మాణం, కర్తవ్యం, దృక్పథాన్ని నాటో సలహాదారుల కూటమి 'సెంటర్ ఫర్ స్ట్రాటజిక్ అండ్ ఇంటర్‌నేషనల్ స్టడీస్'(సిఎస్ఐఎస్) రూపొందించింది. దీన్ని 1962లో జార్జ్‌టౌన్ విశ్వవిద్యాలయంలో నెలకొల్పారు. ప్రపంచ పోలీసుగా వ్యవహరిస్తూ, సమస్యాత్మక ప్రాంతాలపై కూటమి సైన్యాల ద్వారా ప్రపంచంపై తన పట్టు నిలుపుకోవడానికి తహతహలాడే అమెరికా ఇప్పుడు క్వాడ్ ద్వారా ఆసియా-పసిఫిక్‌లో ఆధిపత్యం సాధించే వ్యూహంతో పావులు కదుపుతున్నది.

2007 నుంచి అనేకానేక మలుపులు తిరుగుతూ నేటికి ఈ కూటమి రూపుదిద్దుకుంటున్నది. పసిఫిక్ నుంచి హిందూ మహాసముద్రం వరకు చైనా ప్రాబల్యాన్ని నిలువరించడానికి భారత్, అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్‌లు సభ్య దేశాలుగా ఏర్పడిన 'క్వాడ్' తన లక్ష్యసాధన దిశగా వడివడిగా అడుగులు వేస్తోంది. చైనాకు పగ్గాలు వేసే చట్టాలను అమెరికా, ఆస్ట్రేలియాలు తీసుకురాగా, లడ్డాఖ్‌లో చైనా దూకుడును అడ్డుకొంటూనే హిందూ మహాసముద్రంలో పైచేయి సాధించడానికి భారత్ చురుగ్గా పావులు కదుపుతోంది. అదే సమయంలో బంగాళాఖాతం, అరేబియా సముద్ర జలాల్లో భారత్, ఆస్ట్రేలియా, జపాన్, అమెరికా కూటమి(క్వాడ్) నావికా దళాల ఉమ్మడి విన్యాసాలు మొదటి దశలో బంగాళాఖాతంలోని విశాఖపట్నం తీరానికి సమీపంలో గత నవంబర్ 3 నుండి 6 వరకు, రెండవ దశలో అరేబియా సముద్రంలో నవంబర్ 17 నుంచి 20 వరకు జరిగాయి. క్వాడ్‌లోని నాలుగు దేశాల నావిక దళాలు 13 సంవత్సరాల కాలంలో ఉమ్మడి విన్యాసంలో పాల్గొనడం ఇదే మొదటిసారి కావడం విశేషం. ఈ విన్యాసాలు చైనాను లక్ష్యంగా చేసుకుని జరిపారన్నది వాస్తవం.

ఒబామా హయాంలో కూడా ఇండో-పసిఫిక్ ప్రాంతంపై అమెరికా వ్యూహాత్మక చర్యలు చేపట్టింది. 2015 జనవరిలో ఒబామా భారత పర్యటన సందర్భంగా 'ఆసియా-పసిఫిక్, హిందూ మహాసముద్ర ప్రాంతంపై సంయుక్త వ్యూహాత్మక దృష్టి' అనే పత్రంపై ప్రధాని నరేంద్ర మోడీ సంతకం చేశారు. క్వాడ్ ప్రతిపాదన తొలుత 2007లో జపాన్

అవసరం ఉంది. ఎందుకంటే కోవిడ్-19 వాక్సిన్ పథకం విజయవంతం కావడమనేది ప్రజల నమ్మకంమీద ఆధారపడ్డ విషయం. భారతదేశంలో ఇప్పటికే వాక్సిన్ల పట్ల వ్యతిరేకత, అశాస్త్రీయ భావాలు ఉన్నాయి. ఇలాంటి స్థితిలో ప్రజలు వాక్సిన్ వేయించుకోవడం పట్ల తటపటాయించే స్థితికి ఇది దారితీయకూడదు.

భారత్ బయోటెక్ ప్రసిద్ధి చెందిన మందుల తయారీ కంపెని. రోటా వైరస్, హెపటైటిస్, జికా, జపనీస్ ఎన్‌సెఫలైటీస్ తదితర అంటువ్యాధులకు సంబంధించిన మందులను ప్రపంచవ్యాప్తంగా నాలుగు బిలియన్ల డోసులను అది అందిస్తోంది. బలహీనపరచబడిన వైరస్‌లను ఉపయోగించుకునే పద్ధతి చాలాపాతదీ, కాలపరీక్షకు నిలబడిన పద్ధతి. దానినే ఈ కంపెనీ వాడుకున్నది. ఆ కారణంగా అది తయారుచేసే మందుల మీద ఎక్కువమంది ఆశ పెట్టుకున్నారు.

ఇప్పటికే బ్రిటన్‌లో వాడకంలోకి వచ్చింది కాబట్టి, మనం ముందుగా కొవిషీల్డ్ వాక్సిన్‌తో మొదలు పెట్టటం మంచిది. భారత్ బయోటెక్ కంపెనీని ముందు మూడవ దశ పరీక్షలను పూర్తి చేయనివ్వండి. క్లినికల్ ట్రయల్స్ జరగనివ్వండి. దాని భద్రతకు, సామర్థ్యానికి సంబంధించిన అదనపు గణాంకాలను సేకరించండి. వలంటీర్లను నిరంతర పర్యవేక్షణలో ఉంచండి. వాళ్లకి దీర్ఘకాలిక రక్షణను కల్పించండి.

వాక్సిన్ మన వద్ద ఉన్న ఇతర ఆరోగ్య వనరులకు అదనంగా ఉపయోగపడేదేగానీ వాటికి ప్రత్యామ్నాయం మాత్రం కాదు. వ్యాధి ఎవరి నుండి సోకుతుందో వాళ్లను పసిగట్టడం, ఇంకా ఇంకా ఎక్కువమందిని పరీక్షించడం, వ్యాధి సోకినవాళ్లను ఒంటరిగా ఉంచడం, క్వారంటైన్ లాంటివి కొనసాగించాలి. అదే సమయంలో సామాజిక దూరాన్ని పాటించడం, మాస్కులు వాడడం, చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవడం వంటి పద్ధతులను ప్రజలు కూడా కొనసాగించాలి.

(డాక్టర్ కఫీల్ ఖాన్ ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని గోరఖ్‌పూర్‌లో ఉన్న బి.ఆర్.డి. వైద్యకళాశాలలో శిశువైద్యశాఖలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు)

(6 జనవరి 2021, 'ద లీఫ్‌లెట్' సౌజన్యంతో)

(అనువాదం సి.ఎస్.ఆర్.ప్రసాద్) వీ

ముందుకు తెచ్చింది. మొదటగా ఆస్ట్రేలియా, జపాన్, భారత్, అమెరికా దేశాల అత్యున్నత స్థాయి సమావేశంలో క్వాడ్ ప్రకటన 2007లో చేశారు. ఈ నాలుగు దేశాలను కలుపుతూ గీసిన రేఖలు చతుర్భుజి (క్వాడ్రిలేటరల్) ఆకారంలో ఉండడంతో దానికి క్వాడ్ అని పేరు వచ్చింది. టోక్యోలో అదే ఏడాది మేలో తొలి నావికాదళ విన్యాసాలు జరిగాయి. దాని కొనసాగింపుగా అదే ఏడాది బంగాళాఖాతంలో మలబార్ విన్యాసాల్లో ఆస్ట్రేలియా, సింగపూర్‌లు పాల్గొన్నాయి. దీన్ని చైనా వ్యతిరేకిస్తూ దౌత్యపరమైన నిరసన తెలియజేసింది. 2008లో జపాన్‌లో ప్రధాని షింజో అబే అధికారం కోల్పోయి, టారో అసో రావడంతో క్వాడ్‌కు దూరమైంది. 2008లో ఆస్ట్రేలియా ప్రధాని జాన్ హూవార్డ్ తప్పుకోవడం, ఆ స్థానంలో కెవిన్ రుడ్ రాకతో ఆ దేశం కూడా క్వాడ్ నుంచి నిష్క్రమించింది. ఆ ఏడాదే భారత ప్రధాని మన్మోహన్ సింగ్ కూడా 'చైనాను కట్టడి చేసే ఏ కూటమిలోనూ భారత భాగస్వామి కాబోదు' అని ప్రకటించారు. అయితే అమెరికా అధ్యక్షుడుగా డొనాల్డ్ ట్రంప్ వచ్చిన తర్వాత మళ్లీ కదలిక మొదలైంది.

చైనా, రష్యా వ్యతిరేక కూటమిలో భారత్‌ను కలుపుకోవాలనేది ట్రంప్ ఆకాంక్ష. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో పూర్తి స్థాయి భద్రతా కూటమిగా క్వాడ్ ఆవిర్భవింపజేయడంలో భారత్‌ను తన వైపు లాక్కునేందుకు ట్రంప్ ప్రయత్నించారు. 2016లో 'లాజిస్టిక్స్ ఎక్స్ఛేంజ్ మెమోరాండం ఆఫ్ అగ్రిమెంట్'పై భారత్ సంతకం చేసింది. 2017లో ఆసియా పసిఫిక్ ప్రాంతం పేరును ఇండో- పసిఫిక్ కమాండ్ అని మార్చారు. 2018లో అమెరికాతో భారత ప్రభుత్వం 'కమ్యూనికేషన్స్ కంపాటబిలిటీ అండ్ సెక్యూరిటీ అగ్రిమెంట్' (కోంకాసా) చేసుకుంది. 2020 అక్టోబర్ 27న ఢిల్లీలో భారత్ అమెరికా దేశాల రక్షణ, విదేశాంగ మంత్రుల సమావేశాలలో రెండు దేశాల మధ్య 'బేసిక్ ఎక్స్ఛేంజ్ అండ్ కమ్యూనికేషన్ అగ్రిమెంట్(బీకా) కుదిరింది. అంటే, అమెరికాకు చెందిన ఉపగ్రహాలు, సెన్సర్‌లు ప్రపంచ వ్యాప్తంగా సేకరించే కీలక అంతరిక్ష సమాచారాన్ని భారత్‌తో పంచుకొనే ఒప్పందం. ఇది అమెరికాకు సైనికంగా భారత్‌ను మరింత ముడివేసే ఒప్పందం. దీంతో రక్షణ రంగ సహకారానికి మూడో ఒప్పంద మవుతుంది. ఇప్పటికే లెమోవా, కోంకాసా అనే ఒప్పందాలను భారత్‌తో అమెరికా కుదుర్చుకున్నది. భారతదేశం 'క్వాడ్'లో చేరడం కూడా దీనిలో భాగమే.

ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో 2017లో ఈ నాలుగు దేశాల కార్యదర్శి స్థాయి ప్రతినిధుల సమావేశంతో క్వాడ్ పునరుద్ధరణ క్రమాన్ని తిరిగి చేపట్టారు. 2019 సెప్టెంబర్‌లో ఐరాస జనరల్ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా నాలుగు దేశాల విదేశాంగ మంత్రుల సమావేశం న్యూయార్క్‌లో నిర్వహించారు. అమెరికాలో ఏర్పడిన ఆర్థిక సంక్షోభాన్ని నివారించలేక, చైనా ఆర్థికాభివృద్ధిని ఓర్వలేక, చైనా విసురుతున్న రాజకీయ ఆర్థిక సవాళ్లను ఎదుర్కొలేక చైనాతో వాణిజ్యం, సాంకేతిక పరిజ్ఞానం, వ్యూహాత్మక రంగాల్లో ఘర్షణ వైఖరిని ట్రంప్ తీసుకున్న నేపథ్యంలో క్వాడ్ ఏర్పాటుపై అమెరికా ఒత్తిడి పెంచింది. 2020 ఆగస్టులో జరిగిన నాలుగు దేశాల విదేశాంగ శాఖ అధికారుల సమావేశంలో నమ్మకమైన అమ్మకందారులను ముఖ్యంగా అయిదో తరం (5జి) నెట్‌వర్క్‌లో ప్రోత్సహించడం ఎలా అన్నదానిపై చర్చించారు. చైనాకు చెందిన హువావే కంపెనీ 5జి టెక్నాలజీ ఎగుమతులను అడ్డుకోవడానికి అమెరికా పన్నిన కుతంత్రమిది. ఈ సమావేశంలో ప్రస్తావనకు వచ్చిన ఇతర అంశాల్లో తీవ్రవాద నిరోధక చర్యలు, సైబర్, నావికాయాన భద్రత, నాణ్యమైన మౌలిక సదుపాయాలు వంటివి ఉన్నట్లు ఆ ప్రకటన పేర్కొంది. 2020 సెప్టెంబర్ 25న క్వాడ్ దేశాల సీనియర్ అధికారుల సమావేశం, ఆ తర్వాత అక్టోబర్‌లో విదేశాంగ మంత్రుల వర్చువల్ సమావేశం టోక్యోలో జరిగింది. ఈ సమావేశంలోనే 'క్వాడ్'ను పునరుద్ధరించారు. క్వాడ్ చైనా వ్యతిరేక కూటమి అని అమెరికా బహిరంగంగానే ప్రకటించింది. ఆ తర్వాత భారత్‌తో ఆస్ట్రేలియా(జూన్ 2020), జపాన్(సెప్టెంబర్ 2020)లు లాజిస్టిక్స్ ఒప్పందాలు చేసుకున్నాయి. క్వాడ్ ఆవిర్భావానికి ఇవి ప్రధాన దశలు.

టోక్యో సమావేశంలో అమెరికా విదేశాంగ మంత్రి మైక్ పాంపియో 'చైనా కమ్యూనిస్టు పార్టీ(సిసిపి) దోపిడీ, అవినీతి, దౌర్జన్యం నుంచి క్వాడ్ భాగస్వామ్య దేశాలను కాపాడేందుకు గతంలో కన్నా మేం ఎక్కువ సహకరించాల్సి ఉంది' అంటూ చైనాపై తన ద్వేషాన్ని వెళ్లగక్కారు. ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో నౌకాయాన స్వాతంత్ర్యానికి, వివాదాల పరిష్కారానికి విధి విధానాలతో కూడిన నిర్వహణ తన లక్ష్యమని ఆ సమావేశం ప్రకటించింది. అలాగే నాలుగు దేశాలు మలబారు తీరంలో సంయుక్త నావికా విన్యాసాలు నిర్వహించాలన్న అంగీకారానికి వచ్చాయి. తొలుత ఆస్ట్రేలియా భాగస్వామ్యంపై కొంత సందిగ్ధత తలెత్తినా, భారత్ ఆస్ట్రేలియాను ఆహ్వానించింది. వాస్తవానికి జపాన్, ఆస్ట్రేలియాలు అమెరికా సాంప్రదాయక సైనిక మిత్ర దేశాలే. ఈ రెండు దేశాల్లో అమెరికాకు సైనిక స్థావరాలున్నాయి. ఇప్పుడు భారత్ వాటితో చేరింది.

అమెరికా సామ్రాజ్యవాదం అంటేనే యుద్ధాలు, దురాక్రమణలు, వనరుల దోపిడీలు, హత్యలు, కుట్రలు, వీటిని మనం దశాబ్దాలుగా చూస్తునే ఉన్నాం. పెట్టుబడిదారీ విధానాలు, వలసవాదం, సామ్రాజ్యవాదం, ఆధిపత్య యుద్ధాల సైద్ధాంతిక భావజాలానికి సహజంగానే సరిహద్దులు లేవు. అందువల్ల ప్రపంచాధిపత్యపు ఆకాంక్షలు సరిహద్దు పరిమితులకు లోబడి ఉండవు. దుర్మార్గమైన సైనిక, ఆర్థిక శక్తితో స్వేచ్ఛా మార్కెట్, ప్రజాస్వామ్యం, మానవ హక్కుల పేరుతో పెట్టుబడిదారీ వ్యవస్థను విస్తరింపచేయడం ద్వారా రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక రంగాలలో సామ్రాజ్యవాదం ప్రపంచ ఆధిపత్యాన్ని కోరుకుంటుంది. ప్రజాస్వామ్యాన్ని నామరూపాలు లేకుండా చేసి ఆ స్థానంలో నియంతృత్వ, నిరంకుశ ప్రభుత్వాలను తీసుకురావడానికి అభివృద్ధి నిరోధక, మతతత్వ, సాంస్కృతిక, రాజకీయ శక్తులతో అది ఐక్యతను సాధిస్తుంది. ప్రజాస్వామ్యం పేరుతో తనకు వ్యతిరేకంగా ఉన్న ప్రభుత్వాలను మార్చడానికి యుద్ధాలకు పాల్పడింది. దేశాధి నేతలను హత్య చేసింది. పెట్టుబడి ప్రయోజనాలు నెరవేర్చడానికి పశ్చిమాసియా, లాటిన్ అమెరికా, ఉత్తర ఆఫ్రికా దేశాలతో యుద్ధాలు, ఘర్షణలకు పాల్పడింది. సామ్రాజ్యవాదుల యుద్ధాల నుండి ప్రజల విషాదాలు, వ్యధలు విడదీయరాని భాగాలుగా మిగిలాయి.

మోడీని అన్ని విధాలా నడిపిస్తున్న కార్పొరేట్ సంస్థలు, వారి మీడియా, వారిని బలపర్చే వ్యూహాత్మక నిపుణులు కూడా ఈ క్వాడ్‌ను సమర్థిస్తున్నారు. ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో చైనాకు ప్రతిగా అమెరికా, దాని మిత్రదేశాలతో భారత్ సంబంధాలను బలోపేతం చేసుకోవాలని వారు వాదిస్తున్నారు. దానివల్ల చైనా కన్నా భారత్‌కి ఎక్కువ ప్రమాదమనే వాస్తవాన్ని వారు విస్మరిస్తున్నారు. ఫలితంగా భారత్-అమెరికా సంబంధాలను, ద్వైపాక్షిక సంబంధాలను దాటి ఆసియా-పసిఫిక్

ప్రాంతంపై తన ఆధిపత్యాన్ని నెలకొల్పుకోవడానికి అమెరికా చేపట్టిన వ్యూహాత్మక కార్యకలాపాలతో భారతదేశాన్ని బంధిస్తాయి. మోడీ చర్యలు జాతీయ సార్వభౌమత్వాన్ని దెబ్బతీసేలా అమెరికా ఆధీన మిత్రుడి పాత్ర పోషించడానికి దిగజార్చాడన్నది స్పష్టమవుతున్నది. ఆసియన్‌లో అర్ధ శతాబ్దిగా ఉన్న మన సంబంధాలను దెబ్బతీసుకునేలా దానికి సమాంతరంగా క్వాడ్‌కు ఊతంగా నిలువడం చారిత్రక తప్పిదం అవుతుంది. దీనివల్ల దేశానికి ఎటువంటి ప్రయోజనం ఉండకపోగా చైనాను, సరిహద్దుల్లో ఉన్న దేశాలను మరింత దూరం చేసుకొనే ప్రమాదం కనిపిస్తున్నది.

చైనా కట్టడికి అమెరికా పన్నాగం

'మా ఇంటికొస్తే ఏమి తెస్తావు, మీ ఇంటికొస్తే ఏమి ఇస్తావు' అనేది అమెరికా రాజనీతి. ఈ కోణంలో భారత్‌-అమెరికా సంబంధాలను పరిశీలిస్తే భారతదేశ భౌగోళిక స్వరూపం, విస్తృతి, సుసంపన్నమైన సహజ వనరులు, విశాలమైన మార్కెట్‌ కారణంగా అమెరికా సామ్రాజ్యవాద ఆధిపత్య వ్యూహాత్మక లక్ష్యాల సాధనకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని భావిస్తోన్న కారణంగా భారతదేశంపై పట్టుకోసం అది అత్యంత ప్రాధాన్యతనిస్తుంది. భారతదేశాన్ని శక్తివంతమైన చైనా వ్యతిరేక దేశంగా మార్చేందుకు, ఆసియా-పసిఫిక్‌ ప్రాంతంలో తన ఆధిపత్య కార్యకలాపాలను ముందుకు నెట్టేందుకు అమెరికా సామ్రాజ్యవాదులు ఆసక్తిగా ఉన్నారు. చైనాపై మనకు వ్యతిరేకత పెరిగే కొద్దీ అమెరికాపై మనదేశం ఆధారపడే పరిస్థితి మరింత పెరుగుతుందని, దీంతో ఆసియా-పసిఫిక్‌ ప్రాంతంలోనూ, ఇతర ప్రాంతాల్లోనూ అమెరికా ఆధిపత్య వ్యూహాలలో మనదేశాన్ని ఉపయోగించుకోవడం మరింత సులభమవుతుందని అమెరికా భావిస్తోంది. ఇండో-పసిఫిక్‌ ప్రాంతానికి సంబంధించిన అమెరికా వ్యూహాత్మక విధానపత్రంలో భారత్‌కు అమెరికా దన్నుతో చైనాను అడ్డుకునే శక్తి ఉందని పేర్కొంది. భారత్‌ భద్రతకు ఎంచుకోవల్సిన సరైన భాగస్వామి అమెరికాయే అని పేర్కొంది. చైనా ప్రాబల్యాన్ని అడ్డుకునేందుకు రెండు దేశాలు పరస్పరం సహకరించుకోవాల్సిన అవసరముందని తెలిపింది.

భారత సరిహద్దుల వెంట ప్రస్తుతం నెలకొన్న ఉద్రిక్తతలు, గొడవలు నిరోధించడానికి చర్చలు జరుపడం పట్ల అమెరికా అసహనాన్ని వ్యక్తం చేస్తోంది. చర్చలు నిరుపయోగమైనవని, చైనాను పూర్తిగా ధ్వంసం చేయడంలోనే నిజమైన, శాశ్వతమైన పరిష్కారం ఇమిడి ఉందని, అందుకు సంసిద్ధం కావాలని భారత పాలకులకు వారు హితబోధ చేస్తున్నారు. భారత్‌- చైనా లేదా భారత్‌-పాక్‌ల నడుమ ఉద్రిక్తతలు, విబేధాలు, యుద్ధ పరిస్థితులు నిరంతరం కొనసాగుతుంటేనే తమ పట్టును భారత్‌పై మరింత బలోపేతం చేయడానికి సానుకూలంగా ఉంటుందని అమెరికా భావిస్తోంది. చైనాను కట్టడి చేసేందుకు పన్నిన వ్యూహాన్ని క్వాడ్‌ ద్వారా నెరవేర్చుకోవాలని అమెరికా చూస్తోంది. అటువంటి ఈ వ్యూహాత్మక కూటమిలో భారత్‌ భాగస్వామిగా చేరడం వల్ల దేశానికి వచ్చే ప్రయోజనమేమీ ఉండదు.

దక్షిణ చైనా సముద్రంలో భారత దేశ కీలక ప్రయోజనాలేవీ ముడిపడి లేవు. అలాంటప్పుడు భారత నావికాదళం అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్‌తో కలసి దక్షిణ చైనా సముద్రంలో సంయుక్త విన్యాసాలు నిర్వహించడమెందుకు?

చైనాతో ప్రాదేశిక ఘర్షణ వచ్చినప్పుడు ఈ భాగస్వామ్య దేశాల్లో ఏ ఒక్కటీ భారత్‌కు మద్దతు ఇవ్వడానికి సుముఖత చూపలేదు. దక్షిణ చైనా సముద్రం వివాదంతో సంబంధమున్న తీర ప్రాంత దేశాలు కానీ, ఈ ప్రాంతంలో ప్రధాన ప్రాంతీయ వేదిక అయిన ఆసియాన్‌ కానీ క్వాడ్‌లో చేరేందుకు సుముఖంగా లేవు. చైనా వ్యతిరేక గ్రూపులో చేరడం వల్ల తమ దేశ కీలక ప్రయోజనాలు ఏ విధంగాను నెరవేరవని భావించడం వల్లే ఇందులో చేరరాదని అవి భావించాయి. ఈ ప్రాంతంలో ప్రధాన దేశాల్లో ఒకటి అయిన ఇండొనేషియా దక్షిణ చైనా సముద్ర వివాదంలో ఉన్నప్పటికీ చైనా వ్యతిరేక వైఖరి తీసుకోలేదు. చైనాతో అమెరికా కోరి కయ్యం పెట్టుకుంటుంటే మోడీ ప్రభుత్వం అమెరికాకు బంటుగా చేరడం వల్ల భారత్‌కు ఒరిగేదేమీ ఉండదు. ఇక జపాన్‌, ఆస్ట్రేలియాలు ఇటు క్వాడ్‌లో ఉన్నాయి. అటు చైనా ఏర్పాటు చేసిన 'ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్య కూటమి(ఆర్‌సిఇపి)లో ఉన్నాయి.

ఆసియా-పసిఫిక్‌ ప్రజలపై తమ ఆధిపత్యాన్ని రుద్దాలనే అమెరికా ఎత్తుగడలకు చైనా ఒక శక్తివంతమైన అడ్డంకిగా నిలిచిందనేది జగమెరిగిన సత్యం. మావో మరణానంతరం చైనా పెట్టుబడిదారీ తరహా ఆర్థిక అభివృద్ధి పంథాను ఎంచుకున్నప్పటి నుంచి ప్రపంచంలో తన ఆర్థిక, వాణిజ్య సంబంధాలను విస్తృతం చేసుకోవడంలో భాగంగా ఆసియా-పసిఫిక్‌ ప్రాంతంలోని దేశాలతో, ఆ ప్రాంత సముద్ర జలాలతో తన ఆధిపత్యాన్ని పెంచుకోవడంలో నిమగ్నమై ఉంది. ఒకవైపున ఈ ప్రాంతంలోని దేశాల విధానాలను ప్రభావితం చేయడానికి అన్ని విధాల ప్రయత్నిస్తూనే, ఈ ప్రాంతం మీద, ఈ సముద్ర మార్గాలపైన ఆధిపత్యం చెలాయించే శక్తుల పట్ల తన వ్యతిరేకతను ప్రకటిస్తూ ఉంది. అందువలన ఈ ప్రాంతంలో చైనా ప్రభావాన్ని తగ్గించడం, దాన్ని ఒంటరిని చేయడం, అవసరమైతే సరైన సందర్భంలో చైనాపై దాడి చేయడానికి సిద్ధంగా ఉండడం అనేది ఈ ప్రాంతంలో అమెరికా ఎత్తుగడలో ఒక భాగం.

చైనా కూడా తన స్వంత ఎత్తుగడలతో అమెరికాను ఎదుర్కోవడానికి సన్నద్ధమవుతోంది. చైనా తన ఆర్థిక పటిమతో ఆగ్నేయాసియా దేశాలనూ, హిందూ మహాసముద్ర తీర దేశాలనూ గుప్పిట్లోకి తీసుకొంటోంది. తద్వారా పసిఫిక్‌లో అమెరికా, జపాన్‌, ఆస్ట్రేలియాల ప్రాబల్యానికి, హిందూ మహాసముద్రంలో భారత్‌ పలుకుబడికి చెక్‌ పెడుతోంది. భారత్‌ పొరుగున శ్రీలంక, బంగ్లాదేశ్‌, మయన్మార్‌, మాల్దీవులకు పెట్టుబడుల ఎరవేసి లోబరచుకొంటోంది. ఈ నేపథ్యంలో ఆసియా-పసిఫిక్‌ ప్రాంతంలోని దేశాలు ఈ సముద్రంలో నిరాటంకంగా ప్రయాణించే హక్కులను కాపాడడానికే ఈ కూటమి ఏర్పాటు జరిగిందని ఆసియా ప్రజలకు భరోసా కల్పించడానికి అమెరికా యత్నిస్తోంది. కానీ వాస్తవానికి ఆసియా- పసిఫిక్‌ ప్రాంతంలో తన ఆధిపత్యం కొరకు వేసిన ఎత్తుగడలో ఒక పనిముట్టు మాత్రమే ఈ కూటమి. ఈ కూటమిలో జేరడం మన దేశానికి ఎంతో ప్రయోజనకరమనీ, ఇది మన దేశం హోదాను పెంచుతుందని ప్రజలను నమ్మబలకడానికి భారత పాలకులు ప్రయత్నిస్తున్నారు. వాస్తవానికి అమెరికా సామ్రాజ్యవాదుల ఆధిపత్య రాజకీయాలకు భారత్‌ స్నేహహస్తం అందించడంపై ఆసియా, ప్రపంచ ప్రజల వ్యతిరేకతను మనదేశం ఎదుర్కోవాల్సి ఉంటుందనేది వాస్తవం.

చైనా పెట్టుబడిదారీ దేశంగా మారిందని అమెరికాకు తెలుసు, అయినప్పటికీ ఎత్తుగడలో భాగంగా చైనాను కమ్యూనిస్టు దేశంగా చూపిస్తున్నారు. కమ్యూనిస్టు వ్యతిరేక భావోద్వేగాలను

ఉపయోగించుకుంటూ ఇతర దేశాలను తమ వెనుక సమీకరించుకోవడం జరుగుతోంది. చైనా శక్తివంతమైన ఆర్థిక, రాజకీయ, సైనిక, సాంకేతిక శక్తిగా ఆవిర్భవించడాన్ని, ప్రపంచ మార్కెట్‌లోకి చైనా పెట్టుబడులు, సరుకులు, సాంకేతిక నైపుణ్యాలు విస్తృతంగా ప్రవేశించడాన్ని అమెరికా భరించలేకపోతున్నది. ఇప్పటివరకు అమెరికా సామ్రాజ్యవాదుల చేతుల్లో ఉన్న మార్కెట్లు చైనా ఆక్రమించే దూకుడుతనాన్ని జీర్ణించుకోలేకపోవడం అసలు సమస్య. స్వేచ్ఛా మార్కెట్‌లో భాగంగా అమెరికా ఆధీనంలోని భూభాగాల్లోకి చైనా ఒక పెద్ద పోటీదారుగా ప్రవేశించడంతో ఆర్థిక వత్తిడులకు గురై బలహీనపడుతామన్న భయం అమెరికా సామ్రాజ్యవాదులను వెంటాడుతుంది.

వివిధ ప్రపంచదేశాల సంపదలపై, వనరులపై అదేవిధంగా ప్రపంచ మార్కెట్‌పై తన పట్టును నిలబెట్టుకుంటూ, మరింతగా తన ఆధిపత్యాన్ని విస్తరించుకొనే ప్రయత్నాలను అమెరికా ఇంతకాలంగా సాగిస్తోంది. దశాబ్ద కాలంగా ప్రపంచ మార్కెట్‌ను తనకనుకూలంగా ప్రభావితం చేసుకోవడానికి చైనా ప్రయత్నాలు చేస్తోంది. వాస్తవానికి ఇక్కడే ఈ రెండింటి మధ్య విభేదాలు, పోటీ వ్యక్తమౌతున్నాయి. ఆధిపత్య వాదానికి తాను వ్యతిరేకమని, తాను ఆధిపత్య, విస్తరణవాద కాంక్షలను అనుసరించబోనని చైనా పదేపదే ప్రకటిస్తోంది. అదే సమయంలో ఆసియా– పసిఫిక్ దేశాలపై, ప్రజలపై అమెరికా ఆధిపత్య విధానాల ప్రభావాన్ని, అమెరికా వెనుక సమీకరించుకునే ప్రయత్నాలను వ్యతిరేకించడానికి చైనా చేపట్టిన పద్ధతులు సందేహాస్పదమైనవి, ప్రశ్నించదగినవిగా ఉన్నాయి.

అమెరికా, దాని మిత్ర కూటమిలోని దేశాలకు– చైనాకు నడుమనున్న విభేదాన్ని, స్వేచ్ఛాయుత, ప్రజాస్వామిక ప్రపంచానికి, చైనీయుల ఆధిపత్య వాదానికి మధ్య విభేదంగా ప్రకటించడం పూర్తిగా పక్కదోవపట్టించేది, మోసపూరితమైంది. శాంతి, భద్రతల పరిరక్షణ, ఆసియా– పసిఫిక్ ప్రాంత సముద్ర జలాలలో స్వేచ్ఛా నౌకాయాన హక్కులనేవి ఈ ప్రాంత దేశాలన్నింటి అవసరంగా ఉన్నాయి. ఈ ప్రాంత దేశాల, ప్రజల హక్కుల, ప్రయోజనాల పరిరక్షకుడిగా, ఉద్ధారకుడిగా, ఏ అగ్రరాజ్యమూ వ్యవహరించరాదు. ఆధిపత్యం కోసం అగ్రరాజ్యాల మధ్య పోటీకి, శత్రుత్వానికి ఈ ప్రాంతం, ఈ ప్రాంత సముద్ర జలాలు స్థావరమయ్యేట్లయితే, ప్రాంతీయ వివాదాలు ఆ ప్రాంత దేశాలు ద్వైపాక్షిక చర్చల ద్వారా లేదా అంతర్జాతీయ సంస్థల ద్వారా పరిష్కరించుకోవాలి. ఈ ప్రాంతంలోని దేశాలు, ప్రభుత్వాలు తమ స్వాతంత్ర్యాన్ని, సార్వభౌమత్వాన్ని ప్రాదేశిక సమగ్రతలను, ప్రజల హక్కులను, ప్రయోజనాలను బలిపెట్టి వీరు అగ్రరాజ్యాల పోటీలో సాధనాలుగా మారితే ఈ ప్రాంత ప్రజల హక్కులు, ప్రయోజనాలు, శాంతి భద్రతలన్నీ తీవ్రమైన ప్రమాదంలో చిక్కుకునేందుకు అన్ని అవకాశాలున్నాయి.

క్వాడ్‌లో చేరడం భారత్ తప్పిదం

ఇక్కడ భారతదేశ పాలకులు మూడు విధాల ఘోరమైన తప్పిదాలకు పాల్పడుతున్నారు. మొదటి అంశం మనదేశ, ప్రజల ప్రయోజనాలకు, ఆకాంక్షలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తూ, సామ్రాజ్యవాదులు మన ఆంతరంగిక విషయాల్లో ప్రత్యేకించి భారత– చైనా సరిహద్దు వివాదంలో జోక్యం చేసుకోవడానికి చొరబడుతున్నారు. ఇది వివాద పరిష్కారాన్ని మరింత సంక్లిష్టం చేసేది మాత్రమే. సామ్రాజ్యవాదులు పీడిత జాతులకు, ప్రజలకు నమ్మకమైన మిత్రులుగా, మంచిని కాంక్షించేవారుగా ఏనాడూ లేరు, ఉండరనే విషయం భారత ప్రజలకు తెలుసు. చర్చల ద్వారా, శాంతియుత పద్ధతుల ద్వారా వివాద పరిష్కారానికి చేసే ప్రతి ప్రయత్నాన్నీ అమెరికా సామ్రాజ్యవాదులు భగ్నం చేస్తున్నారు. వారు ఇప్పటికే మనదేశంతో భారీస్థాయి ఆయుధ వ్యాపారం సాగిస్తూ, సైనికంగా మనదేశాన్ని తమకు లోబడిన బానిస దేశంగా కట్టి పడేశారు. ఆసియా–పసిఫిక్ ప్రాంతంలో తమ ఆధిపత్య ప్రయత్నాలకు తోడ్పడే స్పష్టమైన లక్ష్యంతోనే చైనాతో మనదేశానికున్న విభేదాల పరిధిని ఆసియా – పసిఫిక్ ప్రాంతానికి విస్తృతపరిచారు.

రెండవ అంశం అమెరికా నాయకత్వంలోని కూటమి 'క్వాడ్'లో చేరడం ద్వారా ఒక తప్పుడు కారణం కోసం చాలా పెద్ద, విధ్వంసకర విభేదంలోకి భారత పాలకులు ఈడ్వబడ్డారు. ఆసియా–పసిఫిక్ ప్రాంతంపైనా, ఆ ప్రాంత సముద్ర జలాలపైనా తమ ఆధిపత్యాన్ని నెలకొల్పుకునే లక్ష్యంతో రూపొందించబడిన అమెరికా నాయకత్వంలోని ఈ కూటమిలో చేరడం ద్వారా భారత పాలకులు ఈ ప్రాంతంలోని దేశాలకు, ప్రజలకు నమ్మకమైన స్నేహితునిగా ఉండే హక్కు అవకాశాలను కోల్పోవడమేగాక, వారితో శత్రుత్వాన్ని కొని తెచ్చుకుంటున్నారు. ఈ ప్రాంతంలో ప్రజలు, దేశాలు తమ హక్కులను, ప్రయోజనాలను కాపాడుకునేందుకు ఆసియా–పసిఫిక్ ప్రాంతాన్ని, సముద్ర జలాలను సామ్రాజ్యవాద అగ్రరాజ్యాలు తమ ఆధిపత్యం కోసం సాగించే కుట్రల నుండి, పోటీల నుండి, యుద్ధక్రీడల నుండి దూరంగా ఉంచేందుకు సాగించే ఉమ్మడి పోరాటాలలో భాగంగా ఉండే అవకాశాన్ని భారత పాలకులు కోల్పోతున్నారు. ఈ విధంగా భారత పాలకులు అత్యంత ప్రమాదకరమైన మృత్యు వ్యూహంలోకి, అమెరికా ఆధిపత్య దుష్టక్రీడలోకి భారతదేశాన్ని, ప్రజలను నెడుతున్నారు.

మూడవ అంశం ఆసియా–పసిఫిక్ ప్రాంతంలో అమెరికా భౌగోళిక, రాజకీయ వ్యూహంలో భారత్ పావుగా మారడం వల్ల చైనాతో సరిహద్దు సమస్యను చర్చల ద్వారా శాంతియుతంగా పరిష్కరించుకునే అవకాశాలను మనకు మనమే క్లిష్టతరం చేసుకున్నట్లవుతుంది. పెరుగుతున్న బహుళ ధృవ ప్రపంచంలో దేశ పురోగతికి చాలా అవసరమైన వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తిని ఇది తీవ్రంగా పరిమితం చేస్తుంది లేదా దెబ్బతీస్తుంది. 'అమెరికా ఫస్ట్ పేరిట మిత్ర దేశాలపై రకరకాల ఆంక్షలు విధిస్తూ స్వీయ ప్రయోజనాలు తప్ప మరేమీ పట్టని అమెరికాను నమ్మి ఈ కూటమిలో చేరడం పెద్ద తప్పిదమనే వాస్తవాన్ని మోడీ సర్కారు గుర్తించడం లేదు. ఆసియాన్‌తో అర్ధ శతాబ్దిగా ఉన్న మన సంబంధాలను దెబ్బతీసుకునేలా దానికి సమాంతరంగా క్వాడ్‌కు ఊతంగా నిలవడం చారిత్రక తప్పిదమవుతుంది. క్వాడ్ విస్తరణ ఆసియాన్ మనుగడకు ప్రశ్నార్థకమవుతుంది. భారత్ పొరుగు దేశాలేవీ లేదా ఆసియాన్ సభ్యదేశాలేవీ ఈ క్వాడ్‌లో చేరేందుకు ఆసక్తి చూపడం లేదు.

ముగింపు

ప్రపంచ దేశాలలో ప్రజాస్వామ్య వ్యవస్థ, స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, శాంతి, భద్రత, సౌభాగ్యాల పరిరక్షకులుగా అమెరికా నాయకులు తమకు తాము చెప్పుకునేది శుద్ధ అబద్ధం. అమెరికా సామ్రాజ్యవాదులు ఇతర దేశాలను దురాక్రమించి లక్షలాది మందిని వారు హతమార్చారు. ఆ దేశాల వనరులను బలప్రయోగంతో ఆక్రమించారు. ఆ పై వారి కీలుబొమ్మ

జడలు విప్పుకున్న ట్రంపిజం

అధికారాన్ని అంటిపెట్టుకోవడం కోసం రాజ్యాంగాల్నే మారుస్తున్న సందర్భంలో ఎన్నికల్లో ట్రంప్ ఓడినా అధికారాన్ని వదలకుండా జాత్యహంకారాన్ని రెచ్చగొట్టి కాపిటల్‌పై దాడి చేయడం అందులో భాగమేనని అంటున్నారు **రాజేంద్రబాబు అర్విణి**

ఎట్టకేలకు, చిట్టచివరకు డోనాల్డ్ ట్రంప్ వైట్ హౌస్ వీడాడు. 2021 జనవరి 20 నాడు అమెరికా సంయుక్త రాష్ట్రాల 46వ అధ్యక్షునిగా జోసఫ్ ఆర్. బైడన్, ఉపాధ్యక్షురాలిగా కమలా హరిస్‌లు అత్యంత పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య ప్రమాణ స్వీకారం చేయడంతో ఒక ఉత్కంఠ వీడింది. నూతన నాయకత్వం బాధ్యతలైతే చేపట్టింది కాని ట్రంప్ మున్ముందు ఏం చేస్తాడో, జాత్యహంకారం తలకెక్కిన తన అనుచరులను ఉసిగొల్పి ఏ సమస్యకు ఆజ్యం పోస్తాడో అన్న సందేహం ఇంకా పలువురిలో మిగిలే ఉంది. ఎందుకంటే ఎన్నికల ద్వారా రాజ్యాధికారం కట్టబెట్టే ప్రక్రియను పాటిస్తున్న ఏ దేశంలోనూ జరగని విధంగా జనవరి 6న అమెరికాలో అందరినీ నిశ్చేష్ఠపరచిన ఒక సంఘటన జరగడం, దానికి మూలకారణం ఎన్నికలలో ఓటమిని జీర్ణించుకోలేని ట్రంప్ కావడమే. ఆ ఘటనను అమెరికా ప్రభుత్వం, ప్రపంచ మీడియా 'తిరుగుబాటు'గా వర్ణించింది. గత సంవత్సరం నవంబర్‌లో జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికలలో అంతవరకూ అధ్యక్షునిగా ఉన్న డోనాల్డ్ ట్రంప్ ఓటమిని నిర్ధారించడానికి, ఆయన స్థానంలో అత్యధిక ఓట్లు గెలుచుకున్న జో బైడన్‌ను విజేతగా ఖరారు చేయడానికి అమెరికా కాంగ్రెస్ ఆనాడు సమావేశమయ్యింది. వాషింగ్‌టన్ డి.సి. రాష్ట్రంలోని కాపిటల్ హిల్ జిల్లాలో అమెరికా కాంగ్రెస్ సమావేశ మందిరం ఉంది. దాని పేరు 'కాపిటల్'. అంటే భారతదేశంలో పార్లమెంట్ భవనం లాగా. 2001లో భారత పార్లమెంట్‌పై ఉగ్రవాద దాడి జరిగినట్టుగా, అమెరికాలో కాపిటల్ భవనంపై 2021 జనవరి 6న దాడి జరిగింది. అటల్ బిహారీ వాజ్‌పేయ్ ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు లష్కర్-ఎ-తొయిబా, జయిష్-ఎ-మహమ్మద్ సంస్థలకు చెందిన అయిదుగురు ఉగ్రవాదుల గుంపు ఒకటి అంబాసిడర్ కారులో పార్లమెంట్ భవనంలోకి దూసుకువచ్చి ఎకె 47 తుపాకితో కాల్పులు జరిపారు. ఆ కాల్పుల్లో ఢిల్లీ భద్రతా పోలీసులు అయిదు మంది, ఒక మహిళా కానిస్టేబుల్, కేంద్ర రిజర్వు పోలీస్ సిబ్బంది ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు జరిపిన కాల్పుల్లో ఉగ్రవాదులు కూడా మరణించారు. కొన్నేళ్ల తర్వాత, ఆ దాడికి ప్రణాళిక రచించాడన్న నేరంపై అఫ్జల్‌గురును ఉరితీసింది భారత ప్రభుత్వం. ఇలాంటి సంఘటనలు అరుదుగా జరుగుతుంటాయి. భారత పార్లమెంట్ భవనం మీద జరిగిన దాడి లాగా కాపిటల్ భవనంలో అమెరికా కాంగ్రెస్ ప్రతినిధులు సమావేశ మవుతుండగా దాడి జరిగింది. అయితే, ఈ దాడి చేసింది ఉగ్రవాదులు కాదు. అమెరికన్లే ఆ పని చేశారు. జాత్యహంకార మదం ఎక్కిన ట్రంప్ మద్దతుదారులు ఉగ్రవాద చర్యకు పాల్పడ్డారు.

జనవరి 6న వందలాది మంది ట్రంప్ సానుభూతిపరులు తుపాకులు

ప్రభుత్వాలను అక్కడ స్థాపించారు. అసంఖ్యాక దేశాల స్వాతంత్ర్యాన్ని, సార్వభౌమత్వాన్ని, ఆయా దేశాల ప్రాదేశిక సమగ్రతలను అతిక్రమించి వారు తమ దురాక్రమణలు సాగించారు. అనేక దేశాలలో ప్రభుత్వాలను వారు కూలదోశారు, సాయుధ తిరుగుబాట్లను చేయించారు, నాయకులను హత్యలకు గురిచేశారు, చిన్న బలహీన దేశాలపై బాంబుల వర్షం కురిపించారు. బల ప్రయోగంతో దేశాలను విభజనలకు గురిచేశారు. ఆయా దేశాలలో తీవ్రవాద గుంపులకు అన్నివిధాలా సహాయ, సహకారాలందించి మార్గదర్శకత్వం వహించారు. ఇదంతా కేవలం ఆయా దేశాల ప్రజానీకం తమ సుసంపన్నమైన సంపద, వనరులతో వారికి లొంగి ఉండనందుకే నన్నది చరిత్ర చెబుతున్న సత్యం.

భారత పాలక వర్గాలు అలీన విధానానికి స్వస్తి పలికి ఏదో ఒక కూటమితో జతకడుతున్నారు. రష్యా సామ్రాజ్యవాదం కాకుంటే అమెరికా సామ్రాజ్యవాదం వైపు మొగ్గుచూపడం భారత ప్రయోజనాలకు హానికరం. సామ్రాజ్యవాద దోపిడీని శాశ్వతంగా అరికట్టాలని, దోపిడీ, పీడన, యుద్ధాలు, ఆధిపత్యం లేని ప్రపంచాన్ని సాధించాలని ప్రజలు కోరుకుంటున్నారు. అయితే, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లేని ప్రభుత్వం, తన ప్రజలపై నమ్మకముంచలేని ఏ ప్రభుత్వమైనా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఆధిపత్య రాజకీయాలనెదుర్కొనలేదు. తన ప్రజల ప్రయోజనాల కోసం సామ్రాజ్యవాదుల మధ్యనున్న వైరుధ్యాలను, వాటి సంక్షోభాలను ఉపయోగించుకొని సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాన్ని ముందుకు తీసుకు వెళ్లలేదు. అందువల్ల ప్రజలే సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా, నూతన ప్రజాతంత్ర భారతదేశం కొరకు ఉద్యమాలను తీవ్రతరం చేయడమే ఈనాటి ఆవశ్యకత.

అమెరికా సామ్రాజ్యవాదం ఇతర దేశాల మీద, ఆసియా ప్రజల మీద, ఆసియా పసిఫిక్ ప్రాంతం మీద తన ఆధిపత్యాన్ని రుద్దాలనుకుంటోంది. అలాంటి అమెరికా చేతిలో భారత్, జపాన్, ఆస్ట్రేలియాల కూటమి అనేది పై లక్ష్యాన్ని నెరవేర్చుకోవడానికి ఒక పనిముట్టు మాత్రమే. క్వాడ్ కలలు వాస్తవ రూపం ధరిస్తే అది విషాదకరంగా ఉంటుంది. ఆసియాలో శాంతికి ప్రమాదకరంగా పరిణమిస్తుంది. ప్రపంచ అభివృద్ధిని నాశనం చేస్తుంది. అందువల్ల భారత ప్రభుత్వం ఈ కూటమి నుండి బయటకు రావాలి. సామ్రాజ్యవాద దోపిడీ, ఆధిపత్యాల నుండి బయటకు వచ్చి స్వతంత్ర, ప్రజాతంత్ర, శాంతియుత ఆసియా కొరకు కృషి చేయాలి. అందుకు ప్రభుత్వం పూనుకునేలా శ్రామిక, కర్షక, విద్యార్థి, యువజన, మేధావి వర్గాలు సంఘటితంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన సందర్భం ఇది.

(రచయిత ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు, రాజనీతిశాస్త్ర విద్యార్థి) వీ

ధరించి పొడుగాటి కర్రలు పట్టుకొని కాపిటల్ భవనంలోకి జొరబడ్డారు. విధ్వంసం సృష్టించారు. ఆ దాడిలో అక్కడికక్కడ ఒక మహిళ, ఒక పోలీసు అధికారితో సహా అయిదు మంది చనిపోయారు. తుపాకులు పట్టుకుని విధ్వంసకారులు కాంగ్రెస్ సభ్యుల కోసం వెతికారు. అప్పటి ఉపాధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీకే చెందిన మైక్‌పెన్స్ గదిని కూడా వదల్లేదు. కాంగ్రెస్ సభ్యులంతా చెల్లా చెదురై ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకొని అల్లరి మూకల నుండి తప్పించుకొని పారిపోయారు. ఆస్తినష్టం భారీగా జరిగింది. అద్దాలు పగలగొట్టారు. ఫర్నీచర్ ధ్వంసం చేశారు. అంత ప్రాణ నష్టం జరిగిందంటే ఆ విధ్వంసకాండ ఏ స్థాయిలో జరిగిందో అర్థం చేసుకోవచ్చు. అల్లర్లను అణచివేయడానికి, అల్లరి మూకను భవనం నుండి ఖాళీ చేయించడానికి అమెరికా పోలీసులకే నాలుగు గంటల సమయం పట్టింది. ఇదంతా ఒక ఎత్తయితే, విధ్వంసకాండకు ముందు క్యాపిటల్ భవనం సమీపంలో జరిగిన ర్యాలీని ఉద్దేశించి డోనాల్డ్ ట్రంప్ గంటసేపు ప్రసంగించడం మరొక సంగతి. ట్రంప్, ఆయన కుటుంబ సభ్యులు ఆ ఊరేగింపుతో పాటు నడుస్తారని కూడా మొదట ప్రకటించారు. కాని ఎందుచేతనో ఆవేశపూరితమైన ప్రసంగాలకే పరిమితమయ్యారు. ట్రంప్ చేసిన రెచ్చగొట్టే ఉపన్యాసంతో ఆయన మద్దతుదారుల ఉద్రేకం కట్టలు తెంచుకుంది. 'ట్రంప్ గెలిచాడు', 'ఈ ఎన్నికల్లో మాయ చేశారు', 'డోనాల్డ్ ట్రంప్ మా అధ్యక్షుడు' అని అరుస్తూ, ప్లెకార్డులు పట్టుకొని గేట్లు పగలగొట్టి కొందరు, గోడదూకి మరికొందరు క్యాపిటల్ భవనంలోకి దూసుకువచ్చి నానా హంగామా చేశారు.

'తాను అధ్యక్షుడైతే అమెరికాను తిరిగి గొప్ప దేశంగా తీర్చిదిద్దుతానని' 2016 ఎన్నికల్లో వాగ్దానం చేసి గెలుపొందిన ట్రంప్, అధ్యక్షుడైన నాలుగు సంవత్సరాలు పరిపాలించి చివరికి అమెరికాను ప్రపంచంలో నవ్వుల పాలు చేశాడు. జనవరి 6 తర్వాతి పరిణామాలలో అమెరికా ప్రతినిధుల సభ అయన్ను అభిశంసించాలని తీర్మానించింది. అయితే, (ఈ వ్యాసం రాసే సమయానికి) సెనేట్‌లో ఇంకా చర్చ జరగాల్సి ఉంది. ట్రంప్ అభిశంసనకు గురయితే, ఆయన శాశ్వతంగా అమెరికా అధ్యక్ష పదవి గాని, పదవి కోసం గాని జరిగే ఎన్నికలలో పాల్గొనే అవకాశం ఉండదు. అంతేకాదు, సాలీనా 20 లక్షల డాలర్ల పెన్షన్, పది లక్షల డాలర్ల ప్రయాణపు ఖర్చులు కోల్పోతాడు.

జనవరి 6 సంఘటన జరిగిన సందర్భంలో నాకు నాజీ నియంత అడాల్ఫ్ హిట్లర్ గుర్తుకు వచ్చాడు. గత శతాబ్దపు మూడవ దశకం మధ్య భాగంలో జర్మనీ పరిపాలకుడుగా వచ్చిన హిట్లర్ జాత్యహంకారాన్ని జర్మన్‌ల తలకెక్కించి, రెండవ ప్రపంచ యుద్ధానికి సన్నద్ధం చేసి చివరికి ఓటమిని తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నాడు. ట్రంప్ కూడా అమెరికాలో తెల్ల చర్మంతో పుట్టిన వాళ్లే జన్మతఃఅధ్యక్షులు అన్న భావం ప్రజలలో చొప్పించి జాత్యహంకారం ప్రబలేలా చర్యలు చేపట్టి చివరికి ఓటమి తట్టుకోలేక హింసకు, విధ్వంసానికి తన అనుచరులను ఉసిగొల్పాడు. అమెరికా అధ్యక్ష పదవిలో ఉండి తన అనుయాయులను అలా తెంపరితనానికి ఉసిగొల్పడం ఆత్మహత్యతో సమానమే.

ఇటీవల కాలంలో పదిమంది నోళ్లల్లో నానుతున్న దేశాల అధినేతలు తమ పదవులను, అధికారాలను శాశ్వతం చేసుకోవాలన్న తపనతో ప్రజాస్వామిక స్ఫృహకు వ్యతిరేకమైన పనులకు పాల్పడడం ప్రజలు గమనిస్తున్నారు. అధికారం ప్రజల నుండి రావాలి గాని చట్ట సవరణల ద్వారానో, అణచివేత వలననో కాదు అన్న రాజకీయ ప్రాథమిక సూత్రాన్ని మరిచిపోతున్నారు. రష్యాలో పుతిన్ తన ప్రత్యర్థులను భీకరంగా అణచివేస్తూ గత 20 ఏళ్లకు పైగా అంతులేని అధికారాన్ని అనుభవిస్తున్నాడు. 2018లో జరిగిన ఎన్నికల ద్వారా 2029 సంవత్సరం వరకు అధికారాన్ని పొందాడు. ఆ తర్వాత కూడా అధికారంలో ఉండడానికి చట్ట సవరణకు పూనుకున్నాడు. కాని, ఆ తర్వాత అనారోగ్య పరిస్థితుల కారణంగా తన నిర్ణయం మార్చుకున్నట్లు వార్తలు వచ్చాయి కాని, అదెంతవరకు వాస్తవమో తెలియదు. పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా అధ్యక్షుడు ఎవరైనా వెంట వెంటనే రెండు దఫాల కంటే ఎక్కువ పర్యాయాలు అధ్యక్షుడిగా కొనసాగే అవకాశం ఉండేది కాదు. 2013లో అధ్యక్షుడిగా ఎన్నికయి 2018లో రెండవ సారి కూడా తిరిగి ఎన్నికైన జి జిన్‌పింగ్ ఎన్ని సార్లయినా ఒకవ్యక్తి అధ్యక్షుడిగా కొనసాగవచ్చని రాజ్యాంగం మార్చుకున్నాడు. 1986 నుండి ఉగండా అధ్యక్షుడిగా ఏకచక్రాధిపత్యం చేలాయిస్తున్న యొవరి ముసవేని 2021లో జరిగిన ఎన్నికలలో వరుసగా ఆరవ సారి కూడా ఎన్నికైనట్లు ఉగండా ఎన్నికల కమిషన్ ప్రకటించింది. ఓటింగ్ ప్రక్రియలో గందరగోళం జరిగిందని, ఇంటర్నెట్ బంద్దైన రోజుల్లో ఆన్‌లైన్ ఓటింగ్ ఎలా నిర్వహించారని, ఇవి బోగస్ ఫలితాలని ప్రతిపక్ష నాయకుడు అభ్యంతరం వ్యక్తపరిస్తే ఎలక్షన్ కమిషన్ నుండి గాని, ప్రభుత్వం వైపు నుండి గాని సమాధానం లేదు. పైగా అరెస్టులు. ప్రపంచ దేశాల్లో ఈ విధంగా అధికారాన్ని అంటిపెట్టుకునే ధోరణి ప్రబలిపోతున్న ఈ రోజుల్లో ప్రజల నుండి వచ్చిన వత్తిడివల్ల, రాజ్యాంగ వ్యవస్థలు ఆయనకు సహకరించకపోవడం వల్ల ట్రంప్ అక్రమంగా పదవిలో కొనసాగే ప్రయత్నం చేసినా అధి సాధ్యం కాలేదు. (పైన ఉదహరించిన రష్యా, చైనా, ఉగండా దేశాలలో వ్యవస్థలు ప్రభుత్వాధినేతల అడుగులకు మడుగులొత్తే పరిస్థితులలోనే అధినేతల ఆటలు సాగినవి.) అయితే, మరొక్క విషయంలో 2020 అమెరికా ఎన్నికలు ప్రత్యేకంగా నిలిచాయి. ఒక మహిళ – నల్లజాతి మహిళ – ఆసియా మూలాలు ఉన్న మహిళ ఉపాధ్యక్షురాలిగా ఎన్నిక కావడమే ఆ ప్రత్యేకత. ఎందుచేతనంటే, అమెరికాలో జాత్యహంకారులు మహిళలను చిన్నచూపు చూస్తారు. ఆఫీసుల్లో చేసే పని ఒకటే అయినా పురుషుల కంటే మహిళా ఉద్యోగినులకు తక్కువ వేతనాలు ఇస్తారు. నల్లజాతి వాళ్లను నేరస్థులుగా పరిగణిస్తారు. ఆసియన్లను అనాగరికులని భావిస్తారు. భారతీయ సంతతికి చెందిన స్త్రీగా మనం గర్వించవచ్చు గాని, కమల హరిస్ పూర్తిగా అమెరికన్ మహిళనే!

అయితే, అసలు ప్రశ్న ట్రంప్ శైలికి, బైడన్ పరిపాలనా విధానాలకు ఏమైనా తేడా ఉంటుందా అని. శైలి భిన్నమైనా విధానాలు ఒక్కటే అన్నది మన అనుభవంలోని మాట. ప్రపంచంలోని ప్రఖ్యాత టివి ఛానళ్లు ట్రంప్ వెంట ఉన్న వాళ్లెవరూ మూతికి మాస్కులు పెట్టుకోలేదని, బైడన్ బృందం మాత్రం మాస్కులు ధరించారని ఘోషిస్తున్నాయి గాని, అది మాత్రమేనా కావల్సింది? మెక్సికో గోడ నిర్మాణం ఆపివేయడం మంచిదే. ప్రజల మధ్య అడ్డుగోడలు తొలగించే పనిని అభినందించాల్సిందే. అలాగే ట్రంప్ 2017లో ముస్లిం దేశాల నుండి వచ్చే ప్రయాణికులపై పెట్టిన ఆంక్షలను ఎత్తివేయడాన్ని స్వాగతించవలసిందే. పర్యావరణ పరిరక్షణలో పారిస్ కేంద్రంగా జరుగుతున్న 'కయిమేట్ మార్పు' ఉద్యమంలో మళ్లీ చేరడం, ప్రపంచ ఆరోగ్య సంస్థలో సభ్యత్వం పునరుద్ధరించడం – ఇవన్నీ మంచి చర్యలే. కాని, ప్రపంచ దేశాల మధ్య అమెరికా పెద్దన్న పాత్ర వహించడం, ముఠా మేస్త్రి, పోలీసు పాత్ర నిర్వహించడం మానుతుందా అన్నది అసలు ప్రశ్న! బైడన్ గత చరిత్ర పరిశీలిస్తే ప్రపంచ దేశాలకు మంచి మిత్రునిగా, మోసం చేయని వాటాదారునిగా అమెరికాను తీర్చుదిద్దుతాడని ఆశించడం అత్యాశ అవుతుందేమో!

(రచయిత జూనియర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్) వీ

వైమార్ యుగంలోకి ప్రవేశించిన అమెరికా

***పాలకులు జాతి, మత, ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టి, ప్రజలకు భ్రమలు కల్పించి వీధి పోరాటాల ద్వారా అధికారంలోకి రావడానికి అనుకూలమైన పరిస్థితి ఉందని అంటున్నారు* వాల్డెన్ బెల్లో**

(అమెరికా అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికలలో డెమోక్రాటిక్ పార్టీ అభ్యర్థి జో బైడన్ ఎన్నిక కావడం పట్ల నిరసనగా ట్రంప్ ఇచ్చిన పిలుపును అందుకుని రిపబ్లికన్ పార్టీ కార్యకర్తలు, శ్వేతజాతి దురహంకారులు జనవరి 6న అమెరికా ప్రభుత్వ కేంద్రమైన క్యాపిటల్ హిల్‌పై సాయుధంగా దాడిచేశారు. దీనిని సాయుధ తిరుగుబాటుగా కొత్త ప్రభుత్వం పేర్కొంది. ఈ సంఘటనపట్ల ప్రపంచమంతా దిగ్భ్రాంతికి గురైంది. ప్రపంచ దేశాలన్నింటికీ 'ప్రజాస్వామ్య' విలువల పాఠాలను నేర్పుతున్నాననే అమెరికాలో ఇలాంటి అప్రజాస్వామిక చర్యలు జరగడం అక్కడి రాజకీయ ఆర్థిక వ్యవస్థ ఎంతగా దిగజారిపోయిందో తెలియజేస్తోంది. దాని 'ప్రజాస్వామ్య అహంకారం' నేల కూలింది. దీని గురించి విశ్లేషణ చేయడానికి 'డెమోక్రసీ నౌ' పత్రిక వాల్డెన్ బెల్లోను 2021, జనవరి 12న ఇంటర్వ్యూ చేసింది.

వాల్డెన్ బెల్లో గుర్తింపు పొందిన సామాజిక శాస్త్రవేత్త, విద్యావేత్త, పర్యావరణవేత్త, కార్యకర్త. ఆయన బాంగ్‌కాక్‌లో ఉన్న 'ఫోకస్ ఆన్ ద గ్లోబల్ సౌత్' అనే సంస్థలో సీనియర్ విశ్లేషకుడు. న్యూయార్క్ స్టేట్ యూనివర్శిటీలో అంతర్జాతీయ ఎడ్జంట్క్ ప్రొఫెసర్. ఆయన తను స్వయంగానూ, ఇతరులతో కలిసి 25 పుస్తకాలు రాశారు. వాటిల్లో "ప్రతీఘాతుక విప్లవం; ప్రపంచవ్యాప్తంగా అతి మితవాదం అభివృద్ధి" అనే పుస్తకం ట్రంపిజం సాంఘిక మూలాలను పరిశీలించింది. ఆయన 2009 నుండి 2015వరకు పిలీప్పీన్స్ ప్రతినిధుల సంస్థలో సభ్యుడుగా ఉన్నారు. ప్రత్యామ్నాయ నోబెల్ బహుమతిగా గుర్తించబడిన రైట్ లైవ్లీహుడ్ పురస్కారాన్ని పొందారు. 'ఫారిన్ పాలసీ ఇన్ ఫోకస్' అనే పత్రికలో ఈ మధ్య కాలంలో ఆయన రాసిన వ్యాసానికి 'అమెరికా వైమార్ యుగంలోకి ప్రవేశించింది' అనే శీర్షిక పెట్టారు.)

ప్రశ్న: గతవారం అమెరికాలో జరిగిన తిరుగుబాటును గురించి, ప్రపంచ రాజకీయ నేపథ్యంలో మీరు ఎలా అర్థం చేసుకున్నారు?

బెల్లో: అమెరికన్ రాజకీయ వ్యవస్థకు గుండెకాయవంటి క్యాపిటల్ హిల్‌లో జరిగిన ఈ తిరుగుబాటు సంఘటన మొదట నాకు దిగ్భ్రాంతి కలిగించింది. అయితే ప్రతీఘాతుక విప్లవాలను అధ్యయనం చేసిన వ్యక్తిగా ఇలాంటి వీధి యుద్ధాలు, సమీకరణలకు అన్ని దేశాలల్లోలాగానే అమెరికాలో కూడా అతి తీవ్రవాద శక్తులు ప్రయత్నిస్తాయని నేననుకుంటూనే ఉన్నాను. అయితే సంఘటనలు ఇంత నాటకీయంగా జరుగుతాయని మాత్రం ఊహించలేదు.

1973లో చిలీలో అల్లర్లు సృష్టించిన మితవాద ముఠాలు గుర్తుకు వచ్చాయి. అవి సృష్టించిన అల్లకల్లోలాన్ని అడ్డం పెట్టుకుని సైన్యం జోక్యం చేసుకుని అధ్యక్షుడు అలెండీని పదవీచ్యుతుణ్ణి చేసింది. ఇప్పుడు అమెరికాలో ఉన్న 'ప్రౌడ్ బాయ్స్' లాంటి రౌడీ ముఠాలే చిలీలో కూడా అప్పట్లో అల్లర్లు సృష్టించాయి.

ఆ తరువాత నాకు గుర్తుకువచ్చింది, ఇటలీలో ముసోలినీకి చెందిన నేషనల్ ఫాసిస్టు పార్టీ పారామిలటరీ దళాలు. అవి వీధుల్లోకి వచ్చి ప్రాంతాలను స్వాధీనం చేసుకొని తదనంతరం దేశంలో అధికారాన్ని స్వాధీనం చేసుకున్నాయి. ఆ సమయంలో ఇటలీలో సోషలిస్టులు ఎన్నికలలో ప్రజాదరణను పొందుతున్న కారణంగా, పాలకవర్గం ఫాసిస్టు దళాలను హింసాత్మక చర్యలకు ప్రేరేపించి వామపక్షాల్ని అణచివేసింది.

దీని తరువాత నాకు గుర్తుకువచ్చిన మరో దృశ్యం 1920వ దశకం చివరి సంవత్సరాలలో జర్మనీలో వైమార్ రిపబ్లిక్1 పాలన అంతిమ రోజులు. ఆ కాలంలో జర్మనీలో బలమైన రాజకీయ సమీకరణలు జరుగుతుండేవి. దాని కారణంగా ఏర్పడిన రాజకీయ ప్రతిష్టంభనను తమదైన శైలిలో పరిష్కరించాలని నాజీ ఫాసిస్టులు కోరుకున్నారు. వీధులమీద అజమాయిషీ సంపాదించడం, ప్రజల్ని, సోషల్ డెమోక్రాట్లను, కమ్యూనిస్టులను చితకబాదటం వంటి చర్యలకు వాళ్లు పాల్పడ్డారు. అలా వీధులలో వచ్చిన వెల్లువ తెట్టుపై తేలి వాళ్లు హిట్లర్‌ను అధికార పీఠంపైకి ఎక్కించగలిగారు. ఎన్నికల ద్వారా మాత్రమేకాక వీధి టెర్రరిస్టు పద్ధతుల ద్వారా కూడా వాళ్లు ఈ పనిచేశారు.

అందుచేత క్యాపిటల్ హిల్‌లో జరిగిందేమీ అసాధరణమైందేమీ కాదు. ఎన్నికలలో తాము ఓడిపోవడం ప్రారంభమైనపుడు, ప్రత్యర్థులు ఎన్నికల బరిలో తమపై పైచేయి సాధిస్తున్నారని అనుకున్నప్పుడు ఈ మితవాద బృందాలు వీధుల్లోకి వచ్చి దౌర్జన్యంగా, ఆ క్రమాన్ని ఆపడానికి ప్రయత్నిస్తాయి.

ఇలాంటి విషయాలన్నీ నా మనసులోకి వచ్చాయి. ఇందులో నాటకీయత చాలా ఉంది. అయితే గత కొద్ది సంవత్సరాలుగా అమెరికాలో జరుగుతున్న పరిణామాలను, ప్రతీఘాతుక విప్లవాలని అధ్యయనం చేసిన వ్యక్తిగా ఇలాంటిదేదో జరుగుతుందని మాత్రం నేను ఊహించగలిగాను. గత కొద్ది కాలంగా రిప్లబికన్ పార్టీతో సంబంధం ఉన్న గణనీయమైన శక్తులు క్రమంగా అతి మితవాదంవైపు ప్రయాణించిన కారణంగా ఇది ఇలా జరిగింది.

ప్రశ్న: "మరణశయ్యమీద ఉన్న నయా ఉదారవాదం స్థానాన్ని ఆక్రమించడానికి పోటీ" అని మీరు రాసిన వ్యాసంలో ఇలా అన్నారు. ప్రతిసారీ సంక్షోభాలు గణనీయమైన మార్పులకు దారితీయవు. అది రెండు అంశాలమధ్య పోటీ, పరస్పర సమ్మేళనం మీద ఆధారపడి

ఉంటుంది. ఒకటి వస్తుగతమైంది, అంటే వ్యవస్థలో సంక్షోభం. రెండు స్వీయాత్మకమైనది, అంటే వ్యవస్థాగత సంక్షోభానికి ప్రజల మానసిక ప్రతిస్పందన. ఇదే నిర్ణయాత్మకమైనది" మీరు ఇలా కూడా అన్నారు. "ప్రపంచవ్యాప్తంగా ఉన్న అసంతృప్తిని తమకు అనుకూలంగా మార్చుకోవడంలో దురదృష్టవశాత్తు వామపక్షాల కంటే అతి మితవాదమే ప్రస్తుతం అనుకూల పరిస్థితుల్లో ఉన్నది" ఈ స్థితి ఉత్తర ప్రపంచంలోనే కాకుండా దక్షిణ ప్రపంచంలో కూడా ఉందని మీరన్నారు. అది ఎలా ఎందుకుందో వివరిస్తారా?

బెల్లో: అందరికీ తెలిసిన ఒక వాస్తవాన్ని ప్రస్తావిస్తున్నాను. 2008లో బద్దలైన ప్రపంచ ద్రవ్యసంక్షోభం వాస్తవంగా ఇప్పటిదాకా పరిష్కరించబడక కొనసాగుతూనే ఉంది. బ్యాంకులను కంట్రోల్ చేయడానికి, ఇళ్ల యజమానులను కాపాడడానికి, ఉద్యోగ అవకాశాలను గణనీయంగా పెంచడానికి అమెరికాలో ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడమే దీనికి కారణం. ఇదంతా ప్రజలను పరాయీకరణకు గురిచేసిన క్రమం. ఈ స్థితి రావడానికి నయా ఉదారవాదం సహాయపడింది. తీవ్రవాదానికి అనుకూలమైన పరిస్థితులు 2008లో లేవు. కాని కోవిడ్-19 కారణంగా 2020నాటికి తీవ్రవాదానికి అనుకూలంగా ప్రజలను సమీకరించడానికి కావల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

ఈ స్థితి కారణంగా వామపక్షాలకంటే అతిమితవాదమే లాభపడిందని నేను అనడంలో నాకు చాలా ఆలోచనలున్నాయి. మొదటిది జాత్యహంకారాన్ని రెచ్చగొట్టడం, నిక్సన్ కాలం నుండి ప్రారంభమైన 'ఉత్తరాది రాష్ట్రాల వ్యూహం'లో భాగంగా రిపబ్లికన్ పార్టీ అనుసరించిన నిత్యం 'కోడై కూసే' (గోబెల్స్ తరహా-అను) ప్రచార ధోరణి. రెండోది ఇంతటి నిరుద్యోగాన్నీ, పరిశ్రమల మూసివేతను సృష్టించిన నయా ఉదారవాద ప్రభావం. ప్రత్యేకించి తెల్లజాతి కార్మికులతో సహా కార్మికులందరిలో పెరిగిన నిరుద్యోగం ఆయా వర్గాలను గట్టిగా దెబ్బతీసింది.

డెమొక్రటిక్ పార్టీ ఇంకెంతమాత్రమూ తమ ప్రయోజనాల కోసం పనిచేసేదిగా భావించడాన్ని తెల్లజాతి కార్మికులతో సహా కార్మికులందరూ మానుకున్నారు. క్లింటన్‌తో ప్రారంభమై ఒబామా దాకా డెమొక్రటిక్‌పార్టీ ఏదో ఒకరకంగా నయా ఉదారవాద కథనాలలో చిక్కుకుందని వాళ్లు గమనించారు.

ఈ విధంగా తెల్లజాతి కార్మికులు పెద్దసంఖ్యలో సమీకరించ బడడానికి సిద్ధంగా ఉన్నారు. ట్రంప్, అమెరికాలోని మితవాదశక్తులు దీన్ని తమకు అనుకూలంగా మలుచుకుని వాళ్లను పెద్దఎత్తున సమీకరించాయి. అయితే ఈ సమీకరణంతా ప్రాథమికంగా మితవాదంవైపూ, జాత్యహంకారం వైపుగా జరిగింది."మీకు చెందినదాన్ని ఉదారవాదులు లాక్కుని మైనారిటీలకు ఇస్తున్నారు" అని మితవాదం సమీకరణలో భాగంగా ప్రచారం చేసింది. అంటే కార్మికులు ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభాన్ని, పరిష్కారాన్ని జాత్యహంకార భావజాలంతో ప్రచారం చేసిందన్నమాట. ట్రంప్ పెంచిపోషించిన అసలైన పునాది ఇది. ట్రంపిజంకు సంబంధించి ఒక్కమాట చెప్పనివ్వండి. ట్రంప్ కేవలం ఆ పునాదికి సృష్టికర్త మాత్రమే కాదు, దానిచేత సృష్టించబడినవాడు కూడా.

ఇక వామపక్షాలవైపు చూద్దాం. ప్రపంచీకరణలో లోపాల్ని అది గుర్తించింది. కాని ఆ గుర్తింపు స్వతంత్రంగా వ్యవహరించే వామపక్షవాదుల నుండి వచ్చింది. కాని ఐరోపాలోని సోషల్ డెమోక్రాట్లు, అమెరికాలోని డెమోక్రాటిక్‌పార్టీ, సాధారణంగా మనం వామపక్షంగా భావించే శక్తులు మాత్రం నయా ఉదారవాదంతోటి, వాల్‌స్ట్రీట్ విధానాలతోటి కుమ్మక్కు అయినట్టుగా ప్రజలు గమనించారు. ఆ కారణంగా ప్రధాన స్రవంతికి చెందిన వామపక్షం నుండి, డెమోక్రాటిక్‌పార్టీ నుండి రావల్సిన ప్రత్యామ్నాయం ఏదీ రాలేదు. వామపక్షం నుంచి ప్రత్యామ్నాయ సమాజానికి సంబంధించిన గొప్ప ఆలోచనలు వచ్చినమాట మాత్రం వాస్తవమే. కాని దానివల్ల వాళ్లు రాజకీయలబ్ధి పొందలేకపోయారు. అభ్యుదయశక్తులు, పొందవలసిన సమయంలో, ప్రజాపునాదిని సమకూర్చుకోలేకపోయాయి.

అంతేకాదు కోవిడ్-19, ప్రపంచ ఆధిపత్య శక్తిగా కొనసాగుతున్న అమెరికా వేగాన్ని తగ్గించగలిగింది. ఆధునిక పెట్టుబడికి పారిశ్రామిక కేంద్రంగా చైనా ఎదుగుదల కొనసాగింది. అది ప్రపంచ ఉత్పత్తి కేంద్రంగా మారింది. పెద్ద ఎత్తున పారిశ్రామిక పునాదిని సృష్టించుకున్నది. ఉత్పత్తుల విలువ పెరిగింది. ప్రపంచంలో నూతన పెట్టుబడి సంచయం రూపొందిన కేంద్రంగా అది మారింది. మరోవైపు అమెరికాలో పరిశ్రమలు మూతపడి నిరుద్యోగం ఊహకందని రీతిలో పెరిగింది.

ప్రశ్న: సెప్టెంబర్ 11, 1973న పినోచెట్ అనుకూలశక్తులు, ప్రజాస్వామికంగా ఎన్నుకోబడిన అధ్యక్షుణ్ణి పదవీచ్యుతుణ్ణి చేసి అధికారంలోకి వచ్చినప్పుడు మీరు యువ విద్యార్థిగా చిలీలోనే ఉన్నారుకదా? పినోచెట్ పరిపాలనా కాలం నుండి మీరు నేర్చుకున్న గుణపాఠాలేవి? మీ స్వంత దేశమైన ఫిలిప్పైన్స్‌లో మార్కోస్ పాలనాకాలంలోనూ, ప్రస్తుతం డ్యుటెరె పాలనా కాలంలోనూ మీరు చవిచూస్తున్న అనుభవాలు ఎలాంటివి? అధ్యక్షుడు ట్రంప్‌ను మేం అర్థం చేసుకోవడానికి అవి ఎలా ఉపయోగపడతాయో మీరు చెప్పండి? అలాగే ఈ దేశంలో రాబోయే సంక్షోభం గురించి కూడా మాట్లాడండి?

బెల్లో: మంచిది. చెప్పాల్సినవి చాలా ఉన్నాయి. తాము ఎన్నికల పోరాటంలో ఓడిపోవడం ప్రారంభమైనప్పుడు మితవాదశక్తులు ప్రజాస్వామిక క్రమాన్ని నిరోధించడానికి వీధిపోరాటాలకు దిగుతాయనేది మనం నేర్చుకోవాల్సిన మొదటి పాఠం. చిలీలో ప్రాథమికంగా జరిగింది ఇదే. అప్పటికి మాకు మేం ఎన్నుకున్న ఒక ప్రభుత్వం ఉంది. కాని శాసన పరంగానూ, పాలనా పరంగానూ దాన్ని కంట్రోల్ చేయడానికి మితవాదశక్తులు ప్రయత్నించాయి. అది సాధ్యం కాలేదు. అప్పుడు మితవాద మూకలు వీధుల్లోకి వచ్చి వాటిని తమ అజమాయిషీలోకి తెచ్చుకొని వామపక్షవాదుల మీద దాడులుచేసి ఒక నూతన పరిస్థితిని సృష్టించాయి. ఆ తరువాత "రాజకీయ స్థిరత్వం కోసం" సైన్యాన్ని జోక్యం చేసుకోమని ఆహ్వానించారు. ఇదంతా మితవాదశక్తులకు అనుకూలంగా జరిగిన క్రమం.

చిలీ గణతంత్ర రాజ్యంగా ఏర్పడినప్పటి నుండీ రాజకీయాలలో సైన్యం జోక్యం చేసుకోకూడదనే గర్వించదగ్గ సాంప్రదాయం మా దేశంలో ఉండేది. కాని 1973లో రాజకీయ సమీకరణలు మారినప్పుడు సైన్యం రాజకీయాలలో ప్రవేశించి మితవాదులకు అనుకూలంగా జోక్యం

చేసుకున్నది. సైన్యంపై పౌర అజమాయిషి వంటి రాజకీయ వ్యవస్థల శక్తిని మనం తక్కువ అంచనా వేయరాదు, అతిగానూ అంచనా వేయరాదు. రాజకీయ సమీకరణలు పెద్ద ఎత్తున మారుతున్న సందర్భంలో ఇలాంటి నియమాలన్నీ బలహీనపడతాయి. భద్రతా దళాలలోనూ, ప్రభుత్వ యంత్రాంగంలోనూ కూడా కొన్ని శక్తులు "పౌర ప్రభుత్వం సమస్యలను పరిష్కరించలేకపోతున్నది, రాజకీయ శిష్టుల మధ్య ఏకాభిప్రాయం లేదు. దేశాన్ని స్థిరంగా ఉంచగలిగేది మనం- అంటే సైన్యం- మాత్రమే. ప్రజాస్వామ్యాన్ని నిర్మూలించడం ద్వారా స్థిరత్వాన్ని సాధిద్దాం" అని అంటాయన్నది మనం గుర్తించాలి.

1972లో ఫిలిప్పైన్స్‌లో జరిగింది కూడా ప్రధానంగా ఇదే. "ప్రజాస్వామ్యం ప్రతిష్టంభనలో పడింది. మనం ముందుకు కదలాలి. అందుచేత ఒక అధికారయుత పాలనను మనం ప్రకటించాలి" అని మార్కోస్ అన్నాడు.

నేనిక్కడ ఒక విషయం చెప్పదలుచుకున్నాను. అమెరికన్ రాజకీయ సంస్థల బలాన్ని అతిగా అంచనా వేయవద్దు. అమెరికన్ సాంప్రదాయాలను తాను ఎంత సులువుగా ఉల్లంఘించగలిగాడో ట్రంప్ గత నాలుగేళ్లలో మనకు చేసి చూపించాడు. అది ఎక్కడ ముగుస్తుందో మనకు తెలియదు. అమెరికాలో జనాభా నిష్పత్తి తెల్లజాతి ప్రజలకు నష్టదాయకంగా మారుతోంది. రాజకీయంగా కూడా రిపబ్లికన్‌పార్టీ తన ఆధిపత్యాన్ని కోల్పోతోంది. ఇది మనం చూశాం. జార్జియా, అరిజోనా వంటి రాష్ట్రాలు ఎలా డెమోక్రాట్ల చేతుల్లోకి పోయాయో. బైడన్ దాదాపు డెబ్బై లక్షల ఓట్ల తేడాతో ఎట్లా గెలిచాడో మనం చూశాం. అంటే రాజకీయంగానూ, ఎన్నికల పరంగానూ మార్పు సాధారణ వామపక్షశక్తులు, అభ్యుదయ కాముకులు, ఉదారవాదులు, మైనారిటీలతో కూడిన ఐక్యసంఘటనవైపు మొగ్గింది. ఇలాంటి సమయంలో అమెరికాలోని మితవాదశక్తులు మరింతగా వీధిపోరాటాలకు సిద్ధమవుతాయని మనం ఊహించాలి. దీనికి ప్రజలు సిద్ధంగా ఉండాలి. ఎన్నికల్లో గెలవలేని వాళ్లు వీధుల్ని తమ అజమాయిషీలోకి తెచ్చుకొని గెలుస్తారు. అదే జరిగితే సైనిక జోక్యానికి తలుపులు తెరుచుకున్నట్టే.

అమెరికా వైమార్ దశలోకి ప్రవేశిస్తుందని నా అంచనా. అదికూడా ఆనాటి వైమార్ రిపబ్లిక్ చివరి సంవత్సరాలను గుర్తుకు తెస్తోంది. ఒక పక్క ఎన్నికల పోరాటం, మరోపక్క వీధిపోరాటాలు, అల్లకల్లోలం. 1933లో హిట్లర్ జర్మనీలో అధికారంలోకి రావడంతో ఈ స్థితి ముగిసింది. అయితే జర్మనీలో జరిగినట్టే ఖచ్చితంగా ఇక్కడ జరగక పోవచ్చు. చరిత్ర ఎప్పుడూ ఎక్కడా యథాతథంగా పునరావృతం కాదని మనం గుర్తుంచుకోవాలి. అదే సమయంలో గత శతాబ్దంలోనూ ఈ శతాబ్దంలోనూ జరిగిన విప్లవ ప్రతీఘాతుక ఉద్యమాల నుండి మనం గుణపాఠాలను తీసుకోవాలి. దీనికి అమెరికా మినహాయింపు కాదు. అమెరికా ఇంకెంతమాత్రం ఒక ప్రత్యేకమైన సమాజం కాదు. గత కొద్ది సంవత్సరాలుగా, ప్రత్యేకించి గత కొద్ది నెలలుగా గత కొద్ది రోజులుగా జరుగుతున్న సంఘటలను చూస్తే అమెరికా మిగిలిన ప్రపంచంలాగే తయారవుతుందని తెలుస్తుంది. అందుచేత అమెరికా ప్రత్యేకతకు ఇది ముగింపు.

1. వైమార్ రిపబ్లిక్: మొదటి ప్రపంచ యుద్ధం తరువాత జర్మనీలో తీవ్రమైన ఆర్థిక, సాంఘిక అస్తవ్యస్త పరిస్థితి ఏర్పడింది. ఆ కారణంగా సైనికులు తిరుగుబాట్లు జరిపారు. ప్రజల మధ్య కోల్పోయిన కైజర్ విల్‌హెల్మ్-2 1918, నవంబర్ 9న అధికారం నుండి వైదొలిగాడు. 1918 డిసెంబర్‌లో నేషనల్ అసెంబ్లీకి ఎన్నికలు జరిగాయి. 1919 ఫిబ్రవరి 6న ఈ కొత్త అసెంబ్లీ వైమార్ అనే పట్టణంలో సమావేశమై ఒక కొత్త ఐక్య సంఘటనా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అందులో సోషల్ డెమోక్రాటిక్ పార్టీతోపాటు కొందరు సోషలిస్టులు కూడా చేరారు. దానినే వైమార్ రిపబ్లిక్ అంటారు. కాని ఈ ప్రభుత్వం ప్రపంచ యుద్ధానంతరం ఏర్పడిన తీవ్ర ఆర్థిక సంక్షోభం నుండి దేశాన్ని కాపాడలేకపోయింది. సమాజంలో ఏర్పడిన అరాచకస్థితిని, ప్రజలలో ఏర్పడిన అసంతృప్తిని సొమ్ముచేసుకున్న హిట్లర్, విపరీతమైన తప్పుడు ప్రచారం ద్వారా, సాయుధ మూకల దౌర్జన్యకర చర్యల ద్వారా జాత్యహంకారాన్ని, యూదు వ్యతిరేకతను రెచ్చగొట్టి ఎన్నికలను తనకు అనుకూలంగా మార్చుకుని అధికారంలోకి వచ్చాడు. తదనంతరం నాజీ నియంతగా మారాడు.

(ప్రపంచ చరిత్రలో తీవ్ర మితవాదశక్తులు వాటి ఆర్థిక, రాజకీయ, సాంఘిక ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడానికి ఉపయోగపడినంత కాలం ప్రజాస్వామ్యాన్ని, ఎన్నికల వ్యవస్థను గౌరవించినట్లు నటిస్తాయి. ప్రజానుకూల శక్తులు ఎన్నికల్లో అధికారాన్ని సంపాదించుకుంటే జాతి, మత, ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టి, ప్రజలలో తప్పుడు భ్రమలు కల్పించి వీధిపోరాటాల ద్వారా అధికారాలను కైవసం చేసుకుంటాయి. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇలాంటి రాజకీయాలకు ప్రపంచ వ్యాప్తంగా అనుకూల వాతావరణం ఏర్పడిందని వాల్డెన్ బెల్లో భావన. మనదేశంలో క్రమక్రమంగా చోటుచేసుకుంటున్న పరిణామాల నేపథ్యంలో బెల్లో వ్యాసానికి ప్రాసంగికత ఉన్నది. - అను) వీ

(అనువాదం: సిఎస్ఆర్. ప్రసాద్)

బొడ్డేపల్లి దాలినాయుడు మృతి

శ్రీకాకుళ ఉద్యమంలో పాల్గొన్న బొడ్డేపల్లి దాలినాయుడు(71) జనవరి 16న అనారోగ్యంతో మరణించారు. ఆయన శ్రీకాకుళం జిల్లా, ఆముదాలవలస మండలం, కనుగులవలస గ్రామంలో జన్మించారు. 1969 - 70లలో శ్రీకాకుళ సాయుధ పోరాటంలో పాల్గొన్నారు. పలాస అచ్చుకోట జంట హత్యల కేసులో పార్టీకి వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పనందుకు పోలీసులు ఎన్‌కౌంటర్ చేయాలని ప్రయత్నించగా బంధుమిత్రులు అడ్డుకొని నిరసన తెలుపడంతో జైలుకు పంపారు. తర్వాత పలాసలో అరెస్టు చేసి 2 సంవత్సరాలు జైలులో నిర్బంధించారు. కండిషన్ బెయిల్ మీద బయటకు వచ్చి యూనివర్సిటీలో ఉద్యోగం కొనసాగిస్తూనే ఎపిఆర్ఎఫ్‌లో పనిచేశారు. జననాట్య మండలితో కలిసి శ్రీకాకుళంలో అనేక గ్రామాలలో కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

జర్మనీలో రైతు యుద్ధాలు - కార్మిక కర్షక ఐక్య సంఘటన

విప్లవోద్యమంలో రైతాంగ పాత్రను అర్థం చేసుకోవడానికి ఉపయోగపడే ఫ్రెడరిక్ ఎంగెల్స్ రచనను పరిచయం చేస్తున్నారు **కొండూరి వీరయ్య**

రైతాంగం పట్ల మార్క్స్, మార్క్సిజం వైఖరి గురించి చెప్పుకోదగ్గ స్థాయిలో సైద్ధాంతిక భిన్నాభిప్రాయాలున్నాయి. వివాదాలు ఉన్నాయి. పొరపాటు అవగాహనలు కూడా ఉన్నాయి. సమాజం పెట్టుబడిదారీ దశ నుండి సోషలిస్టు దశకు మారడం గురించినదే మార్క్సిజం మౌలిక విశ్లేషణ. కమ్యూనిస్టు ప్రణాళికలో అంతిమంగా సమాజం రెండు వైరి శిబిరాలుగా – పెట్టుబడిదారులు, కార్మికులుగా చీలిపోతుందని, మిగిలిన అన్ని వర్గాలు ఈ రెండింటిలో ఏదో ఒకదానిలో సంలీనం కావల్సిందేనని ప్రకటిస్తారు మార్క్స్, ఎంగెల్స్‌లు. అదే సమయంలో అమెరికా వ్యవసాయ సంస్కరణలను సమర్థించడమే కాక పోలాండ్‌లో వ్యవసాయక విప్లవమే జాతీయ విముక్తి ఉద్యమానికి ముందస్తు షరతుగా ఉంటుందని కూడా ప్రకటిస్తాడు. రైతాంగం మితవాద లేదా ప్రగతి వ్యతిరేక స్వభావాన్ని కలిగి ఉంటుందన్న మార్క్స్ విశ్లేషణ ప్రధానంగా 1848లో ఫ్రాన్స్ విప్లవం వైఫల్యానికి దారి తీసిన పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని చేసిన వ్యాఖ్యేనన్న వాదన కూడా బలంగానే ఉంది. మరో సందర్భంలో బాల్టిక్ సముద్రం, నల్ల సముద్రం తీరంలో ఉన్న వ్యవసాయక దేశాల్లో వ్యవసాయక విప్లవం ద్వారానే అంటే భూమికి కట్టివేయబడిన అర్ధ బానిసలను భూమికి హక్కుదారులను చేయడం ద్వారానే –1789 నాటి ఫ్రెంచి విప్లవం తరహాలో–పితృస్వామిక భూ సంబంధాలను బద్దలు కొట్టగలుగు తారంటాడు మార్క్స్. తద్వారా బూర్జువావర్గం, కార్మికవర్గం పూర్తి స్థాయిలో ఏర్పడని దేశాల్లో కమ్యూనిజపు మౌలిక లక్ష్యాలకు (వ్యక్తిగత ఆస్తి హక్కు రద్దు లక్ష్యం) పూర్తి విరుద్ధంగా వ్యక్తిగత ఆస్తి హక్కు పునాదిగా రైతాంగం నడిపే పోరాటాలకు కమ్యూనిస్టులు మద్దతు ఇవ్వడం ద్వారానే అసంపూర్ణంగా ఉన్న బూర్జువా విప్లవాన్ని సంపూర్ణం చేయాలన్న ప్రతిపాదనలు కూడా ముందుకొచ్చాయి.

ఈ విధంగా చూసినప్పుడు విప్లవ వ్యూహం, ఎత్తుగడలు సార్వత్రికం కాదు అన్న విషయం స్పష్టమవుతుంది. పెట్టుబడిదారీ వ్యవస్థ, సంబంధాలు పూర్తిస్థాయిలో పరిపూర్ణంగా అభివృద్ధి చెందిన సంపన్న దేశాలు, పెట్టుబడిదారీ సంబంధాలు తరతమ స్థాయిలో అభివృద్ధి చెందిన వర్ధమాన దేశాల విప్లవోద్యమంలో అనుసరించే వ్యూహం ఎత్తుగడల్లో మౌలిక తేడాలుంటాయన్న అవగాహన మార్క్స్, ఎంగెల్స్‌లకు ఉందన్న విషయం స్పష్టమవుతుంది. ఈ సంక్లిష్టమైన సైద్ధాంతిక చర్చల నేపథ్యంలోనే కార్మిక కర్షకుల విప్లవాత్మక ఐక్య సంఘటన గురించిన చర్చ 1850 దశకంలో మొదలైంది. ఈ సైద్ధాంతిక చర్చకు ముగింపు పలుకుతున్నట్లు ఎంగెల్స్ జర్మనీలో రైతు యుద్ధాలు రచనకుపక్రమించాడు. కొందరు మార్క్సిస్టు పరిశీలకులు, మార్క్సిజం విద్యార్థులు ఈ రచనను సుదీర్ఘ వ్యాసంగా కూడా తరచూ ప్రస్తావిస్తుంటారు. ఈ రచన ముగింపులో ఎంగెల్స్ 'పెటీ బూర్జువావర్గం, వృత్తిదారులు, రైతాంగంతో కూడిన విశాల జన సామాన్యానికి ముందుండి నాయకత్వం వహిస్తూ వచ్చిన బూర్జువా వర్గం మధ్యలోనే వదిలేస్తుంది. కొన్ని సందర్భాల్లో బూర్జువా వర్గం పీడిత వర్గాల డిమాండ్లు విప్లవాత్మకంగా ఉన్నాయని భావించడం అలా మధ్యలోనే వదిలేయడానికి కారణమైతే మరి కొన్ని సందర్భాల్లో ఈ వర్గపు డిమాండ్లకు ఆశించినంత విప్లవకర స్వభావం లేదన్న కారణంగా కార్మికవర్గం కూడా ఈ తరగతులు, వర్గాలతో జత కట్టేందుకు సిద్ధం కాదు. దాంతో దిక్కుతోచని దురవస్తలో ఉన్న ఈ వర్గాలు ఒక్కోసారి అటు మితవాద శక్తులనూ, ఇటు వామపక్ష శక్తులనూ కూడా వ్యతిరేకించే దుస్థితికి లోనవుతాయి' అని హెచ్చరిస్తాడు.

ఈ ప్రస్తావనలో రెండు కీలక అంచనాలను ఎంగెల్స్ మన ముందుంచుతాడు. బూర్జువావర్గం చేతిలో మోసపోయిన రైతాంగం కార్మికవర్గంలో మిత్రులను వెతుక్కుంటుందన్నది మొదటి అంచనా. 20వ శతాబ్దం తొలి దశాబ్దాల్లో విప్లవాలు విజయవంతమైన రష్యా, చైనాల్లోనూ, వియత్నాం విప్లవ చరిత్రలోనూ ఈ అంచనా సరైనదేనని రుజువైంది. రైతాంగంలో ఏ తరగతి బూర్జువాలతో షరీకవుతుంది, ఏ తరగతి కార్మికవర్గం కొమ్ము కాస్తుందో కూడా చూచాయగా పై ప్రస్తావనలో మనకు వ్యక్తమవుతుంది. పాలకవర్గాలు మన కళ్ల ముందు ఈ నాలుగు స్థంభాలాట ఆడుతున్నప్పుడే వాస్తవాన్ని సరిగ్గా అర్థం చేసుకోవడం ఆశించినంత తేలికేమీ కాదు. ఈ ఆట, దాని స్వభావం పూర్తిగా మన కళ్ల బడకుండా ఉండడానికి కావల్సినన్ని తెరమరుగులను పాలకవర్గం మన ముందుంచుతుంది. వర్గాలు, వర్గ ప్రయోజనాలు మనం ఊహించినంత నిక్కచ్చిగా మార్పులేనివిగా ఉండవు. ఉండబోవు. ఓసారి ఓ వర్గం ఓ తరహా డిమాండ్లు ముందుకు తెచ్చినంత మాత్రాన సదరు వర్గం శాశ్వతంగా అదే డిమాండ్లకు కట్టుబడి ఉంటుందని ఆశించడం, అంచనా వేయడం మార్క్సిస్టు విశ్లేషణ అనిపించుకోదు. ఇలాంటి గందరగోళపు స్థితిలో మనకుండాల్సిన అవగాహన, మనం అనుసరించాల్సిన వైఖరిలో స్పష్టత కోసం 1850 దశకంలో ఎంగెల్స్ రాసిన జర్మనీలో రైతు యుద్ధాలు అన్న సుదీర్ఘ వ్యాసాన్ని మరోసారి మననం చేసుకోవడం అవసరం.

జర్మనీలో రైతు యుద్ధం జరిగి దాదాపు ఐదు శతాబ్దాలు నిండుతున్నాయి. 14వ శతాబ్దంలో, ఇంగ్లాండ్, ఫ్రాన్స్, ఇటలీలో చోటుచేసుకున్న రైతాంగ పోరాటాలకు 15వ శతాబ్దంలో జర్మనీలో చోటుచేసుకున్న రైతాంగ పోరాటాలకు మధ్య చాలా వ్యత్యాసం ఉంది. ఈ దేశాల్లో చెలరేగిన రైతాంగ తిరుగుబాట్లు, పోరాటాలు ప్రధానంగా పెట్టుబడిదారీ వ్యవస్థ పురుడుపోసుకుంటున్న సమయంలో మొత్తం ఆర్థిక

సంబంధాలు నగదు ఆధారిత సంబంధాలుగా రూపాంతరం చెందుతున్న క్రమంలో దైనందిన జీవితంలో, ఆర్థిక జీవితంలో పెరుగుతున్న ధనాధిపత్యానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటాలు. జర్మనీలో రైతాంగం సాగించిన యుద్ధం దీనికి భిన్నమైనది. ఇది సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమంతో సన్నిహిత సంబంధం కలిగిన పోరాటం. పద్నాలుగో శతాబ్దంలో సమాజం ప్రత్యేకించి పాశ్చాత్య సమాజం అని నేడు మనం పిలుచుకుంటున్న యూరోపియన్ సమాజం పెను మార్పులకు లోనవుతున్న తరుణం. ఎవరు ఏ వర్గంగా గుర్తింపు పొందుతున్నారో, పొందుతారో తెలీని స్థితి. ఈ సమయంలో గ్రామీణ ఆస్తిపర వర్గంగా ఉన్న రైతాంగం సాగించిన పోరాటమే జర్మనీలో రైతు యుద్ధాలు శీర్షికతో ఉన్న ఎంగెల్స్ రచన. అప్పటి వరకు జరిగిన పోరాటాల్లో పాల్గొన్నదానికంటే వీరోచితంగా భావి కార్మికులు ఈ పోరాటంలో పాల్గొన్నారు. అటు ఫ్రాన్స్‌లో 1840 దశకపు పోరాటాలు, ఇటు జర్మనీలో పుంజుకుంటున్న ప్రజాతంత్ర ఉద్యమం నేపథ్యంలో జర్మనీలో రైతు యుద్ధ చరిత్ర అధ్యయనం గురించిన ఆసక్తి పెరిగింది.

1840-45 మధ్య కాలంలో యూరోపియన్ దేశాల్లో వెల్లువెత్తిన పోరాటాల నేపథ్యంలో విముక్తి యుద్ధంలో రైతాంగం పాత్ర గురించిన ఆసక్తి కూడా పెరిగింది. విప్లవోద్యమ క్రమంలో రైతాంగం నమ్మకమైన మిత్రుడుగా ఉంటుందా లేదా అన్నది తొలినాటి కమ్యూనిస్టు లీగు చర్చల్లో ముఖ్య స్థానాన్ని ఆక్రమించాయి. ఈ అధ్యయనంలో థామస్ ముంజెర్ వంటి నాయకులు ఈ ఉద్యమంలో పోషించిన పాత్ర గురించి మరింత లోతైన అధ్యయనాలు జరిగాయి. నార్తర్న్ స్టార్ అనే ఛార్టిస్టు ఉద్యమ పత్రికకు 1845లో రాసిన వ్యాసంలోనే '1525 నాటి జర్మనీ రైతు యుద్ధంలో గొప్ప నాయకుడి గురించి తెలుసుకోవాల'ని ఇంగ్లాండ్ కార్మికవర్గాన్ని ఎంగెల్స్ హెచ్చరించాడు. ఎంగెల్స్ దృష్టిలో ముంజెర్ మౌలికంగా ప్రజాతంత్రవాది. జర్మనీలో ప్రతీఘాత విప్లవం విజయవంతమైన నేపథ్యంలో న్యూ రీనిష్ జీటుంగ్ పత్రికలో వ్యాసాల రూపంలో ఎంగెల్స్ ఈ రచనను పూర్తి చేశాడు. జిమ్మర్‌మాన్ రచనలో సమగ్రత లోపించిందనీ, నిర్దిష్ట సమయంలో తెర మీదకు వచ్చే రాజకీయ ధార్మిక వివాదాలు సమాంతరంగా సాగుతున్న వర్గ పోరాట వ్యక్తీకరణలేన్న వాస్తవాన్ని గుర్తించడంలో జిమ్మర్‌మాన్ విఫలమయ్యాడనీ గుర్తిస్తూనే నాటి జర్మన్ భావవాద చరిత్రలో కీలకమైన రచనగా జిమ్మేర్‌మాన్ రచనను ప్రశంసిస్తాడు ఎంగెల్స్.

విశాలమైన సామాజిక మార్పు కోసం సాగే ఉద్యమంలో భూస్వాములు, విశాల కమతాలపై పెత్తనం చేస్తున్న ధనిక రైతాంగానికి వ్యతిరేకంగా నేడు మనం వర్గీకరించుకుంటున్న భూమిలేని పేదలు, చిన్న, మధ్యతరగతి రైతాంగం ఓ ముఖ్యమైన భూమికను పోషిస్తుందని మార్క్స్, ఎంగెల్స్ అంచనా వేశారు. రైతాంగం ఎంత ఎక్కువగా విప్లవాత్మక స్వభావం కలిగిన నాయకత్వం మార్గదర్శనంలో ఏకమైతే అంత ఎక్కువ శక్తివంతంగా రాజకీయ పోరాటాలు నడపగలదని మార్క్స్, ఎంగెల్స్ విశ్లేషించారు. అందుకే సంఖ్యారీత్యా రైతాంగం, భూమిలేని పేదలు కార్మికవర్గం కంటే పెద్దదే అయినా, వారికంటే మెరుగైన విప్లవ స్వభావం, పోరాట పటిమ కలిగి పెట్టుబడిదారీ వ్యవస్థ మూలాల్లోకి ప్రవేశించిన కార్మికవర్గం నాయకత్వంలో ఈ భూమిలేని పేదలు, చిన్న, సన్నకారు, మధ్యతరగతి రైతాంగం నడిస్తే సదరు విప్లవం మరింత శక్తివంతంగా వ్యవస్థలను కుదిపేసేదిగా ఉంటుందన్న నిర్ధారణకు వచ్చారు.

ఉత్పత్తి కేంద్రాలు, మార్కెట్ మాయాజాలం ద్వారా మిగులు విలువ పోగేసుకోవడానికి పరిమితం అయితే సార్వత్రిక వ్యవస్థగా మారిన పెట్టుబడిదారీ వ్యవస్థ తన మనుగడ సాగించలేదు. విశాలమైన గ్రామీణ ప్రజానీకం నుండి మిగులు విలువ స్వంతం చేసుకోవడం ద్వారానే తన మనుగడను కొనసాగించగలుగుతుంది. ఈ పరిస్థితుల్లో పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా సాగే పోరాటం రెండు క్షేత్రాల్లోనూ-పట్టణ ప్రాంతాలు, పారిశ్రామిక వాడల్లోనూ, గ్రామీణ క్షేత్రమైన వ్యవసాయ రంగంలోనూ-కొనసాగాలి. పట్టణ ప్రాంతంలో కార్మికవర్గం, పూర్తి స్థాయి కార్మికవర్గంగా మారని వేతన జీవులు సాగించే పోరాటానికి దన్నుగా (బుల్ వర్క్‌గా) గ్రామీణ ప్రాంతంలో దోపిడీకి గురవుతున్న రైతు వర్గాలు, భూమిలేని పేదలు జతకలిస్తేనే పెట్టుబడిదారీ వ్యవస్థ మనుగడ సాగించడానికి అందే ప్రాణవాయువును నిలిపివేయడం సాధ్యమవుతుంది అన్న అంచనాకు, నిర్ధారణకు వచ్చారు మార్క్స్, ఎంగెల్స్. ఈ నేపథ్యంలోనే 1840 దశకం నాటి ఉద్యమంలో జర్మన్ బూర్జువా వర్గం కార్మికవర్గానికి వ్యతిరేకంగా జర్మన్ భూస్వామ్యం (జంకర్లు)తో అంటకాగుతున్న వైనాన్ని తూర్పారపట్టడానికి మార్క్స్ వెనకాడలేదు. అటువంటి పోరాటంలో ఊగిసలాడుతున్న జర్మన్ బూర్జువా వర్గానికి హితోపదేశం చేసే ప్రయత్నంలో భాగంగానే 1525 నాటి జర్మనీ రైతు యుద్ధాల గురించి జిమ్మర్‌మాన్ సేకరించిన వివరాలు, సాగించిన పరిశోధనలను కూలంకషంగా అధ్యయనం చేసిన ఎంగెల్స్ జర్మనీలో రైతు యుద్ధం అన్న సంక్షిప్త రచన చేశాడు.

చారిత్రక భౌతికవాద సూత్రాలకు పదును పెట్టడానికి మార్క్స్ ఫ్రాన్స్‌లో అంతర్యుద్ధం, ఫ్రాన్స్‌లో వర్గ పోరాటాలు, లూయీ బోనపార్టీ రచనలను ఎలా వేదికగా ఉపయోగించుకున్నాడో అదే తరహాలో ఎంగెల్స్ కూడా జర్మనీలో రైతు యుద్ధం రచనలో సమకాలీన జర్మనీ సమాజపు ఆర్థిక స్థితిగతులు, వర్గ పొందిక, ఆయా వర్గ వ్యత్యాసాలకు అనుగుణంగా వివిధ సంస్థలు, వివిధ కార్యక్రమాలతో, ఎజెండాతో ముందుకొచ్చిన తీరును విశ్లేషిస్తూ ఈ మొత్తంలో థామస్ ముంజెర్ విలక్షణతను అద్భుతంగా వర్ణిస్తాడు. మూడో అధ్యాయంలో 1476 నుండి 1517 మధ్య కాలంలో జర్మనీలో వివిధ ప్రాంతాల్లో చెలరేగిన రైతాంగ పోరాటాలను, వాటి స్వభావాన్ని, పరిధిని, ప్రభావాన్ని విశ్లేషించాడు. జర్మన్ చరిత్రలో 1517 పునరుజ్జీవన యుగం ఆరంభంగా ఆధునిక చరిత్రకారులు నిర్ధారించారు. నాలుగో అధ్యాయంలో 1525 నాటి రైతు యుద్ధం ఆరంభం, నడక, నడత, ఫ్రాన్స్ వాన్ సికిన్జెన్, ఉల్రిక్ వాన్ హుటెన్‌ల నాయకత్వ శైలి వంటి విషయాలు చర్చిస్తాడు. ఆరు, ఏడు అధ్యాయాల్లో రైతు యుద్ధ వర్ణనకు కేటాయించడంతో పాటు ఈ మహత్తర పోరాటంలో రైతాంగం పరాజయం పొందానికి దారితీసిన పరిస్థితులు, కారణాలు విశ్లేషిస్తాడు. చివరి అధ్యాయంలో జర్మనీ చరిత్రలో రైతు యుద్ధం స్థానం, జర్మనీ భవిష్యత్తుపై దాని ప్రభావం వంటి అంశాలు చర్చకు పెడతాడు.

ఈ రచనలో మనకు కనిపించే కీలకమైన ఉపదేశం ఒక్కటే. భూస్వామ్య వర్గానికి దానికి దన్నుగా ఉన్న బూర్జువా వర్గానికి వ్యతిరేకంగా సాగించే పోరాటంలో రైతాంగం మీనమేషాలు లెక్కించరాదన్న ఉపదేశమే. కార్మికవర్గం నాయకత్వంలో విప్లవం పురోగమించాలంటే అన్ని రకాల

భూస్వామ్యపు అవశేషాలకు చెల్లు చీటి ఇవ్వాలని ఎంగెల్స్ ఈ రచనలో ప్రతిపాదిస్తాడు. మార్క్స్ ఆగస్టు 16, 1856న ఎంగెల్స్‌కు రాసిన లేఖలో "రైతు యుద్ధం తరహాలో మరో మహత్తర పోరాటం జర్మనీలో పెల్లుబకనున్న కార్మికవర్గ పోరాటానికి అండగా ఉంటుందా లేదా అన్నదానిపైనే జర్మనీ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది" అని అభిప్రాయపడుతూ జర్మనీలో రైతు యుద్ధం గురించిన ఎంగెల్స్ అంచనాలను, విశ్లేషణలను స్వాగతిస్తాడు. ఓ ఉద్యమాన్ని అధ్యయనం చేయడం, సమకాలీన సమాజ స్థితిగతుల నేపథ్యంలో దాని పాత్రను అర్థం చేసుకోవడం, భవిష్యత్తులో సదరు సమాజంపై ఈ ఉద్యమం చూపించబోయే ప్రభావం, పర్యవసానాల గురించి అంచనా వేయడంలో అనుసరించాల్సిన వైఖరి ఎలా ఉండాలో అర్థం చేసుకోవడానికి ఈ రచన ఉపయోగపడుతుంది.

జర్మనీలో రైతు యుద్ధం గురించి ఎంగెల్స్‌తో విభేదిస్తాడు జర్మన్ కార్మికవర్గ నేత లాసాల్. ఫ్రాన్స్ వాన్ సికిన్జెన్, ఉల్రిక్ వాన్ హుటెన్‌ల నాయకత్వ సామర్థ్యాన్ని ఆరాధనాపూర్వకంగా ప్రశంసిస్తాడు. సమాజంలోని అట్టడుగు వర్గాలు, తరగతులకు చెందిన ప్రజల చైతన్యాన్ని ఈసడించుకుంటాడు. లాసాల్ అభిప్రాయంలో 1525 నాటి జర్మనీ రైతు యుద్ధం పూర్తిగా విప్లవ ప్రతీఘాతక స్వభావం కలిగింది. బెర్లిన్ కార్మికులనుద్దేశించి చేసిన ఉపన్యాసంలో లాసాల్ "రైతాంగం భూస్వాములను తుదముట్టించింది. దుర్గాలు దగ్ధం చేశారు. కచేరిలు కొల్లగొట్టారు. మనకు తెలిసిన ఈ సాహసోపేత చర్యలన్నీ ఈ పోరాటంలో ఉన్నప్పటికీ పోరాటం మౌలికంగా మితవాద, విప్లవ వ్యతిరేక స్వభావం కలిగిన ఉద్యమమే"నని నిర్ధారిస్తాడు.

పెట్టుబడి గ్రంథం మూడో సంపుటం కూడా చిత్తుప్రతి పూర్తి చేశాక మార్క్స్ రష్యా పరిణామాల పట్ల ఆసక్తి కనబరుస్తూ పెట్టుబడిదారీయేతర దేశాల్లో సమాజ పరిణామ క్రమాన్ని, ప్రత్యేకించి వ్యవసాయక సంబంధాలను అధ్యయనం చేయడానికి ఉపక్రమించాడు. రష్యా పరిణామాలు మార్క్స్, ఎంగెల్స్‌లకు ఎంత ఆసక్తికరంగా మారాయంటే 1860 దశకంలో రష్యా పరిణామాలను ప్రత్యక్షంగా అర్థం చేసుకోవడానికి ఇద్దరూ రష్యన్ నేర్చుకుంటారు. ఇతరుల వ్యాఖ్యానాలపై ఆధారపడి అంచనాకు వచ్చేకంటే స్వయంగా అధ్యయనం చేయడం మెరుగైందన్న సూత్రమే వీరిద్దరినీ రష్యన్ నేర్చుకోవడానికి ప్రోత్సహించి ఉండొచ్చు.

విప్లవోద్యమంలో రైతాంగం పాత్ర గురించిన, ప్రత్యేకించి నాటి జర్మనీలో రైతు యుద్ధంలో రైతాంగం పాత్ర గురించిన లాసాల్ అభిప్రాయాలనే మార్క్స్, ఎంగెల్స్ అభిప్రాయాలుగా రష్యన్ విప్లవకారుడు బకూనిన్ పొరపడ్డాడు. అదే విధంగా ప్రాచుర్యంలోకి తెచ్చాడు. పద్నాలుగో శతాబ్దంలో జర్మనీలో రైతాంగం సాగించిన పోరాటాలు పరాజయం పొందడానికి, తదనంతర కాలపు జర్మనీలో బ్యూరోక్రటిక్ రాజ్యాంగ యంత్రం త్వరితగతిన వేళ్లూనుకోవడానికి అనేక కారణాలున్నాయని మనందరికి తెలిసిందేనని వ్యాఖ్యానించాడు. జర్మన్ కమ్యూనిస్టులందరూ రైతాంగాన్ని మితవాద శక్తిగానూ, విప్లవ ప్రతీఘాత శక్తిగానూ పరిగణించినట్లు బకూనిన్ వ్యాఖ్యలు తెలుపుతున్నాయి. బకూనిన్ ఈ వ్యాఖ్యలు రాసే నాటికి జర్మనీలో రైతు యుద్ధం రెండో ప్రచురణ, దానికోసం 1870లో ఎంగెల్స్ రాసిన ముందుమాట రెండూ అందుబాటులోనే ఉన్నాయి. ఈ ముందు మాటలో ప్రధానంగా లీబ్నెక్ట్ వంటి సమకాలీన జర్మన్ సోషల్ డెమొక్రసీ ఉద్యమ నాయకుల్లో ఉన్న ఊగిసలాట, గందరగోళాన్ని సరి చేయడానికి ఎంగెల్స్ ప్రయత్నం చేశాడు. 1875లో అచ్చయిన మూడో ప్రచురణకు రాసిన అనుబంధంలో విప్లవోద్యమంలో రైతాంగం పాత్ర గురించి మార్క్స్, ఎంగెల్స్ అభిప్రాయాలకు, లాసాల్, ఇతరుల అభిప్రాయాలకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని మరింత స్పష్టంగా ప్రస్తావించాడు ఎంగెల్స్. జీవిత చరమాంకంలో జర్మనీలో రైతు యుద్ధాలను మరింత లోతుగా అధ్యయనం చేసేందుకు ఎంగెల్స్ ఉపక్రమించాడు. 1884, డిసెంబర్ 31న సోర్జ్‌కు రాసిన లేఖలో ఎంగెల్స్ "జర్మనీలో రైతు యుద్ధాలు రచనలోని నా వాదనలను పునఃపరిశీలించబోతున్నాను. జర్మనీ చరిత్రకు ఈ రచన మూలపునాది కాబోతుంది. అద్భుతమైన రచనకు కావాల్సిన ప్రాథమిక కసరత్తంతా పూర్తయ్యింది." అని తెలియచేశాడు.

కానీ పెట్టుబడి గ్రంథం రెండు, మూడు సంపుటాలు అచ్చుకు సిద్ధం చేయడం ప్రాధాన్యత కలిగిన కర్తవ్యంగా భావించి తన స్వంత అధ్యయనాన్ని పక్కన పెట్టాడు. సోషలిజం శాస్త్రీయం, ఊహాజనితం అన్న చిన్న పుస్తకానికి 1882లో రాసిన ముందుమాటను ప్రత్యేకించి జర్మనీ రైతాంగానికి ఎంగెల్స్ అంకితమివ్వడం గుర్తించాల్సిన విషయం. 1893 జూలైలో మెహరింగ్‌కు రాసిన లేఖలో ఎంగెల్స్ "నేననుకున్నట్లు జర్మనీలో రైతు యుద్ధాలు అన్న నా రచనను పునఃవ్యాఖ్యానించడానికి అవకాశం దక్కినట్లయితే (16వ శతాబ్దం నాటి జర్మనీలో బూర్జువా విప్లవం విఫలం కావడం, దేశం ముక్కలు కావడం వంటి అంశాలపై నా అభిప్రాయాలు మరింత విస్తృతంగా ప్రస్తావించడం సాధ్యమయ్యేది." అని రాశాడు.

విప్లవోద్యమంలో రైతాంగం పాత్ర గురించి, ప్రత్యేకించి జర్మనీలో రైతు యుద్ధాల గురించిన ఎంగెల్స్ అభిప్రాయాలు మరింత విపులంగా అర్థం చేసుకోవడానికి కారల్ కాట్స్కీకి 1895 మే 21న ఎంగెల్స్ రాసిన లేఖ బాగా ఉపకరిస్తుంది. అప్పటికే వ్యవసాయక సమస్యపై కాట్స్కీ తన ప్రసిద్ధ రచనకు సంబంధించిన కృషి చేస్తున్నాడు. బహుశా దాని చిత్తుప్రతికి ఎంగెల్స్ స్పందనగా ఈ లేఖను భావించవచ్చు. ఈ లేఖలో "ఈ రచన పూర్తి చేయడానికి రూపొందించుకున్న ప్రణాళిక అమలు జరిగితే మరింత మెరుగ్గా ఉంటుంది. నీవు గతంలో రాసిన ప్లాటో, తొలినాళ్లల్లో క్రైస్తవం గురించిన రచన కంటే ఇప్పుడు రాస్తున్న రచన చాలా మెరుగ్గా ఉంది. మధ్య యుగాల నాటి తెగల గురించి ఇచ్చిన సమాచారం బాగుంది. టాబొరైట్స్, ముంజెర్, అనబాప్టిస్ట్‌ల గురించిన సమాచారం మిగిలినవాటికంటే బాగుంది. నేను రాసిన జర్మనీలో రైతు యుద్ధం రచనను తాజాపర్చడానికి కావాల్సిన ప్రాథమిక సమాచారం నీ రచనలో లభ్యమవుతుంది.

నీ రచనలో రెండు చెప్పుకోదగ్గ లోపాలున్నాయని నా అభిప్రాయం:

1. భూస్వామ్య సమాజం బయట అభివృద్ధి చెందుతున్న సామాజిక తరగతులు, వాటి నేపథ్యం, పునాదులు గురించిన సమాచారం అసమగ్రంగా ఉంది. ఈ తరగతి సమాజంలో అట్టడుగు స్థానంలో ఉంది. అంటరానివారితో మాత్రమే పోల్చదగిన స్థానం. మధ్యయుగాల కాలం నాటి అన్ని నగరాల్లోనూ ఇలాంటి తరగతి మనకు కనిపిస్తుంది. వీరికి ఎలాంటి హక్కులూ ఉండవు. గ్రామీణ సమూహాలకు వెలుపుల ఉంటారు. భూస్వాములపై ఆధారపడి ఉంటారు. గిల్డ్ తరహా సామాజిక సంబంధాల్లో ఇమిడిపోయి ఉంటారు. దీన్ని గుర్తించడం, అధ్యయనం

చేయడం క్లిష్టమైనదే కానీ భూస్వామ్య వ్యవస్థ పునాదులు కదిలించేది, భూస్వామ్య వ్యవస్థను శిథిలం చేసేది కూడా రూపొందుతున్న ఈ తరగతే. తర్వాతి దశలో కార్మిక వర్గానికి పునాదులు వేసే తరగతి ఇదే. 1789లో ఫ్రెంచి విప్లవానికి ఆద్యులు వీళ్లే. కార్మికవర్గం గురించి నువ్వు రాశావు కానీ నాటి యధార్థ స్థితిలో ఆ పదం పొసగదు. అయితే నేతపని వాళ్ల గురించి ఆ మాట ఉపయోగించడం సరైనదే. గిల్డ్ వ్యవస్థకు బయట ఉన్న నేత కార్మికులను వివరించడానికి ఈ పదం సరిపోతుంది. ఈ కోణంలో మరింత కృషి జరగాలి.

2. పదిహేనో శతాద్ది చివరి నాటికి అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో జర్మనీ స్థితి, నాటికి సూక్ష్మ రూపంలో ఉనికిలో ఉన్న ప్రపంచ మార్కెట్ లకు తగినంత ప్రాధాన్యత ఇవ్వలేదు. ఇంగ్లాండ్, నెదర్లాండ్, బొహీమియాల్లో మతం మరుగున సాగిన ప్లేబియన్లు–బూర్జువా వర్గపు తిరుగుబాట్లు ఎందుకు విఫలమయ్యాయి? జర్మనీలో రైతాంగ యుద్ధాలు అంతో ఇంతో విజయం సాధించగలిగాయి అన్నది అర్థం చేసుకోవడానికి నాటి అంతర్జాతీయ మార్కెట్లు, ప్రపంచ మార్కెట్‌లో జర్మనీ స్థానం వంటి విషయాల గురించిన అవగాహన కీలకమవు తుంది. దీనికి కారణం మతమే. ఈ యుద్ధ కాలంలో ముందుకొచ్చిన బూర్జువా లక్షణాలు తర్వాతి శతాబ్దంలో పూర్తి స్థాయిలో అభివృద్ధయ్యాయి. బూర్జువా లక్షణాలను అందింపుచ్చుకున్న దేశాలు ప్రపంచ మార్కెట్ అభివృద్ధితో మరో మలుపు తీసుకున్నాయి. హాలండ్, ఇంగ్లాండ్‌లు దీనికి మంచి ఉదాహరణ. జర్మనీలో రైతు యుద్ధాలు రచనను తాజా పర్చే అవకాశం, సమయం దొరికితే ఈ విషయాల పట్ల మరింత విపులంగా ప్రస్తావించనున్నాను."

చివరిగా బకూనిన్‌కు సమాధానమిస్తూ రాసిన మరో వ్యాసంలో ఎంగెల్స్ ఫ్రాన్స్, పశ్చిమ జర్మనీ ప్రాంతంలోని చిన్న కమతం రైతులకు ప్రష్యా ప్రాంతంలోని జంకర్లు (భారీ ఎస్టేట్ యజమానులకు) మధ్య ఉన్న వ్యత్యాసాన్ని స్పష్టంగా గుర్తించాడు. చిన్న కమతం దారులను తేలిగ్గా విప్లవోద్యమం వైపు ఆకర్షించవచ్చని కూడా అంచనా వేస్తాడు. అయితే వారికి కావల్సిన డిమాండ్ల విషయంలో కార్మికవర్గ నాయకత్వం తగిన హామీనివ్వాల్సి ఉంటుందని కూడా ఎంగెల్స్ గుర్తు చేస్తాడు. ఈ సందర్భంగానే చిన్న కమతాలు (పెట్టుబడిదారీ వ్యవస్థ చక్రాల సందుల్లో) నలిగిపోవడం అనివార్యమని మనకు తెలుసు. అంతమాత్రాన ఆ వర్గం ఈ విధంగా నలిగిపోయే క్రమాన్ని మనం దగ్గరుండి వేగిరపర్చాల్సిన పనిలేదని ఎంగెల్స్ హెచ్చరిస్తాడు. కార్మికవర్గం అధికారానికి వచ్చాక భారీ కమతాలపై పెత్తనం చేస్తున్న భూస్వాముల నుండి భూములు లాగేసుకున్నట్లు చిన్న కమతాల యజమానుల నుండి బలవంతంగా భూములు లాక్కోవడం సరికాదని స్పష్టం చేస్తాడు. ఈ సందర్భంగానే జర్మనీలో రైతు యుద్ధాలు పునర్ముద్రణకు 1870లో రాసిన ముందుమాటలో "కార్మికుల పరిస్థితి 1525లో ఉన్నట్లే 1848లో తిరుగుబాటు సమయంలోనూ ఉంది. మొత్తం జనాభాలో పూర్తిగా వేతనాల మీద మాత్రమే ఆధారపడిన కార్మికుల సంఖ్య పరిమితమే. అందువల్ల ఈ వర్గం కూడా మిత్రులను వెతుక్కోవడం అనివార్యం. కార్మికవర్గానికి మిత్రులు పెటీ బూర్జువాలు, పట్టణ ప్రాంతాల్లో దిగువ స్థాయి కార్మికులు, చిన్న రైతాంగం, భూమిలేని వ్యవసాయ కార్మికులే." అని స్పష్టం చేస్తాడు. ఈ అవగాహనను మరింత విస్తృతపరుస్తూ ఎంగెల్స్ "కార్మికవర్గానికి మిత్రులుగా ఉండదగిన రైతులంతా ఏకశిలా సదృశ్యమైన అఖండ వర్గం కాదు. రుణపీడన, కౌలుదోపిడీ భరించలేని చిన్న రైతులుంటారు. వారిని ఆదుకోవాల్సిన బూర్జువావర్గం నట్టేట ముంచి వెడుతుంది. అలాంటి వారి విముక్తి కార్మికవర్గం నాయకత్వంలో జరిగే పోరాటంలోనే ఉంటుందని భరోసా కల్పించడం అంత కష్టమేమీ కాదు. వారిలో కొద్దిపాటి భూములు కలిగిన రైతులు కూడా ఉంటారు. ఆరుగాలం కష్టపడితే వారి సంపాదన కూలీలు వేతనం ద్వారా సంపాదించే దానికంటే ఎక్కువేమీ ఉండదు. బూర్జువా వర్గం నుండి వీరికి దక్కేదేమీ లేదు. కానీ ఆస్తిహక్కు భావన వీరిని కట్టి పడేస్తుంది.

రైతు రుణాలన్నింటినీ ప్రభుత్వ రుణాలుగా పరిగణించే ప్రభుత్వం అధికారానికి వస్తే తప్ప వీరికి విముక్తి ఉండదు. మధ్యతరగతి రైతుల సంఖ్య గణనీయంగానే ఉంటుంది. ఫ్యాక్టరీలో యజమాని కార్మికుడి ప్రయోజనాలను వ్యతిరేకించినట్లే ఈ మధ్యతరగతి రైతులు కూడా వ్యవసాయకూలీ ప్రయోజనాలను వ్యతిరేకిస్తూ ఉంటారు. వ్యవసాయ కార్మికుల శక్తి సామర్థ్యాలు పాలకవర్గాలకు తెలీనిదేమీ కాదు. అందుకే వీరికి సామాజిక చైతన్యం కలగకూడదనే లక్ష్యంతోనే నాశిరకమైన విద్యతో సరిపెడతారు. ఈ గ్రామీణ పేదలు తమ ప్రయోజనాలు ఏమిటో ఎక్కడున్నాయో ఓసారి అర్థం చేసుకున్న తర్వాత బూర్జువా భూస్వామ్య ప్రతీఘాత శక్తులు అట్టే ఎక్కువకాలం పెత్తనం చెలాయించలేవు" అని స్పష్టం చేస్తాడు ఎంగెల్స్.

ఈ వివరాలు పరిశీలించినపుడు రైతాంగ సమస్య పట్ల మార్క్స్ ఎంగెల్స్‌ల విశ్లేషణ మనం అనుకున్నంత లేదా మనకు తెలిసినంత తేలికైనదేమీ కాదన్నది స్పష్టమవుతుంది. జీవిత చరమాంకం వరకూ మార్క్స్–ఎంగెల్స్ జోడీ విప్లవోద్యమంలో రైతాంగపు వ్యూహాత్మక స్థానాన్ని మదింపు వేయడానికి ప్రయత్నించారని పై వివరణ రుజువు చేస్తుంది.

(రచయిత పాత్రికేయులు) వీ

బూర్గుల నర్సింగ్‌రావు మృతి

స్వాతంత్ర సమరయోధుడు, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు బూర్గుల నర్సింగ్ రావు(89) కరోనా సోకి చికిత్స పొందుతూ జనవరి 18న మరణించారు. ఆయన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా బూర్గుల గ్రామంలో జన్మించారు. హైదరాబాద్‌లోని వివేక వర్ధిని పాఠశాలలో చదువుతున్న రోజుల్లోనే 12 ఏళ్ల వయసులో 'క్విట్ ఇండియా' ఉద్యమంలో పాల్గొన్నారు. అనంతరం సామ్యవాద సిద్ధాంతాలకు ఆకర్షితుడై భారత కమ్యూనిస్టు పార్టీలో పనిచేశారు. నిజాం నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా విద్యార్థి దశ నుంచే ఉద్యమంలో పాల్గొన్న ఆయన నిజాం కాలేజీ విద్యార్థి సంఘం నాయకుడిగా, ఆల్ హైదరాబాద్ స్టూడెంట్స్ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడిగా పనిచేవారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొని 1949లో చంచల్‌గూడ జైలుకు వెళ్లారు. 1952లో ముల్కీ ఉద్యమానికి నాయకత్వం వహించారు. భారత విద్యార్థి సమాఖ్య 1955లో లక్నోలో నిర్వహించిన సమావేశంలో తొలి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. తెలంగాణ మలి దశ ఉద్యమానికి 1994 నుంచి బాసటగా నిలిచారు. తెలంగాణ ఉద్యమానికి తాత్విక పునాది వేశారు.

వలస రాయలసీమలో మహిళా చైతన్యం-2

బ్రిటిష్ వలస పాలనలో వెలుగుచూడని రాయలసీమ ప్రాంత మహిళల చైతన్యాన్ని సంఘటిత నిర్మాణాలను వివరిస్తున్నారు **డా. షేఖ్. మహబూబ్ బాషా**

(గత సంచిక తరువాయి..)

బ్రాహ్మణ, వైశ్య కులస్థులలోనే కాకుండా శూద్రులుగా వర్ణధర్మ ముద్రలు వేయబడ్డ కులాల ప్రజల్లోనూ, 'అంటరానివారు'గా ఛీత్కరింపబడ్డ కులాలకు చెందిన ప్రజల్లోనూ, ఖురాను సూత్రాలను గాల్లో వదిలేసిన ముస్లింలలోనూ, క్రైస్తవులలోనూ బాల్య వివాహ షైతాను ఇళ్లు చేసుకోనుండింది. (1901 నుండి 1931 నాటికి 15 సంవత్సరాలలోపు వివాహితలైన బాలికల సంఖ్య ప్రతి వెయ్యి వివాహాలకు హిందువులలో 92 నుండి 108కీ, మహమ్మదీయులలో 44 నుండి 55కూ, క్రైస్తవులలో 25 నుండి 35కూ పెరిగింది. 'అతి బాల్య వివాహములు' అంటే 5 సంవత్సరాల లోపుగా జరిగినవి, 1921 నుండి 31 నాటికి హిందువులలో 21 నుండి 47కు పెరిగాయి. ఈ వయస్సు బాలికల వివాహాలు 'మాల' కులస్థుల్లో 1901 నుండి 1931 నాటికి 5 నుండి 26కు పెరిగింది. 'తెలుగు మాలలలో తమిళ మాలలకంటే నిట్టి వివాహములు 30 రెట్లు హెచ్చినవి. తెలుగు మాలలలో అయిదు రెట్లు కంటెను హెచ్చినట్లు పాఠకులు గ్రహించగలరు'.) బ్రాహ్మణులు, వైశ్యులలో ఇది అత్యంత భయంకరంగా తాండవమాడింది. వితంతు పునర్వివాహాలు జరగకపోవడం కారణంగా (ముఖ్యంగా బ్రాహ్మణ, వైశ్య కులాలలో) 'రండా గర్భాలూ', భ్రూణ హత్యలూ, శిశు హత్యలూ జరిగేవి. (1914 ఆగస్ట్ 16 నాటి 'ఆంధ్ర పత్రిక' గుంటూరు జిల్లా చీరాల గ్రామంలోని ఒక బ్రాహ్మణ వితంతువు రహస్య వ్యభిచారం కారణంగా ఒక శిశువు జన్మిస్తే దాన్ని చంపి కుండలో మూసిపెట్టారనీ, పోలీసులు కనుక్కొని ఆ వితంతువును అరెస్టు చేశారనీ 'వృత్తాంతములు: కుల పవిత్రత కొరకు శిశు హత్య' అనే శీర్షికన ప్రచురించింది.) బాల్య వివాహం కారణంగా 'బాల మాతల' మరణాలూ, శిశు మరణాలూ అధికంగా ఉండేవి. (కాశీనాథుని రమాబాయమ్మ ఇచ్చిన గణాంకాల ప్రకారం 1910లో మద్రాస్ ప్రెసిడెన్సీలో ఒక సంవత్సరం లోపుగా మరణించిన మగ, ఆడ శిశువుల సంఖ్య వరుసగా 1,26,088, 1,09,097గా ఉండింది. చూడండి: 'ఆంధ్ర మహిళా సభ: సభాధిపురాలి ఉపన్యాసము', హిందూ సుందరి, మార్చ్ 1913, పు. 35. మొత్తం బ్రిటిష్ భారతదేశం వ్యాప్తంగా సజీవంగా జన్మించిన ప్రతి వంద మంది శిశువుల్లో 1921లో 19.4 శాతం, 1929లో 18.7 శాతం మరణించారు. ఒక్క మద్రాస్ ప్రెసిడెన్సీలోనే ప్రతి వెయ్యి మంది బాలింతలలో 17.5 శాతం మరణించారు. (ఏ సంవత్సరానికి సంబంధించిన గణాంకమో ఆకరంలో ఉల్లేఖించబడలేదు. రాజమండ్రి నుండి వేములూరి అమ్మిరాజు అనే ఆమె వేములూరి భ్రమరాంబ అనే తన తహోదరి బాలింత మరణాన్ని (1903 మార్చ్ 27) గూర్చి తెలుగు జనానా పత్రికకు ఉత్తరం రాసింది. అందులో ఆమె తన సహోదరి చావుకి బాల్య వివాహాన్ని కారణంగా చూపి విమర్శించడంతో పాటుగా పెద్దలు ఆ దురాచార నిర్మూలనకు పాటు పడాలని ప్రార్థించింది.) బాలికా విద్యాభివృద్ధికి తీవ్ర ప్రతిబంధకంగా పరిణమించిన బాల్య వివాహాలు బాలికల 'బాల్యానుభవాన్ని' హరించివేసేవి. పరిస్థితి తీవ్రతను గమనించిన సంస్కర్తల, ముఖ్యంగా మహిళోద్యమ, కృషి ఫలితంగా శారదా శాసనంగా ప్రఖ్యాతి గాంచిన బాల్య వివాహ నిరోధక చట్టాన్ని బ్రిటిష్ భారత ప్రభుత్వం చేసింది. 1929 సెప్టెంబర్‌లో చేయబడ్డ చట్టం 1930 ఏప్రిల్ 1 నుండి అమల్లోకి వచ్చింది. దీని ప్రకారం, 14 సంవత్సరాలలోపు బాలికల వివాహాన్ని నిషేధించడం జరిగింది.

కానీ చట్టం ఆశించిన ఫలితాలను ఇవ్వలేకపోయింది. చట్టంలోని పలు లొసుగుల్ని అదనుగా తీసుకున్న ఛాందసవాదులు చట్టానికి తూట్లు పొడిచారు. శారదా బిల్లు చట్టరూపం పొందిన కాలానికీ అమల్లోకొచ్చిన కాలానికీ ఆరు నెలల నిడివి ఉండడంతో చట్టం పట్ల భయభ్రాంతులైన ఛాందసవాదులు ఆ మధ్య కాలంలో దేశ వ్యాప్తంగా లక్షల కొద్దీ బాల్య వివాహాలు చేశారు. నలభై తొమ్మిది వేల జనాభా కలిగి ఉండిన ఒక్క మచిలీపట్నంలోనే 900 బాల్య వివాహాలయ్యాయి. (దేశ వ్యాప్తంగా ఛాందసవాదులు పెట్టిన పెడబొబ్బల్ని తెలుసుకోవడానికై చూడండి: 'ఏ ప్రియులు ఒకటి' (సంపాదకీయం), గృహలక్ష్మి, ఏప్రిల్ 1930, పు. 81–86. 'శ్రీ ఆర్య ప్రకాశిక పత్రికా సంపాదకులగు శ్రీ జి. చిదంబరయ్య గారు (కడప జిల్లా) జమ్మలమడుగు నుండి వైస్రాయి గారికి శారదా చట్టము నిలుపు చేయవలసినదని జాన్యువరి పదునాలుగవ తేదీని బహిరంగ లేఖ వ్రాసియున్నారు') ఈ పరిస్థితి బోలిశెట్టి వెంకట హనుమంతరావు అనే అతనికి 'సెట్టి సింగారించుకొనే లాగా పట్నం మాటు మణిగింది' అనే సామెతను గుర్తుకు తెచ్చింది. (ఈ ఆరు నెలల మధ్య కాలంలో బాల్య వివాహాభిలాషులు ఎంత హడావిడిగా బాల్య వివాహాలు జరిపించారో కండ్లకు కట్టినట్లు వర్ణించారు కనుపర్తి వరలక్ష్మమ్మ తన శారద లేఖలలో. 'ఏమి పెండ్లిండ్లు! ఏమి ఊరేగింపులు! ఏమి కోలాహలము! అన్ని వస్తువులకు ధరలు లేచిపోయినవి. గుడ్డల దుకాణములలో సరకు ఝూడా అయినది. మార్కెటులో కూరలు శూన్యమూ... ఇక పెండ్లిండ్లకు వెళ్లి వచ్చెడి పేరంట్రాండ్రకు బొత్తిగా తీరుబడిలేదు. ఇల్లు మరచిపోయినారంటే సందేహము లేదు. పెండ్లి, జోడు పెండ్లిండ్లు, పెండ్లిపై పెండ్లి, పెండ్లిలో పెండ్లి... ఈ పెండ్లిండ్ల ప్రళయములో... నేను పొందినంత శ్రమ, నిద్ర నష్టము మరియొకరు పొందియుండరు... పెండ్లిండ్లు విరివిగా జరిగిన మార్గశీర్ష మాసమంతయు సుఖదమైన సుప్తినెరుగను... అరగంటలో అయిదూరేగింపులు వచ్చెను. ఒక ఊరేగింపు చూచి లోనికివచ్చి మంచముపై మేనువాల్చితినో లేదో మరలనింకొక పెండ్లివారి

యూరేగింపులోని పెద్ద బూరగల బూరటింపు చెవులు చిల్లులు పడజేసెడిది. మరల దానిని చూచివచ్చునప్పటికింకొకదాని బం, భం, బూ, బూ అను ధ్వనులు వినవచ్చెడివి...' ఒకటవ సంపుటము, పు. 155–160. 'శారద చట్టమమలులోనికి వచ్చులోపల పూర్వాచార పరాయణుల ప్రేరణచే దేశీయులు గావించిన యనుచిత వివాహములకు లెక్కలేదు... యావద్భారత దేశమునందు ఎన్ని లక్షల వివాహములు జరిగెనో వివరింపదరము గాదు. దేశీయులెల్ల రావిధముగా కన్నులు తెరువని వారును, పిడికిళ్లు విప్పని వారును, మాటలు రాని వారును, నడకలు నేరవని వారును అయిన కసుగందులకు గంగ వెర్రినెత్తినట్లు పెండిండ్లు' చేశారు) చట్టం బ్రిటీషిండియా భూభాగానికి మాత్రమే వర్తించడం కారణంగా బాల్య వివాహాభిలాషులు అటు నైజాం సంస్థానానికో (ముఖ్యంగా ఖమ్మం జిల్లా మధిర) ఇటు పోర్చుగీసు పాలనలో ఉండిన యానాంకో విహార యాత్రలకు వెళ్లినట్లు వెళ్లి పెళ్లిళ్లు చేసుకొని వచ్చేవారు. బాల్య వివాహం జరిగిందని ఎవరైనా ఫిర్యాదు చేయాలనుకుంటే సదరు ఫిర్యాదు దారు వంద రూపాయల ధరావత్తు కట్టాల్సి ఉండడంతో చాలా మంది ముందుకొచ్చేవారు కాదు. చట్టానికి భయపడ్డవాళ్లు రహస్యంగా పెళ్లిళ్లు చేస్తే గుండెలు తీసిన బంట్లు కొందరు బహిరంగంగానే చట్టాన్నుల్లంఘించేవారు. 'ఆదవాని (కర్నూలు జిల్లా ఆదోని)లో ఒక హిందూ కురవ జాతి గృహస్థుడు తన ఇంట రెండు బాల్య వివాహములను గావించి ఊరేగింపుటుత్సవమును జరిపి శారదా శాసనమును ధిక్కరించెను'. డబ్బులున్న వాళ్లు, ఎట్టి పరిస్థితిలోనూ బాల్య వివాహం జరిపి తీరాలని భీష్మించుక్కూర్చున్న వాళ్లూ చట్టోలంఘనకై ఒకవేళ జరిమానా విధించబడితే పెళ్లి ఖర్చులో ఇదో ఖర్చుగా భావించి గుండెల్నిండా ఊపిరి పీల్చుకునే వాళ్లు. చట్టోల్లంఘనకు శిక్షగా జరిమానాతో పాటుగా ఖైదు చేసే ప్రొవిజన్ కూడా ఉండినప్పటికీ, అధికారులు సాధారణంగా చిన్న-చిన్న జరిమానాలతోనే సరిపుచ్చేవారు. (వకీలు వేమూరి చిన్నయ్యరావు తన 11 సంవత్సరాల సవతి చెల్లెలి వివాహం శారదా చట్టాన్నుల్లంఘించి చేసిన కారణంగా (1932 జూన్ 23, మచిలీపట్నంలో) కన్యాదాతగా వ్యవహరించిన వకీలు యల్. శ్రీనివాసరావుకూ, పురోహితుడుకీ తల 50 రూపాయల జరిమానా విధించబడింది. చిన్నయ్యరావుకెంత జరిమానా విధించారో ఆధారంలో లేదు. చూడండి: 'వివాహ విశేషములు', గృహలక్ష్మి, నవంబర్ 1933, పు. 756. శారధా చట్టాన్నతిక్రమించి చేసిన మరో రెండు బాల్య వివాహాలను కూడా పై ఆధారం తెలిపింది. ఒక వివాహం వైశ్య కులస్థుల్లో కాగా మరోటి బ్రాహ్మణ కులస్థుల్లో జరిగింది. వైశ్య కులంలో జరిగిన వివాహంలో వరుడు 50 సంవత్సరాల వాడు కాగా వధువు కేవలం 10 సంవత్సరాల పిల్ల. బ్రాహ్మణ కులంలో జరిగిన వివాహంలో వధూవరుల వయస్సు వరుసగా 10, 20. వధూవరుల తండ్రులు తమ తప్పును ఒప్పుకోవడంతో జిల్లా కలెక్టరు వారికి తలా 25 రూపాయల జరిమానా విధించాడు. అంతేకాక తలా పది రూపాయలు ఫిర్యాదు దారుకు ఇవ్వాల్సిందిగా తీర్పు ఇచ్చాడు. శారదా చట్టాన్నుల్లంఘించి విశాఖపట్నంలో జరిగిన ఒక వివాహంలో మాత్రం జిల్లా మెజిస్ట్రేటు కఠినంగా వ్యవహరించాడు: 1934 జనవరి 23 నాటి తీర్పులో వధువు తండ్రి అయిన దాసు కనకరాజుకు రెండు వందల రూపాయల జరిమానా కానీ, ఒక వారం ఖైదు కానీ విధించాడు; వరుడి తల్లి అయిన కూసుమంచి రామమ్మకు శిక్ష యాభై రూపాయల జరిమాన లేదా ఒక వారం శ్రీకృష్ణ జన్మస్థానం; పురోహితుడైన కొడుకుల చిన్న సుబ్బారావుకు శిక్ష యాభై రూపాయాల జరిమానా లేదా వారం రోజులు జైలు పక్షిత్యము. కృష్ణా జిల్లా కలెక్టరు ఇ.సి. వుడ్ దొర అయితే ఇంకా కఠినంగా వ్యవహరించాడు. చింతలపాటి యజ్ఞయ్య అనేవాడు ఎనిమిది సంవత్సరాల తన కూతుర్ని పదునాలుగు సంవత్సరాల అబ్బాయికిచ్చి పెళ్లి చేయగా మానేపల్లి బాపనయ్య అనే అతను ఫిర్యాదు చేశాడు. ఇ.సి. వుడ్ దొర విధించిన శిక్షలు ఇలా ఉన్నాయి: వధువు తండ్రి అయిన చింతపాటి యజ్ఞయ్యకు రు. 700 జరిమానా విధించి అతని చింతల్ని పెంచాడు; వరుడి తండ్రికి రు. 700; వధూవరుల తల్లులకు ఒక్కొక్కరికి రు. 100, పురోహితులుగా వ్యవహరించిన చివులూరి యజ్ఞన్నారాయణ, బోరుపల్లి అమరయ్యలకు తలా రు. 300; సేకరించిన జరిమానాలో నుండి ఫిర్యాదు దారుకు రు. 150 ఇప్పించారు. శారదా చట్టం గూర్చి అందరికీ తెలుసుననీ, దోషులు ఉద్దేశపూర్వకంగా చట్టాన్నత్రికమించారనీ, నిజానికి దోషులు ఇంకా కఠినమైన శిక్షకు నికార్సుగా అర్హులనీ, కాకపోతే వారు తమ తప్పును ఒప్పుకొన్న కారణంగా వారికి తేలికపాటి శిక్షనే విధించి జైలుకు పంపడం లేదనీ కలెక్టరు చెప్పడం జరిగింది) అనేక శారదా శాసనా పరిపాలనా సంఘాలు (అనేక మంది సంస్కరణాభిలాషులు శారదా శాసనం పకడ్బందీగా అమలు జరిగేలా చూడడానికి పలుచోట్ల ఇలాంటి సంఘాల్ని ఏర్పాటు చేశారు. స్త్రీలు కూడా ఈ సంఘాల్లో బాధ్యతాయుత స్థానాల్లో పనిచేశారు. ఉదాహరణకు గోదావరి జిల్లాలోని 'సంఘ సంస్కరణాభివృద్ధి సమితి'కి పెద్దాడ సుబ్బమ్మ, దామెర్ల కమలా రత్నమ్మలు వరుసగా ఉపాధ్యక్షులు, సంయుక్త కార్యదర్శులుగా పనిచేశారు. మద్రాసులోని 'శారదా శాసన పరిపాలనా సంఘము' కార్యనిర్వాహక సంఘ సభ్యురాలిగా యం. సుభద్రమ్మ పనిచేసింది. బాల్య వివాహాలు జరగకుండా ఈ సంఘం గట్టిగా కృషి చేసింది) ఏర్పడినప్పటికీ, (బాల్య వివాహాలు జరగకుండా నిరోధించడానికీ, ఒకవేళ జరిగితే ప్రభుత్వానికి ఫిర్యాదు చేయడానికీ) ఛాందసవాద గార్ధబ ఘోరౌంద్ర 'సంగీతం' ముందు అభ్యుదయవాద శ్రావ్యగీతం పెద్దగా పనిచేయలేకపోయింది. (దోషులను శిక్షింపబోయి ఒక్కోసారి ఫిర్యాదు దారులే భంగపడేవారు. పశ్చిమ గోదావరి జిల్లా శారదా శాసన పరిపాలనా సంఘ బాధ్యుడైన కె. సన్యాసరావు అదే జిల్లాలోని వేల్పూరు గ్రామ పంచాయితీ ఉపాధ్యక్షుడైన కె. సూరయ్య తన 11 సంవత్సరాల కొడుకు పెళ్లి పళని చిరంజీవి అనే అతని 9 సంవత్సరాల కూతురుతో 1932 మే 22న శారదా చట్టానికి వ్యతిరేకంగా చేశాడనీ, వి. వీరయ్య అనే అతను పురోహితుడిగా వ్యవహరించాడనీ ఫిర్యాదు చేశాడు. నిందితులు డిఫెండు చేసుకుంటూ నిజానికి పెళ్లి 1932 ఏప్రిల్ 29న జరిగిందనీ, ఫిర్యాదు కాలం నాటికి ఒక సంవత్సర కాలం దాటి పోయిందనీ, కాబట్టి శారదా శాసన నిబంధననుసరించి సదరు ఫిర్యాదు చెల్లదనీ వాదించారు. (చట్ట ప్రకారం, ఏ ఫిర్యాదైనా పెళ్లి జరిగిన సంవత్సరంలోపే చేయాలి) జిల్లా మేజిస్ట్రేటు రావు బహదూర్ ఆర్. సుబ్బయ్య నిందితుల వాదనలతో ఏకీభవించి ఫిర్యాదును కొట్టిపడెయ్యడమే కాకుండా దురుద్దేశం కొద్దీ ఫిర్యాదు చేశాడని సన్యాసిరావును నిందించి నిందితులకు వరుసగా రు. 20, రు. 10, రు. 5 నష్టపరిహారం చెల్లించమని ఆజ్ఞాపించారు).

రామసుబ్బమ్మ ప్రసంగం నాటికి (డిసెంబర్ 1939) శారదా చట్టం అమల్లోకొచ్చి తొమ్మిది సంవత్సరాలకు పైగానే అయినా, పరిస్థితి మాత్రం పైన మనం వివరించిన విధంగా ఘోరంగా ఉండింది. అందుకే ఆమె 'బాల్య వివాహముల నిషేధించు శారదా చట్టము ఇప్పటికిని అంత ప్రయోజనకారిగాకున్నది' అని వాపోయింది. చట్టం పటిష్టమైన అమలును

కోరుకోవడంతో పాటుగా ఆశించిన సత్ఫలితాలు త్వరితగతిన సాధించడం కోసం పలుమంది సమకాలీన మహిళా మేధావుల్లాగానే 'ఆ చట్టమును ఇంకను సవరించ'వలెనని వాదించింది. చట్ట వ్యతిరేకంగా బాల్య వివాహాలు చేసిన వారికి ప్రభుత్వం అడపాదడపా శిక్షలు విధించిందే కానీ, అలా జరిగిన వివాహాలను రద్దుచేయడం గూర్చి ఏమీ అనలేదు. ఇలాంటి సందర్భంలో 'చట్ట విరుద్ధముగ జరిగిన బాల్య వివాహములు రద్దగునట్లు (చట్టంలో సవరణ) చేసిననే గాని దేశమునకు లాభకరముగా నుండదు' అని రామసుబ్బమ్మ అనడం ఎంతో రాడికల్ ఆలోచన. పెండ్లిని ఒక కాంట్రాక్టుగా కాకుండా దైవికమైన ధర్మంగా భావించే 'హిందువు'లకు ఎంతమాత్రమూ మింగుడుపడని భావజాలం ఇది!

ప్రారంభం నుండీ మహిళోద్యమ అజెండాలో ప్రముఖ స్థానమలంకరించిన అంశం స్త్రీ విద్య. వలస పాలనలో మారిన పరిస్థితులకనుగుణంగా తమ కుటుంబ జీవితాల్లో వచ్చిన మార్పుల కనుగుణంగా తమ గృహలక్ష్ములను తీర్చిదిద్దే ఉద్దేశంతో కూడా పురుష సంఘ సంస్కర్తలు స్త్రీ విద్యను ప్రోత్సహించారు. పురుషుల ఆకాంక్షలను నెరవేర్చడానికై సన్నద్ధులైన స్త్రీలు తొలుత పురుషుల భావజాలాన్నే స్త్రీ విద్యపట్ల కలిగి ఉండినారు. (ఉదాహరణకు భండారు అచ్చమాంబ కథ 'స్త్రీ విద్య : భార్యా భర్తల సంవాదము'లో భర్త నిరక్షరకుక్షి అయిన భార్యకు '... ప్రపంచమునందెల్లప్పుడును పత్ని పతికి సహాయురాలై యుండవలయును. గాన భర్తకు సహాయురాలగు పత్ని విద్యనేర్చిననంగాని తన కర్తవ్యమును బూర్తిగా నిర్వహింపజాలదు. పెనిమిటి దినమంతయు శ్రమపడి ఇంటికి వచ్చిన పిదప నింటి యందలి యనేక లెక్కలను నాతడు వ్రాయనక్కరలేకయే విద్యావతియగు సతి తానే వ్రాయును. అందువలన నామె భర్తకు గొంతయైనను విశ్రాంతి కలుగును... ప్రస్తుతము పురుషుల కంటెను స్త్రీలు విశేష జ్ఞానసంపన్నులగుట యధిక యావశ్యము. ఏలన నికముందు పుట్టబోవు వారినున్నత పదవికి తెచ్చుట స్త్రీలయధీనములోనిదై యున్నది. తల్లి విద్యా హీనము దుర్గుణవతి యునయిన నామె సంతానమంతయు నటులనే యగుటయు దల్లి విద్యావతియు సద్గుణవతియునైనచో నామె సంతానము మిక్కిలి యోగ్యతను గాంచగల్గుటయు సహజము... ఉత్తమురాలగునొక్కి మాతవలన బిల్లలకు గలుగు సద్గుణములు పదిమంది వుత్తముల (ఇన) గురువుల వలనను గలుగనేరవని యొకానొక విద్వాంసుడు వ్రాసెను. గాన తమతమ పిల్లలనుత్తమ చరితలను జేయుటకైనను దల్లులు విద్యావంతులగుట యావశ్యకము' అని స్త్రీ విద్యావశ్యకతను బోధిస్తాడు. స్త్రీ విద్య పరమలక్ష్యం ఇంటి పనుల్లో స్త్రీ సామర్థ్యాన్ని పెంచేందుకూ, పిల్లల, భర్త శ్రేయస్సుకూ అనే భావజాలం ముప్పై, నలభై దశకాల్లోనే కాకుండా ఇప్పటికీ ఉంది) వలసవాద వ్యతిరేక జాతీయోద్యమ కాలంలో వీరులు, ధీరులు అయిన బిడ్డల్ని కని వారిని దేశభక్తి ప్రపూర్ణులైన త్యాగధనులుగా తీర్చిదిద్దే వీరమాతలుగా తయారు చేయడానికై స్త్రీ విద్య అత్యంతావశ్యకమైనది అని స్త్రీలు సహా ఎక్కువ మంది స్త్రీ విద్యాభిలాషులు వాదించేవారు. (వాసవి రజతపాత్ర బహుమతి పొందిన ఈ వ్యాసంలో కమలాంబ ఇలా వ్రాసింది. 'స్త్రీలు ఇన్ని చదువులు చదివినను, వారి హృదయము దేశాభిమాన ప్రేరితము కానిచో, వారు కనిపెంచు బిడ్డలు దేశోద్ధారకులు గాజాలరు. శివాజీ బాల్యమునందు తల్లి వద్ద కూర్చొని, రామాయణ, భారత వీరుల చరిత్రలను విని గ్రహించినందువలననే, అతడు దేశభక్తుడై స్వరాజ్యమును స్థాపించగలిగెను. అటువలనే, ప్రతి మాతయు తన బిడ్డలకు దేశాభిమానమును ఉగ్గు పాలతోడనే పోసి పెంచినట్లుండ వలెను') స్త్రీలను కూడా మానవ వ్యక్తులుగా గుర్తించి వారి వ్యక్తిత్వ వికాసానికి స్త్రీ విద్య ముఖ్యం అనే భావజాలం స్త్రీలలో ఒకవైపు చోటుచేసుకుంటూండిననూ సంఘం కోసం, దేశం కోసం స్త్రీ విద్య అనే భావజాలానిదే ప్రధాన స్వరం: ఈ భావజాలాన్ని స్త్రీలు తమ విద్యావకాశాల్ని ఇంకా మెరుగుపర్చుకోవడానికి వ్యూహాత్మకంగా ఉపయోగించుకున్నారనేది వేరే విషయం.

పరిశీలనలో ఉన్న ఉపన్యాస కాలం నాటికి రామసుబ్బమ్మ కడప జిల్లా ఎడ్యుకేషన్ కౌన్సిల్ అధ్యక్షులుగా స్త్రీ విద్యాభివృద్ధి విషయంలో విశేషంగా కృషిచేసి ఉంది. విద్యకు సంబంధించి ఆమె భావజాలం అప్పటికి డామినెంట్ స్వరంగా ఉండిన 'భవిష్యత్ భారత జాతి కోసం స్త్రీ విద్య' అనే భావజాల పరిధిలోనే ఉండింది. స్త్రీ విద్య ఎందుకు 'అత్యవసరమైన'దో, దాన్ని వృద్ధి చేయడానికి ప్రభుత్వ విధానమెలా ఉండాలో ఈ కింది విధంగా చెప్పింది.

'స్త్రీలకు విద్య అత్యవసరము. భవిష్యద్భారత జాతికి తల్లియగు ప్రకృత స్త్రీకి విద్యలేకపోయిన భారత జాతి వికాసమందజాలదు. ముఖ్యంగా స్త్రీలలో నైనను నిర్బంధ విద్యా విధానమును ప్రభుత్వం వారు ప్రవేశపెట్టిననే కాని, మన స్త్రీ జాతి వికసింపజాలదు. స్త్రీ జాతి వికసించిననే కాని, దేశము దాస్య విముక్తినొందనేరదు. కాన ప్రభుత్వము వారు ధనవ్యయమునకు లెక్కించక స్త్రీలకైనను నిర్బంధ విద్యను ఉచితంగా గరపునట్టి చట్టమును చేయవలెనని (స్త్రీలమైన మనం) ఆందోళన చేయవలసియున్నది.'

దేశ 'దాస్య విముక్తి'కి స్త్రీ జాతి వికసనాన్ని ప్రారంభ సోపాన షరతుగా ప్రవేశపెట్టడం ఇక్కడ గమనార్హమైనది. మహిళా మానవ వనరుల అభివృద్ధికై ఆర్థిక వనరులను ఖర్చుపెట్టే విషయంలో ప్రభుత్వం ఉదారంగా వ్యవహరించాలని సూచించడం అప్పటికీ, ఇప్పటికీ కడప నల్లరాయి లాంటి గొప్ప ఆలోచన.

స్త్రీలను 'తక్కువ' చేసి చూపే పితృస్వామ్య మురికి భాండాన్ని బద్దలు చేసింది రామసుబ్బమ్మ. దైవదృష్టిలో అందరూ సమానమే అనే దైవవాద భావజాలాన్ని ఆశ్రయించి పురుష దురహంకారాన్ని ప్రశ్నించింది. ఇంటా, బయటా అనే అసహజమైన భావజాలాన్ని అత్యంత సహజమైనదిగా చిత్రీకరించే జైవిక నియతివాద భావాన్ని వేళ్లు సహా ఊడబెరుకుతూ 'పురుషులు చేయవలసిన (చేయగలిగిన) కార్యములలో స్త్రీలు చేయజాలని కార్యమేదియు లేదని నా నమ్మకము' అని ప్రగాఢ ఆత్మ విశ్వాసంతో ప్రకటించింది. ఆమె మాటల్లో –

'పురుషులతో పాటు స్త్రీలకు సమాన హక్కులు కావలెనని పోట్లాడుట ఇప్పుడు సహజమైనది. దైవ దృష్టియందు స్త్రీ పురుషులు సమానులని గుర్తెరుగక పురుషులు తాము అధికులమని స్త్రీలను నీచముగా జూచుటయు, తాము సంపాదించిన ఆస్తియందు స్త్రీలకె లాంటి హక్కులేదని ఆస్తియందు స్వాతంత్ర్యమివ్వకపోవుటయు ఇత్యాది చర్యల వలన స్త్రీలు పురుషులతో సమాన హక్కులకై సంఘర్షణ చేయవలసి వచ్చినది. స్త్రీ పురుషులలో నొందురులు చేయు పనులు ఇరువురి మేలుకొరకే అయియుండియు (ఉన్నప్పుడు) ఒకరికి ఆధిక్యత ఒకరికి న్యూనత ఎక్కడిది? పురుషులు చేయవలసిన (చేయగలిగిన) కార్యములలో స్త్రీలు చేయజాలని కార్యమేదియు లేదని నా నమ్మకము.'

(ఇంకా ఉంది)

(రచయిత అసిస్టెంట్ ప్రొఫెసర్, హిస్టరీ, మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ, హైదరాబాద్)

వీ

పుస్తక సమీక్ష

ఇంద్ర ధనుస్సులా 'ఒక నేల అనేక ఆకాశాలు'

- డి.వి. రామక్రిష్ణా రావు

1945 జూలై 16న ప్రారంభమైన బాపట్ల వ్యవసాయ కళాశాల 2020 జూలై 16న 75 ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ చారిత్రక సందర్భాన్ని అలా ఊరకనే వెళ్లిపోనియకుండా పూర్వ విద్యార్థుల జ్ఞాపకాల సమాహారంగా 'ఒక నేల... అనేక ఆకాశాలు' శీర్షికతో సంకలనం చేసి ఒక కాఫీ టేబుల్ పుస్తకంగా వలేటి గోపిచంద్ (1980 బ్యాచ్ విద్యార్థి) మనకు అందించారు. 2020 ప్రారంభం నుంచే ప్రపంచ మానవాళిని అతలాకుతలం చేసిన, చేస్తూనే ఉన్న కరోనా వైరస్ మన దేశంలో వివిధ రాష్ట్రాల్లోనూ తన ప్రతాపాన్ని చూపింది. సామాజిక, ఆర్థిక సంక్షోభానికి కారణమయింది. మనుషుల కదలికలకు, కలుసుకోవడానికి అవాంతరాలు ఏర్పడ్డాయి. ఇలాంటి చాలా ప్రత్యేకమైన పరిస్థితుల్లో.. బాపట్ల 75 ఏళ్ల సందర్భంగా ఈ పుస్తకాన్ని కేవలం మూడు నెలల కృషితో విజయవంతంగా రూపొందించారు.

1945 నుంచి నేటి వరకు బాపట్ల వ్యవసాయ కళాశాలలో చదువుకున్న విద్యార్థుల జ్ఞాపకాలను బ్యాచ్‌ల వారీగా వారి ఫొటోలతో సహా రికార్డు చేశారు. తమకు విద్యను అందించిన కళాశాలపై గౌరవంతో, ప్రేమతో, గొప్ప పూనికతో, అకుంఠిత దీక్షతో ఈ పనిని వలేటి గోపిచంద్, ఆయన మిత్రులు పూర్తి చేశారు.

ఈ పుస్తకం చదువుతున్నంత సేపు అసలు ఇలాంటి పని ప్రతి కళాశాల విద్యార్థులు చేస్తే ఎంత బాగుంటుంది కదా అనిపించింది. మనసు నిండా అనేక ఆలోచనలు ముసురుకున్నాయి. ఇప్పటికీ మనం అక్షరాస్యతలో వెనకబడే ఉన్నాం. అనుభవాలను, జ్ఞాపకాలను రాసుకోవడం, భద్రపరిచి తర్వాత తరాలకు అందజేసే అలవాటు మనకు చాలా తక్కువ. మొత్తంగా ఆ రకంగా మనకు చారిత్రక దృష్టి తక్కువే. దీనివల్ల మన తర్వాత తరాలు కోల్పోయేది చాలా ఎక్కువ. నిజానికి ప్రతి బ్యాచ్ ఫొటో, వారి అనుభవాలు, పరిశీలనలు, కళాశాల పురోభివృద్ధికి సూచనలు, ఆయా బ్యాచ్‌లు కళాశాల నుంచి వెళ్లిపోయేటప్పుడు నమోదు చేసే పని ఆయా విద్యాసంస్థలు, పరిశోధనా సంస్థలు చేస్తే అవి భవిష్యత్తు తరాలకు మార్గదర్శకంగా, ఆలోచనలను రేకెత్తించేవిగా దోహదపడతాయి.

'ఒక నేల.. అనేక ఆకాశాలు' శీర్షిక పెట్టడంలోనే సప్తరంగుల ఇంద్ర ధనస్సుగా భాసిల్లిన, అనేక ఆలోచనా ధారలకు వేదికైన కళాశాలను అర్థవంతంగా ఆవిష్కరించడమే.

అప్పటి మద్రాసు రాష్ట్రంలో భాగంగా ఉన్న బాపట్లలో మనదేశ స్వాతంత్రానికి పూర్వమే 1945లో వ్యవసాయ కళాశాల ప్రారంభమైంది. ఉస్మానియా పరిధిలో హైదరాబాద్‌లో వ్యవసాయ కళాశాల 1946లో ప్రారంభమైంది. కాల క్రమంలో ఎన్నో మార్పులకు, చేర్పులకు లోనయింది. 1956లో తెలుగు ప్రాంతాలు కలిసిపోయి ఉమ్మడి రాష్ట్రంగా ఏర్పడి మళ్లీ 2014లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లుగా విడిపోయేదాకా దాదాపు 6 దశాబ్దాల కాలంలో తెలుగు ప్రాంతాల నలుమూలల నుంచి విద్యార్థులు వచ్చి ఈ కళాశాలలో చదువుకున్నారు. 1964లో హైదరాబాద్ కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పడింది. కాల క్రమంలో విద్యా విధానంలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి.



'ఒక నేల... అనేక ఆకాశాలు'

సంకలనకర్త: వలేటి గోపిచంద్

ఫోన్ : 9441276770

పుస్తకం కాపీల కోసం..

పుస్తకం ప్రకటించిన వెల రు.1000 అయినా రైతునేస్తం పబ్లికేషన్స్ కార్యాలయంలో రు. 350 కే కాపీ పొందవచ్చు. పోస్టు ద్వారా పొందడానికి కాపీకి రు.500లు. గమనించగలరు.

ప్రతులకు :

రైతునేస్తం పబ్లికేషన్స్, 6-2-959, దక్షిణ భారత హిందీ ప్రచారసభ కాంప్లెక్స్, ఖైరతాబాద్, హైదరాబాద్ - 500004, ఫోన్ : 040-23395979, 9676797777

విద్యార్థుల ఆరాట, పోరాటాలూ అందులో ఉన్నాయి. 1995లో జరిగిన 50 ఏళ్ల స్వర్ణోత్సవ ముగింపు వేడుకల్లో కళాశాల మొదటి బ్యాచ్ విద్యార్థి రోల్ నెంబరు బి.-45-1/ అజీజ్ అహ్మద్ (హైదరాబాద్) గారిని ప్రత్యేకంగా సన్మానించుకోవడం ఒక విశేషం. ఇలాంటి సున్నితమైన విశేషాలు ఈ పుస్తకంలో సాధ్యమైన మేరకు నమోదు చేశారు.

ఇటీవల చనిపోయిన బాపట్ల వ్యవసాయ కళాశాల పూర్వ విద్యార్థులు కొసరాజు తిరుమల రావు, నందూరి వాణి వివేక వర్ధిని గార్లకు పుస్తకాన్ని అంకితమిచ్చారు.

విత్తు నాటింది వీరే అంటూ.. బాపట్ల వ్యవసాయ కళాశాల ఏర్పాటుకు బీజాలు వేసిన అప్పటి మద్రాసు రాష్ట్ర గవర్నరు సలహాదారు ఎస్. వెంకటరామ మూర్తి, గుంటూరు జిల్లా అభివృద్ధి బోర్డు చైర్మన్ పి.వి. కృష్ణయ్య చౌదరి, మద్రాసు రాష్ట్ర వ్యవసాయశాఖ సంచాలకులు బి.వి. నాథ్, అప్పటి వ్యవసాయశాఖ ఉప సంచాలకులు సీతారాం పాత్రుడు గార్ల ఫోటోలను పొందుపరిచారు.

ఒక నేల.. అనేక ఆకాశాలు పుస్తకం రూపొందడానికి అండదండగా నిలిచిన బాపట్ల పూర్వ విద్యార్థులు కె. సాంబశివరావు (1972), ఎన్. శిరీష (1973), టి. సురేష్ (1974), వై.వెంకటేశ్వర్లు (1978), డి. పురుషోత్తం (1980), జె. అఖండరావు (1980) లకు ఒక పేజీ కేటాయించి గౌరవంగా రికార్డు చేశారు.

చాలా వినమ్రంగా 'నా మొహం నాకేం తెలుసు' అంటూ సంకలన కర్త వలేటి గోపిచంద్ తన ముందుమాటలో 75 ఏళ్ల కళాశాల ప్రస్థానాన్ని రేఖా మాత్రంగానైనా రికార్డు చేసి భవిష్యత్ తరాలకు తెలియజేయడమే తమ ఉద్దేశం అని అన్నారు.

బాపట్లలో వ్యవసాయ కళాశాల ప్రారంభించినప్పుడు అప్పటి భవనాల ఫొటోలను 'భారతి' పత్రిక ఆగస్టు 1945లో రికార్డు చేస్తే ఆ ఫొటోలను ఇందులో నమోదు చేశారు. వివిధ విశ్వవిద్యాలయ రథ సారథులుగా ఎదిగిన ఐ.వి. సుబ్బారావు, అల్లూరి పద్మరాజు, నీలంరాజు గంగా ప్రసాదరావు, అరిబండి వేణుప్రసాద్ గార్లను జ్ఞాపకం చేశారు.

తెలుగు రాష్ట్రాల్లోనూ, దేశ విదేశాల్లో ఉన్న ఆయా బ్యాచ్ విద్యార్థులను మిత్రుల సహకారంతో రక రకాల పద్ధతుల్లో సంప్రదించి, విలువైన జ్ఞాపకాలను ఒక దగ్గర ప్రోది చేశారు. శాస్త్రరంగంలో, రాజకీయ రంగంలో, పాలనా రంగంలో, ఆర్థిక రంగంలో విజయాలు సాధించి గర్వకారణంగా నిలిచిన బాపట్ల విద్యార్థుల గురించి తెలియజేశారు. ఇవేకాకుండా ఆధ్యాత్మిక, సేవా రంగాల నుంచి ప్రత్యామ్నాయ ప్రజా ఉద్యమాల దాకా అన్ని రంగాల్లో విస్తరించిన విద్యార్థుల జ్ఞాపకాలను రికార్డు చేశారు. బాపట్ల కళాశాల చరిత్రలో మైలు రాళ్లను ఒక దగ్గర రికార్డు చేశారు. ప్రతి బ్యాచ్ అనుభవాలకు అర్థవంతమైన శీర్షికలు పెట్టి ఆయా బ్యాచ్‌లను మనకు పరిచయం చేశారు. అరుదైన ఫొటోలను పుస్తకమంతటా రికార్డు చేశారు. అన్నింటికి గుణ దోషాలు, మంచి చెడులు ఉంటాయి. అలాగే బాపట్ల కాలేజీలోనూ ఒక దశలో రాగింగ్‌కు చాలా ఇబ్బందులు పడ్డ విద్యార్థుల గాథలూ ఉన్నాయి. కుల పరమైన గ్రూపులు (గ్రాఫ్‌లు) వల్ల తలెత్తిన సమస్యలతో సతమతమైన విద్యార్థుల కథలూ ఉన్నాయి. ఇలా ఇంకా అనేకం చెప్పుకోవాల్సే ఉంది. సమాజ స్వభావానికి ప్రతికలే కదా మన వ్యవస్థలు కూడా.

చెప్పుకోవల్సిన విషయాలు ఎన్నో ఉన్నా కాల క్రమంలో ఎక్కువ మంది అమ్మాయిలు వ్యవసాయ విద్యలోకి రావడం ఒక ముఖ్య పరిణామం. తొలినాళ్లల్లో వ్యవసాయ కళాశాలలో ఆడపిల్లలు చేరడం చాలా తక్కువగా ఉన్న స్థితి నుంచి 1991 వచ్చే సరికి 50 శాతం ఆడపిల్లలు చేరే దశకి చేరుకుంది. ఇప్పుడు అంతకన్నా ఎక్కువ మందే ఆడపిల్లలు వ్యవసాయ విద్యలోకి రావడం ముదావహం.

ఈ పుస్తకంలో అనుభవాల్లో భాగంగా విద్యార్థులు అనేక పరిశోధనల్లో సాధించిన విజయాలను రేఖామాత్రంగా పేర్కొన్నారు. ముఖ్యంగా వరిలో బి.పి.టి. 5204, స్వర్ణ, వరి హైబ్రిడ్స్ - ఎ.పి.ఎచ్.ఆర్.-1, ఎ.పి.ఎచ్.ఆర్.-2, చెరకులో విశ్వామిత్ర, భరణి రకాలు, పత్తిలో నర్సింహ అలాగే చిరుధాన్యాల్లో జొన్నలో చేసిన పరిశోధనలు, నువ్వులులో 5 కొత్త వంగడాలు, గోగులో వంగడాలు రూపొందించడంలో బాపట్ల విద్యార్థుల పరిశోధనా కృషి ఉంది. ఈ విజయాలు చూసినప్పుడు వ్యవసాయానికి పరిశోధనా రంగం నుండి రైతాంగానికి అందిన సేవలు ప్రత్యేకంగా ఒక పుస్తకంగా తేవలసి ఉంది. బహుశా ఒక ప్రశ్నావళి రూపొందించుకొని కాస్త వివరంగా పూర్వ విద్యార్థులను, అధ్యాపకులను సంప్రదిస్తే మరింత వివరంగా ఈ జ్ఞాపకాలను ఇంకా సుసంపన్నం చేసుకునే అవకాశం ఉంది. ఈ పుస్తకంలో వ్యవసాయానికి సంబంధించిన విలువైన సామెతలు, పెద్దలు చెప్పిన విలువైన మాటలు నమోదు చేశారు. పుస్తకానికి లోతైన అర్థంతో, కవితాత్మకమైన 'ఒక నేల.. అనేక ఆకాశాలు' శీర్షికను ప్రముఖ కవి యార్లగడ్డ రాఘవేంద్ర రావు సూచించారు. పుస్తకం నిండా రైతు జీవితం గురించి శ్రమైక సౌందర్యం చాటేలా అర్థవంతమైన, అందమైన బొమ్మలను తల్లావఝుల శివాజి అందించారు. పుస్తకంలోని కొన్ని విలువైన మాటలను చూస్తే -

'ఏదైనా ఆగొచ్చు కానీ వ్యవసాయం ఆగకూడదు'

– దేశ ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ

'భారతదేశంలోని వ్యవసాయ సమస్యలకు పరిష్కారం భూమిని జాతీయం చేయడమే. వ్యవసాయాన్ని పరిశ్రమగా గుర్తించి సహకార సాగును ప్రోత్సహించాలి. పారిశ్రామికీకరణ, వ్యవసాయాభివృద్ధి దేశానికి ఊతమిస్తాయి. వ్యవసాయంలో అత్యధిక పెట్టుబడులు పెట్టాలి'

– రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్. అంబేద్కర్

సంకలనకర్త మాట..

బాపట్ల వ్యవసాయ కళాశాల తన 75 ఏళ్ల ప్రస్థానంలో ఈ దేశ అభివృద్ధిలో భాగస్వామ్యం అందుకుంది. మహోన్నతమైన మానవ వనరులను అందించిన విద్యాసంస్థ. అలాగే ఇతర వ్యవసాయ కళాశాలలు కూడా.. ఈ పుస్తకంలో వారందరిని రేఖామాత్రంగా స్మరించుకున్నాం. అయితే వారందరి జీవితాల మీద మోనోగ్రాఫ్‌లు తీసుకురావాల్సిన అవసరం ఉంది. వ్యవసాయ విద్య, పరిశోధనా, విస్తరణా రంగాలతో పాటు ఇతర ఆర్థిక, వాణిజ్య రంగాలలో ప్రభావితం చేసిన వారి సేవలను భవిష్యత్తు తరాలకు అందించాలి. దీనికోసం ప్రతేక కృషి జరగాల్సి ఉంది. ఇదే విధంగా రాజేంద్రనగర్, తిరుపతి వ్యవసాయ కళాశాలల విషయంలో కూడా.. తెలుగు నేల మీద తొలి పొద్దుగా వ్యవసాయ రంగంలో వికసించిన ఈ సస్య పుష్పాల సేవలు అంతర్జాతీయంగా కూడా గుభాళించాయి. వాటిని ఒక సమగ్ర సంగ్రహంగా తీసుకురావాల్సిన అవసరం ఉందనేది నా భావన...

వలేటి గోపిచంద్,

ఫోన్ : 9441276770

(1980 బ్యాచ్)

'కవుల కళాలు..
గాయకుల గళాలు..
నర్తకుల నాట్యాలు..
వాద్యకుల వాదాలు..
అంగనల అందాలు..
కందర్పు కయ్యాలు..
కర్షకా నీ కర్రు కదిలినంతవరకే.."

– కాళోజీ నారాయణరావు

'మానవ జాతి ముఖ్య సంపద నేల. భూసారాన్ని కాపాడగలిగేలా తన చర్యలను మానవజాతి నియంత్రించుకోగలదా లేదా అనే విషయంపైనే మానవ నాగరికత, భవిష్యత్తు ఆధారపడి ఉంది'

– సర్ అల్బర్ట్ హవార్డ్

'ఆహారం, ఔషధం రెండూ వేరువేరు కాదు. ఇవి రెండూ ఒకే దేహానికున్న రెండు పార్శ్వాలు మాత్రమే'

– మసనోబు ఫుకుఒకా

'వ్యవసాయం తిరోగమనంలో ఉంటే దేశంలో మరే రంగం కూడా పురోగమనంలో ఉండే అవకాశం లేదు'

– ఎం.ఎస్. స్వామినాథన్

..వంటి అనేక విలువైన విషయాలను ఈ పుస్తకంలో పొందుపరిచారు. ఒక నేల.. అనేక ఆకాశాలు కేవలం బాపట్ల కళాశాల విద్యార్థులకు సంబంధించిన వ్యవహారం ఎంతమాత్రం కాదు. ఈ దేశ అభివృద్ధిలో వ్యవసాయం పాత్ర మనకు తెలిసినదే. అలాంటి వ్యవసాయానికి తమ శాస్త్ర పరిశోధనలతో విలువైన ఫలాలను అందించిన విద్యార్థులను రూపొందించిన కళాశాల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి. ఇలాంటి అనుభవాలను ప్రతి విద్యాసంస్థ, విశ్వవిద్యాలయాలు రికార్డు చేయడం ఎంతో అవసరం. ప్రతి ఒక్కరూ ఈ పుస్తకాన్ని ఆదరిస్తారని నమ్ముతూ ఈ కృషిని చేసిన వలేటి గోపిచంద్ గారికి మనందరి తరపునా అభినందనలు. విలువైన ఈ జ్ఞాపకాలను అందంగా ప్రచురించిన రైతునేస్తం పబ్లికేషన్స్‌కు అభినందనలు.

(రచయిత వ్యవసాయ విద్యార్థి, సామాజిక కార్యకర్త) వీ

దివీస్ ఉద్యమకారులను విడుదల చేయాలి

దివీస్ ఉద్యమకారులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేసి, అరెస్ట్ చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ వామపక్ష ఆధ్వర్యంలో తూర్పుగోదావరి జిల్లా కాకినాడలోని కలెక్టరేట్ వద్ద జనవరి 2న ధర్నా నిర్వహించారు. దివీస్ పరిశ్రమ నిర్మాణ పనులు నిలిపివేయాలని కోరుతూ డిసెంబర్ 17న ఆందోళన చేస్తున్న రైతులు, వామపక్ష నాయకులు, 160 మంది ప్రజలపై పోలీసులు అక్రమ కేసులు బనాయించారని, 36 మందిపై నాన్ బెయిలబుల్ కేసులను నమోదు చేసి రిమాండ్‌కు పంపారన్నారు. తక్షణమే కేసులను ఉపసంహరించుకొని నాయకులను, రైతులను విడుదల చేయాలని, దివీస్ కంపెనీని ఇక్కడి నుంచి శాశ్వతంగా తరలించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం, సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ నేతలు పాల్గొన్నారు.

ఆర్మూర్‌లో రైతుల ఆందోళన

పసుపునకు ప్రత్యేకంగా బోర్డు ఏర్పాటు చేయడంతో పాటు పంటకు గిట్టు బాటు ధర చెల్లించి రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, సన్న రకాలకు క్వింటాలుకు రు.700 బోనస్ ప్రకటించడమే కాకుండా కొనుగోలు కేంద్రాలను కొనసాగించాలనే ప్రధాన డిమాండ్లతో రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో వెయ్యి మంది రైతులు జనవరి 9న నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణ శివారులోని మామిడిపల్లి వద్ద 44వ నంబర్ జాతీయ రహదారిపై నాలుగు గంటల పాటు బైఠాయించారు. ప్రొ. నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతులు పార్టీల జెండాలను పక్కన పెట్టి రైతు ఎజెండా ఒక్కటే లక్ష్యంగా ఉద్యమించి పసుపు బోర్డును సాధించుకోవాలని పిలుపునిచ్చారు. పసుపునకు క్వింటాలుకు రు.15 వేల గిట్టుబాటు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

పౌర హక్కుల నేతల అరెస్టు

కేంద్రం తెచ్చిన మూడు నూతన వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని ఢిల్లీలో నిరసన తెలుపుతున్న రైతులకు సంఘీభావంగా తెలంగాణ రాష్ట్ర పౌరహక్కుల సంఘం (సిఎల్‌సి) ఆధ్వర్యంలో రెండు రోజులపాటు జగిత్యాల జిల్లాలో చైతన్య యాత్ర నిర్వహిస్తున్నామని సిఎల్‌సి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ. జి. లక్ష్మణ్ తెలిపారు. దీని ఏర్పాట్లలో భాగంగా కరీంనగర్‌లో బ్యానర్లు ఏర్పాటు చేస్తూ, కరపత్రాలను పంచుతున్న పౌరహక్కుల సంఘానికి చెందిన 8 మంది కార్యకర్తలను పోలీసులు జనవరి 9న అరెస్టు చేశారని వారిని, వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

కాలుష్య ఫార్మా కంపెనీలపై ఉదాసీనత

తెలంగాణలోని పోలేపల్లి సెజ్‌లో పర్యావరణ అనుమతుల ఉల్లంఘనకు పాల్పడిన తొమ్మిది ఫార్మా కంపెనీలకు జరిమానా విధించినట్లు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి(టిఎస్‌పిసిబి) జాతీయ హరిత ధర్మాసనానికి (ఎన్‌జిటి) తెలిపింది. పర్యావరణ అనుమతుల ఉల్లంఘనపై ఢిల్లీలోని ఎన్‌జిటి ప్రధాన ధర్మాసనం జనవరి 15న విచారణ చేపట్టింది. కంపెనీల నుంచి 2013 నుంచి జరిమానా వసూలు చేయాల్సి ఉండగా, కేవలం 365 ఉల్లంఘన రోజులనే పరిగణనలోకి తీసుకుని జరిమానాను పరిమితం చేశారని న్యాయవాది ధర్మాసనానికి తెలిపారు. వెయ్యి నుంచి 1300 ఉల్లంఘన దినాలున్నట్లు అంగీకరిస్తూనే కేవలం 365 రోజులనే పరిగణించిన విషయాన్ని బెంచ్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో కాలుష్యం వెదజల్లే కంపెనీలపట్ల ఎందుకు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని జస్టిస్ ఆదర్శ్ కుమార్ గోయెల్ తెలంగాణ పిసిబి న్యాయవాదిని ప్రశ్నించారు. ఆయన ఇచ్చిన వివరణను తోసిపుచ్చుతూ కాలుష్య ఉల్లంఘన రోజులన్నింటినీ పరిగణనలోకి తీసుకోవాల్సిందేనని అన్నారు.

విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల ధర్నా

విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ ఒకే రకమైన నియమాలు వర్తింపచేయాలని విద్యుత్ ఆర్టిజన్లు డిమాండ్ చేశారు. తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ మింట్ కాంపౌండ్‌లోని టిఎస్ఎస్‌పిడిసిఎల్ ప్రధాన కార్యాలయం ముందు పెద్ద సంఖ్యలో ఆర్టిజన్లు జనవరి 10న లంచ్ అవర్‌లో ధర్నా నిర్వహించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి, అధ్యక్షుడు మాట్లాడుతూ విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న 23,668 మంది ఆర్టిజన్ కార్మికులను క్రమబద్ధీకరిస్తామని ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని విద్యుత్ యాజమాన్యాలు నెరవేర్చాలని కోరారు. ఆర్టిజన్లకు అమలు చేస్తున్న ఫ్యాక్టరీ నియమాలను రద్దుచేసి ప్రస్తుతం ఉన్న ఎపిఎస్ఇబి నియమాలను ప్రభుత్వం చెప్పిన విధంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

నిర్బంధం నీడన నిమ్జ్ ప్రజాభిప్రాయ సేకరణ

సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం బర్దిపూర్‌లో జాతీయ పెట్టుబడులు, మౌలిక సదుపాయాల కల్పనా మండలి(నిమ్జ్) ఏర్పాటుపై జనవరి 20న ఏర్పాటు చేసిన ప్రజాభిప్రాయ సేకరణ పోలీసు నిర్బంధం నీడలో జరిగింది. పోలీసులు ఆ సభాస్థలి చుట్టూ మోహరించారు. సభాస్థలిలో ప్రతీ 15 మందికి ఒక బ్లాకు, ప్రతీ బ్లాకులో ముగ్గురు పోలీసులుండి అభ్యంతరం తెలిపిన వారిని బయటికి గెంటేశారు. నిమ్జ్ ఏర్పాటు వల్ల నష్టపోతున్న నాల్‌కల్ మండలంలోని 14 గ్రామాల ప్రజలు ప్రజాభిప్రాయ సేకరణ సభాస్థలైన బర్దిపూర్‌కు బయలుదేరగా పోలీసులు వీరిని ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. పోలీసులను తోసుకుంటూ ముందుకెళ్లిన ప్రజలపై పోలీసులు లాఠీచార్జి చేసి అరెస్టు చేశారు.

దళితులపై కాషాయ మూకల దాడి

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్‌లో జనవరి 21న దళితులపై కాషాయ మూకలు దాడిచేశారు. కమ్యూనిటి హాలు నిర్మాణం కోసం ఒక స్థలాన్ని కొని నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తుండగా అదే గ్రామానికి చెందిన కొందరు అభ్యంతరం వ్యక్తం చేయడంతో పెద్దల సమక్షంలో పంచాయతీ నిర్వహించారు. కాషాయ జెండాలతో సుమారు 30 మంది పంచాయతీ నిర్వహిస్తున్న ప్రదేశానికి వచ్చి జై శ్రీరాం నినాదాలు చేస్తూ దళితులపై కర్రలతో దాడి చేయడంతో పలువురికి గాయాలయ్యాయి. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని బాధితులు రాస్తారోకో చేశారు.

ఎపిలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలన్న హైకోర్టు

ఆంధ్రప్రదేశ్‌లో వాయిదా పడుతున్న పంచాయతీ ఎన్నికలను ఫిబ్రవరిలో నాలుగు విడతల్లో నిర్వహించాలన్న రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయాన్ని రాష్ట్ర హైకోర్టు ధర్మాసనం సమర్థించింది. ఎన్నికల షెడ్యూల్‌ను రద్దుచేస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన మధ్యంతర ఆదేశాలను చీఫ్ జస్టిస్ అరూప్ కుమార్ గోస్వామి, జస్టిస్ ప్రవీణ్ కుమార్‌ల ధర్మాసనం పక్కనపెట్టింది. ఫిబ్రవరి 5,9,13,17 తేదీల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని జనవరి 21న తీర్పు చెప్పింది.

ఉద్యోగుల నిరసన దీక్షను భగ్నం చేసిన పోలీసులు

పిఆర్‌సి నివేదికను బహిర్గతం చేయాలని, 65 శాతం ఫిట్‌మెంట్‌తో వేతన సవరణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు, పబ్లిక్ సెక్టార్, కాంట్రాక్ట్ ఉద్యోగుల ఐక్యవేదిక చేపట్టిన నిరసన దీక్ష ఉద్రిక్తతకు దారి తీసింది. జనవరి నెలాకరులోపు అన్ని సంఘాలతో చర్చలు జరిపి, వేతన సవరణపై నిర్ణయం తీసుకోవాలని కోరుతూ వేదికలోని భాగస్వామ్య సంఘాలకు చెందిన స్టీరింగ్ కమిటీ సభ్యులు జనవరి 23న ఇందిరా పార్క్ వద్ద నిర్వహించ తలపెట్టిన నిరాహార దీక్షను పోలీసులు అడ్డుకున్నారు. దీక్షకు అనుమతి లేదనడంతో ఐక్యవేదిక సభ్యులు రోడ్డుమీదే బైఠాయించి ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేయడంతో పోలీసులు ఆందోళనకారులను బలవంతంగా అరెస్టు చేశారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్‌లు

ఛత్తీస్‌గఢ్‌లోని దంతేవాడ జిల్లాలోని కిరండుల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పోరోక్కడి అటవీ ప్రాంతంలో పోలీసులకు నక్సలైట్లకు మధ్య డిసెంబర్ 27న ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ఇద్దరు మహిళా నక్సల్స్ ఉన్నట్లుగా పోలీసులు గుర్తించారు. ఛత్తీస్‌గఢ్‌లోని చిక్‌పాల్, మర్జూమ్ అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు మావోయిస్టుల కోసం గాలిస్తుండగా వారు ఎదురు పడడంతో ఇరు వర్గాల మధ్య జరిగిన కాల్పుల్లో ఒక మావోయిస్టు మృతిచెందారు.

జమ్మూ కశ్మీర్‌లో అమాయకుల ఎన్‌కౌంటర్

జమ్మూ కశ్మీర్‌లో డిసెంబర్ 30న జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు ఉగ్రవాదులు మరణించారని పోలీసు అధికారులు చెపుతుండగా, శ్రీనగర్ శివారు ప్రాంతంలో జరిగిన ఈ ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన వారు అమాయకులని, ఉగ్రవాదుల జాబితాలో వారి పేర్లు లేకున్నా పోలీసులు వారిని ఉగ్రవాదులుగా చిత్రీకరిస్తున్నారంటూ మరణించిన వారి కుటుంబ సభ్యులు తెలిపారు. పోలీసులు, సైన్యం ఉమ్మడిగా ఈ ఎన్‌కౌంటర్ నిర్వహించాయన్నారు. షోపియాన్‌లో ముగ్గురు అమాయకులను చంపినందుకు పోలీసులపై చార్జిషీట్ దాఖలు చేసిన నాలుగు రోజులకే ఈ ఘటన జరిగింది. డిసెంబర్ 30 వరకు నివాసాల్లోనే ఉన్న మా పిల్లలు రాత్రికి రాత్రే ఉగ్రవాదులుగా మారారని, ఎన్‌కౌంటర్ పేరుతో ఎలా హత్య చేస్తారని కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టాలని నేషనల్ కాన్ఫరెన్స్, పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీలు డిమాండ్ చేశాయి.

సిట్ దర్యాప్తును కోరిన ఎల్గార్ పరిషత్ నిర్వాహకులు

ఎల్గార్ పరిషత్ సమావేశాల కేసును ప్రత్యేక దర్యాప్తు బృందం (ఎస్ఐటి) చేత విచారణ జరిపిస్తామని గత ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఎన్‌సిపి చీఫ్ శరద్‌పవార్‌కు ఆ సంస్థ నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది డిసెంబర్ 31న జరగాల్సిన ఎల్గార్ పరిషత్ సమావేశాలకు పుణే జిల్లా యంత్రాంగం అనుమతి నిరాకరించింది. కోవిడ్ ఆంక్షల కారణంగా అనుమతివ్వలేదు. దీంతో ఈ సమావేశాలను 2021 జనవరి 30న నిర్వహిస్తామని నిర్వాహకులు జనవరి 1న ప్రకటించారు.

ఛత్తీస్‌గఢ్‌లో బిఎస్‌ఎఫ్ క్యాంపులు తొలగించాలి

ఛత్తీస్‌గఢ్‌లోని నక్సల్స్ ప్రభావిత కాంకేర్ జిల్లాలోని కాట్‌గావ్, కామ్‌టేడా గ్రామాలకు సమీపంలో ఏర్పాటు చేసిన రెండు సరిహద్దు భద్రతా దళం (బిఎస్‌ఎఫ్) శిబిరాలను తొలగించాలని స్థానికులు డిమాండ్ చేశారు. ఈ గ్రామాలకు సమీపంలో జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులకు భద్రత కల్పించడానికి పార్తపూర్–కోయలిబేడా మార్గంలో బిఎస్‌ఎఫ్ శిబిరాలను ఏర్పాటు చేశారు. పోలీసు శిబిరాలను అక్కడి నుంచి మార్చాలని వందకు పైగా గ్రామాల నుంచి వేలమంది కొద్ది రోజులుగా నిరసన వ్యక్తం చేస్తున్నారు. స్థానికులకు మద్దతుగా 46 మంది సర్పంచులు, ఏడుగురు పంచాయత్ సభ్యులు, డిప్యూటీ సర్పంచ్, ఒక జడ్‌పిటిసి రాజీనామా చేశారు.

యుపిలో మహిళలపై కొనసాగుతున్న లైంగిక దాడులు

ఉత్తరప్రదేశ్‌లోని బుదౌన్‌లో 50 ఏళ్ల మహిళపై సామూహిక లైంగిక దాడి, హత్య ఘటన మరవకముందే మరో 19 ఏళ్ల యువతిపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడు ఆమెను టెర్రస్ పై నుంచి విసిరేశాడు. తీవ్రగాయాలపాలైన బాధితురాలు ప్రస్తుతం ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడుతున్నది. ఎదురింటి వ్యక్తి ఈ ఘటనకు పాల్పడ్డట్లు బాధితురాలి తండ్రి జనవరి 8న పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. టెర్రస్ నుంచి గదిలోకి చొరబడి ఆమెను పైకి లాక్కెళ్లి అఘాయిత్యానికి పాల్పడ్డాడని తెలిపారు. అతడి నుంచి తప్పించుకునే ప్రయత్నం చేయగా ఆమెను కిందకు విసిరేశాడన్నారు.

వ్యాపం కేసులో 60 మంది పై చార్జ్‌షీట్

మధ్యప్రదేశ్‌లో జరిగిన వ్యాపం కుంభకోణం కేసులో సిబిఐ 60 మందిని నిందితులుగా పేర్కొంటూ జనవరి 8న చార్జ్‌షీట్ దాఖలు చేసింది. 2011లో నిర్వహించిన ప్రీ–మెడికల్ టెస్ట్‌లో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని, దీని వెనుక ఆనాటి బిజెపి ప్రభుత్వ నేతలున్నారనే ఆరోపణలున్నాయి. మొదట ఈ కేసును స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు విచారించారు. ఈ కేసులోని వ్యక్తులు అనుమానాస్పద స్థితిలో మరణించడంతో ఈ కేసును 2016లో సుప్రీంకోర్టు సిబిఐకి అప్పగించింది. న్యాయమూర్తి అడిషనల్ సెషన్స్ జడ్జ్ సురేంద్ర కుమార్ శ్రీవాస్తవ నేతృత్వంలోని ధర్మాసనం ముందుకు 60 మంది నిందితులు రానున్నారు.

బీహార్ మైనింగ్ విధానంపై లారీ యజమానుల సమ్మె

బీహార్ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన మైనింగ్ విధానాన్ని వ్యతిరేకిస్తూ బీహార్ ట్రక్ ఓనర్స్ అసోసియేషన్ జనవరి 17న నిరవధిక దీక్షకు పిలుపునిచ్చింది. దీంతో రాష్ట్రంలో వేలాది లారీలు నిలిచిపోయాయి. ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విధానం ప్రకారం 14 లేదా అంతకంటే ఎక్కువ చక్రాలున్న ట్రక్కులు, డంపర్లు ఇసుక, రాళ్లను రవాణా చేయడం నిషేధం. దీన్ని వ్యతిరేకిస్తూ బిటిఓఏ సమ్మెకు దిగడంతో రాష్ట్ర రాజధాని పాట్నాతో పాటు జాతీయ, రాష్ట్ర రహదారులపై వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త విధానాన్ని వెంటనే నిషేధించాలని కోరారు.

ఢిల్లీలో రైతుల ట్రాక్టర్ ర్యాలీ

జనవరి 26న ఢిల్లీలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఒకవైపు జరుగుతుండగా కేంద్రం తెచ్చిన మూడు వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని రైతులు చేపట్టిన నిరసన ర్యాలీ అల్లర్లకు దారి తీసింది. ర్యాలీలో ఘర్షణలు, లాఠీ చార్జిలు, బాష్పవాయు గోళాలతో రైతులను పోలీసులు కట్టడిచేసే ప్రయత్నం చేశారు. ఆ ఘర్షణలో ఒక రైతు మరణించగా చాలా మంది గాయపడ్డారు. ఈ ర్యాలీకి మద్దతుగా దేశ నలుమూలల నుంచి రైతులు, విద్యార్థులు, మేధావులు, హక్కుల నాయకులు, ఎన్.జి.ఓ. సంస్థల నుంచి వేలాది మంది పాల్గొన్నారు. అట్లాగే వివిధ రాష్ట్రాల్లో రైతులకు మద్దతుగా ట్రాక్టర్‌లతో నిరసన ర్యాలీలు తీశారు. నిరసన కారులు ఎర్రకోటపై సిక్కులు పవిత్రంగా సిక్కు మత చిహ్నంగా భావించే నిషాన్ సాహిబ్ జెండాతో పాటు రైతు సంఘాల జెండాను ఎగురవేశారు.

ట్రంప్‌పై అభిశంసన

అమెరికాలో అధ్యక్ష ఎన్నికల తర్వాత రోజు రోజుకూ రాజకీయ పరిణామాలు మారిపోతున్నాయి. ఓటమిని జీర్ణించుకోలేని మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తన మద్దతుదారులతో జనవరి 6న కాపిటల్ బిల్డింగ్‌పై దాడి జరిపించాడు. దీన్ని ఖండిస్తూ జనవరి 11న ప్రతినిధుల సభలో డెమోక్రాట్లు అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. దీనికి ట్రంప్ సొంత రిపబ్లికన్ పార్టీ సభ్యులు కూడా మద్దతు తెలిపారు. దీంతో ఆయనపై అభిశంసన తీర్మానం నెగ్గి ఆయన గద్దె దిగాల్సి వచ్చింది.

ఇండోనేషియాలో వరుస ఘటనలు

ఇండోనేషియా రాజధాని జకార్తా నుంచి శనివారం 9న బయలుదేరిన విమానం జావా సముద్రంలో కుప్పకూలిపోయింది. ప్రమాదం సమయంలో విమాన సిబ్బందితో పాటు అరవై రెండు మంది ప్రయాణిస్తున్నారు. జనవరి 15న సులవేసి దీవిలో భారీ భూకంపం సంభవించింది. ఈ భూకంపం వల్ల 35 మంది చనిపోయారు. శిథిలాల కింద అనేక మంది చిక్కుకున్నారు. వారిని రక్షించడానికి సహాయక బృందాలు కృషిచేస్తున్నాయి. 6.2 తీవ్రతతో దాదాపు ఏడు సెకండ్లపాటు భూమి కంపించింది. దీంతో కొందరు భయంతో ఇండ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. మరి కొందరు గాఢనిద్రలో ఉండగానే..భూకంపం సంభవించడంతో చాలామంది శిథిలాల కింద చిక్కుకుపోయారు. ఇప్పటి వరకు 35 మంది ప్రాణాలు కోల్పోయినట్లు ఏజెన్సీ చీఫ్ దార్నో మజీద్ తెలిపారు.

అమెరికా అధ్యక్షుడిగా బైడన్ ఎన్నిక

అమెరికా 46వ అధ్యక్షుడిగా డెమోక్రటిక్ పార్టీకి చెందిన జో బైడన్ జనవరి 20న ప్రమాణ స్వీకారం చేశారు. అమెరికా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జాన్ రాబర్ట్స్ ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఆయన కుటుంబం వద్ద 127 సంవత్సరాలుగా ఉన్న బైబిల్ సాక్షిగా ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. జనవరి 6న ట్రంప్ మద్దతుదారులు దాడికి పాల్పడిన అమెరికా కాపిటల్ భవన పశ్చిమ దేవిడీ వద్ద ఆయన అధ్యక్ష బాధ్యతలు స్వీకరించారు.

రష్యాలో నిరసనలు

రష్యాలో విపక్ష నేత అలెక్సీ నా వెల్నీనీ విడుదల చేయాలంటూ దేశ వ్యాప్తంగా వంద నగరాల్లో నిరసనలు మిన్నంటాయి. అధ్యక్షుడు వ్లాదిమీర్ పుతిన్ 20 ఏళ్ల పాలనను నిరసిస్తూ జనవరి 23న వేలాది మంది ఈ నిరసన చేపట్టారు. నిరసనకారులపై పోలీసులు చెదరగొట్టే ప్రయత్నంలో జరిగిన ఘర్షణలో పలువురు గాయపడ్డారు. 3500 మంది నిరసనకారుల్ని పోలీసులు అరెస్ట్ చేశారు.

నేపాల్ ప్రధాని ఓలికి ఉద్వాసన

నేపాల్ కమ్యూనిస్టు పార్టీ(ఎన్‌సిపి)లో ప్రధాని కె.పి. శర్మ ఓలి ప్రాథమిక సభ్యత్వాన్ని రద్దుచేసింది. ఆయనను పార్టీ నుంచి తొలగిస్తున్నట్లు జనవరి 24న ప్రకటించింది. ఈ మేరకు పార్టీ కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు ఎన్‌సిపి అధికార ప్రతినిధి నారాయణ్‌కాజీ శ్రేష్ట ప్రకటించారు. గత నెల 20న నెపాల్ పార్లమెంట్‌ను ఓలి రద్దుచేసినందుకు ఆయన్ను పార్టీ నుంచి తొలగిస్తున్నట్లు ఎన్‌సిపి నిర్ణయించింది.

ప్రపంచంలో పెరుగుతున్న సామాజిక అంతరాలు

కరోనా సంక్షోభం కారణంగా లక్షల మంది జీవితాలు ప్రభావితం కావడమే కాకుండా ఈ వైరస్ అనేక సామాజిక అంతరాలను పెంచుతుందని వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ డబ్ల్యుఇఎఫ్ తన గ్లోబల్ రిస్క్స్ నివేదికలో విశ్లేషించింది. ఈ పరిణామం 3-5 ఏండ్ల పాటు ఆర్థిక వ్యవస్థలను ప్రమాదాలకు గురిచేయనున్నదని తన అధ్యయనంలో పేర్కొంది. అట్లాగే వచ్చే 5-10 ఏండ్ల వరకు భౌగోళిక స్థిరత్వాన్ని బలహీనపరుస్తుందని హెచ్చరించింది. వచ్చే దశాబ్దం వరకు అంటు రోగాలు అతిపెద్ద రిస్క్‌ను తెచ్చిపెట్టనున్నాయని పేర్కొంది. జనవరి 25-29 తేదీల్లో దావోస్ ఎజెండా సమిట్ నేపథ్యంలో ముందస్తుగా డబ్ల్యుఇఎఫ్ ఈ నివేదికను జనవరి 20న విడుదల చేసింది.

హక్కుల నాయకులను విడుదల చేయండి

భారతదేశంలో హక్కుల కార్యకర్తలను, ముఖ్యంగా భీమా కోరేగాం కేసులో అరెస్టు అయిన న్యాయవాదుల్ని, రచయితల్ని, విద్యావేత్తలను బెయిల్‌పై విడుదల చేయాలని ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల విభాగం కోరింది. హక్కుల కార్యకర్తలను జైల్లో నిర్బంధించిన తీరుపై ఐక్యరాజ్యసమితి ఆందోళన వ్యక్తం చేసింది. హక్కుల కార్యకర్తల ఆరోగ్యం, వయస్సు రీత్యా పరిశీలించి వారిని బెయిలుపై విడుదల చేయాలనీ, హక్కుల కార్యకర్తలు వరవరరావు, స్టాన్‌స్వామి పేర్లను ఐరాస ప్రస్తావించింది. భారతదేశంలో మానవ హక్కుల కోసం శాంతియుతంగా ఆయన చేస్తున్న పని అప్రతిష్టపాలు చేయాలని భావిస్తున్నట్టుగా ఉందని, హక్కుల కోసం పోరాడుతున్న కార్యకర్తల పరిస్థితి మమ్మల్ని ఎంతగానో ఆందోళనకు గురిచేస్తుందని, వారిని బెయిల్ పై విడుదల చేయాలని కోరింది. 83 ఏళ్ల స్టాండ్ స్వామి 1970 నుంచి సామాజిక కార్యకర్తగా పనిచేస్తున్నారని, ముఖ్యంగా ఆదివాసుల, దళితుల బలవంతపు వలసలు, అక్రమ భూ బదలాయింపుల గురించి పోరాడుతున్నారని తెలిపింది.

బాగ్దాద్‌లో పేలుళ్లు

ఇరాక్ రాజధాని బాగ్దాద్‌లో జనవరి 21న జంట బాంబు పేలుళ్లు జరిగాయి. ఈ దాడిలో దాదాపు ముప్పై మందికి పైగా మరణించారు. మరో వంద మందికి పైగా గాయపడ్డారు. సెంట్రల్ బాగ్దాద్‌లోని బాబ్ అల్ షార్కీ మార్కెట్‌లో ఈ పేలుళ్లు జరిగాయి. రద్దీ ప్రాంతం కావడంతో మృతులు, క్షతగాత్రుల సంఖ్య అధికంగా ఉంది.

శ్రీలంకలో హక్కుల ఉల్లంఘనపై దర్యాప్తుకు విజ్ఞప్తి

శ్రీలంకలో మూడు దశాబ్దాలుగా జరుగుతున్న హక్కుల ఉల్లంఘనపై నిర్దిష్ట కాలపరిమితితో అంతర్జాతీయ స్వతంత్ర దర్యాప్తు సంస్థను ఏర్పాటు చేయాలని, దానికి జవాబుదారీతనం ఉండేలా చూడాలని శ్రీలంక మైనార్టీ తమిళ రాజకీయ పార్టీలు, పౌర సమాజ సంస్థలు ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల సంఘాన్ని కోరాయి. ఈ మేరకు యుఎన్‌హెచ్‌ఆర్‌సిలోని 47 సభ్యదేశాలను ఉద్దేశిస్తూ లేఖ రాశాయి. సిరియాలో సాక్ష్యాల సేకరణకు సంవత్సరం కాలవ్యవధితో యంత్రాంగాన్ని ఏర్పాటు చేసినట్లు గానే శ్రీలంక విషయంలోనూ వ్యవహరించాలని కోరాయి. వీ

VEEKSHANAM Telugu Monthly Journal of Political Economy and Society - 232 - February 2021 • **ISSN 2231-6892**
• RNI Regn.No.APTEL/2003/11482 • Published on 27/01/2021 • Postal Regn. No. HD/1100/2020-22

If undelivered please return to:

VEEKSHANAM
Mytri Residency, 3-6-394, St. No. 3,
Himayatnagar, Hyderabad - 500 029.
Phone: 040 66843495

To:
Mr./Mrs.________________________

Edited, printed, published and owned by N. Venugopal Rao, Printed at Charitha Impressions, Azamabad, Hyderabad - 500 020
and Published at 3-6-394, Mythri Residency, Street No. 3, Himayatnagar, Hyderabad 500 029. Editor : N. Venugopal Rao